


తెలంగాణ ప్రభుత్వం

మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ - చైల్డ్ లైన్ ఫౌండేషన్

బడిలోగానీ, బడి బయటగానీ వేధింపులకు గురవుతున్నా

ఆపదలో, కష్టాలలో ఉన్న పిల్లలను రక్షించడానికి

CHILD LINE 1098 NIGHT & DAY

24 HOUR NATIONAL HELPLINE

పిల్లలతో పనిచేయిస్తున్నా, వారిని బడికి పంపకుండా వేరే కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నా

కుటుంబ సభ్యులు గానీ, బంధువులు గానీ ఇబ్బందికరంగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నా

1098 (పది-తొమ్మిది-ఎనిమిది) ఉచిత టెలిఫోన్ సేవా సౌకర్యానికి ఫోన్ చేయండి



రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ

తెలంగాణ, హైదరాబాదు.






# నవ వసంతం -3

# తెలుగు వాచకం

## ఎనిమిదో తరగతి

(ప్రథమ భాష)



Free




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాదు



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ



SCERT TELANGANA

# నా తెలంగాణ



కోటి తెలుగుల బంగారు కొండక్రింద
పరచుకొన్నట్టి సరసులోపల వసించి
ప్రొద్దుప్రొద్దున అందాల పూలు పూయు
నా తెలంగాణతల్లి కంజాతవల్లి.

ఎల్లొరా గుహలందున పల్లవించి
వేయిస్తంభాల గుడిలోన విరులు పూచి
శిల్పి యులిముక్కులో వికసించినట్టి
నా తెలంగాణ, కోటి అందాల జాణ.

మూడు కోటుల దేవతామూర్తు లందు
కోటిమంది వసించెడి హాటకావ
నీ మహాఖండ మీ రమణీయభూమి
నా తెలంగాణలేమ, సౌందర్యసీమ.

మూగవోయిన కోటి తమ్ముల గళాల
పాట పలికించి కవితాజవమ్ము కూర్చి
నా కలానకు బలమిచ్చి నడపి నట్టి
నా తెలంగాణ కోటిరత్నాల వీణ.

డా॥ దాశరథి కృష్ణమాచార్య



# విద్యార్థులకు సూచనలు

విద్యార్థులూ!

- మీరందరూ ధారాళంగ చదువగలగాలి. తెలిసిన దాని గురించి సొంతంగా రాయగలగాలి. మీకు చదువడం, రాయడం రాకుంటే మీ ఉపాధ్యాయుని సాయంతో నేర్చుకోవాలి.
- మీరు నేర్చుకోవలసిన అంశాలను దృష్టిలో పెట్టుకొని మీకోసమే తెలుగుపుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకంలో మీరు సాధించవలసిన సామర్థ్యాల గురించి ఒక పేజీలో ఇచ్చారు. విద్యా సంవత్సరం పూర్తయ్యేసరికి వీటిని మీరు చేయగలగాలి. వాటిని చదువాలి.
- ప్రతి పాఠం మొదట్లో బొమ్మ / పేరా / సంఘటన / పద్యం... ఇట్లా ఏదైనా ఉంటుంది. వాటి గురించి మాట్లాడండి. ప్రశ్నలకు జవాబులు చెప్పాలి. దీనివల్ల మీకు పాఠం ఉద్దేశం, నేపథ్యం, ఇతివృత్తం గురించి అర్థమౌతుంది.
- 'విద్యార్థులకు సూచనలు' అనే గడిలోని సూచనలు చదివి, అర్థం చేసుకొని పదాల అర్థాలు తెలుసుకోవాలి.
- తరగతి గదిలో చర్చలు జరుగుతున్నప్పుడు, జట్టుపనులు నిర్వహిస్తున్నప్పుడు మీరు పాల్గొనాలి. మాట్లాడాలి. అవసరమైతే ప్రశ్నించాలి.
- పాఠం చివరలో 'ఇవి చేయండి' అనే పేరుతో అభ్యాసాలున్నాయి. వీటిని మీరు సొంతంగా చేయాలి. ప్రశ్నలకు మీరే ఆలోచించి సొంతంగా జవాబులు రాయాలి. ఎట్టి పరిస్థితుల్లో గైడ్లు, స్టడీ మెటీరియల్, ప్రశ్నల బ్యాంకులు మొదలైన వాటిలో చూసి రాయవద్దు. ఒకవేళ అట్లా రాస్తే ఫార్మేటివ్ (నిర్మాణాత్మక) మూల్యాంకనంలో మీకు మార్కులు ఇవ్వరు.
- సృజనాత్మక అంశాలను ఎట్లా చేయాల్నో తరగతి గదిలో మీ ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోవాలి. మీరు తరగతి గదిలో రాసి చూపాలి. దీనిపైన చర్చ జరిగిన తరువాతనే మీ నోటు పుస్తకాలలో రాయాలి.
- పాఠంలోని ప్రాజెక్టుపనులు, సృజనాత్మకతకు సంబంధించిన ప్రశ్నలను మీరు మీ మిత్రుల సహాయంతో చేయవచ్చు. వీటిని ఎట్లా చేయాలో మీ ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోండి. వీటిని చేసిన తరువాత మీరు ఎట్లా చేశారు? ఏం చేశారు? ఏం నేర్చుకున్నారు? మొదలైన వాటి గురించి మీరే సొంతంగా చెప్పగలగాలి.
- అభ్యాసాలను మీరే సొంతంగా చేయండి. చేయలేని వాటి గురించి మాత్రమే ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోవాలి.
- అభ్యాసాలలో ఇచ్చిన వ్యాకరణంశాలు మీకు అర్థంకావడానికి మొదట ఉదాహరణలు ఇచ్చారు. వాటి ఆధారంగా మీకు అర్థం అయ్యేలా సూత్రాన్ని ఇచ్చారు. కాబట్టి ఉదాహరణలను జాగ్రత్తగా పరిశీలించి వాటిని విశ్లేషించి సూత్రాన్ని తెలుసుకోవాలి.
- ఉపవాచకం పాఠాలను మీరే సొంతంగా చదువాలి. వాటి గురించి మాట్లాడాలి. చర్చించాలి. విశ్లేషించాలి.
- పాఠాలకు సంబంధించిన ఇతర పుస్తకాలను పాఠశాల గ్రంథాలయానికి పోయి అడిగి తీసుకొని చదువాలి.
- మీరు తప్పనిసరిగా నిఘంటువును ఉపయోగించుకోవడం అలవాటు చేసుకోవాలి. వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, కథలపుస్తకాలు మొదలైనవి చదువడం అలవాటు చేసుకోవాలి.
- కొన్ని పాఠాలలో నాటకీకరణ చేయడం, ఏకపాత్రాభినయం చేయడం, గేయాలను రాగంతో పాడడం, అభినయించడం పద్యాలను కంఠస్థం చేయడం వంటివి ఉన్నాయి. వీటిని మీరు తప్పనిసరిగా సాధన చేయాలి.
- మీరు తప్పనిసరిగా వ్యాసాలు, లేఖలు, నినాదాలు, కరపత్రం, సంభాషణ, పోస్టరు తయారీ వంటివి రాయగలగాలి. చేయగలగాలి. అవసరమైతే మీ ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోవాలి. తోటివారి సహాయంతో చేయాలి.
- సృజనాత్మకతకు సంబంధించిన అంశాలను మీరు రాసిన తరువాత ఒక పుస్తక రూపంలో సంకలనం చేసి తరగతి గదిలో ప్రదర్శించాలి.

SCERT TELANGANA



# నవవసంతం - 3

## తెలుగు వాచకం (ప్రథమభాష)

## ఎనిమిదో తరగతి

### సంపాదకమండలి


**ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య,** విశ్రాంత ఆచార్యుడు, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.

**ఆచార్య ఎస్. వి. రామారావు,** విశ్రాంత ఆచార్యుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చండూరు, నల్లగొండ.

**డా॥ దహగాం సాంబమూర్తి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ఉపాధ్యాయ విద్యా కళాశాల వరంగల్.

**డా॥ ఎన్. రజని,** తెలుగు విభాగాధిపతి, డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**దేశపతి శ్రీనివాస్,** ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి, ముఖ్యమంత్రి కార్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.


### సమన్వయం, విషయనిపుణులు


**సువర్ణ వినాయక్,**
కో-ఆర్డినేటర్,
ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాద్, తెలంగాణ.

**డా॥ నన్నూరు ఉపేందర్ రెడ్డి,**
సలహాదారు, విద్యాసంస్కరణలు,
పాఠశాల విద్యాశాఖ,
హైదరాబాద్, తెలంగాణ.

**ముఖచిత్రం : కూరెళ్ల శ్రీనివాస్,** ప్రధానోపాధ్యాయుడు, జి.ప.ఉ.పా. కుర్మేడు, నల్లగొండ జిల్లా.


### పాఠ్యపుస్తక ప్రచురణ సమితి


**ఎస్. జగన్నాథ రెడ్డి**
సంచాలకులు,
రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

**కె. కృష్ణమోహన్ రావు**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక,
పాఠ్యపుస్తక విభాగం,
రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

**బి. సుధాకర్**
సంచాలకులు,
ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం
తెలంగాణ, హైదరాబాద్.


విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

చట్టాలను గౌరవించాలి
హక్కులను పొందాలి

"నా తెలంగాణ కోటి రత్నాల వీణ"


**తెలంగాణ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20




SCERT TELANGANA



© Government of Telangana, Hyderabad

*First Published 2015*
*New Impression 2016, 2017, 2018, 2019*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Director of School Education, Hyderabad, Telangana.

This Book has been printed on 70 G.S.M. Maplitho
Title Page 200 G.S.M. White Art Card

తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

*Printed in India*
at the Telangana Govt.Text Book Press,
Mint Compound, Hyderabad,
Telangana.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20



# ముందుమాట

2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సందర్భంగా మన రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, సాహిత్యం, చరిత్రను తెలిపే విధంగా పాఠాలు ఉండాలని నిర్ణయించింది. ఇందుకోసం కవులు, రచయితలు, భాషావేత్తలు, క్షేత్రస్థాయి విషయనిపుణులతో ఒక కమిటీని నియమించింది. కమిటీ సభ్యులు ప్రస్తుతం అమల్లో ఉన్న తెలుగు పాఠ్యపుస్తకాలను పరిశీలించి తెలంగాణ సాహిత్యం, సంస్కృతి ప్రతిబింబించేటట్లు పాఠ్యపుస్తకాలను రూపొందించారు. తెలుగు సాహిత్యంపట్ల అవగాహన ఏర్పడడానికి ఇతర ప్రాంతాలకు చెందిన కవులు, రచయితల పాఠాలను కూడా పొందుపరిచారు.

భాషాసామర్థ్యాలు, సృజనాత్మకత, మానవీయ విలువలు పెంపొందించడానికి వీలుగా తెలుగు వాచకాలను రూపొందించారు. దీని ద్వారా పిల్లల్లో అవగాహన చేసుకొని ప్రతిస్పందించే సామర్థ్యాలతోపాటు, స్వీయ రచనాశక్తి పెంపొందుతుంది. త్యాగగుణం, యాత్రానుభవం, భక్తితత్పరత, శ్రమసౌందర్యం, నైతికవిలువలు, సంస్కృతి, నది ప్రశంస, సామాజిక స్పృహ, ఉద్యమస్ఫూర్తి, సహజసంపద, రైతు జీవితం, జంతుప్రేమ మొదలైన ఇతివృత్తాల ఆధారంగా తెలంగాణ రాష్ట్రంలోని కవులు, రచయితల ప్రాచీన, ఆధునిక సాహిత్యాల నుండి పాఠ్యాంశాలను ఎంపిక చేశారు. ఇతిహాసం (పద్యం), యాత్రారచన, ద్విపద, వ్యాసం, శతకం, గేయం, కథానిక, వచనకవిత, కావ్యం, అనువాద కథ మొదలైన ప్రక్రియల్లో పాఠ్యాంశాలు ఉన్నాయి. విస్తారపఠనానికై తెలంగాణ ప్రాంతంలోని స్ఫూర్తిదాతలైన సురవరం ప్రతాపరెడ్డి, షోయబుల్లాఖాన్, పి.వి.నరసింహారావు, చిందు భాగోతం కళాకారిణి చిందు ఎల్లమ్మ, తెలంగాణ జానపద కళలు, శాస్త్రీయ పరిశీలనను పెంపొందింపజేసే చిత్రగ్రీవం అనే పావురం కథ మొదలైన అంశాలను ఉపవాచకంగా పెట్టారు. ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణానికి, తెలంగాణ కళలు, కళాకారులపట్ల అభిరుచి, ఆదరణ కలిగించడానికి ఈ వాచకం తోడ్పడుతుంది.

ప్రతి పాఠంలో సామర్థ్యాల సాధనకనుగుణంగా **'ఇవి చేయండి'** శీర్షికతో అభ్యాసాలున్నాయి. ఆలోచించడం, ప్రతిస్పందించడం, అభిప్రాయాలు చెప్పడం, బహుకోణాల్లో విశ్లేషించడం, విభిన్న కోణాల్లో ఆలోచించడం, సకారణంగా వివరించడం, అన్వయించడం, సృజనాత్మకంగా, ప్రశంసాత్మకంగా వ్యక్తీకరించడం వీటి స్వభావం. పిల్లలు పాఠ్యపుస్తక పరిధిని దాటి నేర్చుకోవడానికి వీలుగా ప్రాజెక్టుపనుల వంటివి చేర్చారు. ఇవి స్వయం అధ్యయనాన్ని, అదనపు / పరామర్శ గ్రంథాలను సంప్రదించడాన్ని ప్రోత్సహించేటట్లు ఉన్నాయి. పాఠంలోని విషయాలను అవగాహన చేసుకొనుటకు వీలుగా సందర్భోచిత అర్థాలను పదవిజ్ఞానం పేరుతో పుస్తకం చివర చేర్చారు. వీటిలో వీలయినంత మేరకు తెలంగాణలో వినియోగించే పదజాలాన్ని పొందుపరిచారు.

ఉపాధ్యాయులు సోపానక్రమం ప్రకారం పాఠాన్ని బోధించుటకు వీలుగా పాఠంలోని విషయాలను అమర్చారు. గద్య, పద్య పాఠాలను వేర్వేరుగా ఇవ్వకుండా పాఠాల స్వభావం, నిడివి ఆధారంగా వరుస క్రమంలో ఉంచారు. వ్యాకరణ సూత్రాలను సులభంగా ఆకళింపు చేసుకునేటట్లు ఉదాహరణలు పొందుపరిచారు. భాషోపాధ్యాయులు పాఠంలోని విషయాన్ని నేరుగా బోధించకుండా పాఠ్యాంశం ముందున్న అంశాలతో ప్రారంభించాలి. తర్వాత పాఠ్యాంశాన్ని చర్చలు, ప్రతిచర్చల ద్వారా అవగాహన కల్పించాలి. ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. అభ్యాసాలపై సాధన చేయించాలి. పాఠ్యాంశంలోని జాతీయాలు, పదబంధాలు, ముఖ్యమైన సందేశాత్మక వాక్యాలు, సంఘటనల గురించి లోతైన చర్చద్వారా అవగాహన, విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలి. భాషాసామర్థ్యాల సాధనలో పాఠ్యపుస్తకం ఉపాధ్యాయుడికి ఒక సహకారి మాత్రమే. పరామర్శ గ్రంథాలను, పాఠశాల గ్రంథాలయాన్ని తాను వినియోగించుకుంటూ పిల్లలు వినియోగించుకునేటట్లు భాషావాతావరణాన్ని కల్పించాలి.

తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన తొలి వాచకం ఇది. కాబట్టి భాషాపరంగా లేదా ఇతర అంశాల గురించి విజ్ఞులు ఇచ్చే సలహాలు, సూచనలను ఎస్.సి.ఇ.ఆర్.టి. స్వీకరించి తగు చర్యలు చేపడుతుంది. పాఠ్యపుస్తకాల రూపకల్పనకోసం ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇచ్చి ప్రోత్సహించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి గౌరవనీయులు **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు** గారికి, విద్యాశాఖ పూర్వ మంత్రి **శ్రీ జి. జగదీశ్ రెడ్డి** గారికి, విద్యాశాఖ ప్రస్తుత మంత్రి **శ్రీ కడియం శ్రీహరి గారికి,** పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి **శ్రీమతి రంజీవ్ ఆర్. ఆచార్య**గారికి, పాఠశాల విద్యాశాఖ పూర్వ సంచాలకులు **శ్రీ ఎమ్. జగదీశ్వర్** గారికి, ప్రస్తుత సంచాలకులు **శ్రీ టి.చిరంజీవులు** గారికి, ప్రభుత్వ సలహాదారు **డా॥ కె.వి.రమణాచారి** గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ వాచక రూపకల్పనలో పాల్గొన్న కమిటీ సభ్యులు, సంపాదక మండలి సభ్యులు, విషయ నిపుణులు, ఉపాధ్యాయులు, చిత్రకారులకు ధన్యవాదాలు. ఈ వాచకం పిల్లల్లో భాషాభిరుచి, సాహిత్యాభిలాష, భాషాసామర్థ్యాలను పెంపొందించి ఉత్తమ వైఖరులు కల్గిన వ్యక్తులుగా ఎదగడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

తేది : 31-01-2015
స్థలం : హైదరాబాద్.

**సంచాలకులు**
రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.



SCERT TELANGANA



# పాఠ్యపుస్తక సమీక్ష మరియు అభివృద్ధి కమిటి సభ్యులు

## విశ్వవిద్యాలయ స్థాయి

**ఆచార్య రవ్వా శ్రీహరి,** పూర్వ ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
**ఆచార్య ఎన్. గోపి,** పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య,** విశ్రాంత ఆచార్యుడు, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.
**ఆచార్య ఎస్. వి. రామారావు,** విశ్రాంత ఆచార్యుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**ఆచార్య బన్న అయిలయ్య,** తెలుగుశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.
**డా॥ ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**డా॥ ఎన్. రజని,** తెలుగు విభాగాధిపతి, డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**డా॥ జి. బాలశ్రీనివాస మూర్తి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్ జిల్లా.

## విద్యావేత్తలు, విషయనిపుణులు

**డా॥ చుక్కా రామయ్య,** విద్యావేత్త, హైదరాబాద్.
**డా॥ దహగాం సాంబమూర్తి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ఉపాధ్యాయ విద్యా కళాశాల వరంగల్.
**డా॥ నందిని సిధారెడ్డి,** విశ్రాంత ఉపన్యాసకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేట, మెదక్ జిల్లా.
**డా॥ నలిమెల భాస్కర్,** విశ్రాంత ఉపన్యాసకుడు, ఎస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల, కరీంనగర్ జిల్లా.
**డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చండూరు, నల్లగొండ జిల్లా.
**డా॥ ముదిగంటి సుజాతారెడ్డి,** విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్, ఆర్.బి.వి.ఆర్.ఆర్. కళాశాల, హైదరాబాద్.
**వేణు సంకోజు,** విశ్రాంత ఉపన్యాసకుడు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నల్లగొండ జిల్లా.
**సంగిశెట్టి శ్రీనివాస్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జోగిపేట, మెదక్ జిల్లా.
**దేశపతి శ్రీనివాస్,** ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి, ముఖ్యమంత్రి కార్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.
**డా॥ ఎన్. ఉపేందర్ రెడ్డి,** సలహాదారు, విద్యా సంస్కరణలు, పాఠశాల విద్యాశాఖ, హైదరాబాద్, తెలంగాణ.
**కె. కృష్ణమోహన్ రావు,** ప్రొఫెసర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**దీపిక,** ఉపన్యాసకురాలు, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**సువర్ణ వినాయక్,** కో–ఆర్డినేటర్, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**కె.రాజేందర్ రెడ్డి,** కో–ఆర్డినేటర్, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**తల్లావజ్ఝల మహేశ్‌బాబు,** ఉపన్యాసకుడు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, నిజామాబాద్ జిల్లా.

## క్షేత్ర స్థాయి

**పల్లెర్ల రామమోహన రావు,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.
**వి. చెన్నయ్య,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., జగద్గిరి నగర్, రంగారెడ్డి జిల్లా.
**వొజ్జల శరత్‌బాబు,** భాషోపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సీతాఫల్‌మండి, హైదరాబాద్.
**అవుసుల భానుప్రకాశ్,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., లోనికలాన్, మెదక్ జిల్లా.
**కందాడై రంగరాజు,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పాఠశాల, రంగాపురం, రంగారెడ్డి జిల్లా.
**ఎల్.ఎం.ప్రసాద్,** భాషోపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., హిమాయత్‌నగర్, సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.
**పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లిహిల్స్, హైదరాబాద్.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20
SCERT TELANGANA



# ఈ పాఠ్యపుస్తకం గురించి...

పొద్దు పొడవంగనే భూమి అంతా కాంతితో పులకరిస్తది. ప్రాజెక్టు పారంగనే పొలాలు పచ్చదనంతో హొయలుబోతవి. చంద్రుడు రాంగనే భూమీ ఆకాశం వెన్నెలమయమై నాట్యం జేస్తవి. అగో అట్ల రాష్ట్రం ఏర్పడంగనే తెలంగాణ సకల అవయవాలతో కేరింతలు కొడుతున్నది. అరవై సంవత్సరాల అరిగోస నుంచి బైటబడ్డ ఆత్మ ఆనందంతో తేలియాడుతున్నది. అన్ని రంగాలలో నూతనోత్సాహంతోని ముందుకు మునుముందుకు దూసుకెల్తున్నది. అట్లా విద్యారంగంలో కూడా...

గత సమైక్యాంధ్ర పాలనలో వచ్చిన తెలుగు పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ కవులు, రచయితల ప్రాతినిధ్యం నామమాత్రంగా ఉండేది. తెలంగాణ భాష మచ్చుకైనా కనిపించేది కాదు. తెలంగాణలో కవులు లేరా అని అనిపించే విధంగా ఉండేది. ఆ పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, విద్యార్థులు సీమాంధ్ర సాహిత్యాన్నే మొత్తం తెలుగు సాహిత్యంగా భావించేవారు. సీమాంధ్ర భాషే అసలు భాష అని, స్వచ్ఛమైన తెలుగు భాష అని భావించేవారు. తెలంగాణ భాషలో మాట్లాడటానికి బిడియపడేవారు. తమది అనాగరిక భాష అని తలచేవారు. మొత్తం మీద ఆత్మన్యూనతకు లోనయ్యేవారు.

తెలంగాణ రాష్ట్రం సిద్ధించినంక దృశ్యం మారిపోయింది. తెలుగు పాఠ్యాంశాలలో తెలంగాణ ముద్ర, తెలంగాణ తనం ఉట్టిపడే విధంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం భావించి, ఆ మార్పులు తీసుకరావటానికి పాఠ్యాంశ నిర్ణాయక కమిటీని నియమించింది. ప్రభుత్వ హృదయాన్ని, ప్రజల ఆకాంక్షను ప్రతిబింబించే విధంగ కమిటీ కొత్త పాఠ్యాంశాలను రూపొందించింది. దాదాపు అన్ని పాఠాలు తెలంగాణ అస్తిత్వాన్ని, విశిష్టతను చాటేవే. తెలంగాణ కవుల రచయితల రచనావైభవాన్ని కళ్ళకు కట్టేవే. వీలయినంతమేరకు తెలంగాణ తెలుగును వినిపించేవే. ఈ 8వ తరగతి పాఠ్యాంశాలను పరిశీలిస్తే అది నిజమని ఎవరైనా ఒప్పుకుంటారు. **'మంజీర'** పాఠం తెలంగాణ జీవనదుల్లో ఒకటైన మంజీర నది విశిష్టతను వెల్లడిస్తుంది. తెలంగాణ పాడిపంటలకు నది ఎట్లా మూలమో తెలుపుతుంది. కవి ఊహాశాలీనతను పట్టిస్తుంది. **'సముద్రప్రయాణం'** ఆనాడు తెలంగాణ విద్యార్థి ఉన్నత విద్యకోసం ఎంత తపనపడ్డాడో తెలుపుతుంది. యాత్రాచరిత్ర అనే ప్రక్రియను గురించీ తెలియజేస్తుంది. **'బసవేశ్వరుడు'** 12వ శతాబ్దంలో తెలంగాణలో భక్తి ఉద్యమం పాదుకొన్నతీరును, భక్తి తత్పరతను, ఆనాటి అచ్చతెలుగును, నుడికారవైభవాన్ని కళ్ళముందుంచుతుంది. తెలుగు సాహిత్యానికి తెలంగాణ అందించిన **'ద్విపద'** ప్రక్రియ ఘనతను తెలుపుతుంది. **'తెలుగు జానపదగేయాలు'** మిగతా తెలుగు ప్రాంతాలతోపాటు తెలంగాణలోని వివిధ రకాల జానపదగేయాలను గురించి తెలియజేస్తుంది. తెలంగాణ జానపదుల కల్పనాశక్తికి అద్దం పడుతుంది. **'అసామాన్యులు'** తెలంగాణ పల్లెల్లో కమ్మరి, కుమ్మరి మొ॥ వివిధ వృత్తులను, ఆయా వృత్తులవారి వృత్తినైపుణ్యాన్ని చిత్రిక పడుతుంది. **'కాపుబిడ్డ'** రైతుల కష్టనష్టాలను, వారి ఔన్నత్యాన్ని, నిష్కల్మషత్వాన్ని, ఆత్మీయతను పట్టిస్తుంది. ఆనాడు వాడుకలో ఉన్న తెలుగుపదాల కమ్మదనాన్ని తెలుపుతుంది. సామాన్యమైన రైతుబిడ్డ పద్యరచనాశక్తిని వెల్లడిచేస్తుంది. **'చిన్నప్పుడే'** అనే పాఠం కథానిక అనే ప్రక్రియను తెలుపడమేగాక తెలంగాణ రచయిత రచనా ప్రతిభను వాస్తవిక జీవిత చిత్రణ విధానాన్ని విశదం చేస్తుంది. **'అమరులు'** అనే పాఠం 1969 నాటి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థుల, యువకుల పాత్రను మనముందు ఉంచి, రాష్ట్రసిద్ధికి ఆనాటి ఉద్యమమిచ్చిన స్ఫూర్తిని అందజేస్తుంది. **'సింగరేణి'** అనే పాఠం, తెలంగాణకే కాదు దక్షిణ భారతదేశానికే తలమానికమైన సింగరేణి గనుల ప్రాముఖ్యతను, అందులో పనిచేసే వేలాది తెలంగాణ గనికార్మికుల పని నైపుణ్యాన్ని విశదపరుస్తుంది. తెలంగాణకున్న అనేక సహజ సంపదలలో భాగమైన 'సింగరేణి' తెలంగాణకు వరప్రసాదిని అనే విషయాన్ని విదితం చేస్తుంది.

**'షోయబుల్లాఖాన్'** రజాకార్లను ఎండగట్టిన సాహసాన్ని తెలిపి ఈనాటి జర్నలిస్టులకు స్ఫూర్తినిస్తుంది. **'చిందుఎల్లమ్మ'** తెలంగాణలో నిమ్నకులస్థులలోని అద్భుత కళాప్రతిభను వెల్లడిస్తుంది. **'పి.వి.నరసింహారావు'** పాఠం తెలంగాణ మాణిక్యం దేశంలో అత్యున్నతమైన ప్రధానమంత్రి పదవి అనే శిఖరాన్ని అధిరోహించిన విధాన్ని తెలిపి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతుంది. **'జానపదకళలు'** అనే పాఠం తెలంగాణలోని వివిధ కళారూపాల గొప్పదనాన్ని తెలిపి మనం గర్వించేలా చేస్తుంది. అయితే తెలంగాణలో వినియోగిస్తున్న క్రియాపదాల విషయంలో ఏకాభిప్రాయం చోటుచేసుకోనందున ప్రస్తుతం శిష్టవ్యావహారిక భాషను వినియోగించడం జరిగింది.

మొత్తం మీద ఈ పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, చదివే విద్యార్థులు తమ రాష్ట్ర గొప్పదనాన్ని తెలుసుకొని ఉత్తేజితులు కాగలరని, ఆ ఘనతను, వైశిష్ట్యాన్ని మరింత తెలుసుకోవటానికి ప్రేరణ పొందగలరని విశ్వసిస్తున్నాం.

తేది : 31-01-2015

స్థలం : హైదరాబాద్.

**పాఠ్యపుస్తక అభివృద్ధి కమిటి,**

తెలంగాణరాష్ట్రం, హైదరాబాద్.



SCERT TELANGANA



# ఉపాధ్యాయులకు సూచనలు

- ఉపాధ్యాయుల పనిభారాన్ని, పనిదినాలను దృష్టిలో పెట్టుకొని ఆచరణకు వీలుగా పాఠ్యాంశాల సంఖ్యను తగ్గించి రూపొందించిన వాచకం ఇది. ఒక నెలలోని పనిదినాలను దృష్టిలో పెట్టుకొని మాసవారీగా పాఠాలను కేటాయించారు.
- **'ముందుమాట, పాఠ్యపుస్తకం ద్వారా సాధించాల్సిన సామర్థ్యా'లను** తప్పనిసరిగా చదవాలి. **'విద్యార్థులకు సూచన'లను** ముందుగా మీరు చదవాలి. వాటిని మీ పిల్లలతో చదివించాలి. వారికి అవి అర్థమైనాయో లేదో పరిశీలించాలి.
- ఈ వాచకాన్ని 180 కాలాంశాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు. వీటిలో 168 కాలాంశాలు పాఠ్యాంశాల బోధనకు, మిగతా కాలాంశాలు ఉపవాచకంలోని అంశాలను చర్చించడానికి వినియోగించాలి.
- ఉపవాచకపాఠాలలో ఒక్కొక్క పాఠానికి 2 కాలాంశాలు వినియోగించాలి.
- ఉపవాచకాన్ని పిల్లలతో తప్పక చదివించాలి. ముఖ్యాంశాలగురించి మాట్లాడించాలి. పఠనావగాహనకు సంబంధించిన అభ్యాసాలను రూపొందించి నిర్వహించాలి.
- సగటున ఒక్కొక్క పాఠానికి 14 కాలాంశాలు అవసరమవుతాయి.
- వీటిలో **'చదవండి - ఆలోచించండి, నేపథ్యం / ఉద్దేశం, కవిపరిచయం, విద్యార్థులకు సూచనల్లో'** ఇచ్చిన అర్థసంగ్రహణ కృత్యాలకు కలిపి రెండు కాలాంశాలను వినియోగించుకోవాలి.
- పాఠ్యాంశ విషయంపై చర్చించి అవగాహన కల్పించడానికి పాఠంలోని విషయం నిడివిని బట్టి రెండు నుండి నాలుగు కాలాంశాల వరకు కేటాయించుకోవాలి. ఇందుకనుగుణంగా పాఠాన్ని విభజించి రోమన్ అంకెల్లో సూచించారు.
- **'ఇవిచేయండి'**లో ఇచ్చిన అభ్యాసాలలో **విని అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం** అభ్యాసానికి 1 కాలాంశాన్ని, **ధారాళంగా చదవడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం** అభ్యాసానికి 1 కాలాంశాన్ని, **స్వీయరచన** అభ్యాసానికి **2 కాలాంశాలు, సృజనాత్మకత / ప్రశంస** అభ్యాసానికి 1 కాలాంశాన్ని, **పదజాలం, వ్యాకరణాంశాలకు** కలిపి 2 కాలాంశాలు, **'ప్రాజెక్టుపని'**ని ప్రదర్శింపజేసి చర్చించడానికి 1 కాలాంశాన్ని కేటాయించుకోవాలి.
- పాఠం ప్రారంభంలో ఇచ్చిన **'చదవండి - ఆలోచించి చెప్పండి'** అనే అంశాలు ఉన్ముఖీకరణకు సంబంధించినవి. వీటిని పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.
- పాఠ్యాంశం ఉద్దేశం / నేపథ్యం, పాఠ్యభాగ వివరాలు, కవిపరిచయంలోని అంశాలను పిల్లలతో చదివించి చర్చించాలి.
- **'విద్యార్థులకు సూచనలు'**లోని అర్థ సంగ్రహణ కృత్యాలను వ్యక్తిగత కృత్యాలుగా నిర్వహించాలి. ఇందుకోసం తరగతి గదిలో తప్పనిసరిగా నిఘంటువులను అందుబాటులో ఉంచాలి.
- పాఠంలోని విషయం పట్ల పిల్లలకు అవగాహన కల్పించడానికి చర్చాపద్ధతి, ప్రశ్నోత్తర పద్ధతి, కథాకథనం, ప్రదర్శన పద్ధతి, నాటకీకరణ వంటి పద్ధతులను ఆయాపాఠాల స్వభావాన్ని బట్టి ఉపయోగించాలి. పాఠం మధ్యలో **'ఆలోచించండి–చెప్పండి'** అనే పేరుతో గడిలో ప్రశ్నలున్నాయి. వీటిని పాఠం బోధించే సమయంలో అడగాలి. ఆలోచించి జవాబులు చెప్పమనాలి.
- పాఠం బోధించడమంటే విషయాన్ని వివరించడం మాత్రమే కాదు. దాంట్లోని విలువలను, కవి హృదయాన్ని, అంతరార్థాన్ని పిల్లలు అర్థం చేసుకునేటట్లు చూడాలి. ఇందుకోసం ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. పదబంధాలు, జాతీయాలు, ఆలోచనాత్మక, సందేశాత్మక వాక్యాలపట్ల చర్చద్వారా, ప్రశ్నించడం ద్వారా పిల్లలే అవగాహన పొందేటట్లు చేయాలి. పిల్లల అభిప్రాయాలు చెప్పించడం, సమకాలీన అంశాలతో అన్వయించడం, బహుకోణాల్లో విశ్లేషించడంవంటివి జరగాలి.
- 'ఇవిచేయండి'లోని అభ్యాసాలు పిల్లల భాషా సామర్థ్యాలను పెంపొందించడానికి ఉద్దేశించినవి. వీటిని పిల్లలే సొంతంగా రాసేటట్లు చూడాలి.
- ఒక్కొక్క అభ్యాసానికి కేటాయించిన కాలాంశాలలో పిల్లలు వాటిని ఎట్లా రాయాలో అవగాహన కల్పించాలి. పిల్లలు రాసిన అంశాలను పరిశీలించి సరిదిద్దాలి.
- పిల్లలు సొంతంగా రాయడాన్ని ప్రోత్సహించాలి. ఎట్టి పరిస్థితుల్లో గైడ్లు, స్టడీమెటీరియళ్ళు, ప్రశ్నల బ్యాంకులు వంటివి చూసి రాయడాన్ని పూర్తిగా నిషేధించాలి. ఎందుకంటే పరీక్షల్లో పుస్తకంలోని ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్లుగానే రావు. ఇట్లాంటి స్వభావం కలిగిన ప్రశ్నలు వస్తాయి. పాఠంలోని అభ్యాసాలను సొంతంగా రాయగల్గిన పిల్లలు మాత్రమే వీటికి సమాధానాలు రాయగల్గుతారు.
- **'వినడం - మాట్లాడడా'**నికి సంబంధించిన ప్రశ్నలను పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. **'చదవడం - అర్థం చేసుకోవడా'**నికి ఉద్దేశించిన అభ్యాసాలను వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20



- **"స్వీయరచన"** అభ్యాసంలోని లఘుసమాధాన ప్రశ్నలను పాఠం బోధించేటప్పుడే ఇంటిపనిగా ఇవ్వాలి. వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు జవాబులు రాయడానికి పూర్తి తరగతి గదిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత వ్యక్తిగతంగా రాయించాలి. వాటిని చదివించాలి. పిల్లలు రాసిన అంశాలను భావాత్మకంగా వాక్యాలు, పదాలు, అక్షరదోషాల పరంగా సరిచేయాలి.
- సృజనాత్మకత/ప్రశంసకు సంబంధించిన ప్రశ్నలకు పిల్లలు సమాధానాలు రాయడానికి తగిన ఉదాహరణలిచ్చి అవగాహన కల్పించాలి. జట్లలో రాయమనాలి. వీటిని ప్రదర్శింపజేసి చర్చద్వారా సరిదిద్దాలి. ఆ తరువాత వీటిని వ్యక్తిగతంగా రాయమనాలి.
- ప్రాజెక్టు పనులను కూడా ఇదేవిధంగా నిర్వహించాలి.
- **'పదజాల వినియోగం, భాషను గురించి తెలుసుకుందాం'**లోని అభ్యాసాలను ఉదాహరణలతో అవగాహన కల్పించాలి.
- పాఠం పూర్తి కావడమంటే **'చదువండి – ఆలోచించి చెప్పండి'** అనే ఉన్ముఖీకరణ అంశంతో మొదలుకొని పాఠంలో చివర ఇచ్చిన సూక్తివరకు అన్ని అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి అవగాహన కల్పించడం. ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులు తయారుకావాలి.
- ఇందుకోసం ఉపాధ్యాయులు వార్షిక, పాఠ్య ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- వార్షిక ప్రణాళికలో కింది అంశాలుంటాయి.

  1) తరగతి 2) సబ్జెక్టు (విషయం) 3) అవసరమైన కాలాంశాల సంఖ్య

  4) విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలు

  5) మాసవారీగా పాఠాల విభజన

| మాసం పేరు | బోధించే పాఠం | అవసరమైన కాలాంశాలు | అవసరమైన వనరులు / సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| | | | | |

  6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు 7) ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు

- ఒక పాఠాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠ్యప్రణాళికను కింది విధంగా రూపొందించుకోవాలి.

  1) పాఠం పేరు 2) అవసరమైన కాలాంశాల సంఖ్య 3) పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు

  4) కాలాంశాల వారీగా విభజన

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహం | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | | | |

  5) ఉపాధ్యాయుని తయారీ, అదనపు సమాచారసేకరణ 6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు

- ప్రతికాలాంశంలో భాషాబోధనను కింది సోపానాల ప్రకారం నిర్వహించాలి. అవి–

  I. **ఉపోద్ఘాతం** : పలకరింపు, ఉన్ముఖీకరణ, శీర్షికా ప్రకటన, ఉద్దేశం, కవిపరిచయం లేదా పలకరింపు, పునశ్చరణ.

  II. **పాఠ్యాంశబోధన చర్చ – అవగాహన** : విద్యార్థుల ప్రకాశపఠనం, ఉపాధ్యాయుల ఆదర్శపఠనం, మౌనపఠనం, అర్థసంగ్రహణం, పాఠ్యాంశ విషయంపై చర్చ – అవగాహన.

  III. సామర్థ్యాల సాధన కోసం 'ఇవి చేయండి' లో అభ్యాసాలు చేయించాలి.

- భాషాబోధనను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయరాదు. పాఠశాల గ్రంథాలయాన్ని, అంతర్జాలాన్ని (ఇంటర్నెట్), మేగజైన్‌లు, వార్తాపత్రికలు, బాలసాహిత్యం వంటివి ఉపయోగించుకునేటట్లు చూడాలి.
- తరగతి గదిలో పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించే వాతావరణాన్ని కల్పించాలి.
- తరగతి గదిలో భాషావాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన నిఘంటువులు, కవుల జీవిత చరిత్రలు, దృశ్యశ్రవణ సామగ్రి వంటివి సమకూర్చుకొని వినియోగించాలి.
- పాఠశాలలో భాషాభివృద్ధికి దోహదపడే కార్యకలాపాలు, భాషోత్సవాలు, బాలకవిసమ్మేళనాలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, వార్షికోత్సవాలు వంటివి నిర్వహించాలి.
- పిల్లలు రాసిన సృజనాత్మక అంశాలను సంకలనం చేసి తరగతి గదిలో ప్రదర్శించాలి.
- సిలబస్ పూర్తి చేయడమంటే పాఠాలను పూర్తిచేయడం మాత్రమేకాదు. ఆ పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలను పిల్లలు సాధించడం. కాబట్టి పాఠం పూర్తికాగానే పాఠం చివర ఉన్న 'స్వీయమూల్యాంకన' కృత్యం నిర్వహించాలి. అవసరమైతే పునరభ్యాసం కల్పించాలి.

SCERT TELANGANA



# వందేమాతరం

**– బంకించంద్ర ఛటర్జీ**

వందేమాతరం, వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం; వందేమాతరం
శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం
ఫుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం.

# జాతీయ గీతం

**– రవీంద్రనాథ్ ఠాగూర్**

జనగణమన అధినాయక జయహే !
భారత భాగ్య విధాతా !
పంజాబ సింధ్ గుజరాత మరాఠా,
ద్రావిడ ఉత్కళ వంగా !
వింధ్య హిమాచల యమునా గంగా,
ఉచ్ఛల జలధి తరంగా !
తవ శుభనామే జాగే !
తవ శుభ ఆశిష మాగే !
గాహే తవ జయ గాథా !
జనగణ మంగళదాయక జయహే !
భారత భాగ్య విధాతా !
జయహే ! జయహే ! జయహే !
జయ జయ జయ జయహే !

# ప్రతిజ్ఞ

**– పైడిమర్రి వేంకట సుబ్బారావు**

భారతదేశం నా మాతృభూమి.
భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.
సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను.
ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.
జంతువులపట్ల దయతో ఉంటాను.
నా దేశంపట్ల, నా ప్రజలపట్ల, సేవానిరతి కలిగి ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.
వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20



## రూపకల్పనలో పాల్గొన్నవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కో-ఆర్డినేటర్,
ఎస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ, హైదరాబాద్.

**వొజ్జల శరత్ బాబు,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పా., సీతాఫల్‌మండి, హైదరాబాద్.

**పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని,
భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల,
జూబ్లిహిల్స్, హైదరాబాద్.

**అవుసుల భానుప్రకాశ్,** యస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., లోనికలాన్, మెదక్ జిల్లా.

**కందాడై రంగరాజు,** యస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పాఠశాల, రంగాపురం, రంగారెడ్డి జిల్లా.

**పల్లెర్ల రామమోహన రావు,** యస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.

**వి. చెన్నయ్య,** యస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., జగద్గిరి నగర్, రంగారెడ్డి జిల్లా.

**గాజుల రవీందర్,** యస్.ఎ. (తెలుగు),
ప్ర.ఉ.పా., సప్తగిరికాలని, కరీంనగర్.

**తల్లావజ్ఝల మహేశ్‌బాబు,** ఉపన్యాసకుడు,
జిల్లా విద్యా శిక్షణ సంస్థ, నిజామాబాద్.

**డా|| బి.వి.యన్.స్వామి,** ఉపాధ్యాయుడు,
జిల్లా విద్యా శిక్షణ సంస్థ, కరీంనగర్.

**ఎల్.ఎం.ప్రసాద్,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పా., సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.

**కొండు జనార్దన్,** యస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., పాఠశాల, మంచిర్యాల, ఆదిలాబాదు జిల్లా.

**సాగర్ల సత్తయ్య,** యస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., చినకాపర్తి, చిట్యాల (మం), నల్గొండ జిల్లా.

**సందుపట్ల రవి,** యస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా.,
తాళ్ళగురిజాల, బెల్లంపల్లి (మం), అదిలాబాద్ జిల్లా.

**కందుల విష్ణు,** యస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., రాంపల్లి, కీసర మండలం, రంగారెడ్డి జిల్లా.

**వెంకటేశ్వర్లు నల్లపాటి,** యస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా. పమ్మి, ముదిగొండ (మం), ఖమ్మం జిల్లా.

**ఘనపురం దేవేందర్,** పి.జి.టి. (తెలుగు),
తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల, నవీపేట్ నిజామాబాద్ జిల్లా.

**డా|| ఎం.లక్ష్మీనరసింహ (శర్మ),** తెలుగుపండితుడు,
జి.ప.ఉ.పా., శివంపేట (ఆ), పుల్కల్ (మం), మెదక్ జిల్లా.

**పెద్దింటి అశోక్ కుమార్,** ఉపాధ్యాయుడు,
యు.పి.ఎస్., రామాజీపేట, ఇల్లంతకుంట (మం) కరీంనగర్.

### చిత్రాలు

**బి. కిషోర్ కుమార్,**
ఉపాధ్యాయుడు, యు.పి.యస్.,
ఊట్కూర్, నిడ్మనూరు (మం),
నల్లగొండ జిల్లా.

**శ్రీ కూరెళ్ల శ్రీనివాస్,**
ప్రధానోపాధ్యాయుడు, జి.ప.ఉ.పా.
కుర్మేడు, నల్లగొండ జిల్లా.

### కార్టూన్లు

**వడ్డేపల్లి వెంకటేశ్వర్లు,**
ఉపాధ్యాయుడు, ప్రా.పా. సోమవరం,
నేరేడుచర్ల (మం), నల్లగొండ జిల్లా.

**కవుల చిత్రాలు :** **దాసి సుదర్శన్,** నాగార్జున సాగర్, నల్లగొండ జిల్లా.
**గుండు శ్రీనివాస్,** మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా.
**సి.హెచ్.వెంకటరమణ,** ఉపాధ్యాయుడు, టేకుమట్ల (మం), సూర్యాపేట, నల్లగొండ జిల్లా.

**డి.టి.పి., లే ఔటు & డిజైనింగ్ : ప్రతిమ పాతూరి,** హైదరాబాద్.



SCERT TELANGANA



# ఈ పాఠ్య పుస్తకం ద్వారా విద్యార్థులు సాధించవలసిన సామర్థ్యాలు

**I. విని, అర్థం చేసుకొని, మాట్లాడడం**

- పద్యాలు, గేయాలు, వచనకవిత... మొదలైన వాటిని విని అర్థం చేసుకోవాలి. మాట్లాడగలగాలి.
- పద్యాలను, గేయాలను రాగయుక్తంగా, భావయుక్తంగా పాడగలగాలి.
- ఏదైనా ఒక విషయాన్ని సమర్థిస్తూ, తగిన కారణాలతో వివరించగలగాలి. అభిప్రాయం చెప్పగలగాలి.
- పద్య తాత్పర్యాలను, గేయ సారాంశాలను సొంతమాటలలో చెప్పాలి. కథను సొంతమాటలలో చెప్పాలి.
- ఇచ్చిన అంశాన్ని గురించి మాట్లాడగలగాలి, చర్చించగలగాలి.

**II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం**

- పద్యాలను, గేయాలను, గద్యభాగాలను ధారాళంగా చదువగలగాలి.
- పరిచిత / అపరిచితాంశాన్ని అర్థం చేసుకొని పట్టికలు రాయడం, శీర్షికలు పెట్టడం, ప్రశ్నలు రాయడం, ఖాళీలను పూరించడం, తప్పొప్పులు గుర్తించడం, సరైన సమాధానాలు గుర్తించడం, ఆయా సందర్భాలను గుర్తించడం, పోలికలు రాయడం మొదలైనవి చేయగలగాలి.

**III. స్వీయరచన**

- గేయ / పాఠం సారాంశాలను సొంతమాటలలో రాయగలగాలి.
- విషయాన్ని విశ్లేషిస్తూ, ఊహిస్తూ, సమర్థిస్తూ, వివరిస్తూ, తగిన కారణాలతో రాయగలగాలి.
- అనుభూతులను, అనుభవాలను, అభిప్రాయాలను సొంతమాటలలో రాయగలగాలి.

**IV. సృజనాత్మకత / ప్రశంస**

- పాఠ్యాంశాలను వివిధ సాహితీ ప్రక్రియలలోనికి అంటే వ్యాసం, లేఖ, సంభాషణ, నినాదాలు, ప్రకటన, ఏకపాత్రాభినయం, ఆత్మకథ, ఇంటర్వ్యూ, కవిత, గేయం, పోస్టర్, కథ మొదలైన రూపాలలోనికి మార్చగలగాలి.
- వివిధ వృత్తుల వారిని, సంస్థలను, సాహితీవేత్తలను, వారి రచనలను, ప్రముఖ వ్యక్తులను వారిసేవలను కవి / రచయితల శైలిని, భావాలను, దానం చేసిన వారిని, జీవకారుణ్యం కలవారిని ప్రశంసించ గలగాలి.

**V. పదజాలం**

- వివిధ సందర్భాలకనుగుణంగా భాషలోని పదాలను, జాతీయాలను ఉపయోగించగలగాలి.
- పర్యాయపదాలు, నానార్థాలు, ప్రకృతి - వికృతులు, వ్యుత్పత్త్యర్థాలు తెలుసుకొని ప్రయోగించగలగాలి.
- నిఘంటువును ఉపయోగించగలగాలి. పదజాలాన్ని సందర్భోచితంగా వినియోగించగలగాలి.

**VI. భాషను గురించి తెలుసుకుందాం**

- సంధులు, సమాసాలు గుర్తించగలగాలి. సంధి సూత్రాలను సొంతమాటలలో రాయగలగాలి.
- వాక్యభేదాలను గుర్తించి సందర్భోచితంగా వాక్యప్రయోగం చేయగలగాలి.
- అలంకారాలు, ఛందస్సుపై అవగాహన పెంచుకొని గుర్తించగలగాలి. లక్షణాలను సమన్వయం చేస్తూ, అర్థవంతంగా సొంతమాటలలో వివరించగలగాలి.

SCERT TELANGANA



# 8వ తరగతి - విషయసూచిక

## పాఠ్యాంశాలు


| క్ర.సం. | పాఠం పేరు | కవి/రచయిత | ఇతివృత్తం | ప్రక్రియ | మాసం | పుట |
|---|---|---|---|---|---|---|
| 1. | త్యాగనిరతి | నన్నయ | త్యాగగుణం | ఇతిహాసం (పద్యం) | జూన్ | 2 |
| 2. | సముద్ర ప్రయాణం | ముద్దు రామకృష్ణయ్య | యాత్రానుభవం | యాత్రారచన | జూలై | 10 |
| 3. | బండారి బసవన్న | పాల్కురికి సోమనాథుడు | భక్తితత్పరత | ద్విపద | జూలై | 22 |
| ★4. | అసామాన్యులు | | శ్రమసౌందర్యం | వ్యాసం | ఆగష్టు | 30 |
| 5. | శతక సుధ | శతక కవులు | నైతిక విలువలు | శతకం | ఆగష్టు | 44 |
| 6. | తెలుగు జానపద గేయాలు | ఆచార్య బిరుదురాజు రామరాజు | సంస్కృతి | వ్యాసం | సెప్టెంబరు | 56 |
| ★7. | మంజీర | డా॥ వేముగంటి నరసింహాచార్యులు | నదీప్రశంస | గేయం | అక్టోబరు | 68 |
| 8. | చిన్నప్పుడే | వట్టికోట ఆళ్వారుస్వామి | సామాజికస్పృహ | కథానిక | నవంబరు | 78 |
| ★9. | అమరులు | ఆచార్య కె.రుక్నుద్దీన్ | ఉద్యమస్ఫూర్తి | వచనకవిత | నవంబరు | 89 |
| ★10. | సింగరేణి | | సహజసంపద | వ్యాసం | డిసెంబరు | 97 |
| 11. | కాపుబిడ్డ | గంగుల శాయిరెడ్డి | రైతు జీవితం | కావ్యం | జనవరి | 108 |
| 12. | మాట్లాడే నాగలి | పొన్‌కున్నం వర్కెయ్ అనువాదం: ఎన్.వేణు గోపాలరావు | జంతుప్రేమ | అనువాద కథ | ఫిబ్రవరి | 118 |

**ఉపవాచకం** 131

1) చిత్రగ్రీవం (జూలై)
2) షోయబుల్లాఖాన్ (ఆగష్టు)
3) చిందు ఎల్లమ్మ (సెప్టెంబరు)
4) ఇల్లు - ఆనందాలహరివిల్లు (అక్టోబరు)
5) జానపద కళలు (నవంబరు)
6) పి.వి.నరసింహారావు (డిసెంబరు)

పదవిజ్ఞానం - 162


గమనిక : 1. పాఠంలో ✿ పువ్వు గుర్తుగల పద్యాలు కంఠస్థం చేయాలి.
2. విషయసూచికలో ★ గుర్తుగల పాఠాలను కాంపోజిట్ కోర్సువారు చదువాల్సిన అవసరంలేదు.

SCERT TELANGANA

1

# త్యాగనిరతి

**- నన్నయ**

## చదువండి - ఆలోచించి చెప్పండి.

దధీచి మహా తపశ్శాలి. చ్యవన మహర్షి పుత్రుడు. ఒకప్పుడు రాక్షసులు దేవతల అస్త్రాలను గుంజుకొంటుండగా వాటిని దాచిపెట్టుమని దధీచికి దేవతలు ఇచ్చిపోయారు. కానీ ఎంతకాలమైనా వారు రాకపోయేసరికి దధీచి వారి అస్త్రాలను నీరుగా మార్చి తాగాడు. అటు తర్వాత దేవతలు మా అస్త్రాలు మాకిమ్మన్నారు. అప్పుడు ఆ అస్త్రాలు తన ఎముకలను పట్టి ఉన్నందువల్ల యోగాగ్నిలో తన శరీరాన్ని దహించుకొని అస్థికలను తీసుకొమ్మన్నాడు. అట్లా దధీచి ఎముకల నుండి ఇంద్రుని వజ్రాయుధం రూపొందింది.

### ప్రశ్నలు:

1. దధీచి ఎవరు?
2. దధీచి చేసిన త్యాగం ఏమిటి? ఎందుకు?
3. త్యాగం అంటే ఏమిటి?
4. మీకు తెలిసిన త్యాగమూర్తుల పేర్లను తెలుపండి.

## పాఠం నేపథ్యం

పూర్వకాలంలో శిబి భృగుతుంగ పర్వతంపై యజ్ఞం చేశాడు. అప్పుడు ఇంద్రుడు, అగ్నిదేవుడు శిబిచక్రవర్తి గుణగణాలను పరీక్షించాలనుకున్నారు. అగ్ని పావురంగా మారాడు. ఇంద్రుడు డేగరూపం ధరించాడు. డేగంటే భయంతో పావురం శిబిచక్రవర్తి వద్దకు వచ్చి శరణు కోరింది.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం ఇతిహాస ప్రక్రియకు చెందినది. ఇతిహాసం అంటే 'ఇది ఇట్లా జరిగింది' అని అర్థం. ఇతిహాసంలో కథకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఈ కథలు గ్రంథస్థం కాకముందు వాగ్రూపంలో ఉండేవి. భారత రామాయణాలను ఇతిహాసాలు అంటారు.

ఈ పాఠాన్ని శ్రీమదాంధ్ర మహాభారతంలోని అరణ్యపర్వంలోని తృతీయ ఆశ్వాసం నుండి గ్రహించారు.

## కవి పరిచయం



(11వ శతాబ్దం)

రాజమహేంద్రవరాన్ని రాజధానిగా పరిపాలించిన రాజరాజ నరేంద్రుని ఆస్థానకవి నన్నయ. ఇతనికి వాగనుశాసనుడనే బిరుదు ఉన్నది.

వ్యాసుడు మహాభారతాన్ని సంస్కృతంలో రాశాడు. నన్నయ మహాభారతంలోని పద్దెనిమిది పర్వాలలో ఆది, సభా పర్వాలు, అరణ్యపర్వంలో 4వ ఆశ్వాసంలో 'శారదరాత్రులు' అనే పద్యం వరకు తెలుగులోకి అనువదించాడు. 'ఆంధ్రశబ్ద చింతామణి' అనే తెలుగు వ్యాకరణ గ్రంథాన్ని సంస్కృతంలో రాశాడు. తన కవిత్వంలో 'ప్రసన్నకథా కలితార్థయుక్తి, అక్షరరమ్యత, నానారుచిరార్థసూక్తి నిధిత్వం' అనే లక్షణాలున్నాయని చెప్పుకున్నాడు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.



SCERT TELANGANA



## ప్రవేశిక

మన ప్రాచీనసాహిత్యంలో నైతికవిలువలకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. భారత, రామాయణాలు ఉత్తములైన రాజుల కథలను వివరిస్తాయి. వారిలో శిబిచక్రవర్తి త్యాగగుణానికి తార్కాణంగా నిలుస్తాడు. తనను ఆశ్రయించిన ఒక పావురాన్ని డేగ నుండి రక్షించడానికి తన ప్రాణాలను సైతం లెక్కచేయడు. అది ఎట్లానో తెలుసుకుందాం.




## I

ఆ॥ నిన్ను సత్య ధర్మ నిర్మలుఁగా విందు
నట్టి నీకు బాడియయ్యె? యిప్పు
డతి బుభుక్షితుండనై యున్న నాకు నా
హార విఘ్న మిట్టులాచరింప? ... 1

వ॥ సర్వ భూతంబులు నాహారంబున జీవించి వర్ధిల్లు, నిదినాకు, భక్ష్యంబు గానినాఁడు బుభుక్షావేదనంజేసి ప్రాణ వియోగంబగు, నట్లయిన నా పుత్త్రులు భార్యయు జీవింపనేర, రొక్క కపోతంబు రక్షించి పెక్కు జీవులకు హింస సేయుట ధర్మవిరోధంబు ... 2

✿ క॥ ధర్మజ్ఞులైన పురుషులు
ధర్మువునకు బాధసేయు ధర్మువునైనన్
ధర్మముగా మదిఁ దలఁపరు
ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్ ... 3

వ॥ ఇక్కపోతంబు నాకు వేదవిహితంబైన యాహారంబు. 'శ్యేనాః కపోతాన్ ఖాదయన్తి' యను వేదవచనంబు గలదు గావున దీని నాకు నాహారంబుగా నిమ్మనిన దానికి శిబి యిట్లనియె ... 4



### ఆలోచించండి - చెప్పండి

- సత్యధర్మ నిర్మలుడని శిబి చక్రవర్తిని ఎందుకన్నారు?
- "ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్" దీనిపై మీ అభిప్రాయాన్ని చెప్పండి.
- ఆశ్రితులను ఎందుకు విడిచి పెట్టరాదు?
- ఏ సందర్భంలో ఇతరులు మిమ్మల్ని ఆశ్రయిస్తారు?

SCERT TELANGANA

తే॥ ప్రాణభయమున వచ్చి యిప్పక్షి నన్ను
నాశ్రయించె నాశ్రితునెట్టి యధముఁడయిన
విడువఁడనినను నేనెట్లు విడుతు దీని?
నాశ్రిత త్యాగమిది ధర్మువగునె? చెపుమ ... 5

## II


వ॥ నీవు పక్షివయ్యును ధర్మమెఱింగినట్లు పలికితి, శరణాగత పరిత్యాగంబు కంటె మిక్కిలి యధర్మం బొండెద్ది? నీయాఁకలి దీననకాని యొంట నుపశమింపదే? నీ యత్నం బాహారార్థం బేని యిప్పు డివ్వనంబున మృగ మహిష వరాహ ఖగ మాంసంబులు దీనికంటె మిక్కిలిగాఁ బెట్టెద, నిక్కపోతంబు వలని యాగ్రహం బుడుగుము, దీని నేనెట్లును విడువ' ననిన శ్యేనం బిట్లనియె... ... 6

ఆ॥ నాకు విహిత భక్షణంబిది; యిప్పక్షిఁ
బూని కావ నీకు బుద్ధియేని
యవని నాథ! దీని యంత నీ మాంసంబు
దూచి నాకుఁ బెట్టు తొలగ కిపుడ ... 7

చ॥ అనిన 'ననుగ్రహించితి మహా విహగోత్తమ' యంచు సంతసం
బున శిబి తత్క్షణంబ యసి పుత్రిక నాత్మశరీర కర్తనం
బనఘుఁడు సేసి చేసి తన యంగమునం గల మాంసమెల్లఁ బె
ట్టినను గపోతభాగమ కడిందిగ డిందుచు నుండె నత్తులన్ ... 8

క॥ దానికి నచ్చెరువడి ధర
ణీ నాథుఁడు తనువు నందు నెత్తురు దొరుఁగం
దాన తుల యెక్కె నంతన్
వాని గుణోన్నతికి మెచ్చి వాసవ దహనుల్ ... 9

వ॥ శ్యేనకపోత రూపంబులు విడిచి నిజరూపంబులఁ జూపి 'నీధైర్య శౌర్యాది గుణంబు లనన్యసాధారణంబులు గావున నీకీర్తి నిత్యంబై శబ్ద బ్రహ్మంబు గలయంత కాలంబు వర్తిల్లుచుండు'మని శిబికి వరంబిచ్చి యింద్రాగ్నులు చనిరి. ... 10



### ఆలోచించండి - చెప్పండి

- *డేగ తన ఆకలిని తీర్చుకోవడానికి శిబి మాంసాన్ని ఎందుకు కోరింది?*
- *"అనుగ్రహించితి మహా విహగోత్తమ' అని శిబిచక్రవర్తి అనటాన్ని మీరెట్లా అర్థం చేసుకున్నారు?*
- *శిబిచక్రవర్తి పావురాన్ని రక్షించడానికి ప్రాణత్యాగానికి పూనుకున్నాడు కదా! త్యాగం ఆవశ్యకత ఏమిటి?*

SCERT TELANGANA

## తాత్పర్యాలు

### I

1. "ఓ శిబి చక్రవర్తీ! నీవు సత్య ధర్మాలను ఆచరించటంచేత కళంకం లేనివాడివని విన్నాను. అటువంటి నీవు ఈ సమయంలో మిక్కిలి ఆకలితో ఉన్న నాకు ఆహారం దొరకకుండా చేయటం న్యాయమేనా?

2. అన్ని ప్రాణులు కూడా ఆహారం మూలంగానే బ్రతుకుతూ వృద్ధి పొందుతాయి. ఈ పావురం నాకు ఆహారం కాకపోతే ఆకలిబాధతో నా ప్రాణాలు పోతాయి. అట్లైతే నా పిల్లలు, భార్య కూడా బతుకజాలరు. ఒక్క పావురాన్ని కాపాడి ఇన్ని ప్రాణులను హింసించటం ధర్మానికి వ్యతిరేకమే కదా!

3. ధర్మం తెలిసినవారు ధర్మానికి కీడు చేసే ఎటువంటి ధర్మాన్నైనా ధర్మమని మనస్సులో తలచుకోరు. ధర్మం అనేది అన్నింటికీ మేలును కలిగించేదిగానే ఉండాలి.

4. ఈ పావురం నాకు వేదంచే నిర్దేశింపబడిన ఆహారం. 'డేగలు పావురాలను తింటాయి' అనే వేద వాక్యం ఉన్నది. కాబట్టి దీనిని నాకు ఆహారంగా ఇవ్వు"మని అడిగిన డేగతో శిబి ఈ విధంగా బదులు పలికాడు.

5. "ప్రాణభయంతో వచ్చి ఈ పావురం నన్ను ఆశ్రయించింది. ఎంతటి నీచుడయినా రక్షింపుమని వచ్చిన ఆశ్రితుడిని విడిచిపెట్టడు. నేనెట్లా విడిచిపెడతాను? ఆశ్రితులను విడిచిపెట్టడం ధర్మం ఎట్లా అవుతుందో నీవే చెప్పు.

### II

6. నీవు పక్షివి ఐనప్పటికీ ధర్మం తెలిసిన దానివలె మాట్లాడావు. రక్షించుమని కోరి వచ్చిన వారిని విడిచిపెట్టటం కన్న అధర్మం మరొకటుంటుందా? నీ ఆకలి ఈ పావురాన్ని తింటే కానీ తీరదా? నీ ప్రయత్నం ఆహారం కోసమే అయితే ఇప్పుడు అడవిలో ఎన్ని జంతువులు లేవు? లేళ్ళు, దున్నలు, పందులు, పక్షులు మొదలైన వాటి మాంసాలు దీని కన్నా ఎక్కువగా పెడతాను. ఈ పావురం మీద కోపాన్ని విడిచిపెట్టు. దీన్ని మాత్రం నేను విడువను" అని శిబి చెప్పగా డేగ ఇట్లా బదులు పలికింది.

7. "ఓ రాజా! ఈ పావురం నాకు సహజసిద్ధంగా కల్పించబడిన ఆహారం. ఒకవేళ దీన్ని నీవు కాపాడాలని అనుకుంటే, దాని బరువుకు తూగినంత మాంసాన్ని నీ శరీరం నుంచి నాకు పెట్టు"మని అడిగింది.

8. అనగా సంతోషించిన శిబి "పక్షులన్నింటిలో గొప్పదానివైన నీవు నాపై దయ చూపావు" అని చెప్పి వెంటనే చిన్న కత్తితో తన శరీరంలోని మాంసాన్ని కోసి తక్కెడలో వేస్తూ పావురం బరువుతో తూకం వేశాడు. తన దేహంలోని మొత్తం మాంసం వేసినప్పటికీ పావురం ఉన్నవైపే తక్కెడ మొగ్గుతున్నది.

9. తన శరీరం నుండి ఎంత మాంసం ఇచ్చినా పావురంతో సరితూగక పోవటంతో ఆశ్చర్యపడ్డ శిబి చక్రవర్తి తానే తక్కెడలో కూర్చున్నాడు. ఇటువంటి ఆత్మార్పణతో కూడిన అతని త్యాగ గుణాన్ని చూసి ఇంద్రుడు, అగ్ని దేవుడు మెచ్చుకొని...

10. డేగ, పావురం రూపాల్లో ఉన్న ఇంద్రుడు, అగ్ని వారి నిజరూపాలతో సాక్షాత్కరించి "నీ ధైర్య, శౌర్య గుణాలు చాలా గొప్పవి. ఇవి ఇతరులకు సాధ్యంకావు. కావున నీ కీర్తి శాశ్వతంగా ఉంటుం"దని వెళ్ళిపోయారు.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

# ఇవి చేయండి

## I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. **త్యాగం అంటే ఏమిటి? త్యాగంలోని గొప్పతనం ఏమిటి?**
2. **ఇతరులకోసం, సమాజంకోసం త్యాగం చేసిన వారి గురించి చెప్పండి.**

## II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

1. **కింది వాక్యాల ఆధారంగా పాఠంలోని పద్యపాదాలను గుర్తించి రాయండి.**

అ) ధర్మం జగత్తుకంతటికీ మేలు చేయాలి ____________________

ఆ) ఈ పక్షి నాకు ప్రకృతి సహజంగా ఏర్పడిన ఆహారం ____________________

ఇ) ఆశ్రయించిన వారిని విడిచిపెట్టడం ధర్మమవుతుందా చెప్పు ____________________

2. **కింది పద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు సరిపోయే జవాబును గుర్తించండి.**

బ్రతికి నన్నినాళ్ళు ఫలము లిచ్చుటెగాదు
చచ్చిగూడ చీల్చియిచ్చు తనువు
త్యాగభావమునకు తరువులే గురువులు
లలిత సుగుణజాల తెలుగుబాల.

అ) 'చెట్టు' అను పదానికి సరిపోయేపదం. ( )

ఎ) తరువు బి) గురువు సి) ఫలం డి) గుణం

ఆ) త్యాగానికి గురువులు ఎవరు? ( )

ఎ) మానవులు బి) చెట్లు సి) పక్షులు డి) జంతువులు

ఇ) తనువును చీల్చి యిచ్చేవి ( )

ఎ) మేఘాలు బి) నదులు సి) చెట్లు డి) పక్షులు

ఈ) చచ్చుట పదానికి వ్యతిరేకార్థం ( )

ఎ) పెరుగుట బి) తరుగుట సి) బ్రతుకుట డి) మేల్కొనుట

ఉ) పై పద్యానికి తగిన శీర్షిక ( )

ఎ) భారం బి) ప్రాణం సి) యోగం డి) త్యాగం

SCERT TELANGANA

## III. స్వీయరచన

1. **కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) ఇతరులు ఆహారం తినేటప్పుడు ఎందుకు విఘ్నం కలిగించకూడదో రాయండి.

ఆ) 'అందరూ ధర్మాన్ని ఆచరించాలి' అనే విషయాన్ని సమర్థిస్తూ రాయండి.

ఇ) ఇతరుల కొఱకు మనం ఎట్లాంటి త్యాగాలను చేయవచ్చో రాయండి.

ఈ) 'త్యాగనిరతి' అనే శీర్షిక పాఠానికి ఏవిధంగా తగినదో రాయండి.

2. **కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) త్యాగం చేయటంలో ఉన్న గొప్పతనాన్ని, అనుభూతిని వివరించండి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

1. **కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

అ) అన్ని దానాల్లోకెల్ల అన్నదానం గొప్పది. శరీరంలోని అవయవదానం ఇంకా గొప్పది. అవయవదానంపై ప్రజలకు చైతన్యం కలిగించుమని వార్తా పత్రికలకు లేఖ రాయండి.

## V. పదజాల వినియోగం

1. **గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.**

ఉదా: కపోతములు శాంతికి చిహ్నాలని భావిస్తారు.

కపోతములు = పావురములు

అ) ఆశ్రితులను వదలి వేయుట ధర్మువు కాదు.

ఆ) ఉత్తముడు పరుల హితమునే కోరతాడు.

ఇ) ఎందరో మహానుభావుల పరిత్యాగం వల్లనే తెలంగాణా రాష్ట్రం సిద్ధించింది.

ఈ) దేశంలో సుఖశాంతులు వర్ధిల్లుగాక!

ఉ) బుభుక్షితుడు రుచిని పట్టించుకోకుండా ఆరగిస్తాడు.

2. **కింది వాక్యాలలోని నానార్థాలను గుర్తించి రాయండి.**

ఉదా: ఈ సంవత్సరం వానలు తక్కువగా ఉన్నాయి.

వర్షం = సంవత్సరం, వాన

అ) న్యాయంగా ఆలోచిస్తే పాలల్లో నీళ్ళు కలపడం ధర్మం కాదు.

పాడి : ____________; ____________

ఆ) అడవిలోని జంతువులకు నీరు కరువవుతున్నది.

వనం : ____________; ____________



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

## VI. భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది వాక్యాలను చదువండి. అవి ఎటువంటి వాక్యాలో గుర్తించి జతపరచండి.**

ఉదా: లోపలకి రావచ్చు - అనుమత్యర్థక వాక్యం

| | | |
|---|---|---|
| అ) దయచేసి వినండి | ( ) | 1. ఆశ్చర్యార్థక వాక్యం |
| ఆ) రమ చక్కగా రాయగలదు | ( ) | 2. ప్రశ్నార్థకవాక్యం |
| ఇ) ఆహా! ఎంత బాగుందో | ( ) | 3. సామర్థ్యార్థక వాక్యం |
| ఈ) అల్లరి చేయవద్దు | ( ) | 4. ప్రార్థనార్థక వాక్యం |
| ఉ) గిరి! ఎక్కడున్నావు? | ( ) | 5. నిషేధార్థక వాక్యం |

**2. కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

అ) ఇంద్రాగ్నులు = ________ + ________ = ________________

ఆ) త్యాగమిది = ________ + ________ = ________________

ఇ) ఆహారార్థం = ________ + ________ = ________________

ఈ) నేనెట్లు = ________ + ________ = ________________

ఉ) శౌర్యాది = ________ + ________ = ________________

### భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- త్యాగబుద్ధి కలిగిన ఇద్దరు మహనీయుల వివరాలను లేదా కథలను లేదా సంఘటనలను సేకరించండి. నివేదిక రాసి తరగతిలో ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | త్యాగంలోని గొప్పదనాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | అవును / కాదు |
| 2. | అపరిచిత పద్యాన్ని చదివి అర్థం చేసుకోగలను. సరైన జవాబులు గుర్తించగలను. | అవును / కాదు |
| 3. | నిత్యజీవితంలో జరిగిన ఒక సంఘటనలోని త్యాగభావాన్ని గుర్తించగలను. | అవును / కాదు |
| 4. | అవయవదానంపై ప్రజలకు చైతన్యం కలిగించుమని వార్తా పత్రికకు లేఖ రాయగలను. | అవును / కాదు |

### సూక్తి

త్యాగం వల్ల సదాచారం,
సత్ప్రవర్తన వల్ల మానవజన్మ
సార్థకమవుతాయి.



SCERT TELANGANA

2

# సముద్ర ప్రయాణం

- ముద్దు రామకృష్ణయ్య

## చదువండి - ఆలోచించి చెప్పండి.

పడవలో ఇంకా ఇద్దరు భారతీయ విద్యార్థులుండిరి. వారు నాతోమాట్లాడుతూ ఉండిరి. సర్కారువారు వారిని స్కాలర్‌షిప్ ఇచ్చి పంపినది. కొంతమంది తల్లిదండ్రుల పైసాతో వచ్చుచుండిరి. నేను ఎక్కువ సామాను లేకుండా 22 పౌండ్లతోనే ఇంగ్లండుకు బయలుదేరినాను. ఉన్నిబట్టలు నా వద్ద సరిపోయేటన్ని లేకుండె. ధోతి, పయిజామా, షేర్వాణీతోనే పడవలో తిరిగేవాణ్ణి. దేవుని పైన భారం వేసినాను. బొంబాయి నుండి గ్రేట్ బ్రిటన్‌కు బయలుదేరినాను.

గ్రేట్‌బ్రిటన్ పడమటి తీరం పొడుగున ఉత్తరం వైపు మా ప్రయాణం సాగుచుండెను. గ్రేట్ బ్రిటన్ భూమి కనపడుచుండెను. దేవుడు నన్ను తుదకు గ్రేట్ బ్రిటన్ చేర్చినందుకు సంతోషించి, కృతజ్ఞతా వందనంచేసితిని.

### ప్రశ్నలు:

1. పడవలోని వాళ్ళు ఎక్కడికి ప్రయాణమైపోతున్నారు?
2. వాళ్ళు బ్రిటన్‌కు ఎందుకు వెళ్ళి ఉండవచ్చు?
3. పడవలో ప్రయాణించిన వ్యక్తి దేవుడికి కృతజ్ఞతా వందనం చెప్పడానికి గల కారణాలు ఏమై ఉంటాయి?

## పాఠ్యం నేపథ్యం, ఉద్దేశం

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో లండనుకు వెళ్ళి చదువుకోవడం వ్యయప్రయాసలతో కూడుకొన్నపని. అయినప్పటికీ ఉన్నత విద్యకోసం, పెద్దపల్లి జిల్లా మంథని గ్రామ వాసియైన ముద్దు రామకృష్ణయ్య సుదూర దేశమైన గ్రేట్ బ్రిటన్‌కు సముద్ర ప్రయాణం చేశాడు. ఆయన సముద్ర ప్రయాణ అనుభవాలే ఈ పాఠం నేపథ్యం.

కార్యసాధకులు అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కృత నిశ్చయంతో దృఢసంకల్పంతో పూర్తి చేసుకుని విజయాన్ని సాధించ గలుగుతారని తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

'యాత్రా చరిత్ర' ప్రక్రియకు చెందినదీ పాఠం. యాత్రవల్ల తమకు కలిగిన అనుభవాలను వివరిస్తూ రాసేదే యాత్రాచరిత్ర. దేశ, విదేశాలలో నెలకొన్న నాటి రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులను కూడా ఇవి వివరిస్తాయి.

ఈ పాఠం ముద్దు రామకృష్ణయ్య రాసిన 'నా ప్రథమ విదేశీ యాత్ర' పుస్తకంలోనిది.

## రచయిత పరిచయం



**18-10-1907**
**21-10-1985**

ముద్దు రామకృష్ణయ్య పెద్దపల్లి జిల్లాలోని మంథని గ్రామంలో జన్మించాడు. వీరి తండ్రి ముద్దు రాజన్న, తల్లి ముద్దు అమ్మాయి. 1946లో బ్రిటన్‌లోని లీడ్స్ విశ్వవిద్యాలయం నుండి యం.ఇడి. పట్టా పొందాడు. 1951-58 మధ్య కాలంలో ఆసియా, ఆస్ట్రేలియా, యూరప్, అమెరికా ఖండాలలోని పలుదేశాలు పర్యటించి, అక్కడి విద్యావిధానాలను అధ్యయనం చేశాడు. మన దేశపు విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తెచ్చాడు. అవి నేటికీ ఆదర్శప్రాయాలైనాయి. సమయపాలనకు ఆయన పెట్టింది పేరు. నిరక్షరాస్యత నిర్మూలన కోసం 'ఈచ్ వన్ టీచ్ వన్' ఉద్యమాన్ని జీవిత చరమాంకం వరకు కొనసాగించిన గొప్ప విద్యావేత్త.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.



SCERT TELANGANA



## ప్రవేశిక

*ప్రయాణం మొదలయ్యింది. ఎక్కడికి పోవాలో తెలవదు. ఎవరిని కలవాలో తెలవదు. కాని, ఏదైనా ఎదుర్కొనే ధైర్యం ఉన్నది. జీవితమంటే అన్నీ ఉంటాయి. కండ్ల ముందు ఒకటే లక్ష్యం. లక్ష్యసాధనే నా సిద్ధాంతం. ఏదో ఒక దారి దొరుకకపోదు.*

*అనుకున్న విధంగా ఉన్నత విద్య పూర్తి చెయ్యాలి. దేశం కోసం ఏదో ఒకటి చెయ్యాలి. ఏం చెయ్యాలి? ఎట్లా చెయ్యాలి? పరి పరి విధాలుగా ఆలోచిస్తున్నది మనసు.*


*ప్రయాణం కొనసాగుతున్నది!*

*అనంతాకాశంలాగా పరుచుకున్న సాగరంలో ఆ ప్రయాణం ఏ తీరం చేరుకున్నది? ఎట్లా చేరుకున్నది ..... తెలుసుకుందాం.*



## I

పడవ యునైటెడ్ కింగ్‌డమ్‌కు బయలుదేరింది. రెండవ ప్రపంచ యుద్ధకాలము. యుద్ధం 1939లో మొదలయింది. అప్పటి నుండి గ్రేట్ బ్రిటనుకు పడవలు తరుచుగా పోవటంలేదు. నేను వెళ్ళినది సెప్టెంబర్ 8-1944లో. గ్రేట్ బ్రిటనుకు చేరేవరకు ఏవేళ ప్రాణం పోతుందో అనే భయమే. కాబట్టి వెళ్ళినప్పుడల్లా ఒక్కొక్క పడవ వెళ్ళేది కాదు. సైన్యపు బందోబస్తులో చాలా నౌకల “కాన్వాయి” వెళ్ళేది.



SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

మా కాన్వాయ్‌లో 50–60 నౌకలు ఉండె. ప్రతి పడవపైన 'Life Boats' ఉండేవి. పడవ కాప్టెన్ మొదలగు ఆఫీసర్లు వచ్చి, మమ్ములను సరిగా ఉన్నామా అని ఇన్స్‌పెక్ట్ చేసి, తరువాత అందరిని పంపేవారు. బొంబాయిలో పడవ ఎక్కిన తరువాత కూడా, కొన్నిదినాల వరకు పడవ అక్కడనే ఉండింది. మమ్ములను దిగనివ్వలేదు. మా క్యాబిన్‌లో ఆరు బెర్తులు ఉండె. మా పడవలోని అటెండెంట్లు భారతీయులే. వారు ఉండే డెక్ వేరే. వారు తినే డెక్ వేరే.

పడవ చిన్నదీ కాదు, చాల పెద్దదీ కాదు. కొత్త వారికి సముద్రరోగము వస్తుంది. సముద్రం ప్రశాంతంగా ఉంటే ఈ జబ్బురాదు. దీనికి డబ్బు తీసుకోకుండానే పడవవారు మందులు ఇస్తారు. సముద్రం సరిగా లేకుంటే ఈ జబ్బు వస్తుంది. తల తిరుగుతుంది. తల నొస్తుంది. కక్కు వస్తుంది. కండ్లు తిరుగుతవి. ఆ సమయంలో పక్కపైన పడుకొని ఉంటారు.

పడవలో హాస్పిటల్ కూడా ఉంటది. డబ్బు తీసుకోకుండానే సామాన్య రోగాలకు మందులు ఇస్తారు. రోగులు లేవలేకుంటే డాక్టర్లు, నర్సులు క్యాబిన్‌కి వస్తారు. మందులు క్యాబిన్‌కు పంపుతారు. పోష్టు ఆఫీసు కూడా ఉంటుంది. తరువాతి రేవు రాకముందే పోస్టులో జాబులు వేయమని నోటీసు పెట్టుతారు. మనకు జాబువస్తే క్యాబిన్‌కు పంపుతారు.

టెలిగ్రాఫ్ ఆఫీసు (వైర్‌లెస్) కూడా ఉంటుంది. మనకు టెలిగ్రాములు వస్తే ఇస్తారు. మనం కూడా టెలిగ్రాములు ఇవ్వవచ్చు. పడవలో "రిసెప్షన్‌రూం" కూడా ఉంటుంది. అది రాత్రి పగలు ఖుల్లా ఉంటుంది. మనకు కావలసిన విషయాలన్నీ తెలుపుతారు. పడవలో దుకాణము కూడా ఉంటుంది. అన్ని వస్తువులు దొరుకుతవి.

**ఆలోచించండి–చెప్పండి**

- *వాహనాలు కాన్వాయ్‌గా వెళ్ళడం ఎప్పుడైనా చూశారా? దేని కొరకు అట్లా వెళ్తాయి?*
- *సైరన్ లేదా అలారం ఎందుకు మోగిస్తారు?*
- *దూర ప్రయాణాలకు ఎట్లా సిద్ధం కావాలి?*

## II

పడవపైన రేడియోలు ప్రతి డెక్ పైన లౌడు స్పీకర్లతో కనెక్టు చేయబడి ఉంటవి. పడవవారు రేడియో వార్తలు అప్పటికప్పుడు టైపు చేయించి, సైక్లోస్టైల్ కాపీలు లాంజ్‌లో పెట్టించేవారు. పీరియాడికల్స్ కూడా లాంజ్‌లో పెట్టేవారు. లాంజ్‌లోని ఫర్నీచర్ గొప్ప ధనవంతుల ఇండ్లలో ఉండేటటువంటివి ఉంటవి. ఫ్లోరు పైన గొప్ప విలువైన తివాసీలు మరియు మఖ్మల్ (వెల్వెట్) తివాసీలు ఉంటవి. కంఫర్టబుల్ సోఫాలు మరియు మెత్తటి కుర్చీలు ఉంటవి. అందరూ కూర్చొని స్నేహితులతో మాట్లాడుతూ ఉంటారు. కొందరు చదువుతూ ఉంటారు.

చిన్న పిల్లలకు నర్సరీ సెక్షన్ మరియు కిండర్ గార్డెన్ సెక్షన్లు ఉంటవి. తల్లిదండ్రులు వెంటలేకుండా ప్రయాణం చేసే పసి పిల్లలు కూడా ఉండిరి. అటువంటి పిల్లల బాధ్యత పడవవారే తీసుకుంటారు. పడవలో లైబ్రరీకూడా ఉంది. పుస్తకాలను మన క్యాబిన్‌కు చదువుకోవటానికి ఇచ్చేవారు. ఔట్‌డోర్ గేమ్స్ కూడా ఉంటవి. పడవలో ప్రయాణీకులు ఆడుతుండేవారు. చివరిదినం టూర్నమెంట్స్ పెట్టించి, గెలిచినవారికి బహుమతులు ఇచ్చేవారు. స్విమ్మింగ్ పూల్స్ ఉంటవి. ఈతల పోటీలు జరుగుతూ ఉంటవి. డెక్‌పైన ఓపెన్ ఏర్‌లో రాత్రి ఎందరో పడ్కుండేవారు.

మా పడవలో పాశ్చాత్యులు చాలా ఉండిరి. భారతీయులు చాలా తక్కువగా ఉండిరి. పాశ్చాత్యులలో బ్రిటీష్‌వారే ఎక్కువగా ఉండిరి. బ్రిటిష్‌వారు ఎవరూ కాని నాకు తెలియదు. దగ్గర నుంచి చూడటం, వారి దగ్గర అంత క్లోజుగా కూర్చుని వారి భాష వినటం అదే మొదటిసారి. వారి ఉచ్చారణ సరిగా తెలిసేదికాదు. నా ఉచ్చారణ వారికి తెలిసేది కాదు. కాని వారు భారతదేశంలో ఉన్నవారు కాబట్టి, నా ఉచ్చారణ తెలుసుకొనేవారు. నాకు వారి మాటలు తెలుసుకోవటం చాలా శ్రమ అయ్యేది.

రేడియో ఇంగ్లీషు భాష కూడా తెలియకపొయ్యేది. నేను ధోవతి శేర్వానీతో ఉంటిని. నేను తప్ప మిగతా భారతీయులు పాశ్చాత్య డ్రెస్‌లో ఉండిరి. నా దగ్గరికి చాలా మంది బ్రిటిష్ వాళ్ళు రాకపోతూ ఉండిరి. ఐనా కొంతమంది నన్ను మందలించేవారు. నా దగ్గరకు వచ్చి కూర్చుండి నాతో మాట్లాడేవారు. అందులో తరుచుగా మాట్లాడిన వ్యక్తి జైపూర్ మహారాజా గారి కుమారునికి చదువు చెప్పిన వ్యక్తి. అతడు చాలా మంచివాడు. భారతదేశంలోని ఎందరో రాజకుమారులు వారికి శిష్యులు.

### ఆలోచించండి-చెప్పండి

- ఇప్పుడు ప్రయాణంలో కాలక్షేపం కొరకు ప్రయాణీకులు ఏమేం చేస్తుంటారో చెప్పండి.
- ప్రయాణం చేసేటప్పుడు తోటి ప్రయాణీకులతో ఎట్లా ఉండాలి? ఎందుకు?
- కొత్త ప్రదేశానికి వెళ్ళినప్పుడు అక్కడి భాష అర్థం కాకపోతే ఎటువంటి చిక్కులెదురవుతాయి? అప్పుడు మీరేం చేస్తారు?

ఇంకొకరు ఆంగ్లో ఇండియను. వ్యక్తి తెల్లగా లేకుండె. అతనిపేరు ఫాల్సెట్టు. ఇంగ్లాండుకు సెలవుపైన వెళ్ళుతూ ఉండెను. అతనితో నాకు చాలా స్నేహం కలిగింది. అతడు నాకు పాశ్చాత్యుల అలవాట్లను కావలసిన వాటిని తెలుపుతూ ఉండేవాడు. బ్రిటీష్ జీవితపు కథలు తెలుపుతూ ఉండేవాడు. బ్రిటన్‌లో చదువుకోవడం బీదవారి తరం కాదనేవాడు. వేయిల రూపాయలు ఉంటేగాని బ్రిటన్‌లో జీవితం జరుగదు అనేవాడు. బ్రిటన్‌లో ఉద్యోగం దొరుకదు అనేవాడు.

## III

డెక్‌పైన మొదటిసారి నన్ను చూసినప్పుడు ఏదో రాజుగారికి వంటచేసే వాణ్ణని, నా డ్రస్సు చూసి అనుకున్నాడట. తరువాత నేను విద్యాభ్యాసానికి వెళ్ళుతున్నానని చెప్పినాను. నేను బీదవాణ్ణి. డబ్బులేకుండా వెళ్ళుతున్నానని వారికి తెలువదు. నేను చెప్పలేదు. నా దగ్గర డబ్బులేదని తెలిస్తే నన్ను 'డీపోర్టు' చేసి ఇండియాకు తిరిగి పంపుతారని నా భయం. దేవునికి తప్ప ఇంకెవరికీ చెప్పలేదు.

ఇంగ్లాండుకు పడవ చేరగానే, బ్రిటీషు రేవులోని పోలీసులు, తగినంత పైసాలేని వారిని డీపోర్టు చేసి వాపసు పంపుతారనీ, బ్రిటీష్ పోలీసువారు చాలా స్ట్రిక్ట్ అని ఫాల్సెట్ నాతో అనేవారు. వారి మాటలు విని, నన్ను ఇంగ్లండులో దిగనివ్వరని మళ్ళీ అదే పడవలో దేశం వెళ్ళగొట్టుతారని లోలోపల భయం వేసి "ఈశ్వరా నీవే దిక్కు, నీవే నన్ను తలవని తలంపుగా తీసుకొని వస్తున్నావు. కనుక నీవే నన్ను డీపోర్టు చేయించకుండా ఇంగ్లండులో ప్రవేశపెట్టమని ప్రతి నిముషం మొక్కేవాణ్ణి.

నేను నా దగ్గర ఎక్కువ సామాను లేకుండా 22 పౌండ్లతోనే ఇంగ్లాండుకు బయలుదేరినాను. అప్పుడు ఎక్స్చేంజ్ రేటు ఒక స్టెర్లింగ్ పౌండ్‌కు కల్దారు 13 రూపాయల 6 అణాలు. ఉన్ని బట్టలు నావద్ద సరిపోయేటన్ని లేకుండె. ధోతీ, పయిజామా, షేర్వాణీతోనే పడవలో తిరిగేవాణ్ణి. దేవునిపైన భారం వేసినాను. కనుక నాకు ఇంగ్లాండులో ఏదో పని చూపించి ద్రవ్యం సంపాదించే మార్గం చూపి నన్ను చదివించి తిరిగి తప్పక దేశం తెస్తడన్న నమ్మకంతోనే బొంబాయి నుండి గ్రేట్‌బ్రిటన్‌కు బయలుదేరినాను. మా పడవ మెల్లగా నడిచేది. పడమర వైపుకు పోతూ ఉంటిమి. కాబట్టి రోజూ గడియారం వెనుకకు తిప్పుకోవాలనీ, ఎన్ని నిమిషాలు వెనుకకు తిప్పాలో పడవ రిసెప్షన్ ఆఫీసులో నోటీసు పెట్టేవారు.

గ్రేట్‌బ్రిటన్ చేరే వరకు అయిదున్నర గంటలు వెనుకకు తిప్పినాము. మొదటి హాల్ట్ మాది ఆడన్ (ఏడెన్)లో. ఆడెన్ పట్టణములోనికి వెళ్ళటానికి మాకు పర్మిషన్ ఇచ్చినారు. నా వెంబడి ఉన్న గుజరాతీ పిల్లల బంధువులు ఆడన్‌లో ఉండిరి.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20
SCERT TELANGANA

అతడు కారు తెచ్చి మమ్ములను తీసుకొని వెళ్ళినాడు. ఆడన్ ప్రాంతములోని చారిత్రాత్మకమైనవన్నీ చూపించినాడు. వారి ఇంట్లో మంచి శాకాహార భోజనం పెట్టి మళ్ళా పడవరేవులో విడచినాడు. ఆడన్‌లో ఉండేవారందరు అరబ్బీ ముస్లిములు. మన హైదరాబాదులోని ముస్లింల మొహల్లా ఉన్నట్టు ఉంటుంది.

మా పడవ కొన్ని దినాలు పోర్టు సయీద్‌లో ఉండి, మధ్యధరా సముద్రములో ప్రవేశించెను. చాలా జాగ్రత్తగా ప్రయాణం చేసితిమి. మా వెంట ఉన్న యుద్ధ విమానాలు మా పడవపైన ఎగురుచుండెను. డిస్ట్రాయర్లు మైనులను తీసివేస్తూ ఉండెను. అప్పుడప్పుడు డేంజర్ ఉన్నదని మేసేజ్ వస్తే మా పడవలు వెనుకకు తిరిగేవి. కొంతసేపు అయిన తరువాత మార్గం మార్చి మళ్ళీ ముందుకు నడిచేవి. 'జిబ్రాల్టర్' రేవుకు చేరుకొంటిమి.

**ఆలోచించండి - చెప్పండి**

- *విదేశాలకు వెళ్ళేటప్పుడు గడియారంలో సమయాన్ని సరిచేసుకోవాలి. దీనికి కారణం ఏమిటి?*
- *విదేశాలలో మనకు తెల్సినవారు, బంధువులుంటే ఎట్లాంటి సౌకర్యాలు పొందవచ్చో చెప్పండి?*
- *"ఈశ్వరా నీవే దిక్కు" అని రచయిత అనుకోవటానికి కారణమేమిటి? మీకెదురైన అట్లాంటి సందర్భాన్ని చెప్పండి.*

## IV

అట్లాంటిక్ మహాసముద్రములో ప్రవేశించేటప్పుడు సముద్రము చాలా 'కాము' (ప్రశాంతం)గా ఉండెను. యుద్ధ నౌకలు యుద్ధ విమానాలు జిబ్రాల్టర్ సంధిని కాపాడుచుండెను. మేము 'బే ఆఫ్ బిస్కే' చేరితిమి. సముద్రము చాలా ఘోరంగా వైల్డ్‌గా ఉండెను. వాతావరణం చల్లగా, మబ్బులతో నిండియుండెను. అప్పుడే ఇంగ్లాండు దగ్గరకు వస్తున్నదని, అందరూ దిగే సన్నాహాలు మొదలు పెట్టినరు. జర్మన్ బాంబుల నుండి బ్రతికి చివరకు ఇల్లు చేరుకొంటిమని బ్రిటిష్‌వారు సంతోషపడుచుండిరి.

ఇంగ్లీష్ చానల్‌లో మా పడవ చేరగానే సముద్రం 'కాం' (ప్రశాంతం) అయింది. గ్రేట్ బ్రిటన్ పడమటి తీరం పొడుగున ఉత్తరం వైపు మా పడవ పోవుచుండెను. గ్రేట్ బ్రిటన్ భూమి కనపడుచుండెను. దేవుడు నన్ను తుదకు గ్రేట్ బ్రిటన్ చేర్చినందుకు సంతోషించి, కృతజ్ఞతా వందనం చేసితిని. కాని పాల్సెట్ గారు ఇతర భారతీయ విద్యార్థులు, బ్రిటిష్ కస్టం వాళ్ళు పడవ దిగేముందు డబ్బు గురించి అడుగుతారనీ, సరిపోయేటంత డబ్బు లేకపోతే పడవ దిగనివ్వరని మాటిమాటికి గట్టిగా చెప్పుచుండిరి. కాబట్టి నన్ను గ్రేట్ బ్రిటన్‌లో దిగనిస్తారో లేదో అని లోలోపల చింతించుకొంటూ, మాటి మాటికి దేవుణ్ణి శరణు జొచ్చితిని.

అప్పుడు నేను నాతో పాటు గ్రేట్ బ్రిటన్‌కు ప్రయాణిస్తున్న కరీంనగరు జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గారి అబ్బాయి సురేశ్ బాబును కలిసితిని. క్లుప్తంగా నా పరిస్థితి వివరించితిని. నా దగ్గర డబ్బు లేదన్న రహస్యం ఎవ్వరికీ చెప్పనని అతని నుండి వాగ్దానము తీసుకొంటిని. ఆ పిల్లవాడు చాలా మంచివాడు. అతని దగ్గర 150/- పౌండ్ల డ్రాఫ్ట్ ఉండె. అతడు గవర్నమెంట్ స్కాలర్‌షిప్ హోల్డర్ కాబట్టి అతన్ని డబ్బు ప్రశ్న అడుగరు. అతనికి పడవదిగే పర్మిషన్ తొందరగా దొరుకుతుందని అతనితో "బాబూ! నీకు డబ్బు ప్రశ్నలేదు. నిన్ను డబ్బు విషయం అడుగరు. నీవు గవర్నమెంట్ స్కాలర్‌షిప్ హోల్డరువు. కనుక నీ 150 పౌండ్ల డ్రాఫ్ట్‌లో నావి నూరు పౌండ్లు ఉన్నవనీ, నేను నీకు బంధువును కాబట్టి ఇద్దరి డబ్బు ఒకే డ్రాఫ్ట్‌లో ఉన్నవని చెప్పు. భయపడకు. నేను నీ డబ్బు తీసుకోను. నిన్ను డబ్బు అడుగను. నన్ను పడవ దిగేటట్టు చూడు" అని అంటిని. ఈ మాటకు సురేశ్‌బాబు ఒప్పుకొన్నాడు. గ్రేట్ బ్రిటన్ సాయంత్రం చేరినాము. గ్రేట్ బ్రిటన్ పశ్చిమ తీరపు



SCERT TELANGANA



స్కాట్‌లాండ్ యొక్క గ్లాస్గో రేవుపట్టణం దగ్గర పడవ ఆగింది. అక్కడి పోలీసువారు, మా పడవరేవుకు చేరకముందే పడవలోనికి వచ్చినారు. ప్యాసింజర్ల పాస్‌పోర్టులను ఇతర కాగితాలను చెక్ చేయటం మొదలు పెట్టినారు. కొందరికి దిగటానికి పర్మిషన్ ఇవ్వలేదు. నాకు గుండె జల్లుమన్నది. నా గతి ఏమి అవుతుందో అని. పాల్సైట్ గారు మహా సంతోషముతో తనకు పర్మిషన్ దొరుకుతుందని వెళ్ళినారు. కాని వారికి కూడా ఎందుకో పర్మిషన్ దొరకలేదు. నాకు చమటలు పట్టినవి. కాని పైకి మాత్రం ధైర్యంగానే ఉన్నా, నేను షేర్వానీ, పైజామాలో ఉన్నా. నా వంతు వచ్చింది. నా పాస్‌పోర్టు చూసిన పోలీసు అధికారి "మీరు స్టడీస్ కొరకు వచ్చినారా?" అని అడిగినారు. నేను అవునని చెప్పినాను. ఆలస్యం లేకుండా, ఇంకా ఏమీ అడగకుండానే "పర్మిటెడ్" అని స్టాంపు వేసినారు.

నేను బయటకు వచ్చినాను. బయట గ్రేట్ బ్రిటన్ దృశ్యం చూస్తూ నిలబడిపోయినాను. పట్టరాని సంతోషం వచ్చింది. దేవుడు సాధ్యం కాదనుకొన్నదాన్ని సాధ్యం చేసినాడు. నేను ఎక్కడ? గ్రేట్ బ్రిటన్‌కు పైసాలేకుండా రావటమెక్కడ? ఈశ్వరుడు నన్ను రక్షించినాడు – బ్రిటన్‌లోని సుందర దృశ్యాలను చూసి, సమీపంలోని పడవలను చూసి దేవునికి కృతజ్ఞతా వందనాలు చేసితిని. పాల్సేట్ గారికి కూడా దిగటానికి పర్మిషన్ దొరికింది. సురేశ్ బాబుకు గూడా పర్మిషన్ దొరికింది. సురేశ్‌బాబు సాహాయ్యం లేకుండానే అతని డబ్బుతో అవసరం లేకుండానే నాకు పర్మిషన్ దొరికినందుకు అతడు ఆశ్చర్యపడినాడు. మేము పడవనుండి దిగేవరకు సూర్యాస్తమయం అయింది. నవంబర్ నెల. చాలా చలి. సామాను దింపటానికి కూలివారులేరు. నా సందుగ చాలా పెద్దది. అందరు తమ తమ సామాన్లు వెతుకుతూ ఉండిరి. కొందరు భారతీయ స్నేహితులు నాకు సాహాయ్యం చేసిరి. నా సామాను పడవ దిగింది. ఈశ్వరుని కటాక్షము వలన వంటాయన కొడుకునైన బీద టీచరును, సరిపడడబ్బు వెంట లేకుండా 22 పౌండ్లతో, షేర్వానీ పైజామా తొడుగుకొని గ్రేట్ బ్రిటన్‌లోని స్కాట్‌లాండ్ భూమిపైన అడుగుపెట్టితిని.

## ఆలోచించండి –చెప్పండి

- రచయితకు సురేశ్‌బాబు సహాయం లేకుండానే పర్మిషన్ దొరకడానికి కారణం ఏమై ఉంటుంది?
- ఏయే సందర్భాల్లో మీరు దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంటారో తెల్పండి.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

# ఇవి చేయండి

## I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. **ఏదైనా సాధించాలంటే పట్టుదల, దృఢ సంకల్పం అవసరం. దీన్ని సమర్థిస్తూ మాట్లాడండి.**

## II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

1. **కింది వాక్యాలు పాఠంలోని ఏ పేరాలో ఉన్నవో గుర్తించి, పేరాకు శీర్షికను పెట్టండి.**

| వాక్యం | పేరా సంఖ్య | శీర్షిక |
|---|---|---|
| పడవలో రిసెప్షన్ రూం కూడా ఉంటుంది | | |
| నేను ధోవతి శేర్వానీతో ఉంటిని | | |
| ఏవేళ ప్రాణం పోతుందో | | |
| మేము పడవ నుండి దిగేవరకు సూర్యాస్తమయం అయింది. | | |

2. **కింది పేరాను చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి.**

హైదరాబాద్ నుండి నేను రైలులో బాసర రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాను. అక్కడి నుండి బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీదేవి ఆలయానికి చేరుకున్నాను. ఆధ్యాత్మికత విలసిల్లే ప్రశాంత సుందర ప్రదేశంలో, గోదావరినదీ తీరాన ఈ సుందర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉన్నది.

ఇక్కడి సరస్వతీదేవి సైకతమూర్తిని వ్యాసమహర్షి మలిచాడని ప్రసిద్ధి. ఈ వాగ్దేవతా సమక్షంలో వసంతపంచమిరోజు పిల్లలకు విద్యాభ్యాసం చేయిస్తే మంచి విద్యావంతులు అవుతారని ప్రతీతి. దసరా పండుగ రోజుల్లో అమ్మవారికి నవరాత్రి ఉత్సవాలు జరుపుతారు. ఒక్కొక్కరోజు ఒక్కొక్క అవతార మూర్తిగా అమ్మవారిని అలంకరిస్తారు. ఈ రోజుల్లో భక్తులు తండోపతండాలుగా వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ పుణ్యక్షేత్రం నిర్మల్ జిల్లాలో ఉన్నది.

అ) బాసర పుణ్యక్షేత్రంలోని దేవత ఎవరు?

ఆ) సరస్వతీదేవి ఆలయం ఏ నది తీరాన ఉన్నది?

ఇ) సరస్వతీదేవి సైకతమూర్తిని మలచిన వారు ఎవరు?

ఈ) నవరాత్రి ఉత్సవాలు ఎప్పుడు జరుగుతాయి?

ఉ) పై పేరాకు శీర్షిక సూచించండి.

SCERT TELANGANA

## III. స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) దూరప్రయాణాలకు పోయేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి?

ఆ) రచయిత ఉన్నతవిద్య కోసం పట్టుదలతో ఇంగ్లాండు వెళ్ళాడు కదా! దీని ద్వారా మీరేం గ్రహించారు?

ఇ) 'ఉన్నత లక్ష్యంతో పట్టుదలతో దేనినైనా సాధించవచ్చు' వివరించండి.

ఈ) ఒక కొత్త ప్రదేశాన్ని దర్శించినప్పుడు అక్కడ తెలియని విషయాలను తెల్సుకోవడానికి మీరేంచేస్తారు?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 'అనుకున్నది సాధించటంలో కలిగే తృప్తి అనంతమైంది.' ముద్దు రామకృష్ణయ్య సముద్ర ప్రయాణం ఆధారంగా వివరించండి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

**1. కింది వానిలో ఒకదానికి జవాబును సృజనాత్మకంగా రాయండి.**

అ) చదువును కష్టంగా భావించవద్దు. ఉన్నతలక్ష్యం పెట్టుకొని, ఇష్టంగా చదువుకుని, అనుకున్నది సాధించాలని తెలుపుతూ మిత్రునికి లేఖ రాయండి.

(లేదా)

ఆ) మీరు చేసిన ఒక ప్రయాణ అనుభవాన్ని వివరిస్తూ వ్యాసం రాయండి.

## V. పదజాల వినియోగం

**1. కింది వాక్యాల్లో గీతగీసిన పదానికి తగిన అర్థాన్ని గుర్తించండి.**

అ) పై చదువుకు సరిపడా <u>ద్రవ్యం</u> నావద్ద లేకుండె. ( )

అ) శక్తి ఆ) సామర్థ్యం ఇ) డబ్బు ఈ) వస్తువు

ఆ) నామిత్రునికి సహాయపడతనని నేను <u>వాగ్దానం</u> చేశాను. ( )

అ) మాటతీసుకొను ఆ) మాటయిచ్చు ఇ) మాట మార్చు ఈ) డబ్బు యిచ్చు

**2. కింది జాతీయాలను సొంతవాక్యాలలో రాయండి.**

ఉదా:- అందెవేసిన చేయి

సీసపద్యాలు రాయడంలో శ్రీనాథుడిది అందెవేసిన చేయి.

అ) పట్టరాని సంతోషం



SCERT TELANGANA

ఆ) దేవునిపై భారం వేయు

ఇ) గుండెజల్లుమను

ఈ) చెమటలుపట్టు

## VI. భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది వాక్యాలలో గీత గీసిన పదాలు ఏ సమాసాలో గుర్తించి, వాటి పేర్లు రాయండి.**

అ) ఆదిశేషునికి వేయితలలు.

ఆ) కృష్ణార్జునులు సిద్ధమైనారు.

ఇ) రవి, రాము అన్నదమ్ములు.

ఈ) వారానికి ఏడురోజులు.

ఉ) నూరేండ్లు జీవించు.

**2. కింది పదాలను విడదీసి సంధిపేరు రాయండి.**

అ) విద్యాభ్యాసం = ______ + ______ = ______

ఆ) మొదలయింది = ______ + ______ = ______

ఇ) విద్యార్థులు = ______ + ______ = ______

ఈ) ఏదైనా = ______ + ______ = ______

ఉ) వారందరు = ______ + ______ = ______

### అత్త్వసంధి

**✷ కింది పదాలను పరిశీలించండి.**

అ) రామయ్య = రామ + అయ్య

ఆ) మేనత్త / మేనయత్త = మేన + అత్త

ఇ) సెలయేరు = సెల + ఏరు

ఈ) ఒకానొక = ఒక + ఒక



SCERT TELANGANA

పూర్వపదం చివర ఉన్న అచ్చు ఏది?

పరపదం మొదట ఉన్న అచ్చు ఏది?

పూర్వపదం చివరి అచ్చుకు పరపదం మొదటి అచ్చు కలిస్తే ఏం ఏర్పడింది?

> సంధిని విడదీసినప్పుడు ఏర్పడే రెండు పదాలలో మొదటి పదాన్ని 'పూర్వపదం', రెండవ పదాన్ని 'పరపదం' అని అంటారు.

పై ఉదాహరణలు చూసినప్పుడు మొదటి పదం చివరన 'అ' అచ్చు ఉంటుంది. రెండవ పదం మొదట అ, ఏ, ఒ మొదలైన అచ్చులు ఉన్నాయి. సంధి జరిగినప్పుడు మొదటి పదం చివరి అచ్చు 'అ' లోపించి రెండో పదం మొదటి అచ్చు వచ్చి చేరితే కింది విధంగా ఉంటాయి.

(i) రామయ్య → లాంటి పదాల్లో సంధి ఎప్పుడూ అవుతుంది. (నిత్యం)

(ii) మేనత్త, మేనయత్త → లాంటి పదాల్లో సంధి జరగవచ్చు, జరుగకపోవచ్చు. (వైకల్పికం)

(iii) సెలయేరు → లాంటి పదాలు 'సెలేరు' లాగా మారకుండా 'సెలయేరు' లాగానే ఉంటాయి. (నిషేధం)

(iv) ఒకానొక → లాంటి పదాలు 'ఒకొక'లాగా మారకుండా మరోరూపంలోకి అంటే 'ఒకానొక'లాగా మారుతాయి. (అన్యకార్యం)

(మొదటి పదం చివరి అచ్చు పూర్వ స్వరం. రెండోపదం మొదటి అచ్చు పరస్వరం.)

'అ' కు అచ్చులు (అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ) పరమైతే ఏర్పడే సంధి **'అత్వసంధి'**.

> **అత్తు ( అత్తు అంటే హ్రస్వమైన 'అ' ) నకు అచ్చు పరమైనప్పుడు సంధి బహుళముగానగు.**

**3. కింది పదాలను కలిపి రాయండి. ఏం జరిగిందో చెప్పండి.**

ఉదా : తగిన + అంత = తగినంత

అ) చాలిన + అంత = ______

ఆ) సీత + అమ్మ = ______

ఇ) అక్కడ + ఇక్కడ = ______

ఈ) అందక + ఉండెను = ______

ఉ) చెప్పుట + ఎట్లు = ______

ఊ) రాక + ఏమి = ______

> **బహుళం :**
> సంధి నిత్యంగా, వైకల్పికంగా, నిషేధంగా, అన్యకార్యంగా జరుగడాన్ని 'బహుళం' అంటారు.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ వివిధ పత్రికలలో వచ్చే యాత్రారచనలను చదివి, వాటిలో ఒక దానికి నివేదిక రాయండి.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | ఏదైనా సాధించాలంటే పట్టుదల, దృఢసంకల్పం అవసరమని సమర్థిస్తూ మాట్లాడగలను. | అవును / కాదు |
| 2. | అపరిచిత గద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలను. | అవును / కాదు |
| 3. | అనుకున్నది సాధించడంలో ఉండే తృప్తిని గురించి సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 4. | చదువు కష్టంగా భావించక, ఇష్టంగా భావించాలని మిత్రునికి లేఖ రాయగలను. | అవును / కాదు |

## మీకు తెలుసా?

1. **జిబ్రాల్టర్ రేవు :** యునైటెడ్ కింగ్‌డం (U.K.)లో ఉన్న ఒక ఓడరేవు.
2. **బే ఆఫ్ బిస్కే :** స్పెయిన్‌లోని లేసెస్ నగరానికి దగ్గరలో ఉన్నది. సముద్రకెరటాలు పర్వత సానువులను ఢీకొట్టడం వలన సొరంగం ఏర్పడింది. ఇది పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్నది.
3. **స్టెర్లింగ్ పౌండ్ :** బ్రిటన్ దేశపు కరెన్సీ (ద్రవ్యం)
4. **పాస్‌పోర్ట్ :** విదేశాలకు వెళ్ళే వాళ్ళకు ప్రభుత్వం ఇచ్చే వ్యక్తి ధృవీకరణ పత్రం.
5. **గ్రేట్ బ్రిటన్ :** ఇంగ్లండ్, స్కాట్‌లాండ్, వేల్స్ దీవులు, ఉత్తర ఐర్లాండ్‌ల సముదాయం.

## సూక్తి

అఖండమైన ఓర్పు, ధైర్యం, ప్రయత్నాలతోనే
ఉత్తమోత్తమ ఫలితాలు సంప్రాప్తమౌతాయి.

– స్వామి వివేకానంద

SCERT TELANGANA

# 3 బండారి బసవన్న

– పాల్కురికి సోమనాథుడు

## చదువండి – ఆలోచించి చెప్పండి.

*గోల్కొండ పాలకుడు అబుల్ హసన్ తానాషా. ఇతని పాలనా కాలంలో భద్రాచలం తహశీల్దారుగా కంచర్ల గోపన్న ఉండేవాడు. ఆయన శ్రీరామభక్తుడు. ప్రజలనుండి వసూలుచేసిన సుమారు ఆరులక్షల రూపాయలు పన్నుతో భద్రాచలంలో రామాలయాన్ని నిర్మించాడు. సీతారాములకు విలువైన నగలు చేయించాడు. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేశాడనే నెపంతో గోపన్నను కారాగారంలో బంధించారు. గోపన్న తన కీర్తనలతో శ్రీరాముడిని వేడుకొన్నాడు. శ్రీరాముడే తానాషాకు ఆ సొమ్ము చెల్లించి బంధవిముక్తిడిని చేశాడు.*

### ప్రశ్నలు:

1. *కంచర్ల గోపన్న ఎవరు?*
2. *అతనిపై మోపిన అభియోగమేమిటి?*
3. *గోపన్న ఎట్లా బంధ విముక్తుడయ్యాడు?*
4. *గోపన్న వంటి భక్తులను గురించి మీకు తెలుసా?*

## పాఠం నేపథ్యం, ఉద్దేశం

*బిజ్జలుడి కొలువులో బండారి బసవన్న దండనాయకుడుగా ఉన్నాడు. ఇతడు గొప్ప శివభక్తుడు. ఒకరోజు ఒక జంగమయ్య బసవన్న దగ్గరకు వచ్చి "నాకు ఈ క్షణంలో ఇంత ధనం కావాలి. లేకపోతే మీ సపర్యలు స్వీకరించను" అన్నాడు. అప్పుడు బసవన్న కోశాగారంలోని పేటికల్లో ఉన్న మాడలను (బంగారు నాణేలు) జంగమయ్యకు సమర్పించాడు. అది చూసిన ఇతర మంత్రులు బిజ్జలుడి దగ్గరకు పోయి బసవన్న రాజద్రోహం చేశాడని చెప్పారు.*

*బసవన్న ఔదార్య బుద్ధి, భక్తితత్త్వం తెలియజేయటం ఈ పాఠం ఉద్దేశం.*



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం ద్విపద. ఇది దేశికవితా ప్రక్రియ. ఇది రెండేసి పాదాల చొప్పున మాత్రాగణాలతో సాగేరచన. మొత్తం కావ్యాన్ని ద్విపద ఛందస్సులో రాస్తే దాన్ని 'ద్విపద కావ్యం' అంటారు.

ఈ పాఠం పాల్కురికి సోమనాథుడు రాసిన 'బసవపురాణం' తృతీయాశ్వాసం లోనిది.

## కవి పరిచయం



(ఊహాచిత్రం)
12వ శతాబ్దం

దేశి సంప్రదాయంలో రచనలు చేసిన మొట్టమొదటి కవి పాల్కురికి సోమనాథుడు. తెలుగులో స్వతంత్ర కావ్యాన్ని రాసిన తొలికవి. బసవేశ్వరుని చరిత్రను పురాణంగా నిర్మించి ద్విపదకు కావ్య గౌరవం కలిగించిన శైవకవి. జనగామ జిల్లా పాలకుర్తి (పాలకురికి / పాల్కురికి) సోమన జన్మస్థలం.

బసవపురాణము, అనుభవసారము, బసవోదాహరణము, వృషాధిపశతకము, చతుర్వేదసారము, చెన్నమల్లు సీసములు, పండితారాధ్య చరిత్రము మొదలయినవి సోమన కృతులు. రగడ, గద్య, పంచకం, అష్టకం, ద్విపద, శతకం, ఉదాహరణం మొదలయిన సాహితీ ప్రక్రియలకు ఈయన ఆద్యుడు. సంస్కృత, తమిళ, కన్నడ, మరాఠీభాషా పదాలను యథేచ్ఛగా తన రచనలో ఉపయోగించిన బహుభాషా కోవిదుడు. తెలుగులో 'మణి ప్రవాళ శైలి'ని వాడిన తొలికవి.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.



SCERT TELANGANA



## ప్రవేశిక

సదుద్దేశంతో చేసే పనులు ఎప్పుడూ మనిషిని సచ్ఛీలుడుగనే నిలబెడుతాయి. భగవంతుడు కూడా ఇటువంటి పనులను చేసే వారిని మెచ్చుకుంటాడు. దీనికి ఉదాహరణలు పురాణేతిహాసాలలో అనేకం కనిపిస్తాయి. ఆ కోవలోని వాడే బండారి బసవన్న. అతని జీవితంలో జరిగిన ఒక మహత్తర ఘట్టం గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



## I



బండారి బసవన దండనాయకుని
రప్పించి "మాయర్థ మొప్పించి పొమ్ము
దప్పేమి? సాలుఁ బ్రధాని తనంబు
'దండింప రా'దను తలఁపున నిట్లు
బండార మంతయుఁ బాడు సేసితివి
పరధనం బపహరింపని బాస యండ్రు
పరధనం బెట్లొకో బసవ! కైకొంటి
వేయు మాటలు నేల వెఱతుము నీకు
మాయర్థ మొప్పించి నీయంత నుండు"
మనవుడుఁ గించి త్ప్రహసితాస్యుఁడగుచు
జననాథునకు బసవన మంత్రి యనియె
"బరమేశు భక్తియన్ సురతరువుండ
హరుభక్తియన్ కనకాచలంబుండ
గామారి భక్తి చింతామణి యుండ
సోమార్ధ ధరు భక్తి సురధేనువుండ
బగుతుఁడాసించునే పరధనంబునకు
మృగపతి యెద్దెస మేయునే పుల్లు?

### ఆలోచించండి -చెప్పండి

- సురతరువు, కనకాచలం, సురధేనువు, భక్తి చింతామణి అనే పదాలను వాడడంలో కవి ఉద్దేశం ఏమిటి?
- 'బగుతుడాసించునే పరధనమునకు' దీనిపై మీ అభిప్రాయమేమిటి?



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

## II

క్షీరాబ్ధి లోపలఁ గ్రీడించు హంస
గోరునే పడియల నీరు ద్రావంగఁ?
జూత ఫలంబులు సుంబించు చిలుక
బ్రాతి బూరుగు మ్రాని పండ్లు గన్గొనునె?
రాకామల జ్యోత్స్నఁ ద్రావు చకోర
మాకాంక్ష సేయునే చీకటిఁ ద్రావ
విరిదమ్మి వాసన విహరించుతేఁటి
పరిగొని సుడియునే బబ్బిలి విరుల?
నెఱుఁగునే యల దిగ్గజేంద్రంబు కొదమ
యెఱపంది చను సీక? నెఱుఁగవు గాక
యరుదగు లింగ సదర్థుల యిండ్ల
వరవుడ నా కొక సరకెయర్థంబు
పుడమీశ! మీధనంబునకుఁ జేసాఁప
నొడయల కిచ్చితి నొడయలధనము
పాదిగదటిఁగిన భక్తుండఁగాను
గాదేని ముదుపు లెక్కలు సూడు" మనుచు
దట్టుఁడు బసవన దండనాయఁకుఁడు
పెట్టెలు ముందటఁ బెట్టి తాళములు
పుచ్చుడు మాడ లుప్పొంగుచుఁ జూడ
నచ్చెరువై లెక్క కగ్గలంబున్న



### ఆలోచించండి-చెప్పండి

- శివ భక్తులను హంస, చిలుక, చకోరం, తుమ్మెదలతో కవి ఎందుకు పోల్చి ఉంటాడు?
- "ఒడయల కిచ్చితి నొడయల ధనము" అనడంలో అర్థం ఏమై ఉంటుంది?

SCERT TELANGANA

## సారాంశం

బిజ్జలుడు దండనాయకుడైన బండారి బసవన్నను పిలిపించాడు. "మా ధనాన్ని అప్పగించి పోవటంలో తప్పేమీ లేదు. ఇక చాలు మీ ప్రధాని పదవి. నన్నెవరు దండించలేరనే ధీమాతో ఖజానా అంతా ఖాళీ చేశావు. ఇతరుల ధనాన్ని ఆశించనని ప్రతిజ్ఞ చేశావు కదా! మరి ఎట్లా దొంగిలించావు? ఎక్కువ మాటలు ఎందుకు గానీ నిన్ను ఏమయిన అనడానికి నాకు భయం కలుగుతున్నది. మా సొమ్ము మాకిచ్చి మీరిక దయచేయవచ్చు" అన్నాడు. అప్పుడు మంత్రి బసవన చిరునవ్వుతో "పరమశివుని పట్ల భక్తి అనే కల్పవృక్షం మాకు అండగా ఉండగా, శంకరునిపై భక్తి అనే బంగారు పర్వతం (మేరు పర్వతం) నా అధీనంలో ఉండగా, పరమేశ్వరుని భక్తి అనే చింతామణి నా చెంత ఉండగా, శంభుని భక్తి అనే కామధేనువు నన్ను కనిపెట్టి ఉండగా నా వంటి భక్తుడు ఇతరుల ధనాన్ని ఆశిస్తాడా? సింహం ఎక్కడైన గడ్డి మేస్తుందా?

పాల సముద్రంలో క్రీడించే హంస మడుగులలో నీరు తాగుతుందా? మామిడి పండ్లను తినే చిలుక బూరుగు చెట్టు పండ్లను కన్నెత్తి ఐనా చూస్తుందా? నిండు పున్నమి నాటి వెన్నెలను తాగే చకోరపక్షి చీకటిని ఆస్వాదిస్తుందా? తామరపూల సుగంధంలో విహరించే తుమ్మెద ఉమ్మెత్త పూలకోసం పరుగులు తీస్తుందా? ఏనుగు పిల్ల పంది పాలు తాగడానికి తహతహలాడుతుందా? నీకు విచక్షణ లేకపోతే నేనేం చేయాలి? శివభక్తుల ఇండ్ల సంప్రదాయం నీకేం తెలుసు? స్వామి సొమ్ము స్వామికే ఇచ్చాను. ఇతరుల ధనంతో నాకేం పని? మీ ధనం కోసం నేను చేయి చాపను. నేను న్యాయం తప్పను. నీకు నా మీద నమ్మకం లేకపోతే నీ సొమ్ము లెక్క చూసుకో" అని పలికాడు. ధనాగారంలోని పెట్టెలన్నీ తెప్పించి తాళాలు తీసి బిజ్జలుడి ముందే వాటి మూతలు తీయించారు. అప్పుడు బిజ్జలుడు చూసుకుంటే పెట్టెల నిండ మాడలు (బంగారు నాణేలు) తళతళలాడుతున్నాయి. లెక్కపెట్టి చూడగా ఉండవలసిన వాటికన్న ఎక్కువనే ఉన్నాయి.

# ఇవి చేయండి

## I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. 'అచంచల భక్తి పారవశ్యం కల్గిన వాళ్ళు ధనాశకు లోనుకారు' – దీని గురించి మీ అభిప్రాయం చెప్పండి.
2. ద్విపదను రాగయుక్తంగా పాడండి.

## II. ధారాళంగా చదువడం – అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

1. పాఠంలో కింది భావాలున్న పాదాలను గుర్తించండి. వీటిని ఎవరు ఎవరితో అన్నారో చెప్పండి.

అ) మా ధనాన్ని అప్పగించి వెళ్ళు.

ఆ) తామర పూల వాసనలో విహరించే తుమ్మెద ఉమ్మెత్త పూలను ఎట్లా ఆస్వాదిస్తుంది?

ఇ) సింహం ఎక్కడైనా గడ్డిమేస్తుందా?



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

**2. కింది పద్యం చదువండి. ఖాళీలను పూరించండి.**

గంగిగోవు పాలు గరిటెడైనను చాలు
కడివెడైన నేమి ఖరము పాలు
భక్తిగలుగు కూడు పట్టెడైనను చాలు
విశ్వదాభిరామ వినురవేమ!

అ) ఖరము అంటే ________________

ఆ) కూడు అంటే ________________

ఇ) గంగిగోవు పాలను ________________ తో పోల్చాడు.

ఈ) ఈ పద్యాన్ని ________________ రాశాడు.

ఉ) ఈ పద్యం ________________ శతకంలోనిది.

## III. స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) బండారి బసవన్న స్వభావాన్ని రాయండి.

ఆ) బండారి బసవన్న రాజుతో నిర్భయంగా మాట్లాడాడు కదా! ఇట్లా ఎప్పుడు నిర్భయంగా మాట్లాడగలుగుతారు?

ఇ) భక్తుడు పరధనాన్ని ఆశించడు. ఎందుకు?

ఈ) "క్షీరాబ్ధి లోపలఁ గ్రీడించు హంస గోరునే పడియల నీరు ద్రావంగ" అని బసవన్న అనడంలో గల ఉద్దేశం ఏమిటి?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) బసవని గురించి తెలుసుకున్నారు కదా! భక్తుడికి ఉండవలసిన లక్షణాలు ఏమిటో రాయండి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

**1. కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

అ) ద్విపద రూపంలోనున్న ఈ పాఠ్యాంశ విషయాన్ని సంభాషణ రూపంలో రాయండి.

## V. పదజాల వినియోగం

**1. గీత గీసిన పదానికి అర్థాన్ని రాయండి.**

అ) క్షీరాబ్ధిని మథించినప్పుడు అమృతం పుట్టింది. =

ఆ) కొండ గుహలలో నివసించే మృగపతి అడవికి రాజు. =

ఇ) పుడమీశులు ప్రజలను చక్కగా పరిపాలించారు. =



SCERT TELANGANA

**2. కింది ప్రకృతి వికృతి పదాలను జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| అ) ఆశ్చర్యం | (    ) | ఎ) | బత్తి |
| ఆ) భక్తి | (    ) | బి) | దెస |
| ఇ) దిశ | (    ) | సి) | పుడమి |
| ఈ) పృథ్వి | (    ) | డి) | అచ్చెరువు |

## VI. భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది పట్టికను పూరించండి.**

| సంధిపదం | విడదీసి రాయండి | సంధిపేరు |
|---|---|---|
| ఉదా: క్షీరాబ్ధి | క్షీర + అబ్ధి | సవర్ణదీర్ఘసంధి |
| 1. కనకాచలం | | |
| 2. క్షీరాబ్ధి | | |
| 3. | నాకు + ఒక | |
| 4. | కాదు + ఏని | |
| 5. అతనికిచ్చెను | | |
| 6. పుట్టినిల్లు | | |
| 7. | ఏమిటి + ఇది | |
| 8. నాయనమ్మ | | |

### గుణసంధి

**2. కింది పదాలను విడదీయండి.**

**ఉదా:** రాజేంద్రుడు = రాజ + ఇంద్రుడు ( అ + ఇ = ఏ )

అ) గజేంద్రుడు = ____________ + ____________ (          )

**ఉదా:** పరమేశ్వరుడు = పరమ + ఈశ్వరుడు ( అ + ఈ = ఏ )

ఆ) సర్వేశ్వరుడు = ____________ + ____________ (          )

**ఉదా:** వసంతోత్సవం = వసంత + ఉత్సవం ( అ + ఉ = ఓ )

ఇ) గంగోదకం = ____________ + ____________ (          )

**ఉదా:** దేవర్షి = దేవ + ఋషి ( అ + ఋ = అర్ )

ఈ) మహర్షి = ____________ + ____________ (          )

పై పదాలను గమనించండి. వాటిని మూడు రకాలుగా విడదీయటం జరిగింది. మూడు సందర్భాల్లోను పూర్వస్వరం 'అకారం' ఉన్నది. పరస్వరం స్థానంలో ఇ, ఈ, ఉ, ఋ లు ఉన్నాయి.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

- 'అ' కారానికి 'ఇ/ఈ' – పరమైనప్పుడు 'ఏ' ( ే )
- 'అ' కారానికి 'ఉ' – పరమైనప్పుడు 'ఓ' ( ో )
- 'అ' కారానికి 'ఋ' – పరమైనప్పుడు 'అర్'

అకారము అంటే 'అ' లేదా 'ఆ'.

ఏ, ఓ, అర్ లను గుణాలు అంటారు.

'అ' కారం స్థానంలో ఏ, ఓ, అర్ లు ఆదేశంగా వచ్చాయి. ఇట్లా ఏర్పడిన సంధిని **గుణసంధి** అంటారు.

**'అ' కారానికి ఇ, ఉ, ఋ లు పరమైనప్పుడు క్రమంగా ఏ, ఓ, అర్ లు ఆదేశంగా వస్తాయి.**

**3. కింది పదాలను కలిపి, సంధి ఏర్పడిన విధానాన్ని తెలుపండి.**

ఉదా: మహా + ఇంద్రుడు = మహేంద్రుడు, ఆ + ఇ = ఏ ( ే )

అ) దేవ + ఇంద్రుడు = ________, ____ + ____ = ____ (   )

ఆ) గణ + ఈశుడు = ________, ____ + ____ = ____ (   )

ఇ) నర + ఉత్తముడు = ________, ____ + ____ = ____ (   )

ఈ) నవ + ఉదయం = ________, ____ + ____ = ____ (   )

ఉ) బ్రహ్మ + ఋషి = ________, ____ + ____ = ____ (   )

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- బసవని వంటి పరమ భక్తులలో ఒకరి కథను సేకరించి, మీ సొంతమాటల్లో రాసి దాన్ని తరగతిలో చెప్పండి.

## నేనివి చేయగలనా?

1. భక్తులకు ధనాశ ఉండదనే అంశంపై అభిప్రాయం చెప్పగలను. అవును / కాదు
2. అపరిచిత పద్యం చదివి ఖాళీలను పూరించగలను. అవును / కాదు
3. భక్తుడి లక్షణాలను సొంతమాటల్లో రాయగలను. అవును / కాదు
4. పాఠం ఆధారంగా సంభాషణలు రాయగలను. అవును / కాదు

**సూక్తి**

"పవిత్రులు, మంచివారైన వ్యక్తుల దగ్గరకు...
దుఃఖం ఎన్నటికీ చేరదు"

– స్వామి వివేకానంద



SCERT TELANGANA

## 4

# అసామాన్యులు

**బొమ్మను చూడండి. ఆలోచించి చెప్పండి.**



**ప్రశ్నలు:**

1. బొమ్మను చూడండి, వాళ్ళు ఏం చేస్తున్నారు?
2. అట్లా చెత్తను ఎత్తిపోసే వారు లేకుంటే ఏమవుతుంది?
3. ఇట్లా మనకు సేవలు చేసేవారు ఇంకా ఎవరెవరున్నారు? వారి గొప్పదనమేమిటి?

**పాఠం ఉద్దేశం**

అన్ని వృత్తుల సమష్టి సహకారంతో సమాజం కొనసాగుతుంది. వృత్తులు సమాజసేవలో తమవంతు పాత్రను పోషిస్తాయి. దేశాభివృద్ధికి మూలస్తంభాలుగా నిలిచినవి వృత్తులే! అయినా వాటికి ఆదరణ కరువైంది. వివిధ వృత్తులవారిపట్ల గౌరవాన్ని, శ్రమ విలువను పెంపొందించడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం వ్యాసప్రక్రియకు చెందినది. వృత్తులు వ్యక్తి గౌరవానికి, సమాజాభివృద్ధికి ఎట్లా తోడ్పడుతాయో వివరిస్తూ, శ్రమ సౌందర్యాన్ని తెలియజేసే వ్యాసమిది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.



## ప్రవేశిక

***శ్రమజీవన సౌందర్యాన్ని వర్ణించడం ఎవరితరం? ఒక్కొక్క వృత్తి ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించుకుంది. అయినా అన్ని వృత్తుల సమష్టి జీవనమే సమాజం. ఎవరి వృత్తి ధర్మాన్ని వారు నిబద్ధతతో నిర్వహిస్తే సమాజం సుసంపన్నం అవుతుంది. ప్రతి వృత్తి గౌరవప్రదమైనదే! అన్ని వృత్తుల మేలుకలయికతోనే వసుధైకకుటుంబ భావన పెరుగుతుంది. కొన్ని వృత్తుల విశేషాలను తెలుసుకుందాం!***



### I

ప్రతిరోజూ మనం ఎన్నింటినో చూస్తుంటాం. వాటిలో కొన్నింటిని పట్టించుకోం. మరికొన్నింటిని గురించి ఆలోచించం. కానీ కొద్దిగా దృష్టిపెడితే కొన్ని విషయాలలో ఆశ్చర్యం కలుగుతుంది. మర్రివిత్తనాన్ని చూశారా? ఎంత చిన్నగా ఉంటుంది! పరిశీలించి చూస్తే తప్ప గుర్తుపట్టలేనంతగా ఉంటుంది. కాని దీనిలో నుంచే పెద్ద మర్రిచెట్టు వస్తుంది. అంటే అంత చిన్న గింజలో ఇంత గొప్ప శక్తి ఉందన్నమాట. ఇట్లే మన మధ్యనే ఉన్నవాళ్ళలో కూడా ఏదో గొప్పతనముంటుంది. సామాన్యులుగా కనిపించేవాళ్ళలో అసామాన్యమైన ప్రతిభ దాగిఉంటుంది. దాన్ని గుర్తించాలి, గౌరవించాలి.

SCERT TELANGANA

"ఆకాశంలో హాయిగా ఎగురగలిగే విమానాన్ని ఎవరు కనుక్కొన్నారు? ప్రపంచంలోని విషయాలను క్షణాలలో ప్రత్యక్షంగా మనకు చూపించే టీ.వీ.ని కనిపెట్టిందెవరు? సమాచార వ్యవస్థలో సాంకేతిక విప్లవాన్ని తెచ్చిన సెల్‌ఫోన్ రూపశిల్పి ఎవరు?" అని తరచూ ప్రశ్నిస్తుంటాం. కాని ఈ సుఖాలు, విలాసాలకన్నా ముందు జీవిత అవసరాలను తీర్చుకొనే మార్గం చూపిన మహాపురుషుల గురించి ఎప్పుడైనా దృష్టి సారించామా? వాళ్ళ కృషిని, త్యాగాన్ని ఎన్నడైనా తలచుకొంటున్నామా?



"అన్నమయములైన వన్ని జీవమ్ములు – కూడులేక జీవకోటి లేదు" అన్నాడు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారు. ఆహారం లేకుంటే ఏ ప్రాణీ బతుకదు. ఇంత ప్రాధాన్యమున్న ఆహార విషయాలను గురించి మనకు మొదట తెలిపినవారు ఆదివాసులు. అడవులే అమ్మ ఒడిగా, కొండకోనలే తోడునీడగా జీవిస్తారు. వాళ్ళు రేయింబవళ్ళు ప్రకృతితోనే కలిసి ఉంటారు. ప్రకృతిని బాగా పరిశీలిస్తారు. ఏవి తినాలో, ఏవి తినగూడదో చెప్పారు. అట్లా చెప్పడానికి వాళ్ళు ఎన్నో ప్రయోగాలు చేశారు. వాటిని రుచి చూశారు. ఆయా ప్రయోగాలలో కొన్ని సందర్భాలలో కొందరు ప్రాణాలను కూడా వదిలారు. జంతువుల మాంసం తినడానికి ముందు ఆయా జంతువులను పరిశీలించారు. ఆ జంతువుల ఆహారపు అలవాట్లపైన దృష్టి పెట్టారు. ఆతరువాత ఇది తినవచ్చు, ఇది తినగూడదని చెప్పారు. వాళ్ళ పరిశీలన, శ్రమ, త్యాగం ఎంత గొప్పవో! కోయలు, గోండులు, చెంచులు మొదలైన గిరిజన జాతులకున్న ప్రకృతి విజ్ఞానం ఎంతో గొప్పది. చెట్లను గురించి వాళ్ళకు తెలిసినంతగా ఎవరికీ తెలియదనడం అతిశయోక్తి కాదు. వాళ్ళూ శాస్త్రజ్ఞులే. రోగాల బారిన పడినప్పుడు చెట్లమందులతోటే ఆరోగ్యాన్ని తిరిగి పొందారు. ఇట్లా వనమూలికలతో చేసే వైద్యమే ఆయుర్వేదం. ఆయుష్షును పెంచేదే ఆయుర్వేదం. పూర్వం యుద్ధాలలో గాయపడిన వారికి కూడా ఈ ఆయుర్వేద వైద్యం చేసేవారు. ఈ విషయాలలో గురువులై వారు తరువాతి తరాలకు తోవ చూపారు.

ఆదివాసులే కాదు, పల్లెతల్లి ఒడిలో బతికే జానపదుల జ్ఞానం కూడా తక్కువేమీ కాదు. పల్లెవారి పనితనాన్ని తెలిపేటట్లుగా వివరించేటట్లుగా ఎన్నో పాటలు కూడా ప్రాచుర్యంలో ఉన్నాయి. గ్రామంలోని వివిధ పనులు, వృత్తులు చేసేవారు ఒకరిపై ఒకరు ఎట్లా ఆధారపడుతారో వివరించే పల్లె పాటలు మనకు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. నిత్యం మనం వాడుకొనే ఒక వస్తువు అది కంచం కావచ్చు, మంచం కావచ్చు, టేబుల్ కావచ్చు, వీటిని తయారుచేయాలంటే వడ్రంగి, కమ్మరి, ఇతర పనులవారు కృషి చేయవలసి ఉంటుంది.

ఇట్లా వృత్తులన్నీ ఒకదానిమీద మరొకటి ఆధారపడి ఉంటాయని గుర్తించండి. అట్లే ఒక్క 'సోల' తయారీ వెనుక ఎందరు వృత్తిపనివాళ్ళ కష్టం దాగిఉందో ఆలోచించండి. ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉంటే తప్ప సమాజం సజావుగా సాగదు. ప్రతి వృత్తీ పవిత్రమైనదే. ప్రతి వృత్తిపనిలోనూ, ఎంతో కష్టం, నైపుణ్యం, త్యాగం కలగలిసి ఉంటాయి. కాంతిని చూసి మురిసిపోతాం. కాని ఆ కాంతినివ్వడానికి కరిగిపోయే కొవ్వొత్తిని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తున్నామా?

SCERT TELANGANA

ఎండాకాలం వచ్చిందంటే చాలు కుండలకు, కూజాలకు మహా గిరాకీ. అటికెలు, గురుగులు మన అవసరాలను తీరుస్తున్నాయి. భక్తిజీవితంలో భాగమైనవి ప్రమిదలు. ఇవన్నీ చకచకా ఎట్లా వచ్చేస్తున్నాయి? కుమ్మరి చక్రంనుంచి - బంకమట్టినుంచే. బంకమట్టి ఊరికే తయారవుతుందా? మెత్తటి మట్టి, బూడిద లేదా రంపపు పొట్టు, సన్న ఇసుకను కలిపి దీన్ని తయారు చేస్తారు. ఈ మూడింటిని కలిపి కాళ్ళతో బాగా తొక్కుతారు. చెమటోడ్చి సిద్ధంచేసిన ఈ బంకమట్టిని బండి చక్రం వంటి సారెమీద పెడుతారు. చక్రం మాత్రం ఊరికే తయారైందా? కమ్మరి, వడ్రంగి వాళ్ళ నైపుణ్యం కలగలిసి ఏర్పడింది. ఇందులో ఎంతో ఇంజనీరింగ్ నైపుణ్యం తొంగిచూస్తుంది. చక్రం తాను తిరగడం కాదు, సమాజ గతినే తిప్పేసింది. ఇదొక అద్భుత ఆవిష్కరణ.

చక్రం తిప్పుతూ చక్రంమీద పెట్టిన బంకమట్టిని చేతివేళ్ళ కొనలతో చాకచక్యంగా నొక్కుతారు. అత్యంత ఆశ్చర్యకరంగా, అనుకున్నరూపాలు అమాంతంగా వచ్చేస్తుంటాయి. ఆ చేతుల్లో ఇంద్రజాల విద్య ఉన్నదా? అని అనిపించక మానదు. తయారైన మట్టిపాత్రలను ఆరబెడతారు. తరువాత 'కుమ్మరి ఆవము' లో పెట్టి బురదమట్టితో కప్పేస్తారు. దీనివల్ల కొలిమిని మండిస్తే అన్ని పాత్రలకూ ఆ వేడి తగులుతుంది. పాత్రలన్నీ బాగా కాలి గట్టిగా తయారవుతాయి. మనం ఉపయోగించుకొనే మట్టిపాత్రలవెనుక ఇంత నైపుణ్యముంది.

**ఆలోచించండి - చెప్పండి**

- *నిజజీవితంలో మీకు ఆశ్చర్యం కలిగించే సంఘటనలు ఉన్నాయా? వాటి గురించి చర్చించండి?*
- *ప్రతి వృత్తి పవిత్రమైందే, అని అనడంలో ఆంతర్యం ఏమై ఉంటుంది?*
- *చక్రం సమాజగతిని మార్చినది అని ఎట్లా చెప్పగలవు?*

## II

నగలంటే ఇష్టంలేనివాళ్ళెవరైనా ఉంటారా? మెడలో హారాలు, చేతులకు కడియాలు, గాజులు, చెవికమ్మలు, ముక్కుపుల్ల, సిగబిళ్ళ, నడుముకు ఒడ్డాణం, కాళ్ళకు కడియాలు, గజ్జెలు, వేళ్ళకు ఉంగరాలు.... ఇట్లా ఎన్నెన్నో ఆభరణాలు ఆపాదమస్తకం ధరిస్తారు. ఒకప్పుడు ఏడు వారాల సొమ్ములు ధరించేవారట. ఆధునిక కాలంలో మరెన్నో రకాల వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కొక్క ఆభరణాన్ని ఎన్నో రకాలుగా తీర్చిదిద్దుతారు. ముద్దగా ఉన్న బంగారాన్ని ముద్దులొలికే నగలుగా తీర్చిదిద్దడంలో ఎంత శ్రమ దాగిఉన్నదో తెలిస్తే ముక్కుమీద వేలువేసుకొంటాం. బంగారం అంత సులభంగా కరుగదు. బంగారాన్ని మూసలో పెట్టి బొగ్గుల కొలిమిలో ఉంచి కరిగిస్తారు. నిప్పు రాజేయడానికి, నిప్పులు కణకణలాడేలా మండడానికి బాగా ఊదాలి. బంగారం పనిచేసేవాళ్ళు (స్వర్ణకారులు) ఇట్లా ఊది ఊది అనారోగ్యపు బారినపడిన సందర్భాలు ఎన్నో.



బంగారమేకాదు మనం నిత్యజీవితంలో వాడే వెండివస్తువుల తయారీలో కూడా ఎంతో కళాదృష్టి, నైపుణ్యం కనిపిస్తుంది. బంగారాన్ని వెండిని వివిధ ఆకృతులుగా తీర్చిదిద్దడంలోగానీ, రత్నాలను పొదగడంలోగానీ సున్నితమైన పనితనం కనిపిస్తుంది.

సన్నని వస్తువును తయారుచేసేటప్పుడు వాళ్ళ కళ్ళు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతాయి. అయినా మన కళ్లకు ఆనందాన్నిచ్చేటట్లు ఆభరణాలను అందించేటందుకు శ్రమిస్తున్నారు.

ఇనుముతో నిత్యం సహవాసంచేసే కమ్మరులు తమ శ్రమను, నైపుణ్యాన్ని సమాజంకోసం త్యాగం చేస్తున్నారు. ఇనుముతో వాళ్ళు చేసే నాగటి 'కర్రు' భూమిని దున్నడానికి ఉపయోగపడుతుంది. అట్లాగే పార, గొడ్డలి, గడ్డపార, కొడవలి, సుత్తి మొదలైనవి వ్యవసాయానికి చాలా అవసరమైన పనిముట్లు. వీటితోబాటు బండి చక్రపు (గిర్ర) పట్టాను కూడ తయారుచేసేవారు. ఇదొక గొప్ప ఇంజనీరింగ్ ప్రక్రియ. వీటన్నింటికీ ఉత్పత్తికేంద్రం కమ్మరి కొలిమి. అది నిప్పులతో కణకణ మండుతూ ఉంటుంది. ఆ సెగను భరిస్తూ ఇనుమును కాల్చి సుత్తెతో కావలసిన వస్తువుల రూపాలను తీర్చిదిద్దుతారు. ఇట్లా చేయడానికి చాలా కష్టపడవలసి ఉంటుంది.



ఇక వడ్రంగుల పనితనాన్ని ఒకసారి చూద్దాం. మనకు ఆహారం కావాలంటే భూమిని దున్నాల్సిందే. అందుకు ప్రధానసాధనం నాగలి. దీన్ని రూపొందించే వాళ్ళు వడ్రంగులు. ఇదే కాదు గుంటుక, గొర్రు వంటి పనిముట్లు కూడా వ్యవసాయంలో కీలకమైనవి. వీటిని తయారుచేయాలంటే ఏ చెట్టు కలప సరిపోతుందో పరిశీలిస్తారు. తాత ముత్తాతల కాలంలో వాళ్ళు ఎంతో పరిశోధించారు. కొయ్యను సరైన రూపాలలోనికి తీసుకురావడం వెనుక ఎంతో శ్రమఉంటుంది. చెట్టు కొట్టాలి, కొయ్యాలి, చెక్కాలి, దువ్వోడ (దూగడ) పట్టాలి, తొలి (రంధ్రం) కొట్టాలి, అందులో బిగించాలి... ఇట్లా ఎన్నెన్నో దశలు. వడ్రంగులు సమాజానికి అందించిన మరో సౌకర్యం బండి. ఇది వ్యవసాయానికే కాదు, ప్రయాణానికి కూడా పనికివస్తుంది. అంతేకాక మొన్నమొన్నటివరకు ఇండ్లను కట్టె (కలప) తోటే నిర్మించారు. దూలాలు, వాసాలు, కిటికీలు, తలుపులు ఇవన్నీ వడ్రంగుల పనితనం మూలంగానే అందంగా ఆకర్షణీయంగా తయారవుతాయి. మనం వాడుకొనే మంచాలు, కుర్చీలు, బెంచీలు, టేబుళ్ళు, తనబ్బీలు... (అలమార) ఇటువంటివెన్నో వడ్రంగుల చేతుల్లో రూపొందినవే! అందుకే వాళ్ళను 'దారుశిల్పుల'ని అంటారు. ఇవన్నీ మనం డబ్బుతో కొనుక్కొంటే వస్తున్నాయని అనుకుంటాం! అయితే వీటిని తయారుచేసినప్పుడే కదా ఎవరైనా కొనుక్కొనేది! ఇంటిసామగ్రి, వస్తుసామగ్రి, వ్యవసాయసామగ్రి వంటివి చూస్తున్నప్పుడు వడ్రంగులను తలచుకోవడం మన ధర్మం. వాళ్ళ నైపుణ్యాన్నీ, గొప్పదనాన్నీ గౌరవించడం మన బాధ్యత.



SCERT TELANGANA

తెల్లవారినప్పటినుంచి అడుగు బయటకు వేయాలంటే చెప్పుల్లో కాళ్లు పెట్టాల్సిందే. చెప్పుల చరిత్రను చెప్పుకొంటే ఆవేదన, ఆశ్చర్యం కలుగుతాయి. ఏదైనా జంతువు చనిపోతే దాన్ని చూసి దూరంగా వెళ్తాం. కాని తోలు పనివాళ్ళు ఆ జంతువు చర్మాన్ని ఒడుపుగా ఒలుస్తారు. శుభ్రం చేస్తారు. దానితోనే చెప్పులు తయారుచేస్తారు. ఒక వ్యర్థపదార్థంనుంచి అందరికీ ఉపయోగపడే వస్తువును సృష్టించినవారి తెలివి ఎంతో గొప్పది. అందుకు వాళ్ళు పడే శ్రమ అంత ఇంత కాదు. అసలు దీనికి వెలకట్టగలమా? వీరి ఔదార్యాన్ని చాటుతున్న ఈ పద్యం చదువండి.



"ముప్పు ఘటించి వీని కులమున్, కలిమిన్ కబళించి దేహమున్
పిప్పి యొనర్చు నీ భరతవీరుని పాదము కందకుండగా
చెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే
దెప్పుడు అప్పువడ్డది సుమీ భరతావని వీని సేవకున్."

అని గుఱ్ఱం జాషువగారు నొక్కి వక్కాణించారు.

జంతుచర్మాన్ని అనేక రకాలుగా మలుచడంలో వీరి ప్రతిభ కనిపిస్తుంది. చర్మంతో 'డప్పు' లాంటి వాద్యాలను తయారు చేశారు. ఇప్పటికీ ఊళ్ళలో ఏదైనా విషయం చాటింపువేయాలంటే డప్పు కొట్టాల్సిందే. చివరకు మనిషిని కాటికి పంపడానికి కూడా డప్పే ముందుంటుంది. ఒకప్పుడు వ్యవసాయ బాయిలోని నీటిని పైకి తోడే మోటకు పెద్ద బొక్కెనలుండేవి. వాటి తొండాలను కూడా చర్మంతో వీళ్ళే తయారుచేసేవారు.

### ఆలోచించండి - చెప్పండి

- బంగారానికే సౌందర్యం తెచ్చే స్వర్ణకారుల జీవితాలు ఎందుకు కళ తప్పుతున్నాయో చర్చించండి.
- 'కమ్మరి పని ఒక ఇంజనీరు ప్రక్రియ' అని ఎట్లా చెప్పగలవు?
- వస్తుసామగ్రి, ఇంటిసామగ్రి తయారుచేయడంలో వడ్రంగి శ్రమ విలువను గురించి మాట్లాడండి.
- వ్యర్థ పదార్థాలనుండి పాదాలకు రక్షణ ఇచ్చే చెప్పులు సృష్టించిన వారి తెలివి ఎంత గొప్పదో చెప్పండి.



సమాజానికి ఎనలేని సేవలు చేసిన దళితులను అంటరానితనం పేరిట దూరంగా ఉంచారు. గాంధీ, అంబేద్కర్ వంటి ప్రముఖుల కృషి ఫలితంగా వీరికి రాజ్యాంగ పరమైన రక్షణ లభించింది. వీరిపట్ల సమాజం ప్రత్యేక దృష్టి సారించాలి. వారికి సమాన గౌరవం లభించేందుకు అన్ని కోణాలలో కృషి జరగాలి.

## III


సంఘంలో క్షురకుల సేవలు మరవరానివి. (క్షురమంటే కత్తి, తలవెంట్రుకలను కత్తిరించేవాడు క్షురకుడన్నమాట) ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో వారి భాగస్వామ్యం ఉన్నది. కత్తి, కత్తెరలతో వారు చూపే పనితనం నాణ్యమైందే కాదు, సున్నితమైంది కూడా. క్షురకులకు తరతరాలుగా తెలిసిన మరొక విద్య దేశీయమైన వైద్యం. చెట్ల వేళ్ళతో, ఆకులతో, చేపలతో చేసే మందులను గురించి కూడా వీళ్ళకు చక్కటి అవగాహన ఉంటుంది.

పేను కొరకడం, శరీరానికి గాట్లు పడడం వంటి సందర్భాలలో వాటి నుండి బయటపడే చిట్కాలు వీరి దగ్గర అనేకంగా ఉంటాయి. తైలంతో శరీరమర్దనం (మాలిష్) చేయడంలో గొప్ప నైపుణ్యం ఉంటుంది. స్త్రీల ప్రసవ సమయంలో, పురుడు పోయడంలో, తల్లీబిడ్డల సంరక్షణలో మంత్రసానులుగా మంగలిస్త్రీల పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. వీరి సేవలన్నీ ఆరోగ్యకరమైన సమాజానికి అవసరం.



శరీరాన్ని రక్షించుకోవాలంటే బట్టలు కావాలి. వాటిని బజారుకు వెళ్ళి కొని తెచ్చుకుంటున్నాం. కాని అవి తయారుకావడానికి పరిశ్రమించేది నేతపనివారు. వాళ్ళు బట్టలు నేసే మగ్గాన్ని ఎప్పుడైనా చూశారా? దానివెనుక ఎంతో సాంకేతిక పరిజ్ఞానం ఉన్నది. మగ్గంలో వాళ్ళు దారాలను ఏర్పరుచుకున్న తీరు, నేసేటప్పుడు వారు చూపే నైపుణ్యం ఎంతో గొప్పది. ఒకప్పుడు మన దేశంలో నేత పనివారు అగ్గిపెట్టెలో పట్టేటంత చీరను నేసినారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇదంతా ఆషామాషీ వ్యవహారం కాదు. పత్తినుంచి దారం తీయడం, రంగులద్దడం, అవసరమైన పద్ధతిలో గుడ్డను తయారుచేయడం... ఇదొక సుదీర్ఘ ప్రక్రియ.

గొర్రెల బొచ్చు కత్తిరించి ఉన్నిదారం వడికి దానితో గొంగడి(కంబళి)ని తయారుచేసే కురుమల శ్రమ ఎందరికో వెచ్చదనాన్ని కలిగిస్తుంది. మురికి బట్టలను శుభ్రంచేసే రజకుల కాయకష్టం మనకు ఆరోగ్యాన్ని అందిస్తుంది. శుభాశుభ కార్యక్రమాలు వీరి ప్రమేయం లేకుండా జరుగవు.



ఈ వృత్తులవారందరూ చూపిన నైపుణ్యం తరువాత కాలంలో అద్భుతమైన ఆవిష్కరణలకు దారితీసింది. వీళ్ళ ఆలోచన, నైపుణ్యం ఎందరినో కదిలించింది. వీటిని ఆధారంగా చేసుకొని కొత్తవాటిని కనుక్కోవడానికి ప్రేరణ కలిగించింది.

ఒక్కరోజు ఆహారం లేకుంటే తల్లడిల్లుతాం. పిడికెడు మెతుకుల కోసం పడరాని పాట్లు పడేవాళ్ళెందరో ఉన్నారు. ఎవరేపని చేసినా కడుపునింపుకోడానికే. మనం తినే అన్నం, కూరగాయలు, పండ్లు వంటివేవీ సులువుగా వచ్చిపడేవికావు. చెమటోడ్చి పనిచేసిన రైతుల కృషి ఫలం. ఎండనక, వాననక, రేయింబగళ్ళనక రెక్కలు ముక్కలు చేసుకొని రైతు శ్రమిస్తేనే మనం హాయిగా తినగలుగుతున్నాం. భారతదేశపు మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రిగారు 'జై జవాన్, జై కిసాన్' అన్న నినాదమిచ్చాడు. సమాజానికి రైతు చేసే సేవ ఎంత గొప్పదో తెలిపే ఈ గేయాన్ని చదువండి.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20
SCERT TELANGANA

రైతే దేశానికి వెన్నెముక
అతడలిగితే లేదు మనకు అన్నమిక

కోటివిద్యలు అన్ని కూటికొరకన్నారు
కూడుగోడును బాప రైతన్నలున్నారు.
నడుమొంచి కష్టించి పాడిపంటలు పెంచి
పొట్ట చల్లగుండంగ పోషించు అన్నదాత

తానేమొ పస్తులుండి తిండిపెడుతున్నాడు
సమాజ గమనానికి సాయపడుతున్నాడు
రాత్రనక పగలనక ఆత్రంగ పనిచేస్తూ
సోమరితనమొద్దని చాటిచెప్పే ధీరుడు

ఎండకు ఎండినా వానలో తడిసినా
చలిలో వణకినా సమస్యలతో నలిగినా
సడలని స్థైర్యంతో సస్యములనందిస్తూ
జాతిసేవలో పునీతుడై నిలచిన ॥రైతే॥



### ఆలోచించండి-చెప్పండి

- 'మానవుని సౌందర్యం వెనుక క్షురకుని పాత్ర ఉన్నది.' దీన్ని సమర్థిస్తూ మాట్లాడండి.
- అగ్గిపెట్టెలో పట్టేటంత చీరను నేసిన నేతపనివారి పనితనాన్ని ప్రశంసిస్తూ మాట్లాడండి.
- దేశానికి అన్నంపెట్టే రైతు జీవనం దుర్భరంగా ఎందుకు మారిందో చర్చించండి.

ఇట్లా చూస్తూ పోతే ప్రతి ఒక్క వృత్తిలోనూ ఎంతో కొంత శ్రమ, నైపుణ్యం తొంగిచూస్తాయి. ప్రతి వృత్తీ పవిత్రమైందే. దేన్నీ చిన్నచూపు చూడాల్సిన పనిలేదు. ఎవరి ఇంట్లో శుభకార్యం జరగాల్సిఉన్నా మంగళవాద్యాలు, కుండలు, ప్రమిదలు, ఆభరణాలు, వస్త్రాలు మొదలయినవన్నీ కావాలి. అంటే ఇన్ని వృత్తులవాళ్ళు సహకరిస్తేనే ఏ కార్యాలైనా జరుగుతాయి. ఇట్లా అందరూ పరస్పరం సహకరించుకొంటేనే సమాజం నడుస్తుంది. అంతేకానీ 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లుగా ఉంటే సమాజ అభివృద్ధి కుంటుబడుతుంది. ఇందులో ఎక్కువ తక్కువ తేడాలు మన మనస్సుల్లో ఉండగూడదు. శరీరంలో కళ్ళు, చెవి, ముక్కు, కాళ్ళు, చేతులు... వీటిలో ఏవి గొప్ప అంటే? అన్నీ కలసి ఉంటేనే శరీరం. అట్లాగే అందరూ కలసి ఉంటేనే సమాజం. ఒకప్పుడు గ్రామాలు స్వయంసమృద్ధంగా వెలిగినాయి. గ్రామజీవనానికి అవసరమైన వస్తువులను అన్ని వృత్తులవారూ కలిసిమెలిసి తయారుచేసుకొనేవారు. ఒకరి అవసరాలకు మరొకరు చేదోడువాదోడుగా నిలిచేవారు. కులాలను పక్కకు పెట్టి అక్క, బావ, మామ, అత్త అన్న అని పిలుచుకొనే ఆత్మీయసంబంధం వాళ్ళది. మానవత్వాన్ని చాటిన మధురజీవనం వాళ్ళది. కలిసి ఉండడం, ఒకరిమీద ఒకరు ఆధారపడడం, ఒకరికొకరు సహకరించుకోవడం, మన సంస్కృతిలోని గొప్ప విలువలు. వీటిని అలవరచుకోవడం, పాటించడం, కాపాడుకోవడం మనందరి ధర్మం.

మనిషిని మనిషిగా గౌరవిద్దాం. అతనిలో దాగున్న ప్రతిభను అభినందిద్దాం. ఆ గొప్పదనాన్ని మనం అందుకోవడానికి ప్రయత్నిద్దాం. 'శ్రమ' పునాదిపైనే 'అభివృద్ధి' భవనం ఆధారపడి ఉంటుంది. శ్రమించడానికి ఎవరూ సిగ్గుపడగూడదు. సోమరితనంతో శ్రమించకపోతేనే సిగ్గుపడాలి. శ్రమైక జీవన సౌందర్యాన్ని చూడగలగాలి. శ్రమను గౌరవంగా భావించడం నేర్చుకోవాలి. శ్రమసంస్కృతితో జీవించడం నేర్చుకోవాలి.



SCERT TELANGANA

## ఇవి చేయండి

### I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. **'ఒక్కొక్క వృత్తి దేనికదే గొప్పది' దీనిని సమర్థిస్తూ మాట్లాడండి.**

### II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

1. **కింది పేరాను చదువండి. దాని ఆధారంగ కింద ఇచ్చిన పట్టికలో వివరాలు రాయండి.**

లక్కతో తయారయ్యే గాజులకు హైదరాబాదు ప్రసిద్ధి. వాటికి అద్దంముక్కలు, పూసలు, విలువైన రంగురాళ్ళతో అలంకరిస్తారు. హైదరాబాద్ సందర్శించేవారు వీటిని తప్పక కొనుక్కుంటారు. కళాత్మక కుట్టుపనులలో, వివిధ ఆకారాలలో ఉన్న చిన్నచిన్న అద్దంముక్కలు, పూసలు అందంగా తీర్చిదిద్దుతారు. దుప్పట్లు, దిండ్లు, కుషన్‌కవర్లు, లంగాలు, జాకెట్లు వంటి దుస్తులకు అత్యంత గిరాకీ ఉన్నది. ఇక నిర్మల్ వర్ణచిత్రాలు ప్రపంచంలో తమకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకున్నవి. గృహోపకరణాలైన కొయ్యసామగ్రి, తేలికపాటి చెక్కబొమ్మలు ఎంతో సృజనాత్మకంగా తయారు చేయబడతాయి.

వెండి నగిషీ కళను 'ఫెలిగ్రీ' అంటారు. కరీంనగర్ ఈ కళకు పెట్టిందిపేరు. ఇక్కడ సన్నని వెండి దారాలతో, ఆకర్షణీయమైన వస్తువులు తయారుచేస్తారు. గంధపుగిన్నెలు, పళ్లాలు, పెట్టెలు, గొలుసులు, పక్షుల, జంతువుల బొమ్మలు వంటివి కళాకారులు కళాత్మకంగా తయారుచేస్తారు. జనగాం జిల్లాలోని 'పెంబర్తి' గ్రామం లోహపు పనివారలకు ప్రసిద్ధి. అపురూపమైన జ్ఞాపికలు, గోడకు తగిలించే చిత్రాలు, పూలకుండీలు, విగ్రహాలు, స్టేషనరీ సామానులు, లోహపు రేకులతో వివిధ అంశాల తయారీ, ఇంకా అనేక రకాల అలంకరణ వస్తువులు వీరి చేతిలో తయారవుతాయి.

| హస్తకళల పేర్లు | దొరికే ప్రాంతం | వాటి ప్రత్యేకతలు |
|---|---|---|
| | | |

SCERT TELANGANA

2. ఆయా వృత్తిపనులవారు తయారుచేసేవి, వాడే వస్తువుల పేర్లను పాఠం ఆధారంగా వివరాలను పట్టికలో రాయండి.

| క్ర.సం | వృత్తులు | వాటికి సంబంధించిన పేరా సంఖ్య | పేరాలో ఇచ్చినవారు వాడే వస్తువులు లేదా తయారుచేసే వస్తువుల పేర్లు |
|---|---|---|---|
| | | | |

## III. స్వీయరచన

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) 'ఆదివాసులు మనందరికీ మార్గదర్శకులు' – అని ఎట్లా చెప్పగలరు? రాయండి.

ఆ) కుమ్మరి గొప్పతనం గురించి మీరు ఏమనుకుంటున్నారో రాయండి.

ఇ) 'రైతులు మన అన్నదాతలు' – సమర్థిస్తూ రాయండి.

ఈ) 'దేహానికి అవయవాలు ఎంత ముఖ్యమో, సమాజానికి అన్ని వృత్తులవాళ్ళూ అంతే అవసరం' – దీన్ని సమర్థిస్తూ, మీ సొంతమాటల్లో రాయండి.

2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.

అ) 'శ్రమ పునాదిపైనే అభివృద్ధి అనే భవనం నిర్మించబడుతుంది' – అని ఎట్లా చెప్పగలరు? కారణాలు వివరిస్తూ రాయండి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

1. కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.

అ) మీ గ్రామంలోని ఒక వృత్తిపనివారి వివరాలను సేకరించడానికి ప్రశ్నావళిని తయారుచేయండి.

ఉదా॥ 1. నమస్కారం! మీ పేరేమిటి? 2. ____________

3. ____________ 4. ____________

5. ____________ 6. ____________

7. ____________ 8. ____________

## V. పదజాల వినియోగం

1. కింది పదాలకు సొంత వాక్యాలు రాయండి.

అ) చేదోడు వాదోడు : ____________

ఆ) చాకచక్యం : ____________



SCERT TELANGANA

**2. కింది పట్టికలోని ప్రకృతి, వికృతి పదాలను గుర్తించి వేరుచేసి రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| గౌ | త్తి | ఆ | హా | రం |
| ర | రి | బ | ర | వం |
| వం | తి | ద్య | ర | రం |
| త్రి | రా | గా | వి | గి |
| భ | క్తి | ద్దె | మ | ఓ |

| | ప్రకృతి | వికృతి |
|---|---|---|
| ఉదా: | విద్య | విద్దె |
| అ) | ________ | ________ |
| ఆ) | ________ | ________ |
| ఇ) | ________ | ________ |
| ఈ) | ________ | ________ |

**3. కింది వాటికి పర్యాయపదాలు రాయండి.**

అ) చెట్టు : ________ ________ ________

ఆ. పాదము : ________ ________ ________

ఇ. శరీరం : ________ ________ ________

## VI. భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది పట్టికలోని వాక్యాలలో క్రియాభేదాలను గుర్తించి రాయండి.**

| | వాక్యం | అసమాపక క్రియ | సమాపక క్రియ |
|---|---|---|---|
| | ఉదా: సీత బజారుకు వెళ్ళి, బొమ్మ కొన్నది. | వెళ్ళి | కొన్నది |
| 1. | రాజు పద్యం చదివి, భావం చెప్పాడు. | | |
| 2. | వాణి బొమ్మ గీసి, రంగులు వేసింది. | | |
| 3. | కావ్య మెట్లు ఎక్కి, పైకి వెళ్ళింది. | | |
| 4. | రంగయ్య వచ్చి, వెళ్ళాడు. | | |
| 5. | వాళ్ళు అన్నం తిని, నీళ్ళు తాగారు. | | |

### సంశ్లిష్ట వాక్యం

**✷ కింది వాక్యాలు చదువండి. కలిపి రాసిన విధానం పరిశీలించండి.**

ఉదా: గీత బజారుకు వెళ్ళింది. గీత కూరగాయలు కొన్నది.

గీత బజారుకు వెళ్ళి, కూరగాయలు కొన్నది.

**2. కింది వాక్యాలను కలిపి రాయండి.**

అ) విమల వంట చేస్తుంది. విమల పాటలు వింటుంది.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

ఆ) అమ్మ నిద్ర లేచింది. అమ్మ ముఖం కడుక్కుంది.

ఇ) రవి ఊరికి వెళ్ళాడు. రవి మామిడి పండ్లు తెచ్చాడు.

పై వాక్యాలను కలిపి రాసినప్పుడు ఏం జరిగిందో చెప్పండి.

మొదటి వాక్యంలోని సమాపక క్రియ అసమాపక క్రియగా మారింది. కర్త పునరుక్తం కాలేదు.

ఇట్లా రెండు లేక మూడు వాక్యాలు కలిపి రాసేటప్పుడు చివరి వాక్యంలోని సమాపక క్రియ అలాగే ఉంటుంది. ముందు వాక్యాల్లోని సమాపక క్రియలు, అసమాపక క్రియలుగా మారుతాయి. కర్త పునరుక్తం కాదు. దీనినే **'సంశ్లిష్ట వాక్యం'** అంటారు.

**3. కింది వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా రాయండి.**

అ) రజిత అన్నం తిన్నది. రజిత బడికి వెళ్ళింది.

ఆ) వాళ్ళు రైలు దిగారు. వాళ్ళు ఆటో ఎక్కారు.

ఇ) రాజన్న లడ్డూలు తెచ్చాడు. రాజన్న అందరికీ పంచాడు.

## సంయుక్త వాక్యం

**✷ కింది వాక్యాలు చదువండి. కలిపి రాసిన విధానం పరిశీలించండి.**

ఉదా: రైలు వచ్చింది. చుట్టాలు రాలేదు.

రైలు వచ్చింది కానీ చుట్టాలు రాలేదు.

**4. కింది వాక్యాలను కలిపి రాయండి.**

అ) వర్షాలు కురిసాయి. పంటలు బాగా పండాయి.

ఆ) అతనికి కనిపించదు. అతడు చదువలేడు.

పై వాక్యాలను కలిపి రాసినప్పుడు ఏం జరిగిందో చెప్పండి.

పై వాక్యాలను కలిపి రాసేటప్పుడు క్రియలలో మార్పురాలేదు. వాక్యాలమధ్య కొన్ని అనుసంధాన పదాలు వచ్చాయి. ఇట్లా రెండు వాక్యాలను కలిపి రాసేటప్పుడు క్రియలలో మార్పు లేకుండా మధ్యలో అనుసంధాన పదాలు రాస్తే అవి **'సంయుక్త వాక్యాలు'** అవుతాయి. అనుసంధాన పదాలు అంటే **కావున, కానీ, మరియు, అందువల్ల** మొదలైనవి.

**✷ సంయుక్తవాక్యంగా మారేటప్పుడు వాక్యాల్లో వచ్చే మరికొన్ని మార్పులు ఎట్లా ఉంటాయో గమనించండి.**

అ) వనజ చురుకైనది. వనజ అందమైనది.

వనజ చురుకైనది, అందమైనది. రెండు నామ పదాల్లో ఒకటి లోపించడం.



SCERT TELANGANA

ఆ) దివ్య అక్క, శైలజ చెల్లెలు.

దివ్య, శైలజ అక్కాచెల్లెళ్ళు – రెండు నామపదాలు ఒకేచోట చేరి చివర బహువచనం చేరడం.

ఇ) రామయ్య వ్యవసాయదారుడా? రామయ్య ఉద్యోగస్తుడా?

రామయ్య వ్యవసాయదారుడా? ఉద్యోగస్తుడా? – రెండు నామవాచకాలలో ఒకటి లోపించడం.

ఈ) ఆయన డాక్టరా? ఆయన ప్రొఫెసరా?

ఆయన డాక్టరా, ప్రొఫెసరా? – రెండు సర్వనామాలలో ఒకటి లోపించటం.

**5. కింది సామాన్య వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చి రాయండి.**

అ) వారు గొప్పవారు. వారు తెలివైనవారు.

ఆ) సుధ మాట్లాడదు. సుధ చేసి చూపిస్తుంది.

ఇ) మేము రాము. మేము తేలేము.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- వివిధ వృత్తిపనులవారు పాడుకొనే పాటలను సేకరించండి. ఒక పాటపై మీ అభిప్రాయం ఆధారంగా నివేదిక రాయండి, ప్రదర్శించండి. (లేదా)
  మీకు తెలిసిన వృత్తిపనివారిని కలవండి. వారు ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యల గురించి నివేదిక రాయండి.

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | చేతి వృత్తుల గొప్పదనం గురించి మాట్లాడగలను. | అవును / కాదు |
| 2. | అపరిచిత పేరాను చదివి వివరాల ఆధారంగా పట్టిక నమోదు చేయగలను. | అవును / కాదు |
| 3. | ఇంటర్వ్యూ చేయడానికి ప్రశ్నావళిని తయారుచేయగలను. | అవును / కాదు |
| 4. | వృత్తి పనివారి కష్టనష్టాల గురించి నివేదిక రాయగలను. | అవును / కాదు |

**సూక్తి**

"నైపుణ్యానికి సహాయపడేవి నిరంతర శ్రమ మరియు సాధనే"

– ఋగ్వేదం

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

# చదువండి - తెలుసుకొండి

## మహామంత్రి మాదన్న

అధికారాన్ని స్వార్థ ప్రయోజనాలకు కాకుండా సకల ప్రజల సుఖసంతోషాలకై వినియోగించగలిగినవాడే చరితార్థుడు, ధన్యుడు. ఆ కోవలోనివాడే మహామంత్రి మాదన్న. రాజుశ్రేయస్సుకై, రాజ్యశ్రేయస్సుకై తన జీవితాన్నే సమర్పణ చేసుకున్న ఆదర్శమూర్తి. దక్షిణ భారతదేశంలో పేరుప్రఖ్యాతులున్న రాజ్యం గోలకొండరాజ్యం. దీనిని ఖుతుబ్‌షాహి వంశస్థులు పాలించారు. ఈ రాజ్యానికి వైశాల్యమేకాదు వనరులు కూడా ఎక్కువే. వీటిని సమర్థంగా వినియోగించుకొని సామ్రాజ్యవైభవాన్ని నలుదిక్కుల చాటాడు మాదన్న. ఇతనితోపాటు అక్కన్న గూడా ఈ రాజ్యంలోనే ఉద్యోగి. వీళ్ళను 'అక్కన్న మాదన్నలు' అని మనం ఆత్మీయంగా పిలుచుకొంటాం.

గోలకొండ ప్రభువుగా అబుల్‌హసన్ తానాషా సింహాసనం అధిష్ఠించడానికి మాదన్న పరోక్షకారకుడు. తానాషా మాదన్న మంచితనాన్ని, కర్తవ్యనిష్ఠను చూసి ప్రధానమంత్రిగా నియమించాడు. పరిపాలన భారాన్నంత తన భుజస్కంధాలపై వేసుకున్నాడు మాదన్న. ఎంతో ముందుచూపుతో సంస్కరణలకు శ్రీకారం చుట్టాడు.

గ్రామాలకు బాటలు వేయించాడు. బాటకు రెండువైపుల చెట్లనుపెంచే ఏర్పాటు చేశాడు. బాటసారులకు సత్రాలు కట్టించాడు. విద్యాలయాలకు, వైద్యాలయాలకు ఎంతో ప్రోత్సాహాన్నందించాడు. వజ్రాలకు గనియైన గోలకొండను ప్రపంచంలో గొప్ప వాణిజ్య కేంద్రంగా మార్చాడు. అధికారులలో లంచగొండితనాన్ని నియంత్రించాడు. ఇంగ్లీషువారు బహుమతుల రూపంలో మాదన్నకు లంచమివ్వజూపగా నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. ఎగుమతులకు ప్రాధాన్యమిచ్చాడు. ఎగుమతులు చేసేటట్లు చూశాడు.

వజ్రాల గనులలో పనిచేసేవారికి జీతభత్యాలు ఏర్పరచాడు. తమకై కొన్ని గనుల నుంచుకొనే సంప్రదాయమున్న ఆకాలంలో మాదన్న ఏ గనిని తనకై తీసుకోలేదు. ఇది అతని నిస్స్వార్థపరతకు నిలువెత్తు సాక్ష్యం.

రాజ్యానికి రక్షణ సైనికవ్యవస్థ. దీన్ని బలోపేతం చేశాడు. క్రమశిక్షణ, అంకితభావంతో తీర్చిదిద్దాడు. అందుకే మొఘలు రాజులు కూడా గోల్కొండ సైన్యాన్ని ఎదిరించలేకపోయారు.

గోల్కొండను ఎట్లాగైనా ఆక్రమించుకొని దక్షిణ భారతదేశంలో తన పరిపాలనను సుస్థిరం చేసుకోవాలనుకొన్నాడు ఔరంగజేబు. కాని దీనికి ప్రధాన అడ్డంకి ప్రధానమంత్రి మాదన్న. ఈ అడ్డును తొలగించాలనుకున్నాడు.

1686 మార్చి 16న అధికారిక బాధ్యతలను నిర్వర్తించి ఇంటికి వెళుతున్నారు అక్కన్నమాదన్నలు. ఇంతలో జంషీద్ హబ్షీ అనే నౌకర్ నాయకత్వంలో కొందరు దుండగులు అమాంతంగా వారిపైబడి తలలను నరికివేశారు. ఈ ఘోరం రాణివాసానికి ఎదురుగానే జరిగింది. అక్కన్న మాదన్నల మొండెములను కోటగుమ్మానికి వేలాడదీశారు. వారి తలలను ఔరంగజేబుకు పంపారు. వాటిని చూడగానే 'ఇక గోల్కొండ ఆక్రమణకు అవరోధములు లేవు' అని నవ్వాడు చక్రవర్తి. ఈ సంఘటన గోలకొండ రాజ్యంలో మాదన్న శక్తి ఎంతటిదో తెలుపుతున్నది.

తన జీవితమంతా ప్రజల సంక్షేమానికి వెచ్చించిన మహామంత్రిమాదన్న జీవితం పరమకిరాతకుల చేతిలో పరిసమాప్తి కావడం పెద్ద విషాదం. ప్రభుభక్తి పరాయణుడై, ప్రజాసేవాపరాయణుడైన మాదన్న 'నిరంతర స్ఫూర్తి'. తెలుగుజాతికి గర్వకారణం.

**(కొమరగిరి వేంకట భూపాలరావుగారి 'మాదన్న మహామంత్రి' పుస్తకం ఆధారంగా)**

SCERT TELANGANA

5

# శతక సుధ

– శతక కవులు

**చదువండి – ఆలోచించి చెప్పండి.**

యాదగిరీశుని వేడుకొంటూ తిరువాయిపాటి వేంకటకవి రచించిన కింది పద్యాన్ని చదువండి.

వాదము చేయఁగా నరులు వాక్య పరుండని యెగ్గు చేతురున్
మోదముతో భుజించునెడ ముందుగఁ బిల్తురు తిండిపోతుగా,
ఏదియుఁ బల్కకున్నయెడ నీతఁడు మూగని యెంచుచుంద్రుగా,
నీ దయగల్గఁగా సుఖము నేర్పును యాదగిరీంద్ర మ్రొక్కెదన్.

**– శ్రీ యాదగిరీంద్ర శతకం**

**ప్రశ్నలు:**

1. ఈ పద్యం ఏ శతకం లోనిది? కవి ఎవరు?
2. ఈ పద్యాన్ని చదివినప్పుడు మీరేం గ్రహించారు?
3. కవులు శతకపద్యాలు ఎందుకు రాస్తారు?
4. ఈ పద్యంలోని మకుటం ఏమిటి?
5. మీకు తెలిసిన కొన్ని శతకాల మకుటాలను చెప్పండి.

## పాఠం ఉద్దేశం

శతకపద్యాలు సమాజంలోని పోకడలను తెలుపుతాయి. వాటి ఆధారంగా విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందింపజేసి ఉత్తమ పౌరులుగా తయారుజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం శతక ప్రక్రియకు చెందినది. శతకం అంటే నూరు పద్యాలు కలది. కాని నూటెనిమిది పద్యాలు ఉండడం శతకానికి పరిపాటి. ఈ పద్యాలకు సాధారణంగా మకుటం ఉంటుంది. పద్యం చివరి పదంగాని పాదంగాని లేక రెండు పాదాలుగాని అన్ని పద్యాల్లో ఒకే విధంగా ఉంటే దాన్ని మకుటం అంటారు. మకుటమంటే కిరీటం అని కూడా అర్థం.

శతకంలోని ప్రతి పద్యం దేనికదే స్వతంత్రభావాన్ని కల్గి ఉంటుంది.

ఈ పాఠంలోని పద్యాలను నారాయణ, చిత్త, భాస్కర, దాశరథి, నరసింహ, విశ్వకర్మ, శ్రీ వేంకటేశ్వర, శ్రీ బాకవరాంజనేయ శతకాల నుండి తీసుకున్నారు.

## కవి పరిచయం



ఊహాచిత్రం
(15వ శతాబ్దం)

1. **నారాయణ శతకం :** 'నారాయణా!' అన్నమకుటంతో మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించే అద్భుతమైన పద్యాలు ఇందులో ఉన్నవి. దీనిని పోతన రాశాడు. ఇతడు వరంగల్లు జిల్లా బమ్మెరవాసి. ఆంధ్ర మహాభాగవతం, భోగినీదండకం, వీరభద్ర విజయం రాశాడు.



ఊహాచిత్రం
(17వ శతాబ్దం)

2. **చిత్త శతకం :** శ్రీపతిభాస్కర కవి 'చిత్తమా!' అనే మకుటంతో పద్యాలను రాశాడు. ఈయన శైవ పండిత త్రయంలో ఒకరైన శ్రీపతి పండితుని వంశం వాడని పరిశోధకుల అభిప్రాయం.



ఊహాచిత్రం
(17వ శతాబ్దం)

3. **భాస్కర శతకం :** మారద వెంకయ్య 'భాస్కరా!' అనే మకుటంతో పద్యాలను రాశాడు. భాస్కర శతకంలోని ప్రతి పద్యంలోను మొదటి, రెండు పాదాలలో ఒక నీతిని చెప్పి, తరువాతి పాదాలలో దానిని సమర్థిస్తూ ఒక దృష్టాంతాన్ని చెప్పడం ఈ శతకంలోని ప్రత్యేకత.



ఊహాచిత్రం
(17వ శతాబ్దం)

4. **దాశరథి శతకం :** కంచర్ల గోపన్న (భక్త రామదాసు) ఖమ్మం జిల్లా నేలకొండపల్లి వాస్తవ్యుడు. 'దాశరథీ కరుణాపయోనిధీ!' అనే మకుటంతో పద్యాలను రాశాడు. భద్రాచల రామునిపై అనేక కీర్తనలు రాశాడు.

తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20



SCERT TELANGANA



ఊహాచిత్రం
(18వ శతాబ్దం)

5. **నరసింహ శతకం :** ఈ శతక కర్త కాకుత్థ్సం శేషప్పకవి. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందినవాడు. 'దుష్టసంహార నరసింహ దురితదూర!' అనే మకుటంతో పద్యాలను రాశాడు. ఈయన మృదంగం వాయించడంలో నేర్పరి. తన జీవితాన్ని శ్రీధర్మపురి నరసింహ స్వామికి అంకితం చేశాడు. ఈయన నరహరి, నృకేసరీ శతకాలు, ధర్మపురీరామాయణం మొదలగు రచనలు చేశాడు.



(1855-1963)

6. **విశ్వకర్మ శతకం :** 'విశ్వపాలన ధర్మ! శ్రీ విశ్వకర్మ!' అనే మకుటంతో పండిత రామసింహకవి 'విశ్వకర్మ' శతకాన్ని రాశాడు. ఈయన జగిత్యాల జిల్లాలోని జగిత్యాల మండలం రాఘవపట్నం వాసి. ఈయన ఆశుకవి. దుష్ట ప్రపంచ వర్ణన, కలియుగ వర్ణాశ్రమ ధర్మాలు, భజన కీర్తనలు మొదలగునవి ఇతని రచనలు.



11-04-1936
09-01-2011

7. **శ్రీవేంకటేశ్వర శతకం :** నల్లగొండ జిల్లా మునగాల మండలం నరసింహాపురం గ్రామంలో జన్మించిన ఆసూరి మరింగంటి పురుషోత్తమాచార్యులు 'వేంకటేశ్వరా!' అనే మకుటంతో పద్యాలను రాశాడు. ఈయన గోదాదేవి, యాదగిరి లక్ష్మీనరసింహ శతకం, గోదావరి, సత్యవతీ సాంత్వనం, మారుతి మొదలగు రచనలు చేశాడు. ఈయన 'విద్వత్ కవి'గా ప్రసిద్ధి పొందాడు.



03-02-1937
26-08-1994

8. **శ్రీ బాకవరాంజనేయ శతకం :** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి నివాసియైన వేంకటరావు పంతులు, తాండూర్ దగ్గరలోని బాకవరం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామిపై 'బాకవరాంజనేయ! ఖలభంజన! సాధుజనానురంజనా!' అనే మకుటంతో పద్యాలను రాశాడు. యక్షగానాలు, కీర్తనలు, గేయాలు రాశాడు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20



## ప్రవేశిక

విశిష్టమైన సాహిత్య ప్రక్రియల్లో శతకం ఒకటి. మేలిముత్యాల్లాంటి శతక పద్యాలనుండి కొన్నింటిని ఈ పాఠం ద్వారా చదువుకుందాం. నైతిక విలువలను పెంపొందించుకుందాం.



## I



1. ✿మ. సతతాచారము సూనృతంబు కృపయున్ సత్యంబునున్ శీలమున్
నతి శాంతత్వము చిత్తశుద్ధి కరమున్నధ్యాత్మయున్ ధ్యానమున్
ధృతియున్ ధర్మము సర్వజీవ హితముం దూరంబు గాకుండ స
మ్మతికిం జేరువ మీ నివాస సుఖమున్ మానాథ నారాయణా!

*నారాయణ శతకం – బమ్మెరపోతన*

2. ✿ఉ. బీదల కన్నవస్త్రములు పేర్మి నొసంగుము, తుచ్ఛ సౌఖ్యసం
పాదనకై యబద్ధములఁ బల్కకు, వాదము లాడబోకు, మ
ర్యాద నతిక్రమింపకు, పరస్పరమైత్రి మెలంగు, మిట్టి వౌ
వేదములంచెరుంగుము, వివేకధనంబిది నమ్ము, చిత్తమా!

*చిత్తశతకం – శ్రీపతి భాస్కరకవి*



### ఆలోచించండి–చెప్పండి

- *కవి ఉద్దేశంలో నిజమైన సుఖం అంటే ఏమిటి?*
- *'వివేకధనం'గా కవి వేటిని పేర్కొన్నాడు?*

## II



3. ✿చ. చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణ సంయుతులెవ్వరు మెచ్చరెచ్చటం
బదునుగ మంచి కూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడు నుప్పులేక రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా!

*భాస్కర శతకం – మారద వెంకయ్య*

SCERT TELANGANA



4. ✿ఉ. పెంపునదల్లివై, కలుషబృంద సమాగమ మొందకుండ ర
క్షింపను దండ్రివై, మెయి వసించు దశేంద్రియ రోగముల్ నివా
రింపను వెజ్జువై, కృపగుఱించి పరంబు దిరంబుగాగ స
త్సంపద లీయ నీవెగతి దాశరథీ! కరుణా పయోనిధీ!

***దాశరథి శతకం – కంచర్ల గోపన్న***

5. ✿సీ. తల్లి గర్భము నుండి ధనము తేడెవ్వడు
వెళ్ళిపోయెడినాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెఱుగు బంగారంబు మ్రింగఁబోడు
విత్తమార్జన చేసి విఱ్ఱవీగుటె కాని,
కూడఁ బెట్టిన సొమ్ముఁ గుడువఁ బోడు
పొందుగా మఱుగైన భూమిలోపలపెట్టి
దానధర్మము లేక దాచి దాచి

తే. తుదకు దొంగల కిత్తురో? దొరలకవునొ?
తేనె జుంటీగలియ్యవా తెరువరులకు
భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస
దుష్ట సంహార! నరసింహ! దురితదూర!

***నరసింహ శతకం – కాకుత్థ్సం శేషప్పకవి***

### ఆలోచించండి – చెప్పండి

- ఎట్లాంటి చదువు వ్యర్థమని మీరనుకొంటున్నారు. ఎందుకు?
- సత్సంపదలు అంటే ఏవి?
- డబ్బు కూడబెట్టి దానధర్మం చేయనివాడిని తేనెటీగతో ఎందుకు పోల్చారు?

## III

6. ✿సీ. మొదట కర్దమముంటె మొగిలిపుష్పముకేమి?
పశువుల దోషముల్ పాలకేమి?
అరయ వైద్యుని కులం బౌషధంబునకేమి?
కప్పదోషము మౌక్తికములకేమి?
వృషభంబు లెట్లున్న కృషికర్మమునకేమి?
వెలియైన వాని సద్విద్యకేమి?
అపవిత్ర దోషంబు లగ్నిహోత్రునకేమి?
గుణదోషములవల్ల కులముకేమి?

మలినమై చందనము పరిమళము జెడున
రాతికంటు గుడము మధురంబు జెడున
వినయములు జెడ మావృత్తి ఘనత జెడున
విశ్వ పాలన ధర్మ! శ్రీ విశ్వ కర్మ!

***విశ్వకర్మ శతకం – పండిత రామసింహకవి***

7. ✿ఉ. లెక్కకురాని కోరికల రీతులలో బడి మానవుండిటుల్
మక్కువలన్ సృజించుచు నమాయకుడై సుడులన్ పదేపదే
యుక్కిరి బిక్కిరై తిరుగుచుండునుగాని, విశిష్ట మార్గముల్
ద్రొక్కు తలంపులేశము కుదుర్కొననీయడె? వేంకటేశ్వరా!

***శ్రీ వేంకటేశ్వర శతకం – ఆసూరి మరింగంటి పురుషోత్తమాచార్యులు***








SCERT TELANGANA



8. ✿ఉ. ఆకలిదప్పులన్ వనట నందిన వారికి పట్టెడన్నమో
శాకమొ, నీరమో యిడి, ప్రశాంతుల జేసిన సర్వపుణ్యముల్
చేకురు, నీవుమెచ్చెదవు, శ్రేయము, ప్రేయమటంచు నెంతయున్
బాకవరాంజనేయ! ఖలభంజన! సాధుజనానురంజనా!

**శ్రీ బాకవరాంజనేయ శతకం - వేంకటరావు పంతులు**

## ఆలోచించండి-చెప్పండి

- మంచిమార్గంలో నడిచే ఆలోచనలు కలుగకపోవటానికి కారణాలేవి?
- 'చెప్పుట చేయుటేకమై' నడవటమంటే ఏమిటి?
- కవి చెప్పిన పుణ్యపు పనులేవి?

## తాత్పర్యాలు

1. లక్ష్మీదేవి భర్తయైన ఓ నారాయణుడా! ప్రియవచనం, దయ, సత్యం, మంచి స్వభావం, మిక్కిలి శాంతం, నిర్మలమైన మనస్సు, భగవద్భక్తి, ధ్యానం, ధైర్యం, ధర్మాలను సదా ఆచరిస్తూ, సర్వప్రాణుల మేలు కోరేవాడిగా మీ సన్నిధిలో నీ కిష్టమైన వాడిగా ఉండే సుఖాన్ని దయచేయి (ఇవ్వుమని అర్థం).

2. ఓ మనసా! పేదవారికి అన్నదానం, వస్త్రదానం అధికంగా చేయి. నీచమైన సుఖాలకోసం అబద్ధాలాడకు. అనవసరంగా ఎవరితోను వాదనకు దిగకు. హద్దుమీరి ప్రవర్తించకు. అందరితో సఖ్యంగా ఉండు. ఈ సూత్రాలనే వేదాలుగా భావించు. వివేకులకు ఈ లక్షణాలే సంపదగా భాసిల్లుతాయి.

3. భాస్కరా! ఎంత చదువు చదివినా, అందులోని అంతరార్థాన్ని గ్రహించలేనప్పుడు ఆ చదువు వ్యర్థం. అటువంటి చదువును ఎక్కడైనా గుణవంతులు మెచ్చుకోరు. ఎంత బాగా వంటచేసినా దానిలో తగినంత ఉప్పు లేకపోతే అది రుచించదు కదా!

4. దయా సముద్రడవైన రామా! నీవు పెంపకంలో తల్లివి. చెడుదారిన నడువకుండా కాపాడే తండ్రివి. ఇంద్రియ (జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ) రోగాలను తొలగించే వైద్యుడివి. మోక్షం స్థిరమయ్యేటట్లుగా దయతో మేలైన సంపదలు ఇవ్వడానికి నీవే దిక్కు.

5. శ్రీ ధర్మపుర నివాసుడా! ఆభరణాలచేత ప్రకాశించేవాడా! పాపాలను దూరం చేసేవాడా! దుర్మార్గులను పారదోలేవాడా! ఓ నరసింహా!

తల్లి కడుపులో నుంచి పుట్టినప్పుడు ఎవ్వడూ ధనాన్ని వెంట తీసుకొనిరాడు. పోయేటప్పుడు వెంటతీసుకొని వెళ్ళలేడు. లక్షాధికారైనా ఉప్పుతో కూడిన ఆహారాన్నే కాని బంగారాన్ని తినలేడు. డబ్బు సంపాదించి గర్వం పెంచుకోడమే కానీ, తాను కూడబెట్టిన సొమ్మును తినడు. దాన్ని దానం, ధర్మం చేయకుండా భూమిలో దాచిదాచి పాతిపెడుతూ ఉంటాడు. తేనెటీగలు తేనెను బాటసారులపాలు చేసినట్లు ఆ సొమ్మును అనుభవించకుండానే చివరకు దొంగలపాలో రాజులపాలో చేస్తాడు.

6. శ్రీ విశ్వకర్మా! విశ్వాన్ని ధర్మబద్ధంగా పరిపాలించేవాడ! మొగిలిపువ్వు మూలాలు బురదలో ఉన్నంత మాత్రాన దాని ప్రాధాన్యం ఎంత మాత్రం తగ్గదు. పశువుల దోషాలేవీ పాలకు అంటుకోవు. ఇచ్చే మందులకు వైద్యుని

SCERT TELANGANA

కులంతో సంబంధమేమి ఉండదు. కప్పల (ముత్యపు చిప్పల) దోషాలవల్ల ముత్యాల వన్నె కొంచెం కూడా తగ్గదు. ఎద్దుల స్వరూపం ఎట్లున్నా వ్యవసాయానికి ఇబ్బంది రాదు. మనిషిని వెలివేసినా అతని విద్యకు లోటేమిరాదు. అపవిత్రత వలన కలిగే దోషాలతో అగ్నిదేవునికి సంబంధం లేదు. చందనం మలినమైనంత మాత్రాన సువాసనలు ఎక్కడికిపోవు. రాయికి అంటిన బెల్లం తీపి కొంచెం కూడా తగ్గదు. ఇతరులు గౌరవించనంత మాత్రాన అతని వృత్తి ఘనతకు ఏ భంగమూ కలుగదు.

7. ఓ వేంకటేశ్వరా! మనిషి అధికమైన కోరికలకు బానిసై అమాయకత్వంతో వివిధ అనుబంధాలను సృష్టించుకుంటు సుడిగుండాలలో పడి, ఉక్కిరిబిక్కిరై తిరుగుతుంటాడే గాని మంచి దారిలో నడిచే ఆలోచన కలిగేటట్లుగా చేయడం లేదు కదా!

8. పాపులను నశింపజేసేవాడ! సాధుజనులను ఆనందింపజేసేవాడ! బాకవరంలో వెలసిన ఓ ఆంజనేయా! ఆకలి దప్పులతో అలమటించే వారికి పట్టెడన్నంగాని, శాకంగాని, నీళ్ళుగాని ఇచ్చి వారిని శాంతపరిస్తే సమస్త పుణ్యాలు లభిస్తాయి. ఆ విధంగా భక్తులు చేస్తే అది వారికి మేలయినదని, ప్రియమైనదని నీవు మెచ్చుకుంటావు.

# ఇవి చేయండి

## I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. పాఠంలోని పద్యాలను రాగ, భావ యుక్తంగా చదువండి.
2. శతక పద్యాలు సమాజాన్ని అర్థం చేసుకోవడానికి తోడ్పడుతాయి - చర్చించండి.

## II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

1. పాఠంలోని పద్యాల ఆధారంగా కింద తెలిపిన పదాలతో వేటిని పోల్చినారో రాయండి.

అ) ఉప్పు : ______________________

ఆ) వేదాలు : ______________________

ఇ) సుడిగుండాలు : ______________________

2. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ కవి మామిడిపల్లి సాంబశివశర్మ రాసిన కింది పద్యాన్ని చదువండి. ఇచ్చిన ప్రశ్నలకు సరైన జవాబును గుర్తించండి.

పరువు లేకున్న జగతి సంబరము లేదు
సంబరము లేక అన్నమే సైపబోదు
అన్నమే లేక యున్న సోయగము సున్న
సోయగము లేక యున్న మెచ్చుదురె జనులు.

అ) అందంగా ఉండాలంటే ఇది అవసరం ( )

ఎ) నగలు బి) రంగు సి) అన్నం డి) వస్త్రాలు



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

ఆ) పరువు అంటే అర్థం ( )

ఎ) ధనం బి) గౌరవం సి) పండుగ డి) ప్రాణం

ఇ) సంతోషంగా లేకపోవడం వల్ల సహించనిది ఏది ( )

ఎ) అన్నం బి) చదువు సి) ప్రార్థన డి) భక్తి

ఈ) జనులు మెచ్చుకొనటానికి ఒక కారణం ( )

ఎ) దుర్మార్గం బి) కోపం సి) ద్వేషం డి) సోయగం

ఉ) ప్రపంచంలో ప్రతి మనిషికి ఉండవలసినది ( )

ఎ) పరువు బి) సంబరం సి) అన్నం డి) పైవన్నీ

## III. స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) "తుచ్ఛ సౌఖ్య సంపాదనకై యబద్ధములఁ బల్కకు, వాదము లాడబోకు" అని భాస్కరకవి ఎందుకు చెప్పి ఉంటాడు?

ఆ) వివేకవంతునికి ఉండవలసిన లక్షణాలేవి?

ఇ) పెంపునదల్లివై... అనే పద్యంలోని అంతరార్థాన్ని మీరేమని గ్రహించారు?

ఈ) 'కోరికలకు బానిసై ఉక్కిరి బిక్కిరి కావడం కంటె విశిష్టమార్గాన్ని వెతుక్కోవటం మంచిది' దీనిపై మీ అభిప్రాయాన్ని రాయండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) శతకకవులు ఈ విధమైన పద్యాలను ఎందుకు రాసి ఉంటారో కారణాలు రాయండి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

**1. కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

అ) పాఠశాలలో పిల్లలకు నిర్వహించే పద్యాల పోటీలో పిల్లలందరు పాల్గొనాలని కోరుతూ ఒక ప్రకటనను రాయండి. (ప్రకటనలో పోటీ నిర్వహణతేది, స్థలం, సమయం మొదలైన వివరాలుండాలి.)

## V. పదజాల వినియోగం

**1. కింది వాక్యాలలోని సమానార్థక పదాలను గుర్తించి గీత గీయండి.**

అ) ఇతరుల దోషాలు ఎంచేవాళ్ళు తమ తప్పులు తాము తెలుసుకోరు.

ఆ) తేనెతెట్టు నుండి తేనెను సేకరిస్తారు. ఆ మధువు తీయగా ఉంటుంది.

**2. కింది వాక్యాలలోని గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.**

ఉదా: <u>సహృదయత</u> గల వారికి సమాజంలో గౌరవం లభిస్తుంది.

సహృదయత = మంచి మనసు.



SCERT TELANGANA

అ) పూలతో పాటు దండలోని దారం కూడా పరిమళాన్నిస్తుంది.

పరిమళం = ______________________________

ఆ) సజ్జనుల మైత్రి ఎప్పటికీ సంతోషాన్నిస్తుంది.

మైత్రి = ______________________________

**3. కింద ఇవ్వబడిన పదాలలో ప్రకృతులకు వికృతులు, వికృతులకు ప్రకృతులు రాయండి.**

| ప్రకృతి | వికృతి |
|---|---|
| గుణం | |
| | దోసం |
| సుఖం | |
| | పున్నెం |
| అగ్ని | |
| | వెజ్జు |
| ధర్మం | |

## VI. భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

అ) దశేంద్రియ = __________ + __________ + ______________

ఆ) లక్షాధికారి = __________ + __________ + ______________

ఇ) పట్టెడన్నము = __________ + __________ + ______________

ఈ) రాతికంటు = __________ + __________ + ______________

ఉ) చాలకున్న = __________ + __________ + ______________

**2. కింది విగ్రహవాక్యాలకు సమాసపదాలు రాసి, సమాసం పేరు రాయండి.**

| | సమాసపదం | | విగ్రహవాక్యం | | సమాసంపేరు |
|---|---|---|---|---|---|
| అ) | ______________ | = | ఆకలియు, దప్పియు | = | ______________ |
| ఆ) | ______________ | = | అన్నము, వస్త్రము | = | ______________ |
| ఇ) | ______________ | = | దశ సంఖ్య గల ఇంద్రియములు | = | ______________ |
| ఈ) | ______________ | = | నాలుగైన వేదాలు | = | ______________ |



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

## ఛందస్సు - లఘువు, గురువు

✷ **కింది వానిని చదివి తెలుసుకోండి.**

పద్యాలలో, గేయాలలో ఉండే మాత్రలు, గురు లఘువులు, గణాలు, యతులు, ప్రాసలు మొదలైన వాటిని గురించి తెలియజెప్పేది ఛందస్సు.

అ) **'లఘువు'** - ఏకమాత్ర కాలంలో ఉచ్చరించేది. దీనిని 'ల' అక్షరంతో సూచిస్తారు. దీని గుర్తు " I " (నిలువుగీత). లఘువులను ఎట్లా గుర్తించాలో చూద్దాం.

(1) దీర్ఘాక్షరాలు కానివి. ( హ్రస్వాక్షరాలు )

ఉదా: అ - ఇ - ఎ - ఒ - క - బ - ర - కృ - క్ష (I I I I I I I I I)

(2) దీర్ఘంలేని ద్విత్వాక్షరాలు.

ఉదా:- క్క, చ్చ, మ్మ, ద్ర, ల్ల, త్త (I I I I I I)

(3) దీర్ఘంలేని సంయుక్తాక్షరాలు

ఉదా:- క్న, ఘ్న, మ్య, ట్చ, త్య (I I I I I)

ఆ) **'గురువు'** - రెండు మాత్రల కాలంలో ఉచ్చరించేది. దీనిని 'గ' అనే అక్షరంతో సూచిస్తారు. దీని గుర్తు " U ". గురువులను ఎట్లా గుర్తించాలో చూద్దాం.

(1) దీర్ఘాక్షరాలు

ఉదా:- ఆ, ఈ, ఊ, ఏ, ఓ, ఐ, ఔ, కా, రీ, తే, దే (U U U U U U U U U U U)

(2) ఐ, ఔ లతో కూడిన హల్లులు.

ఉదా:- క్రై, రై, గ్రై, పై, రౌ, నౌ, తౌ, గౌ (U U U U U U U U)

(3) సున్నతో కూడిన అక్షరాలు.

ఉదా:- అం, చం, ఇం, కం, మం, సం (U U U U U U)

(4) విసర్గతో కూడిన అక్షరాలు

ఉదా:- కః, మః, యః, వః, శః (U U U U U)

(5) పొల్లు హల్లుతో కూడిన అక్షరాలు.

ఉదా:- కన్, నిన్, దుర్, విద్, (U U U U)

(6) ద్విత్వాక్షరాలకు ముందున్న అక్షరాలు.

ఉదా:- అక్క, కర్ర, చిన్న, బొమ్మ (UI UI UI UI)

(7) సంయుక్తాక్షరాలకు ముందున్న అక్షరాలు.

ఉదా:- పద్మ, రిక్త, చోట్ల, దివ్య (UI UI UI UI)

3. కింది పదాలకు గురులఘువులు గుర్తించండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| చిక్కని | పాలపై | ధనము | చెందిన | పాకము | పంచదార |
| మూర్ఖులు | అందం | పుణ్యముల్ | నమోనమః | రైతులు | గౌరీపతి |

## గణాలు

గణం అంటే మాత్రల సముదాయం. అంటే గురు లఘువుల సమూహం. ఈ గణాలలో ఏక అక్షర (ఒకే అక్షరం) గణాలు, రెండు అక్షరాల గణాలు, మూడు అక్షరాల గణాలు ఉంటాయి.

❖ ఏక (ఒకే) అక్షర గణాలు. ఆ ఒకే అక్షరం లఘువు అయితే 'I' అనీ, గురువు అయితే 'U' అనీ గుర్తు ఉంటుంది.

| | | |
|---|---|---|
| I<br>మొ | I | ల |
| U<br>కే | U | గ |

❖ రెండు అక్షరాల గణాలు.

| | | |
|---|---|---|
| IU<br>పదే | IU | లగము లేదా 'వ' గణము |
| II<br>మది | II | లలము లేదా 'లా' |
| UI<br>అందు | UI | గలము లేదా 'హ' గణము |
| UU<br>దోషం | UU | గగము లేదా 'గా' |

❖ మూడు అక్షరాల గణములు.

| | | |
|---|---|---|
| UII<br>పెంపున | UII | 'భ' గణము |
| IUI<br>వినీత | IUI | 'జ' గణము |
| IIU<br>సతతా | IIU | 'స' గణము |
| UUU<br>ఆహారం | UUU | 'మ' గణము |
| IUU<br>సమాజం | IUU | 'య' గణము |
| UIU<br>మార్గముల్ | UIU | 'ర' గణము |
| UUI<br>పద్యాలు | UUI | 'త' గణము |
| III<br>చదువు | III | 'న' గణము |



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

**కింది పద్య పాదాలకు గురులఘువులను గుర్తించి గణవిభజన చేసిన తీరు చూడండి.**

| III | IUI | UII | IUI | IUI | IUI | UIU |
|---|---|---|---|---|---|---|
| చదువ | దియెంత | గల్గిన | రసజ్ఞ | తయించు | కచాల | కున్ననా |

| UII | UIU | III | UII | UII | UIU | IU |
|---|---|---|---|---|---|---|
| బాక వ | రాంజనే | యఖల | భంజన | సాధుజ | నానురం | జనా |

**4. కింది పద్య పాదాలకు గురులఘువులను గుర్తించి గణవిభజన చేయండి.**

అ) బీదల కన్న వస్త్రములు పేర్మినొసంగుము తుచ్ఛ సౌఖ్యసం

ఆ) పొదవెడు నుప్పులేక రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ కింది తరగతుల్లో ఇచ్చిన శతక పద్యాల ఆధారంగా ఆ శతకాల పేర్లు, వాటిని రాసిన కవుల పేర్లు సేకరించి, పట్టిక తయారుచేసి, నివేదిక రాసి తరగతిలో ప్రదర్శించండి.

| క్ర.సం | శతకం పేరు | కవి పేరు |
|---|---|---|
| | | |

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పద్యాలను పాడగలను. వాటి భావాలను సొంతమాటల్లో చెప్పగలను. | అవును / కాదు |
| 2. | అపరిచిత పద్యాన్ని చదివి, ప్రశ్నలకు జవాబులను గుర్తించగలను. | అవును / కాదు |
| 3. | శతకకవులు శతక పద్యాలను రాయటానికి కారణాలు వివరించగలను. | అవును / కాదు |
| 4. | పాఠశాలలో నిర్వహించే పోటీలకు ప్రకటనను రాయగలను. | అవును / కాదు |

**సూక్తి**

మెడలో బంగారు హారాలు వేసుకోవడం...
ఒంటిపై ఖరీదైన బట్టలు ధరించడం...
డాబు, దర్పాలను ప్రదర్శించడం అలంకారాలు కావు...
సంస్కారవంతమైన 'మాటే' నిజమైన అలంకారం.





SCERT TELANGANA

# 6 తెలుగు జానపద గేయాలు

- ఆచార్య బిరుదురాజు రామరాజు

## చదువండి - ఆలోచించి చెప్పండి.

చిక్కుడుపూసే చిక్కుడు కాసే తీగో నాగో ఉయ్యాలో
చిక్కుడు తెంపా ఎవ్వారు లేరూ తీగో నాగో ఉయ్యాలో
చిక్కుడు తెంపాసీరాములు లేరా తీగో నాగో ఉయ్యాలో
కొంగూలుపట్టా ఎవ్వారు లేరూ తీగో నాగో ఉయ్యాలో
కొంగూలు పట్టా సీతమ్మ లేదా తీగో నాగో ఉయ్యాలో
బీరలు పూసే బీరలు కాసే తీగో నాగో ఉయ్యాలో
బీరలు తెంపా శివయ్య లేడా తీగో నాగో ఉయ్యాలో
కొంగూలు పట్టా ఎవ్వారు లేరూ తీగో నాగో ఉయ్యాలో
కొంగూలు పట్టా పార్తమ్మ లేదా తీగో నాగో ఉయ్యాలో

### ప్రశ్నలు:

1. ఈ గేయం దేన్ని గురించి చెప్తుంది?
2. ఈ గేయాన్ని ఏమంటారో తెలుసా?
3. ఇట్లాంటి మరికొన్ని గేయాలు పాడండి.
4. ఇట్లాంటి గేయాల గొప్పతనం ఏమిటి?

## పాఠం ఉద్దేశం

తెలుగువారి ఆచార సంప్రదాయాలను, తాత్త్వికతను, చరిత్రను తెలిపే తెలుగు జానపదగేయాల గొప్పతనం, వైవిధ్యాన్ని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం వ్యాసప్రక్రియకు చెందినది. ఈ పాఠ్యాంశం ఆచార్య బిరుదురాజు రామరాజు రాసిన వ్యాసం.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

## రచయిత పరిచయం



16-04-1925
08-02-2010

తెలుగు జానపద సాహిత్యమనగానే మనకు గుర్తుకువచ్చేవాడు ఆచార్య బిరుదురాజు రామరాజు. వరంగల్ అర్బన్ జిల్లా దేవునూరు గ్రామంలో ఈయన జన్మించాడు.

కవి, పరిశోధకుడు, అనువాద రచయిత, సంపాదకుడుగా ప్రసిద్ధుడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడుగా, డీన్‌గా పనిచేశాడు.

'తెలుగు జానపద గేయ సాహిత్యం' ఈయన పరిశోధన గ్రంథం. చరిత్రకెక్కని చరితార్థులు, ఆంధ్రయోగులు, మరుగునపడిన మాణిక్యాలు, ఉర్దూ - తెలుగు నిఘంటువు, తెలుగు జానపదరామాయణం, తెలంగాణ పల్లెపాటలు, తెలంగాణ పిల్లల పాటలు మొదలైనవి ఈయన ఇతర రచనలు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.



## ప్రవేశిక

**జానపద సాహిత్యమనగానే గుర్తుకువచ్చేది గేయమే. పదాలను, పాటలను జానపదులు పిలుచుకునే లయాత్మక రచనలు జానపదగేయాలు. ఈ గేయాలలో ఆయా ప్రాంతప్రజల భావోద్వేగం, దైనందిన జీవితం, చరిత్ర, సంస్కృతి, భాష మొదలైనవి కనిపిస్తాయి. సామూహిక ప్రచారం, సరళభావం, జనప్రియత్వం వీటి లక్షణాలు. సాంస్కృతిక వారసత్వంగా వచ్చే ఈ జానపదగేయాల్లోని ఔన్నత్యాన్ని తెలుసుకుందాం.**





SCERT TELANGANA

## I

ఇతర భాషలలోని జానపదగేయాలలాగే తెలుగు జానపదగేయాలు కూడా విలక్షణమైన సాహిత్య సాంస్కృతిక విలువ సంతరించుకున్నాయి. ప్రజల నోటినుండి అప్రయత్నంగా వెలువడిన ఈ గేయాలలో చక్కటి శిల్పం కానవస్తుంది. ఈ గేయ సంపదను భద్రపరచి విశ్లేషించి, పరిశీలించడం ఎంతైనా అవసరం. తెలుగు భాషాసంస్కృతుల చరిత్ర ఎంత ప్రాచీనమైనదో తెలుగు జానపదగేయ చరిత్ర కూడా అంత ప్రాచీనమైనట్టిది.

ఈ జాతీయ కవిత ప్రజలకు అత్యంత సన్నిహితం కావడం చేత తెలుగులోని శిష్ట సాహిత్యంకంటే జానపదగేయాలే తెలుగువారి సంస్కృతికి ఉత్తమ దర్పణంగా ఉన్నాయి.

వాస్తవానికి జానపదగేయాలు శక్తిని, చైతన్యస్ఫూర్తిని తెనుగు ప్రజల జీవనస్రవంతి నుంచే పరిగ్రహించాయి. అందువల్ల మతపరమైన ఉద్యమాలు, వీరకృత్యాలు, మహాపురుషుల గాథలు, ఆచార వ్యవహారాలు సంప్రదాయాలు, విశ్వాసాలు, వినోద సాధనాలు, సౌందర్యం, సంపద, విషాదవృత్తాంతాలు. ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు ప్రజల జీవితం యావత్తూ జానపద గేయాలలో మధుర మంజుల శ్రుతిలో ప్రతిధ్వనిస్తుంది. తెలుగువారి దైనందిన జీవితంలో కవితా సౌరభం గుభాళిస్తుంది. మనోల్లాసానికి, ఆనందానికి మాత్రమే కాక ఈ గేయాలను పడవనడిపేవారు, కుప్పనూర్చేవారు, పొలందున్నేవారు, బరువులు మోసేవారు, కాయకష్టంచేసే ఇతర ప్రజలు శ్రమను పోగొట్టుకునే నిమిత్తం పాడుకుంటారు. వీటిలో సరళమైన భావాలు, ఇతివృత్తం ఉంటాయి. ఇందలి కవితను ఆస్వాదించేందుకు కేవలం మేధస్సుకంటే మృదు హృదయం అవసరం. తెలుగు జానపద కవిత ఎంత సంపన్నమైనదో ఎంత వైవిధ్యం కలదో ఈ వ్యాసంలో చూపేందుకు ప్రయత్నించడం జరిగింది.

### పౌరాణిక గేయాలు

శిష్టసాహిత్యంలో మాదిరే జానపదగేయాలకు కూడా పురాణేతిహాసాల నుంచి కథావస్తువు స్వీకరించారు. రామాయణాదులలో అనువాదాలలో మూలంలో లేని గాథలు ఎన్నో కానవస్తున్నాయి. జానపదగేయాలలో దాదాపు ప్రసిద్ధ పౌరాణిక గాథలన్నీ ఉన్నాయి. పౌరాణిక గాథలపైన మన గ్రామీణులు గొప్పభక్తి, ప్రేమాభిమానాలు చూపుతారు. పురాణాలలోని అమూల్యమైన ఉపదేశాలను విద్యావంతులు వాటిని చదువుకుని అర్థం చేసుకుంటారు. కాగా పామరులు వాటిని జానపదగేయాల ద్వారా గ్రహిస్తారు. పామరులు ఈ ఉపదేశాలను అర్థంచేసుకునే విధంగా జానపద గేయాలలో పొందుపరచారు. రామాయణ, మహాభారత, భాగవతాది పురాణాలు వారి వారి అభీష్టానుగుణంగా రూపుధరించాయి. శిష్ట సాహిత్యంలోమాదిరే ఇతర గాథల కంటే రామాయణ సంబంధమైన జానపదగేయాలే అధికంగా ఉన్నాయి.



శాంతాకల్యాణం, పుత్రకామేష్టి, శ్రీరాముల ఉగ్గుపాట, రాఘవకల్యాణం, రాములవారి అలుక, సుగ్రీవవిజయం, అంగదరాయబారం, లక్ష్మణమూర్ఛ, లంకాయాగం, శ్రీరామపట్టాభిషేకం, ఊర్మిళాదేవినిద్ర తదితరములు రామాయణంలోని కొన్ని ఘట్టాలను వివరిస్తున్నాయి. తెలుగు వారికి ముఖ్యంగా స్త్రీలకు సీతమ్మ ఆరాధ్యదైవం. సీత పుట్టుక, సీతాకళ్యాణం, సీతనత్తవారింటికంపుట, సీతసమర్త, సీతశుభగోష్ఠి, సీతగడియ, సీతవామనగుంటలు, సీతమ్మవారి అలుక,



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

సీత అగ్నిప్రవేశం, సీతచెర, మాయలేడిపాట మున్నగునవి సీతాదేవిని గురించిన పాటలు. రామాయణం తర్వాత భారత సంబంధమైన పాటలు అధికసంఖ్యలో ఉన్నాయి.

**ఆలోచించండి-చెప్పండి**

- *తెలుగు జానపద గేయ చరిత్ర ప్రాచీనమైనదని ఎట్లా చెప్పగలం?*
- *పౌరాణిక గాథలపై గ్రామీణులకు ఉండే భక్తి భావం ఎట్లాంటిది?*

## II

### చారిత్రక గేయాలు

జానపదగేయ వాఙ్మయంలో చారిత్రక గేయాలకు విశిష్ట స్థానం ఉంది. ఇతివృత్తం, శైలి, కథా కథన విధానాలలో తక్కినవానికంటే ఇవి భిన్నంగా ఉంటాయి. వీటిలో వీరరసం ప్రధానంగా ఉంటుంది. అందుచేత ఈ గేయాలను వీరగీతాలని వ్యవహరిస్తారు. వీరరస ప్రధానమైన సంఘటన జరిగిన వెంటనే చారిత్రక లేదా వీరగీతం ఉద్భవిస్తుంది. అటువంటి సన్నివేశాన్ని కన్నులారా చూసినప్పుడు చెవులారా విన్నప్పుడు జానపదుడు ఉద్వేగంతో దానిని గానం చేసి వినిపిస్తాడు. ఆపాట క్రమక్రమంగా పాకిపోతుంది. ఈ విధంగా విస్తరించడంలో పాటలోని వస్తువు కాలక్రమంలో మార్పు చెందుతుంది. ఇట్టి గీతాలు ప్రతి భాషలోనూ ఉన్నాయి.



వీరగీతాల ధ్యేయం వేరు. ఇతర జానపద గేయాల ధ్యేయం వేరు. వీరగీతాలు కేవలం వినోదానికి, ఉల్లాసానికి మాత్రమే కాదు. అవి వీరత్వాన్ని దేశభక్తిని ఉద్బోధించి ఉద్దీపింప చేస్తాయి. తెలుగునాడు తొలినుండి వీరసీమగా వాసికెక్కింది. ఈ సీమలో ఎందరో వీరాధివీరులు జన్మించారు. ఇచ్చట పుట్టిన చిగురు కొమ్మైనా చేవ గలదే.

మియాసాబ్ కథ, సోమనాద్రి కథ, రామేశ్వరరావు కథ, రాణిశంకరమ్మ కథ, సలై వెంకటరెడ్డి కథ, సదాశివరెడ్డి కథ, పర్వతాలమల్లారెడ్డి కథ, సర్వాయి పాపని కథ, బిల్లూరి కొండల్రాయుని కథ, కుమార రాముని కథ, తెలంగాణలో బహుళ ప్రచారం పొందిన వీర గీతాలు, పల్నాటి వీరులకథలు, కాటమరాజుకథ, దేశింగురాజుకథ, బొబ్బిలికథ, పెద్దాపురం కోడిపందేల కథ, అల్లూరి సీతారామరాజుకథ మొదలైనవి ఆంధ్రప్రాంతమంతటా ప్రచారం పొందినాయి. మహాభారత కాలం నుంచి సమరనీతి ప్రకారం ద్వంద్వయుద్ధం జరిగినప్పుడు ఒకవీరునితో శత్రుదళం నుంచి ఒక్కడు మాత్రమే తలపడాలి. అలాకాక ఒక వీరునిపై పెక్కుమంది తలపడి అతనిని పరిమార్చినట్లయితే ప్రజల దృష్టిలో అది వీరమరణం అవుతుంది. కాలక్రమంలో అతనిని జానపదులు దైవసమానుడుగా భావిస్తారు. అంతటితో వీరపూజ ప్రారంభమవుతుంది. హైదరాబాదు విమోచనోద్యమంలో అసువులు బాసిన వీరుల గాథలు ఆంధ్రదేశమంతటా ప్రచారంలోకి వస్తున్నాయి.

### పారమార్థిక గేయాలు

భక్తి, కర్మ, జ్ఞానమార్గాలు మూడు మోక్షసాధనాలని భారతీయుల విశ్వాసం. ఈ మూడింటిలో భక్తి మార్గం అత్యంత సులభమైనట్టిది. తెలుగునాట శైవవైష్ణవాది కీర్తనలు వేలసంఖ్యలో ప్రజాబాహుళ్యంలో అధిక ప్రచారం పొందాయి.



SCERT TELANGANA

అదృష్టవశాత్తూ అతి ప్రాచీనమైన భక్తిగీతాలు కొన్ని మనకు లభ్యమవుతున్నాయి. ఈ భక్తి గీతాలు పాడుకుంటూ జంగంవారు. హరిదాసులు, తమజీవనాన్ని సాగించుకుంటున్నారు. అదే వారి జీవనోపాధి. భద్రాచలరామదాసు కీర్తనలు, తూము నరసింహదాసు కీర్తనలు, పరాంకుశదాసు, ప్రకాశదాసు, వెంకటదాసు కీర్తనలు, తెలుగుసీమ అంతటా వినవస్తాయి. పదములు, దరువులు, మేలుకొలుపులు, భూపాళములు, లాలిపాటలు, జోలపాటలు, మంగళహారతులు స్తోత్రములు తారావళులు, నామావళులు కూడ కీర్తనల కిందికే వస్తాయి.



భారతదేశం తత్వవేత్తలకు పుట్టినిల్లు. పండితులే కాక పామరులు సైతం వేదాంత సత్యాలను పాడుకుంటారు. వాటి గురించి చర్చించుకుంటారు. వీటిని 'తత్త్వాలు' అని అంటాం. సంఘవ్యవస్థలోని కులబేధాలను ఎక్కువ తక్కువలను ఈ గీతాలలో ఖండించారు. వరలక్ష్మిపాట, శ్రావణశుక్రవారపు పాట, తులసిపాట, లక్షవత్తులపాట, కామేశ్వరీపాట మొదలైనవి నోములపాటలు, బొడ్డెమ్మ పాట, బతుకమ్మపాట తెలంగాణలో బహుళ ప్రచారం పొందినట్టివి.

## స్త్రీల పాటలు

గృహజీవనంలో స్త్రీకి పురుషునకంటే ఎక్కువ ప్రాధాన్యత ఉన్నది. కాబట్టి సంసార విషయాలకు సంబంధించిన కవితకు ఆలంబనం స్త్రీలే. వీటిని స్త్రీల పాటలు అనవచ్చు. వీటిలో వాస్తవికతపాలు ఎక్కువ. శిశుజననం పురస్కరించుకొని అనేక రకాల పాటలు పాడతారు. లాలిపాటలు, జోలపాటలు పాడి నిద్రపుచ్చుతారు. తల్లి తన కుమారుణ్ణి, రాముడిగానో, కృష్ణుడుగానో, తన కుమార్తెను సీతగానో, రుక్మిణిగానో గౌరిగానో తలచుకొని, ఈ పాటలు పాడుతూ ఆనంద తన్మయత్వం చెందుతుంది.

స్త్రీ జీవితంలో వివాహం అతి ముఖ్యమై ఘట్టం. పెండ్లికి సంబంధించిన వివిధ ఆచార వ్యవహారాలు సంప్రదాయాలు, లాంఛనాలు, పరిహాసాలు వర్ణిస్తూ, పెక్కు జానపదగేయాలు ఉద్భవించాయి. ఇవి పెండ్లిపాటలు, ఇవి కట్నములతో ప్రారంభమై అప్పగింతలతో ముగుస్తాయి. కట్నముల పాటలు, నలుగుపాటలు, అలుకపాటలు, తలుపుదగ్గర పాటలు, బంతుల పాటలు, వధూవరుల పాటలు, ముఖము కడుగుపాటలు, కట్నాలపాటలు, అవిరేణిపాటలు, వియ్యాలవారి పాటలు, అప్పగింత పాటలు వంటివన్నీ పెండ్లిపాటలే. ఈ పాటలన్నిటిలో తెలుగువారి సాంఘిక, సాంస్కృతిక జీవనం పూర్తిగా ఆవిష్కృతమవుతుంది. సీతసమర్త, సీతగడియ, సీతమ్మవారి వసంతం, సీతవామనగుంటలు, సుభద్రసారె. రుక్మిణిదేవి సీమంతం, కౌసల్య బారసాల మొదలైనవి అతి రమణీయములు.



### శ్రామిక గేయాలు

కవిత్వం కేవలం ఉల్లాసం కలిగించేందుకే కాక కష్టనివారణ కోసం కూడా ఉదయిస్తుంది. స్త్రీ పురుషులు కాయకష్టం చేస్తున్నప్పుడు శ్రమ కనపడకుండా ఉండేందుకు అలసట చెందకుండా ఉండేందుకు అప్రయత్నంగా వారి నోట నుండి కూనిరాగాలు వెలువడుతాయి. సామూహిక కర్తృత్వంలో ఇటువంటి రాగాలు జానపద గేయాలుగా పరిణమించి క్రమంగా వ్యాప్తి చెందుతాయి. పిండి విసురుతున్నప్పుడు, ఇల్లు అలుకుతున్నప్పుడు, ధాన్యం దంచుతున్నప్పుడు, నాగలితో దున్నుతున్నప్పుడు, నాట్లు వేస్తున్నప్పుడు పొలానికి నీరు పెడుతున్నపుడు.



విత్తనాలు జల్లుతున్నప్పుడు, వంట నూర్చుతున్నప్పుడు, పడవలాగుతున్నప్పుడు, రాళ్లు కొడుతున్నప్పుడు, బరువులు మోస్తున్నప్పుడు, రోడ్డురోలరు లాగుతున్నప్పుడు, ఇంటికప్పులు వేస్తున్నప్పుడు, పల్లకి మోస్తున్నప్పుడు రకరకాల పాటలు పాడతారు. ఈ పాటలు పాడుతూ పనిచేయడం వల్ల హృదయంలోనూ, మనస్సులోనూ ఉండే బాధ తొలగిపోవడమే కాక, శారీరకశ్రమ కూడా తెలియదు. శ్రామిక గీతాలకు వస్తువేదైనా ఉండవచ్చు. వృత్తికి సంబంధించిన పాటలు, శ్రామికులు పాడుకుంటారు. శ్రామిక గేయాలన్నీ సాధారణంగా వారి పనిపాట్లకు అనుగుణమై ఉంటాయి. శ్రామికుల శరీరభాగాల కదలికలో ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో ఈ గీతాలకు తాళలయలు సమకూరుతాయి.

**ఆలోచించండి - చెప్పండి**

- 'ఇచ్చట పుట్టిన చిగురు కొమ్మైనా చేవగలదే' - దీనిని ఏ సందర్భంలో వాడారు. దీనిని మీరెట్లా అర్థం చేసుకున్నారు?
- 'వీరగీతాల ధ్యేయం వేరు. ఇతర జానపదగేయాల ధ్యేయం వేరు.' దీనిని వివరించండి.
- 'భక్తిగీతాలు కొందరికి జీవనోపాధి.' ఎట్లాగో చెప్పండి.

## III

### పిల్లల పాటలు



జానపదగేయాలందు పిల్లల పాటల దొక ప్రత్యేక శాఖ. పసిపిల్లల లేతహృదయం ఎంత నిష్కపటమో, నిర్మలమో, స్వచ్ఛమో, మార్దవమో వారి పాటలు కూడా అంత నిష్కపటంగాను, నిర్మలంగాను, స్వచ్ఛంగాను, మార్దవంగాను ఉంటాయి. ఈ గేయాలు రెండు విధాలు. పిల్లల

కోసం పెద్దలు రచించి తరతరాల నుండి వస్తున్నవి ఒక రకం. పిల్లలు రాసి ఒక తరం నుండి మరోతరానికి అందినవి రెండవ రకం. పెద్దలు రాసిన వాటిల్లో పిల్లలను లాలించేందుకు వ్రాసినవి లాలిపాటలు. నిద్రపుచ్చేందుకు వ్రాసినవి జోల పాటలు. ఈ లాలిపాటలు, జోలపాటలలోని భావాలు పిల్లలకు అర్థం కావు. వాటిలోని సంగీతం, లయ పిల్లలను లాలిస్తాయి. నిద్రపుచ్చుతాయి. పెద్దలు వ్రాసిన పాటలు, పిల్లలు మెట్లవలె క్రమక్రమంగా పెరిగి పిల్లలు తాము తల్లిదండ్రుల వల్లనో ఇతరుల వల్లనో విన్న పాటలు స్వయంగా పాడేటంత వరకు సాగి ఆగిపోతాయి. ఈ పాటలు పిల్లలకు మొదట నాదామృతం గ్రోలటం నేర్పుతాయి. తర్వాత అనుకరించి చేతులు తిప్పటం చివరకు లయానుగుణంగా చేతులు చరచటం నేర్పుతాయి. మొదటి దశలో ఆకర్షణ, రెండవ దశలో ఉత్సాహం, మూడవ దశలో అభ్యాసం కనిపిస్తాయి.

పిల్లలు పాడే పాటలలో కొన్ని తమ సొంత రచనలు, మరికొన్ని పెద్దల రచనలకు తమ కవిత్వం కలిపి కూర్చినట్టివి ఉంటాయి. అనుకరణలో పిల్లలు పెద్దల రచనలలోని ధ్వనులను, మాటలని గ్రహిస్తారు. వాటిలో అర్థం ఉండదు. వాటిని 'అర్థం లేని పాటలు'గా వ్యవహరిస్తారు. బాలబాలికలు ఆటలలో పాడేపాటలు ఇట్టి కోవకు చెందినట్టివి. చెమ్మచెక్క, బిత్తి, కోతికొమ్మచ్చి, గుడుగుడుగుంచం, బుజబుజ రేకులు, గొబ్బిళ్లు, చిట్టిచిట్టి చిర్ర ఇందుకు కొన్ని ఉదాహరణలు.

## కరుణరస గేయాలు

నిత్యం జీవితంలో సుఖం కంటే దుఃఖమే ఎక్కువగా తారసిల్లుతుంది. అందుచేత కరుణరస ప్రధానమైన సన్నివేశాలను చిత్రించే జానపద గేయాలు బహుళంగా ఉన్నాయి. ఎరుకల నాంచారమ్మ కథ, రాములమ్మ పాట, సరోజనమ్మ పాట, మూసీ పొంగే పాట మున్నగునవి తెలంగాణాలో ప్రచారంలో ఉన్న కరుణరస గేయాలు.

తెలుగు జానపద గేయాలలో అధిక ప్రచారం పొందినవాటి సంగ్రహచరిత్ర ఇది. అముద్రితమైన ఈ గేయాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. వాటిని భద్రపరచేందుకు తగుశ్రద్ధ వహించక పోయినట్లయితే నాగరికత పల్లెసీమలకు విస్తరించిన కొలది ఇవి క్రమంగా అంతరించిపోతాయి. వాటికి సాహితీ పరమైన విలువ మాత్రమే కాక సాంఘిక, సాంస్కృతిక , భాషా విషయక ప్రాధాన్యత కూడ ఉన్నది. నిఘంటువులో లేని ఎన్నో అందమైన నుడికారాలు, పదాలు, ప్రయోగాలు వాటిలో కనిపిస్తాయి. రమణీయమైన స్థానికగాథలు వాటిలో అభినర్పితాలయ్యాయి. ప్రతిభ గల కవులు వాటిని చక్కటి కావ్యాల్లోను మలచవచ్చును. వివిధ ప్రణాళికల ద్వారాను, బహుళార్థ సాధకమైన ప్రాజెక్టుల ద్వారాను భారత దేశానికి కొత్త రూపురేఖలు తీర్చిదిద్దేందుకు బృహత్తర కృషి జరుగుతున్నది. ఇటువంటి తరుణంలో జానపద గేయాలు నిరక్షరాస్యులైన ప్రజలలో ప్రచారానికి అత్యుత్తమ సాధనం కాగలవు. ఈ దిశలో వంగీయులు, హిందీవారు ఎక్కువ పురోగతి సాధించారు. వారు తమ జానపద గేయాలను జాగ్రత్తగా భద్రపరచుకున్నారు. వాటిని ఉత్తమంగా వినియోగించుకుంటున్నారు. తెలుగువారు కూడ వారిని అనుసరించ గలరని నా విశ్వాసం.

### ఆలోచించండి-చెప్పండి

- 'నిష్కపటము, నిర్మలమైన హృదయం కలిగి ఉండడం అంటే ఏమిటి?
- జానపదగేయాలు ప్రచారానికి అత్యుత్తమ సాధనం. దీనిపై మీ అభిప్రాయం చెప్పండి.
- జానపద గేయ సంపదను రక్షించుకోవడానికి ఏం చేయాలి?

SCERT TELANGANA

# ఇవి చేయండి

## I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. 'జానపదగేయాలే తెలుగువారి సంస్కృతికి ఉత్తమదర్పణం' – చర్చించండి.
2. మీకు తెలిసిన జానపద గేయాలు పాడండి. వాటి గురించి మాట్లాడండి.

## II. ధారాళంగా చదువడం – అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

1. కింద ఇచ్చిన అంశాల పేరా సంఖ్య, ఆ అంశాలకు సంబంధించిన కీలక విషయాలను పట్టికలో రాయండి.

| అంశం | పేరా సంఖ్య | కీలక (ముఖ్యమైన) విషయాలు |
|---|---|---|
| ♦ పౌరాణికగేయాలు | | |
| ♦ చారిత్రకగేయాలు | | |
| ♦ శ్రామికగేయాలు | | |
| ♦ పిల్లలపాటలు | | |

2. కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

జానపదుల నిజమైన విద్యాభ్యాసానికి, లోకజ్ఞానానికి హేతువు వారి సాహిత్యమే. బడిలో చదివే చదువు కొంతే. సమాజం నుంచి నేర్చుకొనే చదువు కొండంత. పసి పిల్లలు ఆటలాడకుంటే వాళ్ళ మనస్సు చెడుతుంది.. దేహ ఆరోగ్యం చెడుతుంది. శారీరక శిక్షణ అన్నది జానపదులు తమకుతామే సహజంగా నేర్చుకున్నదేగాని ఒకరు నేర్పింది కాదు. పసిపిల్లలకు పెద్దలు చెప్పే కథలవల్ల వినోదమే కాక విజ్ఞానం కూడా లభిస్తుంది. అనేక విషయాలను వారు ఆలోచించేటట్లు చేస్తాయి. ప్రశ్నించే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయి. పొడుపుకథలు జానపదుల బుద్ధికి పదునుపెట్టే సమస్యలు. ముక్తపదగ్రస్తాలు పదజ్ఞానానికి సాటి అయింది మరొకటిలేదు. ఇవి జానపదులకు ఎన్నో పాఠాలు నేర్పిస్తాయి, వారిని సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతాయి. సంస్కృతికి సంబంధించిన విషయాలు కాలగర్భంలో కలిసిపోకుండా ఈ జానపద సాహిత్యం కాపాడుతుంది.

అ) జానపదులు సహజంగా నేర్చుకున్నది ఏమిటి?

______________________________

ఆ) పెద్దలు చెప్పే కథల వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనం ఏమిటి?

______________________________



SCERT TELANGANA

ఇ) పిల్లలు ఎక్కువ చదువు నేర్చుకొనేది ఎక్కడ?

ఈ) జానపద సాహిత్యం దేనికి హేతువు?

ఉ) పొడుపు కథలు, ముక్తపదగ్రస్తాలు వీటి ప్రత్యేకత ఏమిటి?

## III. స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) జానపదగేయాలను ఎందుకు భద్రపరచాలి?

ఆ) జానపదగేయాల్లో రామాయణ సంబంధమైన గేయాలు ఎక్కువగా ఉండడానికి కారణాలు ఏమిటి?

ఇ) 'గృహజీవనంలో స్త్రీకి పురుషునికంటె ఎక్కువ ప్రాధాన్యత ఉన్నది' – దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?

ఈ) శ్రామిక గేయాల ప్రాముఖ్యత ఏమిటి?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 'స్త్రీల పాటల్లో తెలుగువారి సాంఘిక, సాంస్కృతిక జీవనం పూర్తిగా కనిపిస్తుంది' – ఎట్లాగో వివరించండి.

( లేదా )

ఆ) 'జానపద గేయాలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయి' – దీన్ని వివరిస్తూ రాయండి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

**1. కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

అ) వారం రోజుల పాటు వివిధ జానపద కళారూపాల ప్రదర్శన జరుగుతుంది. ఏ కళారూపం ఏ రోజు, ఏ సమయంలో ప్రదర్శించబడుతుందో, ఎక్కడ ప్రదర్శించబడుతుందో మొదలైన వివరాలతో ఒక ఆహ్వాన పత్రికను తయారుచేయండి.

## V. పదజాల వినియోగం

**1. కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు అదే అర్థం వచ్చే మరో రెండు పదాలను రాయండి.**

ఉదా: మల్లెపూవు <u>సౌరభం</u> వెదజల్లుతున్నది.

సౌరభం = సువాసన, పరిమళం.

SCERT TELANGANA

అ) గృహజీవనానికి స్త్రీలే ఆలంబనం.

ఆ) భక్తి మార్గం మోక్ష సాధనం.

ఇ) కాయ కష్టం చేసేవారు కొందరు. తినేది అందరూ.

**2. కింది పదాలతో సొంతవాక్యాలు రాయండి.**

అ) పురోగతి :

ఆ) రూపురేఖలు :

ఇ) కూనిరాగాలు :

## VI. భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చి రాయండి.**

అ) మామయ్య ఇంటికి వచ్చాడు. మామయ్య కాఫీ తాగాడు.

___

ఆ) కొమ్మ విరిగిపోయింది. కొమ్మ కింద పడింది.

___

ఇ) శత్రువులు భయపడ్డారు. శత్రువులు పారిపోయారు.

___

**2. కింది వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చి రాయండి.**

అ) శివ అన్నం తిన్నాడు. రాజు పండ్లు తిన్నాడు.

___

ఆ) ఆమె పూలు తెచ్చింది. ఆమె కొబ్బరికాయ తెచ్చింది.

___

ఇ) నల్లనిమబ్బులు కమ్ముకొన్నాయి. వర్షం పడలేదు.

___

**తత్పురుష సమాసం**

✤ **కింది వాక్యం చదువండి.**

'రాజభటుడు వచ్చాడు.'

పై వాక్యంలో వచ్చిన వాడు రాజా? భటుడా? అని చూస్తే భటుడే వచ్చాడని అర్థం వస్తుంది. అయితే ఆ భటుడు రాజుకు చెందిన వాడని చెప్పడానికి 'రాజు యొక్క భటుడు' అంటాం. ఇట్లా చెప్పడాన్ని విగ్రహవాక్యం అంటాం. విగ్రహవాక్యం చెప్పేటప్పుడు ఇక్కడ షష్ఠీ విభక్తి ప్రత్యయమైన "యొక్క" వాడినాం.



SCERT TELANGANA

తిండి గింజలు – తిండి 'కొరకు' గింజలు

పాపభీతి – పాపం 'వల్ల' భీతి

పై రెండు వాక్యాలను కూడ గమనిస్తే రెండు పదాల మధ్య విభక్తి ప్రత్యయాలు వాడినాం. పై విగ్రహ వాక్యాలు చూస్తే ఉత్తర పదాలైన భటుడు, గింజలు, భీతికి ప్రాధాన్యత ఇవ్వబడింది. ఇట్లా **ఉత్తరపద ప్రాధాన్యతను తెలిపేది తత్పురుష సమాసం.**

సమాసంలో ఉండే రెండు పదాలలో మొదటి పదం పూర్వపదం, రెండవ పదం ఉత్తరపదం.

పూర్వపదం చివర ఉండే విభక్తిని బట్టి వాటిని ఆయా విభక్తులకు చెందిన తత్పురుష సమాసాలుగా గుర్తించవచ్చు.

**కింది పట్టికను చూడండి. చదువండి.**

| తత్పురుష సమాసం రకాలు | విభక్తులు | ఉదాహరణ |
|---|---|---|
| ప్రథమా తత్పురుషం | డు, ము, వు, లు | మధ్యాహ్నము – అహ్నము యొక్క మధ్య భాగం (సమాసంలోని మొదటి పదం ప్రథమావిభక్తిలో ఉన్నది కనుక ప్రథమా తత్పురుషం) |
| ద్వితీయా తత్పురుషం | ని, ను, ల, కూర్చి, గురించి | జలధరం – జలమును ధరించినది |
| తృతీయా తత్పురుషం | చేత, చే, తోడ, తో | బుద్ధిహీనుడు – బుద్ధి చేత హీనుడు |
| చతుర్థీ తత్పురుషం | కొరకు, కై | దూడగడ్డి – దూడకొరకు గడ్డి |
| పంచమీ తత్పురుషం | వలన (వల్ల), కంటె, పట్టి | దొంగభయం – దొంగవలన భయం |
| షష్ఠీ తత్పురుషం | కి, కు, యొక్క, లో, లోపల | రామబాణం – రాముని యొక్క బాణం |
| సప్తమీ తత్పురుషం | అందు, న | దేశభక్తి – దేశమునందు భక్తి |

**కింది వానిని చదువండి.**

అసత్యం – సత్యం కానిది

అధర్మం – ధర్మం కానిది

అన్యాయం – న్యాయం కానిది

ఇట్లా వ్యతిరేకార్థం తెలిపితే అది **నఞ్ తత్పురుషం** (నఞ్ అంటే వ్యతిరేకార్థం).

**3. కింది పదాలు చదువండి. వాటికి విగ్రహ వాక్యాలు రాయండి. అవి ఏ తత్పురుష సమాసాలో రాయండి.**

| సమాసపదం | | విగ్రహవాక్యం | సమాసంపేరు |
|---|---|---|---|
| అ) గదాధరుడు | = | ______________________ , | ______________________ |
| ఆ) అగ్నిభయం | = | ______________________ , | ______________________ |



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

ఇ) గుణహీనుడు = ____________ , ____________

ఈ) ధనాశ = ____________ , ____________

ఉ) దైవభక్తి = ____________ , ____________

ఊ) అజ్ఞానం = ____________ , ____________

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- పెండ్లిళ్ళలో లేదా శ్రామికులకు సంబంధించిన జానపద గేయాలను సేకరించి నివేదికను రాయండి.

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | జానపదగేయాలను పాడగలను, తెలుగువారి సంస్కృతి గురించి చర్చించగలను. | అవును / కాదు |
| 2. | ఇచ్చిన అంశాలకు సంబంధించి కీలక విషయాలు పట్టికలో రాయగలను. | అవును / కాదు |
| 3. | జానపదగేయాలు మన సంస్కృతి చిహ్నమని వివరించగలను. | అవును / కాదు |
| 4. | జానపదకళల ప్రదర్శనకు ఆహ్వానపత్రిక తయారుచేయగలను. | అవును / కాదు |

### సూక్తి

జానపదం జ్ఞానపథం.
అది జాతి వికాసానికి,
చైతన్యానికి ప్రతిబింబం.



SCERT TELANGANA

7

# మంజీర

- డా॥ వేముగంటి నరసింహాచార్యులు

**బొమ్మను చూడండి. ఆలోచించి చెప్పండి.**



**ప్రశ్నలు:**

1. పై బొమ్మలో ఏమేం కన్పిస్తున్నాయి? బొమ్మలోని బాలిక ఏం చూస్తున్నది?
2. ఏదైనా నదిని చూసినప్పుడు మీకు కలిగిన భావాలను చెప్పండి.
3. మీ ప్రాంతంలో ప్రవహించే నదుల పేర్లు చెప్పండి.
4. నదుల వల్ల ఉపయోగాలు ఏమిటి?

## పాఠం ఉద్దేశం

పాడిపంటలకు, సిరిసంపదలకు నదులే మూలం. తెలంగాణ రాష్ట్రంలో మంజీరానదిపై నిర్మించిన నిజాంసాగర్, సింగూరు, ఘనపురం ప్రాజెక్టులు అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయి.

ప్రజల జీవనానికి, పర్యావరణానికి నదులు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఎంతో మేలును చేకూరుస్తున్నాయని తెలుపడమే ఈ పాఠం ఉద్దేశం.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'గేయ' ప్రక్రియకు చెందినది. గేయం / పాట పాడుకోవటానికి వీలుగా ఉంటుంది. ఇది మాత్రా ఛందస్సులో ఉంటుంది. ఈ పాఠం డా॥ వేముగంటి నరసింహాచార్యులు రాసిన 'మంజీర నాదాలు' అనే గేయకావ్యంలోనిది.

## కవి పరిచయం



30-06-1930
29-10-2005

డా॥ వేముగంటి నరసింహాచార్యులు సిద్ధిపేట జిల్లాలోని సిద్ధిపేటలో రామక్క, రంగాచార్యులనే దంపతులకు జన్మించాడు. 'సాహితీ వికాస మండలి' సంస్థను, 'మెదక్ జిల్లా రచయితల సంఘం'ను స్థాపించి, సాహిత్య వికాసానికి కృషి చేశాడు. 'తిక్కన', 'రామదాసు' అనే పద్యకావ్యాలను, 'మంజీర నాదాలు' అనే గేయకావ్యాన్ని, 'వివేకవిజయం' అనే కావ్యఖండికతోపాటు *40* పుస్తకాలు రాశాడు. కవి కోకిల, కావ్యకళానిధి, విద్వత్కవి ఆయన బిరుదులు. తెలుగు విశ్వవిద్యాలయం వేముగంటిని గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

వేముగంటి రచనలన్నీ చక్కని ధారతో సరళమైన తెలుగు పదాలతో శోభిల్లుతాయి. వీటిలోని తెలంగాణ భాష ఇంపు, సొంపు పాఠకులను పరవశింపజేస్తాయి.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA



## ప్రవేశిక

జలధారలు ప్రాణికోటి జీవనాధారాలు. అందుకే మానవ జీవనమంతా నదీ పరీవాహాల్లో విస్తరించింది. ముఖ్యపట్టణాలు, తీర్థస్థలాలు అన్నీ నదుల నానుకొని వ్యాపించాయి. చినుకులు కాలువలై, కాలువలు నదులై తాగునీరుగా సాగునీరుగా మారి మనిషికి ఆహారాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాయి. అందుకే నది పవిత్రమైనది. పుణ్యప్రదమైనది. మన రాష్ట్రంలో ప్రవహించే ముఖ్యమైన జీవనదుల్లో 'మంజీర' ఒకటి. ఆ నదీమతల్లి ప్రస్థానాన్ని హృదయంతో దర్శించిన కవి వేముగంటి నరసింహాచార్యుల రచనను ఆస్వాదిద్దాం.



## I

నీ కంకణక్వణము
నినదించి నంతనే
కర్షకుని నాగేలు
కదలి ముందుకు సాగు
నీ చేతి చలువ చిం
దిలిపాటు గనినంత
పైరు పచ్చలు కనుల
పండువుగ విలసిల్లు
ఎంత చల్లని దానవే! నీవు మంజీర!
ఎంత తీయని దానవే!

గిడసబారిన పుడమి
ఎడద కరిగించెదవు
చేద్దైన నేలలో
చెరకు పండించెదవు
చేవగలిగిన మట్టి
జీవకణములు తెచ్చి
పొలముకు ఎరువుగా
బలము చేకూర్చెదవు
ఎంత చల్లని దానవే! నీవు మంజీర!
ఎంత తీయనిదానవే!

### ఆలోచించండి - చెప్పండి

- "పైరు పచ్చల కన్నుల పండువుగ విలసిల్లు" అనడంలో మంజీర నదికున్న సంబంధమేమిటి?
- మంజీర నదిని కవి "ఎంత తీయని దానవే" అని అనడంలో ఆంతర్యమేమిటి?
- "గిడస బారిన పుడమి ఎడద కరిగించెదవు" అని కవి మంజీర గురించి ఎందుకన్నాడు?

SCERT TELANGANA

II

ఆనాడు కుతుబు సు
ల్తాను నిలిపిన పురము
భాగ్యనగరములోన
వసియించు పౌరులకు
పంచదారను బోలు
మంచి నీరొసగెదవు
ఎంత చల్లని దానవే! నీవు మంజీర!
ఎంత తీయని దానవే!

పల్లెటూళ్ళను కూర్మి
తల్లివలె లాలించి
స్నానపానాదులను
సమకూర్చెదవు నీవు
పట్టణమ్ములను తో
బుట్టువలె ప్రేమించి
ధాన్యరాసుల నంపి
తరచు పోషించెదవు
ఎంత చల్లని దానవే! నీవు మంజీర!
ఎంత తీయని దానవే!



## ఆలోచించండి - చెప్పండి

- 'మంజీర పల్లెటూర్లను తల్లివలె లాలించింది' అని కవి ఎందుకన్నాడు?
- పట్టణాలను మంజీరానది తోబుట్టువులవలె ప్రేమిస్తుందని కవి ఎందుకన్నాడు?
- 'పట్టణాలను మంజీరానది పోషిస్తున్నది' ఎట్లాగో మీ మాటల్లో చెప్పండి.

SCERT TELANGANA

## సారాంశం

అమ్మా! మంజీర! ఎంత చల్లని దానవు నువ్వు. ఎంత తీయని దానవు నువ్వు. నీ నీటి ప్రవాహపు సవ్వడి, (నీ చేతి గాజుల గలగలల శబ్దం) వింటే చాలు రైతన్న నాగలి ముందుకు సాగుతుంది. నీ మంచితనం చూసిన వెంటనే రెప్పపాటులో పచ్చనిపైర్లు కన్నుల పండుగగా ప్రకాశిస్తాయి.

తల్లీ! మంజీర! చిన్నబోయిన నేలతల్లి హృదయాన్ని కరిగిస్తావు. చేదైన నేలలో తీయని చెరుకును పండిస్తావు. సారవంతమైన మట్టిని తీసుకువచ్చి పొలాలకు ఎరువుగా అందించి బలాన్నిస్తావు.

అమ్మా! మంజీర! కులీకుతుబ్‌షా నిర్మించిన భాగ్యనగర (హైదరాబాద్) వాసులకు చక్కెర వంటి తీయని తాగునీటిని అందిస్తావు.

తల్లీ! మంజీర! పల్లెలను అమ్మలాగ, ప్రేమగా లాలించి స్నానం, తాగునీరు వంటి అవసరాలను తీరుస్తావు. నగరాలను తోడబుట్టిన వాళ్ళగ ప్రేమించి పల్లెల్లో పండిన ధాన్యాన్ని పంపి ఎల్లప్పుడు పోషిస్తావు. అమ్మా! మంజీర నువ్వు ఎంత చల్లని దానవు. ఎంత తీయని దానవు.

# ఇవి చేయండి

## I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. ఈ గేయాన్ని రాగయుక్తంగా పాడండి.
2. నదులవల్ల ఏయే ప్రయోజనాలున్నాయో చర్చించండి.

## II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

1. కింది భావాన్నిచ్చే వాక్యాలు గేయంలో ఎక్కడ ఉన్నాయో గుర్తించి రాయండి.

అ) రైతు నాగలి ముందుకు సాగుతుంది.

ఆ) చిన్నబోయిన నేల గుండెను సేదతీరుస్తావు.

ఇ) హైదరాబాద్ ప్రజలకు తీయని నీళ్ళందిస్తావు.

ఈ) పల్లెను తల్లి ప్రేమతో లాలిస్తావు.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20
SCERT TELANGANA

2. గంగాపురం హనుమచ్ఛర్మ రాసిన కింది గేయ పంక్తులు చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

ప్రవహింతువా దుందుభీ మాసీమ
పాల యేఱుగ దుందుభీ
చిరుగాలి కెరటాల
పొరలెత్తు అలలతో
దరులంటు అమృతశీ
కరములౌ జలముతో
గిరులంటి, వాని ని
ర్ఝరులంటి, పైపైని
దరులంటి జాజి క్రొ
వ్విరుల వన్నియలూని ప్రవహింతువా–

**ప్రశ్నలు :**

అ) ఈ గేయం దేన్ని గురించి చెప్పింది?
ఆ) దుందుభి నది ప్రవాహాన్ని కవి దేనితో పోల్చాడు?
ఇ) కవి దుందుభి నదిని పాలయేఱు అని ఎందుకన్నాడు?
ఈ) 'దరులు' – అనే పదానికి అర్థమేమిటి?
ఉ) దుందుభి జలం ఎట్లా ఉన్నదని కవి ఉద్దేశం?

## III. స్వీయరచన

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) 'నది పొలానికి బలం చేకూరుస్తది' అని కవి ఎందుకన్నాడు?
ఆ) భాగ్యనగరానికి మంజీర నదికి ఉన్న సంబంధం తెల్పండి.
ఇ) మనం నదులను ఎట్లా కాపాడుకోవాలి?
ఈ) నదులు 'నాగరికతకు ఆలవాలం' – ఎందుకు?

2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.

అ) నదుల్లో కూడా నీళ్ళు కనుమరుగయ్యే పరిస్థితులు ఎందుకు వచ్చాయో కారణాలు వివరించండి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

1. కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.

అ) మీ ప్రాంతంలోని లేదా మీరు చూసిన వాగు / చెరువు / నదిని వర్ణిస్తూ కవిత / గేయాన్ని రాయండి.


SCERT TELANGANA

## V. పదజాల వినియోగం

**1. కింది పదాలకు సమానార్థక పదాలను పట్టికలో గుర్తించి రాయండి.**

అ) రైతు ఆ) చల్లదనం ఇ) నేల ఈ) స్నేహం ఉ) పంపి ఊ) ప్రకాశించు

| | | |
|---|---|---|
| భాష | పుడమి | నాగలి |
| అంపి | విలసిల్లు | చలువ |
| కర్షకుడు | కంకణము | సోపతి |

**2. కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు ప్రకృతి పదాలను రాయండి.**

రైతు ఎడద విశాలమైనది. ధాన్య రాసులతో దేశాన్ని సుసంపన్నం చేస్తాడు.

**3. కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.**

అ) కాకతీయుల కాలం సాహిత్య సంపదతో విలసిల్లింది. =

ఆ) కృష్ణ కుచేలుల కూర్మి గొప్పది. =

ఇ) పుడమి అనేక సంపదలకు నిలయం. =

## VI. భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది ఖాళీలను పూరించండి.**

| | సమాసపదం | విగ్రహవాక్యం | సమాసంపేరు |
|---|---|---|---|
| ఉదా: | సీతజడ | సీత యొక్క జడ | షష్ఠీ తత్పురుషము |
| | | చెట్టు యొక్క నీడ | |
| | వయోవృద్ధుడు | | |
| | | రాజులలో శ్రేష్ఠుడు | |
| | అమంగళం | | |
| | | తిలకమును ధరించినవాడు | |



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

## అలంకారం

✷ **కింది దానిని చదువండి.**

ఇల్లు, మనిషి, పెళ్ళి మంటపం, ఫంక్షన్‌హాలు, వాహనం ఏదైనాసరే అందంగా కనిపించాలంటే వివిధ రకాలుగా అలంకరణ చేస్తాం. అట్లానే రచనలు ఆకర్షణీయంగా ఉండడానికి అలంకారాలు ఉపయోగిస్తారు.

ఇది మనబడి
అక్షరాల గుడి
సరస్వతీ దేవి ఒడి
మనకు నేర్పును నడవడి

**ఆలోచించండి - చెప్పండి**

1) ఈ కవిత చదువుతుంటే ఎట్లా అనిపించింది?
2) ఎందుకని వినసొంపుగా ఉన్నది?
3) దీనిలో ఎక్కువసార్లు వచ్చిన అక్షరం ఏది?

పై కవితలో 'డి' అనే అక్షరం అనేకసార్లు రావడం వల్ల కవిత అందంగా, వినసొంపుగా ఉన్నది కదా! ఈ విధంగా వాక్యానికి ఏర్పడ్డ అందమే అలంకారం. ఆ అందం శబ్దం వల్ల వచ్చింది కాబట్టి శబ్దాలంకారం. అర్థం వల్ల అందం కలిగితే అర్థాలంకారం అవుతుంది. ఇప్పుడు ఒక శబ్దాలంకారం గురించి తెలుసుకుందాం.

## వృత్త్యనుప్రాసాలంకారం

✷ **కింది వాక్యాలు పరిశీలించండి.**

అ) గడ గడ వడకుచు తడబడి జారిపడెను.

ఆ) రత్తమ్మ అత్తమ్మ కోసం కొత్త దుత్తలో పాలు తెచ్చింది.

పై రెండు వాక్యాల్లో ఎక్కువసార్లు వచ్చిన హల్లు ఏది?

పై వాక్యాల్లో వరుసగా 'డ', 'త్త' అనే అక్షరాలు అనేకసార్లు వచ్చాయి కదా! ఇట్లా ఒకే హల్లు అనేకసార్లు రావడాన్ని **'వృత్త్యను ప్రాస'** అలంకారం అంటారు.

**2. మరికొన్ని వృత్త్యనుప్రాస అలంకారానికి చెందిన వాక్యాలను మరికొన్ని పాఠాలలో వెతికి రాయండి.**

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________



SCERT TELANGANA

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ తెలంగాణ రాష్ట్రంలో ప్రవహించే నదులు, వాటిపై నిర్మించిన ఆనకట్టలు, ఆ నదుల తీరాలలో ఉన్న పుణ్యక్షేత్రాలు, దర్శనీయ స్థలాలను తెలియజేసే పట్టికను తయారు చేయండి. నివేదిక రాసి ప్రదర్శించండి.

| క్ర.సం | నది పేరు | ఆనకట్ట | పుణ్యక్షేత్రం | దర్శనీయ స్థలం |
|---|---|---|---|---|
| 1 | | | | |
| 2 | | | | |
| 3 | | | | |
| . | | | | |
| . | | | | |

### నేనివి చేయగలనా?

1. ప్రస్తుతం నదుల స్థితిగతులకు కారణాలు వివరించగలను. అవును / కాదు
2. అపరిచిత గేయం చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలను. అవును / కాదు
3. నదుల్లో నీరు కనుమరుగయ్యే పరిస్థితులకు కారణాలు రాయగలను. అవును / కాదు
4. నదిని వర్ణిస్తూ కవిత / గేయం రాయగలను. అవును / కాదు

**సూక్తి**

"నది పాదం మోపిన ప్రతిచోట నేలను
పచ్చబంగారంగా మారుస్తుంది.
అట్లాగే మనిషి అడుగు పెట్టిన ప్రతిచోట
మానవత్వం చెట్టై నీడనివ్వాలె."

SCERT TELANGANA

# చదువండి - తెలుసుకొండి

## ఉద్యమదీపిక టి.ఎన్.సదాలక్ష్మి



అది 1944వ సంవత్సరం. సికింద్రాబాద్ ప్లేగ్రౌండ్ జనంతో కిక్కిరిసిపోయింది. రాజ్యాంగ నిర్మాత ఉపన్యాసాన్ని వినటానికి ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. అంబేద్కర్ మాటలు వినాలన్న కోరికతో బొల్లారం నుండి గుఱ్ఱం బగ్గీ కట్టుకొని ప్లేగ్రౌండ్‌కు చేరుకున్నది ఒక పదిహేనేళ్ళ బాలిక. ఉపన్యాసం ఆసాంతం శ్రద్ధగా విని తిరిగి మళ్ళీ ఒక్కతే బస్తీకి చేరుకున్నది. ఆ సాహస బాలికే టి.ఎన్. సదాలక్ష్మి.

సికింద్రాబాదు బొల్లారంలోని కలాసిగూడ మెహతర్ బస్తీలో 1928 డిసెంబర్ 25న సదాలక్ష్మి పుట్టింది. తండ్రి కొండయ్య తల్లి కర్రె గోపమ్మలకు కలిగిన తొమ్మిదిమంది సంతానంలో ఏడవబిడ్డ సదాలక్ష్మి. దళిత ఉపకులమైన మెహతర్ కులంనుంచి వచ్చిన సదాలక్ష్మి కుటుంబం సికింద్రాబాద్ కంటోన్మెంటు ప్రాంతంలో జీవించడంవల్ల అంటరానితనం వెలివేతకు సంబంధించిన ప్రతికూలాంశాలు ఎన్ని ఉన్నా కొన్ని అనుకూలాంశాలను పొందగలిగింది. బాల్యంనుండే చదువుల్లో, క్రీడల్లో అమితమైన ఆసక్తి చూపింది. క్రమంగా సామాజిక సేవ, సంఘసంస్కరణ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ వచ్చింది. ఆనాటి దళిత ఉద్యమనాయకులు, రాజకీయ ప్రముఖులను సదాలక్ష్మి వ్యక్తిత్వ ఔన్నత్యం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో 1952లో దేశంలో మొట్టమొదటిసారిగా నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో రిజర్వ్‌డు అభ్యర్థిగా నిలబడింది సదాలక్ష్మి. ఎంతోమంది మహా రాజకీయనేతలు, నాయకుల మధ్య ఈమె రాష్ట్ర శాసనసభకు ఎన్నికయింది. సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగానేకాదు, దేవాదాయశాఖ బాధ్యతలు నిర్వహించిన తొలి దళిత మహిళామంత్రిగా, డిప్యూటి స్పీకర్‌గా సదాలక్ష్మి రాష్ట్ర రాజకీయవ్యవస్థపై బలమైన ముద్రవేసింది.

1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి చివరిదాక తెలంగాణ ఉద్యమం వెంటనడిచిన ఉద్యమకారిణి సదాలక్ష్మి. తన బంగారు, వెండినగలను కరిగించి అమ్మిన డబ్బులతో తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమాన్ని నడిపించిన నిస్స్వార్థ నాయకురాలు సదాలక్ష్మి. ఒకవైపు ఆర్యసమాజ అనుయాయిగా, గాంధేయవాదిగా ఉంటూనే అవసరమైన వేళ నిజమైన పోరాటస్వభావాన్ని చూపించిన వ్యక్తి సదాలక్ష్మి.

"నాకు అసెంబ్లీ అయినా ఇల్లైనా ఒక్కటే. నా మట్టుకు నాకు రూల్సు తప్పితే ఊరుకోను" అంటూ తాను కచ్చితంగా పాటిస్తూ తన సాధికారతను, ఆత్మగౌరవాన్ని కడదాక నిలుపుకున్న పాలనాదక్షురాలు సదాలక్ష్మి. 'అడుగడుగునా నాకు చరిత్ర' సాధికారికంగా ఉన్నదని ప్రకటించుకున్న సదాలక్ష్మి 2004 జూలై 24న తుదిశ్వాస వదిలింది.

**(హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురించిన 'నేనేబలాన్ని' టి.ఎన్.సదాలక్ష్మి బతుకుకథ సౌజన్యంతో)**

SCERT TELANGANA

# 8

# చిన్నప్పుడే

– వట్టికోట ఆళ్వారుస్వామి

## చదువండి – ఆలోచించి చెప్పండి.



### ప్రశ్నలు:

1. పై బొమ్మలోని సన్నివేశం ఎక్కడ జరుగుతుండవచ్చు?
2. మీ గ్రామంలో ఇట్లాంటి దృశ్యం ఎప్పుడైనా చూశారా? ఎప్పుడు?
3. మాట్లాడుతున్న నాయకుడు ఏం చెప్తుతున్నాడని మీరు అనుకుంటున్నారు?
4. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఇట్లాంటి దృశ్యాలు ఊరిలో కనిపించేవని మీకు తెలుసా?

### పాఠం ఉద్దేశం

ఒకప్పటి నిజాం రాష్ట్రంలో తెలుగు భాషా సంస్కృతులు ఉపేక్షకు గురికావడాన్ని నిరసిస్తూ ఆంధ్రోద్యమం విస్తరించింది. ఆ సందర్భంగా సభలద్వారా పత్రికలద్వారా రచనల ద్వారా ప్రజా చైతన్యాన్ని ఎట్లా సాధించారో తెల్పడం ఈ పాఠం ఉద్దేశం.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం కథానిక ప్రక్రియకు చెందినది. ఇది జీవితపు ముఖ్య సన్నివేశాల్ని క్లుప్తంగా తెలియజేస్తుంది; సంఘటనల మధ్య సంబంధాన్ని కళాత్మకంగా చిత్రిస్తుంది; ఇటువంటి వచన ప్రక్రియనే 'కథానిక' అంటారు. కథనం, సంభాషణ, శిల్పం ఇవి కథానికలోని ప్రధానాంశాలు. సంక్షిప్తతా లక్షణమే కథానిక ప్రత్యేకత.

1945లో మీజాన్ పత్రికలో ప్రచురితమైన ఆళ్వారుస్వామి కథానికనే ప్రస్తుత పాఠ్యాంశం.

## రచయిత పరిచయం



**01-11-1915**

**05-02-1961**

సుప్రసిద్ధ రచయిత, సాహితీవేత్త, తొలితరం కథారచయిత వట్టికోట ఆళ్వారుస్వామి నల్గొండ జిల్లాలోని చెరువుమాదారంలో జన్మించాడు. నిజాంపాలనకు వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్ళాడు. ఆంధ్రమహాసభ నల్గొండజిల్లా శాఖకు అధ్యక్షుడుగా పనిచేశాడు. దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించి 35 పుస్తకాలను ముద్రించాడు. 'తెలంగాణ', 'గుమాస్తా'లనే పత్రికలను నడిపించాడు. 'జైలులోపల' అనే కథల సంపుటితో పాటు అనేక కథలు రాశాడు. రామప్పరభసు, తెలంగాణ వ్యాసాలు ఈయన ఇతర రచనలు. హైదరాబాదు సంస్థానంలోని ప్రజల్లో స్ఫూర్తిని, సాంస్కృతిక చైతన్యాన్ని రగిలించిన ఆళ్వారుస్వామి రాసిన 'ప్రజలమనిషి', 'గంగు' నవలలు ఎంతో ప్రజాదరణ పొందాయి.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.

SCERT TELANGANA



## ప్రవేశిక

*రజాకార్ల అఘాయిత్యాలకు పెత్తందార్ల పీడనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజానీకం తిరగబడ్డది. అట్లా తిరగబడటానికి ప్రేరణనిచ్చినవారు ఉద్యమ కార్యకర్తలు, నాయకులు. ఆనాటి మానవ సమాజానికి స్వతంత్రత, వ్యక్తిత్వం, గౌరవం, మర్యాద, విశ్వమానవ సౌభ్రాతృత్వం, సహనశక్తి, పరహితం వంటి ఉత్తమ గుణాలనందించేటందుకు వాళ్ళు ఏవిధమైన ప్రయత్నం చేశారు? ఆనాటి సాంఘిక పరిస్థితులెట్లా ఉండేవి? ఇవన్నీ కళ్ళకు కట్టినట్లు వివరించే కథనంకోసం.. ఈ పాఠం చదువుదాం......*



### I

ఆంధ్రమహాసభ కార్యకర్త వెంకటరావు నాయకులతో రంగాపురానికి బయలు దేరాడు.

"మనం నేరుగా ఊళ్ళోకి వెళ్ళకూడదు. గ్రామీయులకు నిరుత్సాహం కలుగుతుంది. గ్రామీయులు వాయిద్యాలతో ఎదుర్కొని తీసుకు వెళ్ళుతారు" అని వెంకటరావు హెచ్చరించాడు నాయకులను.

ఉదయం 12 గంటల కాలం. వరికోతల రోజులు. అయినా పొలాల్లో ఎవరూ లేరు. జనం అంతా నాయకుల ఊరేగింపు సన్నాహాల్లో ఉన్నారు. నాయకులు ఊరిబయట మోటబావి వద్ద కూర్చున్నారు. చెట్టునీడను కూర్చున్న ఒకరైతు యువకుడు "దండమండే" అని పెద్దగొంతుతో అన్నాడు, వెంకటరావువైపు చూస్తూ. విధిగా గ్రామ అగ్రజాతుల వారికి పెట్టే దండంలోను, భయంతో గ్రామ పెత్తందార్లకు పెట్టే దండంలోను వెంకట్రావుకు పెట్టే దండంలోను ఎంతో భేదం కనిపించింది. వికసించిన ముఖం, ఉప్పొంగి వస్తున్న సంతోషం, చనువు "దండమండే" అన్న శబ్దంలో నగ్నంగా కనిపించినవి. వెంకట్రావు ఆంధ్రమహాసభ కార్యకర్తగా సుమారు రెండు నెల్లనుండి ఏక దీక్షతో గ్రామీయుల సమస్యలను తీసుకుని పని చేస్తున్నాడు. 90 ఏండ్ల ముసలి మొదలు 8 ఏండ్ల బాలుని వరకూ వెంకట్రావంటే ధన, మాన,ప్రాణ రక్షకునిగా భావిస్తారు. అడుగడుగుకు గ్రామ పెత్తందార్లు నిందలు, నేరాలు మోపి లాగే లంచాలు లేకుండా చేశాడు వెంకట్రావు. చిన్న, పెద్ద, గౌరవ మర్యాద లేక ప్రతివారిని, ప్రతి స్త్రీని దుర్భాషలాడటం, నీచంగా ప్రవర్తించటం వెంకట్రావు కృషి ఫలితంగా లేకుండా పోయినవి. గ్రామ పెత్తందార్లు దయతో ఇచ్చే కూలితో, విధి విరామం లేకుండా జీవితాంతం పని చేయించుకోవటం, తుదకు పనివారు కడుపునిండా తిండి లేక మాడుచుండటం మానిపించాడు వెంకట్రావు. బావివద్ద చెట్టుక్రింద కూర్చున్న రైతుయువకుడు బాటసారితో ఆంధ్ర మహాసభ నాయకుల ఆగమన వార్తను ఊళ్ళోకి తెల్పాడు.

కొద్ది సేపట్లోనే కొందరు బాలురు నాయకులు కూర్చున్న వైపుకు వచ్చారు. మెల్లమెల్లగా సమీపంలో ఉసిరిచెట్టు వద్దకు వెళ్ళి ఉసిరికాయలు రాల్చుకొని, జేబులు నింపుకొని నములుతూ మెల్లగా నాయకుల ప్రక్క కూర్చున్నారు.

నాయకులు పచ్చని పచ్చికపై హాయిగా కూర్చుని మాటామంతీ సాగించారు.

వారిలో ఒకరు "నీపేరేం" అని బాలుడ్ని ప్రశ్నించాడు.

"లింగయ్య" అని మెల్లగా అన్నాడు. ఆ పిల్లవాని వయస్సు పదిఏండ్లు సుమారు ఉంటాయి.

SCERT TELANGANA

"లింగా'! అని మొదలు మేము పిలిచేది" వెంకట్రావు వైపు చూపుతూ "సంగంపంతులు బడి పెట్టినప్పటినుండీ లింగయ్య అని పిలుస్తున్నాం" అని ఇంకొక పిల్లవాడు అందుకున్నాడు.

నాయకులు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. వెంకట్రావు ఆలోచిస్తున్నట్లు తల నేలకు వేశాడు.

"మీరెవరు" అని ఒక నాయకుడు ప్రశ్నించాడు.

"మేం బట్టలుతుకుతాం" అని లింగయ్య చెప్పాడు.

"నాకొక ఉసిరికాయ ఇస్తావూ" అని ఒక నాయకుడు లింగయ్య వైపు చేయిచాపాడు. మొదట పరిహాసమనుకున్నాడు లింగయ్య. అయినా తేల్చుకుందామన్నట్టుగా అనుమానంతో మెల్లగా జేబులో నుండి ఒక ఉసిరికాయ తీసి అందిచ్చాడు.

ఆ నాయకుడు వెంటనే అందుకుని కొరికాడు. కొరుకుతూ ఉండగానే అక్కడ కూర్చున్న పిల్లలందరూ గభాలున ఆ నాయకునివైపు వచ్చి తమ జేబులో నున్న కాయలన్నీ అతని ముందర పోశారు.

"ఎందుకివన్నీ, చాలు, చాలు" అని నాయకుడంటుండగానే "ఇది బాగుంది. ఇది బాగుంది" అని పిల్లలందరూ తాము బోర్లించిన కాయల్లో నుండి మంచి మంచివి ఏరి అందించసాగారు.

ఆ నాయకుడు పట్టలేని సంతోషంతో అందరిని తన కౌగిట్లోకి తీసుకొని కన్న కొడుకుల్లాగ వీపులపై చేతులు నిమిరాడు. ఆ బాలురు అమితోత్సాహంతో ఆ నాయకుణ్ణి చుట్టివేశారు.

ఆ బాలురకు, ఆ నాయకునకు ఏర్పడిన ఆ ప్రేమకు ఎంత విలువ గట్టగలం? ప్రతిరోజు, ప్రతివస్తువు అన్యాయంగా హరించే గ్రామ పెత్తందారుణ్ణి అసహ్యించుకునే ఆ బాలురు తాము స్వయంగా ఇవ్వటమేగాక దాన్ని నాయకుడు





SCERT TELANGANA

అంగీకరించటంతో పొందిన ఆనందానికి ఎంత విలువ కట్టగలం? తమ గ్రామీయులైనప్పటికీ గ్రామ పెత్తందార్లు అంటే హడలిపోయే ఆ బాలురు పరగ్రామీయుడు, పది నిమిషాలక్రింద పరిచయుడైన ఆ నాయకుడు చిరపరిచిత, అవ్యాజబంధువుగా తలచ బడ్డాడంటే వారికి పరస్పరం ఏర్పడిన గాఢాభిమానానికి ఎంత విలువ కట్టగలం?

**ఆలోచించండి-చెప్పండి**

- 'వరికోతల రోజులు. అయినా పొలాల్లో ఎవరూ లేరు' ఈ వాక్యాన్నిబట్టి మీకేమి అర్థమయింది.
- ఊళ్ళోకి ఎదుర్కొని తీసుకొని పోవడమంటే ఏమిటి?
- 'పిల్లలు నాయకుణ్ణి అమితోత్సాహంతో చుట్టివేశారు' కదా! వాళ్ళు అట్లా ప్రవర్తించడానికి కారణాలు ఏమై ఉంటాయి?

## II

"వీండ్లందరెవరో ఎరికేనా?" అని ఆ బాలురను వెంకట్రావు ప్రశ్నించాడు.

"మే మెందుకొచ్చామో చెప్పు" అని నాయకుల్లో ఒకరడిగారు.

పిల్లలు ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు. అందరిముఖాలు వికసించినవి.

"మమ్ముల బతికించటానికి" అని ఒక బాలుడన్నాడు.

"మీబతుకుకేమైంది? నీ చేతులకు వెండికడియాలున్నాయి. ఆ పిల్లవాని చెవులకు బంగారు పోగులున్నాయి. ఈ పిల్లవానికి బంగారు గుండీలున్నాయి" అని ఒక నాయకుడు పిల్లలవైపు చేతులు చూపుతూ అన్నాడు.

"ఇవి ఉంటే? ఒకసారి మావూరిదొర మా బర్రెను బందెలదొడ్లో పెట్టించాడు".

"మా అన్న కోడెదూడ చేలో బడ్డదని మావూరి పటేలు పదిరూపాయలు వసూలు చేశాడు"

"మా దున్నపోతు 'బుస్సు'మన్నదట, ముకుతాడు లేదని ముప్పయిరూపాయలు తీసుకున్నాడు మాలిపటేలు."

"సర్కారీ రకం కట్టలేదని మా నాయనకు బండలెత్తారు ఒకసారి"

"వెంకట్రావు పంతులు పెట్టిన బడిలోకిపోతె దెబ్బలు కొడతానని మొన్న మా దొర గుమాస్తా బెదిరించాడు."

"మొన్న మా అమ్మ కూలికిపోయి వస్తూ చేలో కట్టెపుల్ల లేరుకుంటుంటే ఎందుకేరుకున్నావని మా అమ్మని సిగపట్టుకొని కొట్టాడు. మా అయ్య అడ్డంబోతే చేతికర్ర ఇరిగేదాకా కొట్టాడు దొరగారి శేగిదారు."

ఈ విధంగా పిల్లవాండ్లంతా తమకష్టాలు కుప్పలుగా కురిపించారు.

"పొయ్యిలో కట్టెలు లేకపోతె ఆరోజు రాత్రి బువ్వెట్లా వండింది మీ అమ్మ?" అని ఒక నాయకుడు ప్రశ్నించాడు.

"నేను పసులుకాడనుండి ఇంటికొచ్చేవరకూ మా అమ్మా అయ్యా మూలుక్కుంటూ పండుకున్నారు. ఇంట్లో బువ్వ ఉన్నదేమోనని కుండలన్నీ వెతుకుతూంటే, మా అయ్యలేచి చెట్లపొదల్లోంచి కట్టెలు తెచ్చి బువ్వ వండుతుంటే, గిర్దావరు బరులకు పోవాలని సేక్సింది బట్టుకపోయిండు, పొయ్యిమీద బువ్వంత చెడిపోయింది. దాంట్లనే మిరం, ఉప్పు పోసుకుని, నీళ్ళు పోసికొని తిన్న" అని ఆ బాలుడు జవాబు చెప్పాడు.

"మీరెవరబ్బాయి?" అని నెత్తినుండి కారేటంత నూనె పెట్టుకున్న ఒక అబ్బాయిని ప్రశ్నించాడు ఒక నాయకుడు.

"నేను సంగి శెట్టి కొడుకును"

"మీకేం కష్టాలున్నాయి చెప్పు" అని తిరిగి ప్రశ్నించాడు నాయకుడు.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

"ఏమో నాకేం ఎరుక. మా నాయనకెరుక" అని ముఖం తిప్పాడు.

" ఓసారి మీ అమ్మ పసుల జంగల్లోనుంచి పేడ తెచ్చిందని పోలీసు పటేలు ఇనుపతట్ట గుంజుకోలే?" అని వేరొక పిల్లవాడు జ్ఞాపకం చేశాడు. "ఇంకా ఆ తట్ట ఇవ్వలేదు కూడ" అని శెట్టి కొడుకు అందుకున్నాడు.

ఈ విధంగా నాయకులు సుమారు అరగంటకాలం పిల్లలతో గడిపారు.

"పాపం! చిన్నప్పుడే కుటుంబ ఇబ్బందులన్నీ ఈ పిల్లలు తెలుసుకోవాల్సిన గతి బట్టిందంటే పరిస్థితులు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో తెలుస్తున్నది" అని నాయకుల్లో ఒకరన్నారు.

"మనం మన సంతానానికి ఆస్తిగా ఇచ్చేవి అప్పులు, రోగాలు, కష్టాలేగా" అని ఒక నాయకుడన్నాడు.

"మనం ఈ రోజు స్వార్థ రహితంగా, ధైర్యంగా, పట్టుదలతో పనిచేస్తే మన సంతానం అంత హాయిగా బతుకుతారు" అని ఒక నాయకుడన్నాడు.

"స్వతంత్రం, వ్యక్తిత్వం, గౌరవం, మర్యాద, విశ్వమానవ సౌభ్రాతృత్వం, సహనశక్తి, పరహితం. ఇదే నేటి మానవ సమాజానికి వజ్ర, వైడూర్యాలు, దివ్యభవనాలు, నగలు, నాణ్యాలు, ఆస్తి, ఆదాయం" ఇంకొక నాయకుడన్నాడు.

ఇంతలో గ్రామంలో వాద్యాలచప్పుడు వినబడింది., "వాళ్ళతో కలిసి మళ్ళావస్తాం" అని స్నేహితులతో సెలవు తీసుకుంటున్నట్లు చెప్పి ఆ బాలురంతా పరుగెత్తారు.

### ఆలోచించండి - చెప్పండి

- పిల్లలు చెప్పిన విషయాలను బట్టి ఆనాటి గ్రామాల పరిస్థితిని ఎట్లా అర్థం చేసుకున్నారు.
- "మనం మన సంతానానికి ఆస్తిగా ఇచ్చేవి అప్పులు, రోగాలు, కష్టాలేగా" అని నాయకుడు అనడంలోని ఉద్దేశమేమి?

# ఇవి చేయండి

## I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

**1. 'చిన్నప్పుడే' కథ చదివారు కదా! దీని ఆధారంగా స్వాతంత్ర్యానికి ముందు గ్రామాల్లో పరిస్థితి ఎట్లా ఉండేదో ఊహించండి, మాట్లాడండి.**

## II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. పాఠం ఆధారంగా కింది మాటలు ఎవరు ఎవరితోటి ఏ సందర్భంలో అన్నారో చర్చించండి.**

అ) వీండ్లందరెవరో ఎరికేనా?

ఆ) నేను సంగిశెట్టి కొడుకును.

ఇ) మన సంతానమంతా హాయిగా బతుకుతారు.

**2. కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

నిజాం రాష్ట్రంలో సాంస్కృతికంగా, భాషాపరంగా అణచివేయబడిన తెలంగాణ ప్రజల్లో వారి మాతృభాష, సంస్కృతి పట్ల గాఢాభిమానం కలిగించటంలో ఆనాడు తెలుగు గ్రంథాలయాలు, పఠనాలయాలు, తెలుగు పత్రికలు ఎంతో దోహదం చేశాయి. తెలంగాణలో తెలుగు ప్రజలకు తెలుగు భాషపై, సంస్కృతిపై ఆసక్తి కలిగించటం ద్వారా వారి జాతీయ, సాంస్కృతిక వికాసానికి కృషి చేసిన మహనీయుల్లో మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, అహల్యాబాయి, రాజాబహద్దూర్ వెంకట్రామారెడ్డి, రావి నారాయణరెడ్డి ముఖ్యులు. జాతిని చైతన్యపరిచే లక్ష్యంతోనే మాడపాటి హనుమంతరావు ఆంధ్రోద్యమాన్ని తెలంగాణాలో అంటే అప్పటి నిజాం రాష్ట్రంలో ప్రారంభించాడు.

**ప్రశ్నలు :**

అ) అణచివేతకు గురైన వారెవరు?

ఆ) వాళ్ళు ఏఏ విషయాల్లో అణిచివేతకు గురి అయ్యారు?

ఇ) తెలంగాణలో ఆంధ్రోద్యమం ఎందుకు విస్తరించింది?

ఈ) తెలంగాణ ప్రజల్లో భాషాసంస్కృతులపట్ల అభిమానాన్ని పెంచిన సంస్థలేవి?

ఉ) తెలంగాణలో జాతీయ, సాంస్కృతిక వికాసానికి కృషి చేసిన మహనీయులు ఎవరు?

## III. స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) వెంకట్రావు స్వభావాన్ని తెల్పండి.

ఆ) వెంకట్రావు వంటి యువకుల వల్ల కలిగే ప్రయోజనాలేవి?

ఇ) వెంకట్రావుతో నేటి యువతను పరిశీలించి, పోల్చండి.

ఈ) "మనం ఈ రోజు స్వార్థ రహితంగా, ధైర్యంగా, పట్టుదలతో పనిచేస్తే, మన సంతానం అంతా హాయిగా బతుకుతారు" అని ఒక నాయకుడు ఎందుకు అని ఉంటాడు?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 'చిన్నప్పుడే' కథ ద్వారా ఆనాటి పరిస్థితులు ఎట్లా ఉన్నాయో తెలుసుకున్నారు కదా! నాటి పరిస్థితులు నేటి సమాజంలో కూడ ఉన్నాయా? కారణాలు ఏమిటి?



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

## IV. సృజనాత్మకత / ప్రశంస

1. **కింది అంశాల గురించి సృజనాత్మకంగా రాయండి.**

అ) ఈ పాఠం ఆధారంగా చేసుకొని, మీ అనుభవాలతో ఒక చిన్న కథ రాయండి.

(లేదా)

ఆ) వెంకట్రావువలె గ్రామం బాగుకోసం పాటు పడుతున్న వాళ్ళు నేడు కూడా ఉంటారు. అటువంటి వారి సేవలను ప్రశంసిస్తూ ఒక అభినందన పత్రం రాయండి.

## V. పదజాల వినియోగం

1. **కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు అర్థాలు తెలుసుకొని రాయండి.**

అ) వెంకట్రావుకు పెట్టే దండంలో పెత్తందార్లకు పెట్టే దండంలో తేడా కనిపించింది.

ఆ) ఆ నాయకుడు పిల్లలకు అవ్యాజ బంధువైపోయాడు.

ఇ) సర్కారీ రకం కట్టలేదని ఆ పిల్లవాని తండ్రికి బందలెత్తారు.

ఈ) ఆ బువ్వలోనే మిరం, ఉప్పుపోసుకొని పిల్లవాడు తిన్నాడు.

ఉ) కష్టాల సంగతి నాయనకు ఎరుక.

2. **కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు అదే అర్థం వచ్చే మరి రెండు పదాలను రాయండి.**

ఉదా :- ఊళ్ళోని యువకుడు వెంకట్రావుకు దండం పెట్టాడు.

దండం = నమస్కారం, అంజలి

అ) పిల్లల పట్ల ఆయనకు గల ప్రేమకు విలువ కట్టలేం.

ఆ) పిల్లలు తమ కష్టాలను కుప్పలుగా కురిపించారు.

ఇ) పిల్లలందరూ గభాలున అతని వద్దకు చేరుకున్నారు.

ఈ) నీ చేతులకు వెండి కడియాలున్నాయి.

3. **కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు పాఠం ఆధారంగా ప్రకృతి పదాలు రాయండి.**

అ) నాయకులు ఒకరి మొగం ఒకరు చూసుకున్నారు.

ఆ) అతడు పట్టలేని సంతసం తో పిల్లలను దగ్గరికి తీసుకున్నాడు.

ఇ) మనం ధైర్యంగా కష్టపడి పనిచేస్తే మన పిల్లలు సుకంగా ఉంటారు.

ఈ) గారవం పొందాలంటే మంచి పనులు చేయాలి.

SCERT TELANGANA

## VI. భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది పట్టికలోని ఖాళీలను పూరించండి.**

| సమాసపదం | విగ్రహవాక్యం | సమాసంపేరు |
|---|---|---|
| రాజ్యకాంక్ష | | |
| | విజయం వల్ల గర్వం | |
| అష్టదిక్కులు | | |
| | బలరాముడును, కృష్ణుడును | |
| ప్రజలభాష | | |
| | క్రమము కానిది | |

### ఆమ్రేడిత సంధి

**✷ కింది వాటిని చదువండి.**

ఔరౌర! ఎంత గొప్పపని చేశావు.

ఆహాహా! ఎంతో ఆనందం కలిగించావు.

పై వాక్యాల్లో గీత గీసిన పదాలను విడదీసి రాస్తే

ఔరౌర = ఔర + ఔర

ఆహాహా = ఆహా + ఆహా – అవుతున్నాయి కదా!

ఇక్కడ ఒకే పదం రెండుసార్లు వచ్చింది. అట్లా వచ్చినప్పుడు రెండోసారి వచ్చిన పదాన్ని **'ఆమ్రేడితం'** అంటారు.

పై పదాలను గమనిస్తే...

ఔర = ఔర్ + అ

ఆహా = ఆహ్ + ఆ

ఆ పదాల చివర అచ్చులు కనబడుతున్నాయి. వాటికి ఆమ్రేడితం వచ్చి చేరితే ఏమవుతుందో చూద్దాం.

ఔర + ఔర = ఔరౌర

ఔ (ర్+ అ) = ఔర అని ఉండగా అకారం లోపించి ఔర్ + ఔర అని ఉంటుంది. ఆమ్రేడిత పదంలోని 'ఔ' వచ్చి చేరి 'ఔరౌర' అని అయింది.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

అట్లాగే ఆహా + ఆహా = ఆ (హా + ఆ) + ఆహా = ఆహాహా

దీనివల్ల అచ్చుకు ఆమ్రేడితం పరమైతే సంధి జరుగుతుంది. ఇది **'ఆమ్రేడితసంధి'**.

**"అచ్చునకు ఆమ్రేడితం పరమైతే సంధి తరుచుగానగు."**

**2. కింది పదాలను కలిపి రాయండి.**

అ) అప్పుడు + అప్పుడు = ____________________

ఆ) ఏమి + ఏమి = ____________________

ఇ) ఊరు + ఊరు = ____________________

ఈ) ఇంట + ఇంట = ____________________

ఉ) ఓరి + ఓరి = ____________________

## ద్విరుక్తటకార సంధి

**✷ ఈ కింది పదాలను చదువండి.**

అ) పగలు + పగలు = పట్టపగలు

ఆ) చివర + చివర = చిట్టచివర

పై పదాలు కలిపినప్పుడు ఏం జరిగిందో చెప్పండి.

పగలు + పగలు = పట్టపగలు అవుతోంది. అంటే మొదటి పదంలోని పగలులో 'ప' తర్వాత ఉన్న 'గలు' పోయి దానికి బదులుగా 'ట్ట' వచ్చింది. అప్పుడు పట్టపగలు అయింది. అట్లనే 'చిట్టచివర' పదం కూడ.

**మరికొన్ని ఉదాహరణలు చూద్దాం.**

అ) నడుమ + నడుమ = నట్టనడుమ

ఆ) కొన + కొన = కొట్టకొన

ఇ) కడ + కడ = కట్టకడ

**ద్విరుక్తటకారమనగా 'ట్ట' (ద్విత్వము)**

'ఆమ్రేడితం' పరంగా ఉంటే నడుమ, కొన, కడ మొదలైన శబ్దాలలో మొదటి అచ్చు మీద అన్ని అక్షరాలు పోయి వాటి స్థానంలో 'ట్ట' వస్తుందని చూశాం కదా!

**ఆమ్రేడితం పరమైతే కడాదుల తొలి అచ్చుమీది అన్ని అక్షరాలకు ద్విరుక్తటకారం వస్తుంది.**

తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20



SCERT TELANGANA

**3. కింది పదాలను కలిపి రాయండి. ఏం జరిగిందో చెప్పండి.**

అ) బయలు + బయలు = ____________

ఆ) అంత + అంత = ____________

ఇ) తుద + తుద = ____________

ఈ) ఎన్ని + ఎన్ని = ____________

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ మీ తాత / అమ్మమ్మ / నాయనమ్మలను అడిగి ఒక కథ చెప్పించుకొని వాళ్ళు చెప్పినట్లుగానే రాసి నివేదికను తరగతిలో ప్రదర్శించండి.

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పాఠం ఆధారంగా స్వాతంత్ర్యానికి ముందు, గ్రామాల్లో పరిస్థితి ఎట్లా ఉండేదో మాట్లాడగలను. | అవును / కాదు |
| 2. | అపరిచిత అంశాన్ని అర్థం చేసుకొని జవాబులు రాయగలను. | అవును / కాదు |
| 3. | కథ ఆధారంగా తగిన కారణాలతో నేటి పరిస్థితులను గురించి రాయగలను. | అవును / కాదు |
| 4. | కథను / అభినందన పత్రాన్ని రాయగలను. | అవును / కాదు |



## సూక్తి

ప్రజల యోగక్షేమాల కోసం, ఎంత పెద్ద త్యాగానికైనా వెనుకాడనివాడే నిజమైన ప్రజానాయకుడు.

– నరేంద్ర కోహ్లి

SCERT TELANGANA

౯

# అమరులు

- ఆచార్య కె.రుక్నుద్దీన్

**బొమ్మను చూడండి. ఆలోచించి చెప్పండి.**



**ప్రశ్నలు:**

1. బొమ్మలో ఏం జరుగుతున్నది?
2. స్తూపాలను ఎందుకు కట్టిస్తారు?
3. స్తూపం వద్ద ఎందుకు నివాళులు అర్పిస్తారు?
4. అమరవీరులకు ఎట్లా నివాళులు అర్పించాలో మీకు తెలుసా ?

## పాఠం నేపథ్యం, ఉద్దేశం

*ప్రత్యేక తెలంగాణను కాంక్షిస్తూ 1969లో పెద్దఎత్తున తెలంగాణ ప్రజలు ఉద్యమం చేశారు. నాటి పోరాటంలో 360 మందికి పైగా విద్యార్థులు, యువకులు ప్రాణత్యాగం చేశారు. ఆ అమరవీరులకు ప్రజలు, కవులు, కళాకారులు తమదైన రీతిలో నివాళులు అర్పించారు. ఆచార్య రుక్నుద్దీన్ అమరవీరులకు తన కవిత ద్వారా నివాళులు అర్పించాడు. (1969 సంఘటనకు సంబంధించి అప్పుడు రాసిన కవిత కాబట్టి పాఠంలో "ప్రత్యేక తెలంగాణా బాహాటంగా సాధిస్తాం" అని ఉన్నది. దాన్ని గమనించండి.)*

*తెలంగాణ ఉద్యమంలో నాటి నుండి నేటివరకు అమరులైన వారి త్యాగాలను స్మరించుకోవడమే ఈ పాఠం ఉద్దేశం.*

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'గేయ' ప్రక్రియకు చెందినది.

ఇది జి. యాదగిరి, కె.రుక్నుద్దీన్ రాసిన 'విప్లవ ఢంకా' అనే కవితా సంకలనంలోనిది.

## కవి పరిచయం



02-05-1947

26-05-2013

సామాజికస్పృహ కలిగిన సాహితీవేత్త. ఆచార్య కె.రుక్నుద్దీన్. ఈయన నాగర్‌కర్నూలు జిల్లా రాచూరు గ్రామంలో జన్మించాడు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేశాడు. 'జానపద సాహిత్యంలో అలంకార విధానం'పై పరిశోధన గ్రంథాన్ని రాశాడు. 1969 సం॥లో 'విప్లవఢంకా' మోగించడంతో మొదలైన ఇతని రచనా వ్యాసంగం తుదిశ్వాస వరకు కొనసాగింది. ప్రయాణం, శెలిమె, సూక్తిసుధ, కిన్నెరమెట్లు, మోదుగపూలు, విశ్వదర్శనం వంటి ఉత్తమ రచనలు చేశాడు. ఎన్నో సాహిత్యసంస్థల నుండి పురస్కారాలు అందుకున్నాడు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA





## ప్రవేశిక

వలస పాలనలోని వివక్షపై, తమ ప్రాంత విముక్తి కోసం, స్వపరిపాలన కోసం, సహజవనరుల సంరక్షణ కోసం, తమదైన భాష, సంస్కృతులను కాపాడుకోవటం కోసం తెలంగాణ ప్రజలు ఉద్యమాలు, చేశారు. 1969 ఉద్యమంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయక ఆశయసిద్ధి కొరకు పోరాడి అమరులైన వీరులకు కవి ఎట్లా నివాళులు అర్పించాడో తెలుసుకుందాం.

## I


మాకై అసువులు బాసిన
మాన్యులార ! ధన్యులార !
మాతృభూమి స్వేచ్ఛ కొరకు
బలియయ్యిన ప్రబలులార !

తెలంగాణ గర్భమ్మున
గలిగిన శ్రీ రుద్రులార
జనని, సఖుల, సేవలకై
తను వొడ్డిన ఘనులారా !

సౌహార్దతతోడ నిచ్చు
జోహారులు, జోహారులు
సకలజనుల సమూహములు
సమర్పించు జోహారులు

### ఆలోచించండి–చెప్పండి

- "మాకై అసువులు బాసిన" అనటంలో మాకు అంటే ఎవరు?
- జోహారులు అంటే ఏమిటి? ఎవరికి జోహారులు సమర్పిస్తాం? ఎందుకు సమర్పించాలి?




## II

ఏ తల్లి కడుపు పంటల కొరకో
నీ తల్లి కడుపు మంటల మాడెను
ఏ సతి సౌభాగ్యమ్ముల కొరకో
నీ సతి కుంకుమ గోల్పోయెను

ప్రత్యేక తెలంగాణ కొరకై
ప్రవహించిన నీ రక్తం
పాపాత్ముల పరిపాలన
పటాపంచలౌ పర్యంతం
క్రాంతి విడదు – శాంత పడదు

SCERT TELANGANA



మీ వొక్కొక్క రక్తపు చుక్కే
లావైన విషమ్ముల గ్రక్కే
ఈ వీరుల ఉద్రేకాస్త్రం
ఈ వీరుల ఉద్బోధార్థం

నీ పెట్టిన రక్తపు తిలకం
నా పాలిటి దీక్షా బంధం
అధికారాంధుల పాలిటి
రుధిరసిక్త యమపాశం

### ఆలోచించండి – చెప్పండి

- "కడుపు పంటల – కడుపు మంటల" – దీనిని గురించి మీకేమి అర్థమయింది?
- "పాపాత్ముల పరిపాలన" అని అనడంలో కవి ఉద్దేశం ఏమై ఉంటుంది?

## III

రక్త తర్పణమ్మయినా
రక్తితోడ యిచ్చేస్తాం
మీ యడుగుల జాడల్లో
మాయడుగుల నుంచేస్తాం

అనంతాకాశం
సువిశాల భూవలయం
మధ్యనున్న ఓ సమస్త ప్రాణులారా !
మా ప్రతిన వినుడు

ప్రత్యేక తెలంగాణా
బాహాటంగా సాధిస్తాం !
మృతవీరుల ఆత్మలలో
అమృత వర్షం కురిపిస్తాం

### ఆలోచించండి – చెప్పండి

- "మీ యడుగుజాడల్లో మాయడుగుల నుంచేస్తాం!" – దీనిని మీరెట్లా అర్థం చేసుకున్నారు?
- 'అమృతవర్షం కురిపించడం' అంటే ఏమిటి?

SCERT TELANGANA

## సారాంశం

తెలంగాణ ప్రజలకోసం, మాతృభూమివిముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన ధన్యజీవులారా! మీకు జోహార్లు. వీరులారా! మీ జీవితం తెలంగాణ భూమిపుత్రుల సేవలలోనే తరించింది. ఈ సమాజమంతా మీకు జోహార్లు అర్పిస్తుంది. ఇక్కడి ప్రజల సుఖసంతోషాల కోసం మీరు, మీ కుటుంబసభ్యులు ఎన్నో బాధలను అనుభవించారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పారినరక్తం పాపాత్ములపరిపాలన అంతమయ్యేవరకు విశ్రమించదు. శాంతించదు. మీ ఒక్కొక్క రక్తపుచుక్క తెలంగాణ వ్యతిరేకులపై విషం చిమ్ముతుంది. మీ ఆవేశం ప్రత్యేక తెలంగాణ అవసరాన్ని ప్రతి నిమిషం ప్రబోధిస్తుంది. మీరు ధరించిన రక్తతిలకం మాకు స్ఫూర్తినందిస్తుంది. అది అధికార మదంతో బలిసిన వారికి యమపాశమవుతుంది. మీ అడుగులలో అడుగేస్తూ మా నెత్తురు ధారపోస్తాం. రక్తతర్పణాలను చేస్తాం. నింగి, నేలలో విస్తరించిన సమస్త ప్రాణులారా! మా ప్రతిజ్ఞ వినండి. బాహాటంగానే తెలంగాణను సాధిస్తాం. అమరుల ఆత్మలు శాంతించే విధంగా అమృతవర్షం కురిపిస్తాం.

## ఇవి చేయండి

### I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. **తెలంగాణ రాష్ట్రసాధన కోసం జరిగిన ఉద్యమం గురించి మాట్లాడండి.**

### II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

1. **కింది వాక్యాలు చదువండి. అవి పాఠంలో ఎక్కడున్నాయో గుర్తించి, వాటి సందర్భం రాయండి.**

అ) సకలజనుల సమూహములు.

ఆ) క్రాంతి విడదు - శాంత పడదు.

ఇ) రుధిరసిక్త యమపాశం.

ఈ) అమృతవర్షం కురిపిస్తాం.

2. **కింది పేరాను చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1969 నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం 2009 నాటికి మహోద్యమమయింది. ఈ మలిదశ ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యోగులు, కవులు, కళాకారులు, నాయకులు, పిల్లల నుండి పెద్దల వరకు సకలజనులు పాల్గొన్నారు. ఉద్యమం శాంతియుతంగా నడవాలని ఉద్యమ నాయకత్వం కోరింది. తెలంగాణకై ప్రజలందరు ఆత్మవిశ్వాసంతో పోరాడాలని, అధైర్యంతో బలిదానాలు చేయవద్దని చెప్పింది. ఆ ఉద్యమాల ఫలితంగా 2014 జూన్ 2వ తేదీన తెలంగాణరాష్ట్రం ఆవిర్భవించింది. అమరవీరుల ఆశయం సిద్ధించింది. ప్రభుత్వం ఆధికారికంగా వేడుకలు నిర్వహించింది.



SCERT TELANGANA

తెలంగాణలోని ఆబాలగోపాలం ఘనంగా సంబురాలు జరుపుకున్నది. సాధించిన తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దడానికి అందరం కృషి చేయాలి. అదే మనం అమరవీరులకు ఇచ్చే ఘనమైన నివాళి.

**ప్రశ్నలు :**

అ) తెలంగాణ ఉద్యమం ఎందుకు జరిగింది?

ఆ) ఉద్యమంలో ఎవరెవరు పాల్గొన్నారు?

ఇ) ఉద్యమం పట్ల నాయకత్వానికి ఉన్న ఆలోచన ఏమిటి?

ఈ) ఆబాలగోపాలం అంటే అర్థమేమిటి?

ఉ) అమరవీరులకు మనమిచ్చే నివాళి ఏమిటి?

## III. స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) అమరవీరులను కవి "తెలంగాణ గర్భమ్మున గలిగిన శ్రీ రుద్రులారా!" అని ఎందుకు సంబోధించాడు?

ఆ) అమరవీరుల పట్ల మనమెట్లాంటి గౌరవాన్ని చూపాలి?

ఇ) అధికారాంధుల ప్రవర్తన ఎట్లా ఉంటుంది?

ఈ) కవి ప్రతిజ్ఞలోని విషయాన్ని మీరెట్లా అర్థం చేసుకున్నారు?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) కవి నాడు చేసిన ప్రతిజ్ఞ నేడు సాకారమైంది కదా! దీనికి పాటుబడిన వారిని గురించి వివరించండి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

**1. కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

అ) ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి త్యాగాన్ని గురించి ఒక కవిత/గేయం రాయండి.

## V. పదజాల వినియోగం

**1. కింది పదాలకు పర్యాయపదాలు (అదే అర్థం వచ్చే పదాలను) రాయండి.**

అ) సమూహం = ____________ ____________

ఆ) అసువులు = ____________ ____________

ఇ) స్వేచ్ఛ = ____________ ____________

ఈ) సఖులు = ____________ ____________



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

2. **కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు గల నానార్థాలు (వేరు వేరు అర్థాలు) రాయండి.**


అ) ఈ వర్షంలో కురిసిన పెద్ద వర్షం ఇది.

జ. ______________ ______________

ఆ) అమృతంతో పాయసం చేశారు. అమృతంతో చేతులు కడిగారు.

జ. ______________ ______________

3. **కింది వృత్తంలోగల ప్రకృతి, వికృతి పదాలను గుర్తించి రాయండి.**




| ప్రకృతి | – | వికృతి |
|---|---|---|
| ______________ | | ______________ |
| ______________ | | ______________ |
| ______________ | | ______________ |
| ______________ | | ______________ |

## VI. భాషను గురించి తెలుసుకుందాం

### సంధులు

1. **కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.**

అ) ఉద్రేకాస్త్రం = ____________ + ____________ = ______________

ఆ) మొట్టమొదలు = ____________ + ____________ = ______________

ఇ) లావైన = ____________ + ____________ = ______________

ఈ) అనంతాకాశం = ____________ + ____________ = ______________

ఉ) ఒక్కొక్క = ____________ + ____________ = ______________

### ఉపమాలంకారం

✷ **కింది వాక్యాలను చదువండి. తేడా చెప్పండి.**

ఆమె ముఖం అందంగా ఉన్నది.

ఆమె ముఖం చంద్రబింబం వలె అందంగా ఉన్నది.

పై వాక్యాల్లోని తేడాను చూస్తే 'ఆమె ముఖం అందంగా ఉన్నది' అనే దానికి బదులు 'ఆమె ముఖం చంద్రబింబం వలె అందంగా ఉన్నది' అనే వాక్యం బాగా ఆకట్టుకుంటుంది కదా! ఇట్లా ఆకట్టుకునేటట్లు చెప్పడానికి చంద్రబింబం అనే పోలికను తీసుకున్నాం. ఇట్లా చక్కని పోలికతో చెప్పడాన్నే **'ఉపమాలంకారం'** అంటాం. పై వాక్యాన్నిబట్టి చూస్తే ఉపమాలంకారంలో నాలుగు అంశాలను గమనించవచ్చు. అవి :



SCERT TELANGANA

1) **ఉపమేయం** - దేనిని లేక ఎవరిని పోలుస్తున్నామో తెలిపేది. (ఆమె ముఖం - ఉపమేయం)

2) **ఉపమానం** - దేనితో లేక ఎవరితో పోలుస్తున్నామో తెలిపేది. (చంద్రబింబం - ఉపమానం).

3) **సమానధర్మం** - ఉపమేయ, ఉపమానాల్లో ఉండే ఒకే విధమైన ధర్మం. (అందంగా ఉండడం - సమానధర్మం).

4) **ఉపమావాచకం** - పోలికను తెలిపే పదం. (వలె - ఉపమావాచకం)

**ఉపమాన, ఉపమేయాలకు చక్కని పోలిక చెప్పడమే ఉపమాలంకారం.**

**2. కింది ఉదాహరణలు చదువండి. దేనిని దేనితో పోల్చారో, వాటిలోని సమానధర్మం ఏమిటో చెప్పండి.**

అ) ఏకలవ్యుడు అర్జునుడి వలె గురితప్పని విలుకాడు.

ఆ) తోటలో పిల్లలు సీతాకోకచిలుకల్లాగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- తెలంగాణ ఉద్యమం సందర్భంగా వచ్చిన పాటలను లేదా ఉద్యమకాలంలో జరిగిన ఒక కార్యక్రమం గురించి వివరాలు సేకరించి నివేదిక రాయండి. తరగతిలో ప్రదర్శించండి.

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడగలను. | అవును / కాదు |
| 2. | భావాలకు సరిపోయే గేయపాదాలను గుర్తించి సందర్భం రాయగలను. | అవును / కాదు |
| 3. | తెలంగాణ రాష్ట్రసాధనకై పాటుబడిన వారిని గురించి వివరిస్తూ రాయగలను. | అవును / కాదు |
| 4. | అమరవీరులపై కవిత / గేయం రాయగలను. | అవును / కాదు |



**సూక్తి** "ఎంతకాలం జీవించామన్నది కాదు. ఏమి సాధించామన్నది, ఎందరి హృదయాలలో చోటు సంపాదించుకున్నామన్నది ముఖ్యం." - భగత్‌సింగ్

SCERT TELANGANA

# 10 సింగరేణి

**బొమ్మను చూడండి. ఆలోచించి చెప్పండి.**



**ప్రశ్నలు:**

1. చిత్రంలో కనపడుతున్నవాళ్ళు ఏం పనులు చేస్తున్నారు?
2. చిత్రంలో ఏయే వస్తువులు కనపడుతున్నాయి?
3. చిత్రం దేనికి సంబంధించిందని మీరు అనుకొంటున్నారు?
4. తెలంగాణలో బొగ్గు గనులు ఏ ఏ జిల్లాలలో ఉన్నాయి?
5. నేల బొగ్గువల్ల ఉపయోగాలేవి?

**పాఠం ఉద్దేశం**

ఏ దేశం తన సహజసంపదను సమర్థంగా వినియోగించుకోగలుగుతుందో ఆ దేశం అభివృద్ధి దిశలో పయనిస్తుంది. మన దేశం సకలసంపదలకు నిలయం. ఇక్కడి నేలల్లో అపారమైన ఖనిజ సంపద దాగి ఉన్నది. ప్రత్యేకంగా మన తెలంగాణ ప్రాంతంలోని సింగరేణి బొగ్గుగనులు దేశంలోనే ప్రసిద్ధిపొందాయి. దేశ ప్రగతికి దోహదపడే 'సింగరేణి గనుల' గురించి తెలియజేయటమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం వ్యాసప్రక్రియకు చెందినది.

సింగరేణి బొగ్గు గనులు, బొగ్గు ఉత్పత్తి గురించి సమాచారాన్ని తెలిపే వ్యాసం.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.



## ప్రవేశిక

**ఒకదేశ పారిశ్రామిక పురోగమనానికి, ఆర్థిక పుష్టికి అతి ప్రధానమైన వనరుల్లో బొగ్గు ఒకటి. తెలంగాణ రాష్ట్రంలో బొగ్గు ఉత్పత్తిలో 'సింగరేణి కాలరీస్' ప్రధాన భూమికను పోషిస్తున్నది.**

**"శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని" శ్రీశ్రీ అన్నాడు. ఆధునిక ప్రపంచంలో కార్మికులపాత్ర అమోఘమైనది. బొగ్గు ఉత్పత్తిలో కార్మికులశ్రమ వెలకట్టలేనిది. ప్రతిరోజూ పొంచిఉన్న ప్రమాదాలను కూడా లెక్కచేయకుండా... గనుల్లో పనిచేస్తూ... తమ స్వేదాన్ని శక్తిగా మార్చి నేలబొగ్గును వెలికి తీస్తున్న సింగరేణి కార్మికుల జీవితాలను ఆవిష్కరించే విషయాన్ని ఈ పాఠంలో చదువుదాం.**



SCERT TELANGANA

## I

శ్రమలేకుండ సుఖం లేదు. సుఖానికి మూలం శ్రమ. "శ్రమజీవే జగతికి మూలం... చెమటోడ్చక జరుగదు కాలం" అన్నారు పెద్దలు. జీవితం సుఖమయం కావాలంటే అందరి అవసరాలు తీరాలి. అందరికి సౌకర్యాలు కల్పించాలి. సౌకర్యాలు కావాలంటే ఉత్పత్తులు పెరగాలి.

ఉత్పత్తి చేయాలంటే ఏం అవసరం? ముడిపదార్థం, మానవవనరులు, ఆర్థిక వనరులు, చిన్నవో పెద్దవో పరిశ్రమలు కావాలి. ఈ పరిశ్రమలు నడువాలంటే ఏం కావాలి? ఆనాడు అన్ని యంత్రాలు నడవటానికి ప్రధాన ఇంధనంగా బొగ్గునే ఉపయోగించేవారు. ఆ తర్వాత జరిగిన ఎన్నో పరిశోధనల వల్ల విద్యుచ్ఛక్తి కనిపెట్టడం జరిగింది. విద్యుత్తును ఉత్పత్తి చేయటానికి కూడ బొగ్గే అవసరమయ్యింది. బొగ్గుతోనే ఈ రోజు దేశంలో ఎన్నో పరిశ్రమలు నడుస్తున్నాయి.

గోదావరి నది పరీవాహక ప్రాంతమంతా దట్టమైన అడవులతో నిండి ఉండేది. రెండువందల మిలియన్ సంవత్సరాలకు పూర్వం అడవులు తగలబడి భూమి మీదున్న అవశేషాలు క్రమక్రమంగా భూమిలోనికి కూరుకుపోయి, వాటి మీద మన్ను, రాళ్ళు పడి లోపలికి కుదించబడి అవి బొగ్గుపొరలుగా ఏర్పడినాయని చెప్పవచ్చు. ఇట్లా ఏర్పడ్డ బొగ్గునే మనం తవ్వి తీస్తున్నాం. దీన్నే 'నేలబొగ్గు', 'నల్లబంగారం' అంటున్నాం. అత్యంత శక్తినిచ్చే ఈ బొగ్గే ఇంధనంగా మారి పరిశ్రమలకు మూలాధారమయ్యింది. రోడ్లు వేయడానికి ఉపయోగించే డాంబరు (తారు)ను, ప్లాస్టిక్‌ను, మనం రోజూ తలకు పూసుకునే సువాసన నూనెలను, బట్టల అద్దకాలకు వేసుకునే రంగులను ఈ బొగ్గునుండే తయారుచేసుకుంటున్నామంటే ఆశ్చర్యం కలుగుతున్నది కదా! అన్నిటి కంటే ముఖ్యంగా ఇప్పుడు మనం పంట పొలాలకు వేస్తున్న రసాయనిక ఎరువులు కూడా ఈ నేలబొగ్గునుండే తయారవుతున్నాయి తెలుసా?

ఒక దేశం తనకున్న సహజవనరులను ఎంత విరివిగా ఉపయోగించుకుంటే ఆ దేశం అంత వేగంగా అభివృద్ధి చెందుతుంది. పారిశ్రామిక ఉత్పత్తుల్లో అత్యంత శక్తినివ్వగల మహత్తు ఈ నేల బొగ్గుకున్నది. ప్రకృతి ప్రసాదించిన సహజసంపదను వినియోగించుకొనే విజ్ఞానం పైననే మానవనాగరికత నిర్మించబడుతున్నది. కనుక ఎన్నోరకాల ఉపయోగాలను కలిగి ఉన్న ఈ నేలబొగ్గును తవ్వి తీయటానికి అత్యంత శ్రద్ధాసక్తులను చూపించారు.

మనదేశంలో వ్యవసాయం మాదిరిగా సామాజిక జీవితంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్న పరిశ్రమల్లో సింగరేణి ఒకటి. మొత్తం దక్షిణ భారతదేశంలో బొగ్గు ఉత్పత్తిచేసే ఏకైక కంపెనీగా తెలంగాణలో సింగరేణికి విశిష్టత ఉన్నది.

అందుకే...

"సిరివెలుగులు విరజిమ్మే సింగరేణి బంగారం
అణువణువున ఖనిజాలే నీ తనువుకు సింగారం" అన్నారు.

సింగరేణి బొగ్గు గనులకు సంబంధించిన అనేక విషయాలు చాలా మందికి తెలియవు. విస్తారమైన బొగ్గు నిక్షేపాలకు నిలయమైన తెలంగాణలో గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం వల్లనే, వారి సామాజిక, ఆర్థిక, స్థితిగతుల్లో అనూహ్యమైన మార్పును తీసుకువచ్చింది. ఇక్కడ దొరుకుతున్న బొగ్గు 'జాతి' సంపదై ప్రపంచ ఖ్యాతిని పొందిందని చెప్పవచ్చు.

**ఆలోచించండి - చెప్పండి**

- 'శ్రమజీవే జగతికి మూలం... చెమటోడ్చక జరుగదు కాలం' అన్న వాక్యాన్ని ఏవిధంగా అర్థం చేసుకున్నారు?
- నేలబొగ్గును 'నల్ల బంగారం' అని ఎందుకంటారు?
- 'సహజసంపదను వినియోగించుకొనే విజ్ఞానం పైననే మానవ నాగరికత నిర్మించబడుతున్నది' చర్చించండి.

## II

దేశంలో మరే ఇతర బొగ్గు సంస్థకు లేని ప్రత్యేకత 'సింగరేణి గనుల' కు ఉన్నది. ఇటువంటి సంస్థ గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలను తెలుసుకుందాం...


1841వ సంవత్సరంలో ఖమ్మం జిల్లాలోని ఇల్లందు గ్రామానికి చెందిన గ్రామస్థులు కొందరు భూమిని తవ్వుతుండగా ఈ 'బొగ్గు బయటపడింది. అప్పటి వరకు అటువంటిది ఎవరూ చూసిఉండకపోవటంతో వాళ్ళు ఆశ్చర్యపోయారు.

SCERT TELANGANA

ఈ విషయం తెలుసుకున్న భారత ప్రభుత్వానికి చెందిన భూగర్భ పరిశోధన శాఖ ఇక్కడ పరిశోధనలు మొదలుపెట్టింది. కాని ఆ బొగ్గు అంత శ్రేష్ఠమైనది కాదని బొగ్గు తవ్వకాలను చేపట్టలేదు.

అప్పటి ప్రయత్నాల ఆధారంగా 1871లో డాక్టర్ కింగ్ అనే మరో భూగర్భ ఖనిజ పరిశోధకుడు 'ఇల్లందు' గ్రామ పరిసరాల్లో శ్రేష్ఠమైన బొగ్గు ఉన్నట్లు గుర్తించాడు. అది భూమిలోపల ఆరు పొరల్లో నిక్షిప్తమై ఉన్నదని వెల్లడించాడు.

1886లో హైదరాబాద్ దక్కన్ కంపెనీ లిమిటెడ్ సంస్థవాళ్ళు ఇల్లందులో మొదటి భూగర్భ గనిని ప్రారంభించారు. గనిలోని కింది బొగ్గు పొరకు 'కింగ్‌సీమ్' అని, పై బొగ్గుపొరకు క్వీన్‌సీమ్ అని పేరు పెట్టినారు. ఇక్కడ ఉత్పత్తి చేస్తున్న బొగ్గును రవాణాచేయడానికి డోర్నకల్ నుండి ఖాజీపేటకు బ్రాంచి రైల్వేలైను వేసి దానికి 'సింగరేణి కాలరీస్' అని పేరు పెట్టారు.



1921లో 'హైదరాబాద్ దక్కన్ కంపెనీ లిమిటెడ్' సంస్థ 'సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌గా' పేరు మార్చుకున్నది. అప్పటినుండి 'సింగరేణి కాలరీస్'గా స్థిరపడింది. 1928వ సంవత్సరంలో ఆదిలాబాద్ జిల్లాలోని తాండూర్ ప్రాంతంలో మోర్గన్స్, 2వ ఇంక్లయిన్, శాంతిఖని, కళ్యాణిఖని, గనులను ప్రారంభించారు. అంతేగాకుండా కరీంనగర్, వరంగల్లు, ఖమ్మం జిల్లాల నుండి ప్రవహిస్తున్న గోదావరినది



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

పరీవాహక ప్రాంతంలోనే నేలబొగ్గు నిక్షేపాలు విస్తారంగా ఉండటంతో ఇక్కడే గనులు ఏర్పాటుచేసి, బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించారు.

థర్మల్‌విద్యుత్ ఉత్పత్తికి తప్పనిసరిగా అవసరమైన బొగ్గు, నీరు, భూమి, పని చేయటానికి అవసరమైన మానవ వనరులు లభించే ప్రాంతాలలో దేశంలోనే తెలంగాణప్రాంతం అతి ముఖ్యమైనది. అత్యంత కష్టమైన ఈ పనులను చేయటానికి బతుకుపోరాటానికి సిద్ధమై "బుక్కెడు బువ్వకోసం' తెలంగాణ పల్లెల నుండి వెనుకబడిన వర్గాలు, రైతు కూలీలకు చెందిన కుటుంబాలు బొగ్గుగనుల ప్రాంతాలకు వలస వచ్చాయి.

**ఆలోచించండి - చెప్పండి**

- 'దేశంలో మరే ఇతర బొగ్గు సంస్థకు లేని ప్రత్యేకత సింగరేణి గనులకు ఉన్నది' ఎందుకో చర్చించండి.
- 'బొగ్గు ఉత్పత్తిలో కార్మికుడే అత్యంత కీలకమైన పనిముట్టు' అని ఎందుకన్నారు?

ఆనాడు గనుల్లో పని చేయటానికి బరువులు మోయటం, గుంజీలు తీయటం, పరుగుల పోటీలు పెట్టి సాదాసీదా పరీక్షలతో చదువురాని ఎంతో మందిని పెద్ద సంఖ్యలో సింగరేణి కార్మికులుగా తీసుకునేటోళ్ళు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో ముఖ్యమైన పాత్రను పోషించే కార్మికులందరు, తెలంగాణ పల్లెప్రాంతాలకు చెందినవాళ్ళే. అయితే సింగరేణి ఏర్పడిన మొదటి రోజుల్లో గనుల్లో పనిచేయటానికి ఎక్కువ మంది ఇష్టపడేటోళ్ళు కాదు. గనుల్లో పనిచేయటమంటే ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవటమేనని అనుకునేవాళ్ళు. ఆనాడు యాజమాన్యం కార్మికులు పనిచేసే స్థలాల్లో రక్షణ గురించి శ్రద్ధ చూపేదికాదు. దానికి తోడు జీతాలు తక్కువగా ఇచ్చేటోళ్ళు. బతుకుతెరువులేనోళ్ళు మాత్రమే ఈ పనికి వచ్చేటోళ్ళు. బొగ్గు ఉత్పత్తిలో కార్మికుడే అత్యంత కీలకమైన పనిముట్టు. ఇక్కడి కార్మికులు బొగ్గుగనులను 'బొగ్గుబాయి'గా పిలుచుకుంటారు. బొగ్గు బావుల్లో కార్మికులు మూడు "బదిలీ"ల్లో పనిచేస్తరు. బదిలీ అంటే 'షిఫ్టు' అన్నమాట.

## III

కోడికూతకు ముందే నిద్రలేచి, తయారై గనిలోనికి పోయేవాళ్ళు కొందరు, పగలు మూడు గంటలకు పోయేవాళ్ళు మరికొందరు, నడిరాత్రి పనికి పోయేవాళ్ళు ఇంకొందరు. ఇట్లా పొద్దున ఏడుగంటలకు, పగలు మూడుగంటలకు, రాత్రి పదకొండుగంటలకు మూడు షిఫ్టుల్లో గనుల్లో పనిచేస్తారు. గనిలోనికి పోయేముందు కార్మికులు 'మస్టర్' వేసుకుంటారు. మస్టర్ అంటే హాజరన్నమాట. తర్వాత ఓర్‌మెన్ కార్మికులందరికి ఎవరెవరు ఏమేమి పనులు చేయాల్నో చెప్పి పనిని విభజిస్తాడన్నమాట. తర్వాత కార్మికులు గనిలోపల పనిచేయటానికి అనుకూలమైన పొట్టినిక్కర్, కాళ్ళకు దెబ్బలు తగుల కుండా బూట్లు, నెత్తిపైన లైటుతో ఉన్నటోపిని పెట్టుకుంటారు. లైటుకు నడుముకున్న బ్యాటరీకి కనెక్షన్ ఉంటుంది. ఈ లైటు సహాయంతో అన్ని రకాల పనులు చేసే కార్మికులు గనిలో మైళ్ళ దూరం నడిచి పని ప్రదేశానికి చేరుకుంటారు. సర్దార్ పని ప్రదేశాన్ని పరిశీలించి, టింబర్ మెన్‌లకు చేయవలసిన పనులను వివరిస్తాడు. కోల్‌కట్టర్ ఉళ్ళు కోసి మందుపాతరలను పెడతాడు. తర్వాత షార్ట్‌ఫైర్ మెన్ వాటిని పేలుస్తాడు. ఆ తర్వాత సర్దారు ఆ ప్రాంతాన్ని, పై కప్పును పరిశీలిస్తాడు. పైకప్పు కూలకుండా, ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడుతాడు. కోల్ ఫిల్లర్‌లు చెమ్మస్‌తో బొగ్గును తట్టల్లో ఎత్తి టబ్బులు నింపుతారు. టబ్బులన్ని నిండిన తర్వాత రోప్ సహాయంతో 'హాలర్' వాటిని పైకి చేరుస్తాడు.

ఇట్లా సేఫ్టీ అధికారి, అండర్‌మేనేజర్, సర్వేయర్, చైన్‌మెన్, ఓర్‌మెన్, సర్దార్ (మొకద్దం), షార్ట్‌ఫైర్, కోల్‌కట్టర్, టింబర్ మెన్, లైన్‌మెన్, ట్రామర్, హాలర్, కోల్‌ఫిల్లర్, జనరల్ మజ్దూరులు అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే బొగ్గును తవ్వి తీయడం సాధ్యమవుతుంది.

అత్యంత కష్టమైన ఈ పనిని చేయటానికి కార్మికులు కాలినడకన మైళ్ళ దూరం నడుస్తారు. గాలి, వెలుతురూ సరిగ్గాలేని, చీకటిలో ఊపిరాడని స్థితిలో పనిచేయటం ఎంతో సాహసంతో కూడుకున్నది. సింగరేణి మనుగడకు మూలస్తంభమైన కార్మికులు బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి పాట్లు పడుతున్నరో ఒక సింగరేణి గని కార్మికుడు రాసిన ఈ పాటను ఒకసారి చూడండి.

ఏయ్! సీది బాదే...

బత్తి లగే బాజూక్ రహనా...

ఏయ్ఁ... సిక్ట్సీ ఫైవ్ లెవెల్...

ఫార్టీ ఫైవ్ డీప్...

ఏ సీది బాదే...

పల్లవి : దెబ్బగొట్టిండు షార్టు ఫైరన్న
తట్ట చెమ్మసెత్తు లాడీసన్న
ప్రాణాలు కాపాడె టింబరింగన్న
దాటుపెట్టన్న... దిమ్మకట్టన్న ॥ దెబ్బ ॥

చరణం : టబ్బెనక టబ్బుపెట్టన్న... ఓ(ట్రామరన్నా...

మెల్లంగ టబ్బు నింపన్న... ఓ ఫిల్లరన్నా...

సక్కంగ బర్తి గుంజన్న... ఓహాలరన్నా

అంటూ అడుగడుగున ప్రాణాలరచేతిలో పెట్టుకొని పనిచేస్తుంటరు కార్మికులు.

"బాధలెన్నోపడి బర్తి నింపాము
సల్లంగ మా బర్తి బ్యాంకు చేర్చన్నా" అని

కోరుకుంటారు. పని పూర్తికాగానే 'హమ్మయ్య' ఈ రోజు గడిచింది. అనుకుంటారు.

**ఆలోచించండి - చెప్పండి**

- 'గడియారం ముండ్లవలె పనిచేస్తున్న కార్మికులు' అన్న వాక్యాన్ని మీరెట్లా అర్థం చేసుకున్నారు?
- ప్రమాదాల అంచున నిలబడి పనిచేయటం అంటే ఏమిటి?

'రేయనక పగలనక' గడియారం ముండ్లవలె భూమిపొరల్లో పనిచేస్తున్న కార్మికులు శక్తికి మించి పని చేస్తారు. వారి శ్రమ వెలకట్టలేనిది. ప్రాణాలను పణంగాపెట్టి, రక్తమాంసాలు రంగరించి, బొగ్గుకుప్పల్లో మసిబారుతూ పనిచేస్తున్న కార్మికలోకానికి ఈ దేశం ఎంతో ఋణపడి ఉన్నది. ఎన్నో కష్టనష్టాల కోర్చుకొని పనిచేసే కార్మికుల జీవితాలు మొదట్లో ఎంతో దుర్భరంగా ఉండేవి. వచ్చే జీతాలతో కడుపునిండా తిండి దొరికేదికాదు. బొగ్గుతో కరెంటుత్పత్తి చేసే కార్మికుల ఇండ్లల్లో వెలుగులుండేవి కావు. గనుల్లోపల గాలి, వెలుతురు లేని కారణంగా ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తడం, తరచూ అనారోగ్యం బారిన పడటం జరిగేది. ఎప్పుడు ఏ మూల కూలిపడుతుందో... ఏప్రమాదం ఎక్కడ పొంచి ఉందో చెప్పలేని స్థితి ఉంటుంది గనిలో. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలకు ముప్పుతప్పదు. ప్రతిక్షణం కార్మికులు ప్రమాదాల అంచున నిలబడి మృత్యువుతో పోరాటం చేస్తుంటారు. మొక్కవోని ధైర్యంతో ఎన్నో ప్రయాసలకోర్చి కార్మికులు ఉత్పత్తి చేస్తున్న ఈ బొగ్గుతోనే పరిశ్రమలెన్నో నడుస్తున్నాయి. ఆరోగ్యం కోసం, జీతభత్యాలకోసం కార్మికులు దశాబ్దాల పాటు ఎన్నో పోరాటాలు చేయవలసి వచ్చింది. ఈ ఉద్యమాల ఫలితంగానే మెరుగైన జీతాలు, రక్షణ చర్యలు, కార్మికుల కుటుంబాల సంక్షేమానికి చర్యలు సాధ్యమైనాయి. అంతేకాకుండా సింగరేణి కార్మికులు రాజకీయంగా, సామాజికంగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యమాల్లో పాల్గొని తెలంగాణ సాధనకు వారి వంతు సహకారాన్ని అందించారు.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20
SCERT TELANGANA

ఇక్కడ దొరుకుతున్న బొగ్గు ఎంతో శ్రేష్ఠమైనది. ఈ బొగ్గుతో భారతదేశంలోని పవర్‌హౌజ్‌లు, సిమెంటు కర్మాగారాలు, ఇనుము, ఉక్కు కర్మాగారాలు మొదలగు ఎన్నో పరిశ్రమలు నడుస్తుండటం మనం చూడవచ్చు. దీనికి ప్రస్తుతం రామగుండంలో నడుస్తున్న ఎన్.టి.పి.సి.ని ఉదాహరణగా చెప్పవచ్చు. ఎన్నో వేల మందితో నడుస్తున్న "సింగరేణి కాలరీస్" తెలంగాణకే తలమానికమని సగర్వంగా చాటి చెప్పవచ్చు.

ఇన్ని అద్భుతాలను సృష్టిస్తున్న సింగరేణి కార్మికులు, నల్లబంగారమైన నేలబొగ్గును ఉత్పత్తి చేస్తూ... తెలంగాణ అభివృద్ధికే కాక దేశాభివృద్ధికి కూడా తోడ్పడుతున్నారు. వెలుగులను విరజిమ్మే సింగరేణితో తెలంగాణ బంగారుమయం కావాలి. ఆర్థిక ప్రగతిని సాధించాలి. సిరుల మాగాణి అయిన సింగరేణి నూతన సంస్కరణలతో అభివృద్ధిని సాధించాలి. అందరు సుఖంగా బతకాలి.

## మీకు తెలుసా?

**బొగ్గుబావుల్లో పని చేసే సిబ్బంది చేసే పనుల వివరాలు.**

| | | |
|---|---|---|
| మేనేజర్ | – | సంబంధిత గనికి అధికారి. |
| సేఫ్టీ ఆఫీసర్ | – | గనికి సంబంధించిన రక్షణ బాధ్యతలు చూసుకునే అధికారి. |
| అండర్ మేనేజర్ | – | బదిలీ అధికారి (షిఫ్టు అధికారి) (బొగ్గు గనులు మూడు షిఫ్టులు పనిచేస్తాయి. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి) |
| సర్వేయర్ | – | బొగ్గు నిక్షేపాలున్న మార్గాన్ని సూచించే అధికారి. |
| ఓర్‌మెన్ | – | పనిస్థలాన్ని పరిశీలిస్తాడు (పనులను పర్యవేక్షిస్తాడు) సర్దారులకు పై అధికారి. |
| సర్దార్ (మొకద్దం) | – | గనిరక్షణ చూస్తాడు, ప్రమాదాలను పసిగట్టి హెచ్చరిస్తాడు. |
| షార్ట్‌ఫైర్ | – | బొగ్గు నిక్షేపాలను మందుపాతరతో పేల్చుతాడు. |
| కోల్‌కట్టర్ | – | ఉళ్ళు కోసే పని చూస్తాడు. లూజుగా ఉన్న బొగ్గను కూల్చేస్తాడు. |
| టింబర్‌మెన్ | – | పైకప్పుకు బోల్టులు వేస్తాడు. |
| ట్రాక్‌రిపేరర్ | – | టబ్బులు ప్రయాణించే ట్రాక్‌లను నిరంతరం పరిశీలిస్తూ ఉంటాడు. వాటి పక్కన ఉన్న రెయిల్స్‌ను గమనిస్తూ ఉంటాడు. |
| ట్రామర్ | – | హాలర్ టబ్బుల లాగే ప్రక్రియలో సిగ్నల్ ఇస్తాడు. |
| హాలర్ | – | రోప్‌తో టబ్బులను నడిపిస్తాడు. |
| జనరల్ మజ్దూర్ | – | సాధారణమైన కార్మికుడు. అన్ని పనులను చేస్తాడు. |
| రోప్ లేజర్ | – | బర్తీ తాడును పరిశీలించేవాడు. |
| పంపు ఆపరేటర్ | – | నీళ్ళు తోడే పనులు చూస్తుంటాడు. |
| కోల్ ఫిల్లర్ | – | బొగ్గును తట్టల్లో ఎత్తి టబ్బులు నింపుతారు. |
| ఎలక్ట్రీషన్ | – | విద్యుత్ పనులు చూస్తాడు. |
| ఫిట్టర్ | – | మిషనరీ పనులు చేస్తుంటాడు. |
| ఎన్.టి.పి.సి. | – | నేషనల్ థర్మల్ పవర్ స్టేషన్. ఇది కరీంనగర్ జిల్లా రామగుండంలో ఉన్నది. |

(గనిలో నుండి బొగ్గు బయటకు రావడం కోసం పైన తెలిపిన అందరు అత్యంత సమన్వయంతో రక్షణ సూత్రాలు పాటిస్తూ పనిచేస్తారు.)

# ఇవి చేయండి

## I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

**1. సింగరేణి కార్మికులు కాయకష్టం చేసి బొగ్గు తీస్తున్నారు కదా! కార్మికుల జీవితాల గురించి మీకేం అర్థమయిందో చెప్పండి.**

## II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. కింది గేయాన్ని చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఇష్టదేవతకు దండంపెట్టి
గనిలోనికి నువు అడుగుబెట్టి
బళ్ళున బొగ్గు కూలుత ఉంటే
ప్రాణాలకు వెనుకాడక నువ్వు

రక్తమాంసాలు చెమటగ మార్చి
టబ్బుల్లోన బొగ్గు నింపుతవ్
జాతికి వెలుగులు అందిస్తుంటవు
'నల్లసూర్యుని'వై వెలుగొందుతవు.

ప్రశ్నలు :

అ) గేయం ఎవరిని గురించి తెలుపుతుంది?

ఆ) ఇష్టదేవతకు ఎందుకు దండంపెడతారు?

ఇ) కార్మికుడిని 'నల్లసూర్యుడు' అని ఎందుకన్నారు?

ఈ) జాతికి వెలుగు అందించడమంటే ఏమిటి?

ఉ) తెలంగాణలో బొగ్గుగనులు ఎక్కడున్నాయి?

**2. కింది పేరాను చదువండి. అయిదు ప్రశ్నలను తయారుచేయండి.**

తెలంగాణ 'బట్టల అద్దకం' విషయంలో అనాదిగా ప్రాముఖ్యత వహించిన ప్రదేశం. ఒకప్పుడు ఆ పరిశ్రమ ఉన్నతదశలో ఉండేది. కాని దేశంలో వచ్చిన ఆర్థిక చిక్కులు ఈ పరిశ్రమను కష్టనష్టాలకు గురి చేశాయి. విదేశాలలో యంత్రాలపై తయారైన బట్టలకు అలవాటుపడిన ఈనాటి వారికి మన చేతి పనుల వలన తయారయ్యే సుందర వస్త్రాల గురించి నేటికైనా కనువిప్పు కలిగింది.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

అ) ______________________________

ఆ) ______________________________

ఇ) ______________________________

ఈ) ______________________________

ఉ) ______________________________

## III. స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) సహజసంపదలను వినియోగించుకునే విజ్ఞానం పైన మానవ నాగరికత నిర్మించబడుతుందని ఎట్లా చెప్పగలవు?

ఆ) 'బుక్కెడు బువ్వకోసం బతుకు పోరాటానికి సిద్ధమైనారు' దీనిని మీరెట్లా అర్థం చేసుకున్నారో తెల్పండి.

ఇ) పగలు, రేయి తేడా లేకుండా గడియారం ముండ్లవలె పని చేయటం అంటే ఏమిటి? కార్మికుల పనితో అన్వయించి రాయండి.

ఈ) డాక్టర్ కింగ్ పరిశోధనల వల్ల కల్గిన మేలు ఏమిటి?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) సింగరేణి కార్మికులతో ప్రత్యక్ష సంబంధం మనకు లేకపోవచ్చు. కానీ పరోక్ష సంబంధం ఉన్నది. ఎట్లాగో వివరించండి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

**1. కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

అ) సింగరేణి కార్మికులు గనిలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలుపుతూ ఒక పోస్టరు తయారుచేయండి.

(లేదా)

సింగరేణి గనులు / కార్మికుల గురించి ఒక పాట రాయండి.

## V. పదజాల వినియోగం

**1. కింద ఇచ్చిన జాతీయాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

ఉదా: కోడికూత

పల్లె ప్రజలు కోడికూత కు ముందే లేచి పనులు మొదలుపెడతారు.

అ) చెమటోడ్చు ఆ) మూలస్తంభం ఇ) బతుకుపోరు

ఈ) మసిబారు ఉ) తలమానికం



SCERT TELANGANA

2. కింద ఇవ్వబడిన పదాలకు పట్టికలోని పదాల సహాయంతో పర్యాయపదాలు రాయండి.

| | | | |
|---|---|---|---|
| శరీరం | పుడమి | నిశీథిని | సుగంధం |
| సౌరభం | రాత్రి | వసుధ | మేను |
| ధరణి | దేహం | యామిని | పరిమళం |

అ) తనువు = ____________ ____________ ____________

ఆ) భూమి = ____________ ____________ ____________

ఇ) రేయి = ____________ ____________ ____________

ఈ) సువాసన = ____________ ____________ ____________

3. కింది పదాలకు పాఠం ఆధారంగా ప్రకృతి, వికృతులను రాయండి.

అ) అచ్చెరువు ఆ) ఖని ఇ) జంత్రము ఈ) ప్రాణం

## VI. భాషను గురించి తెలుసుకుందాం

1. కింది విడదీసిన పదాలను కలిపి రాయండి. సంధిపేరు రాయండి.

అ) కావాలి + అంటే = ____________, ____________

ఆ) మూల + ఆధారం = ____________, ____________

ఇ) ప్రాంతము + అంతా = ____________, ____________

ఈ) ఎప్పుడు + ఎప్పుడు = ____________, ____________

ఉ) మహా + ఉద్యమం = ____________, ____________

2. కింది విగ్రహ వాక్యాలకు సమాసపదం రాయండి. సమాసం పేరు రాయండి.

అ) మానవుని యొక్క నాగరికత = ____________, ____________

ఆ) సాధ్యం కానిది = ____________, ____________

ఇ) రక్తమును, మాంసమును = ____________, ____________

ఈ) నేలలోని బొగ్గు = ____________, ____________

ఉ) మూడైన పూటలు = ____________, ____________

### ఉత్ప్రేక్ష

✷ కింది వాక్యం చదువండి.

'ఈ మేఘాలు గున్నఏనుగులా! అన్నట్లు ఉన్నాయి.'

దేన్ని దేనితో పోల్చారు?

పై వాక్యంలో కనిపిస్తున్న పోలిక ఊహించి చెప్పబడింది. పై వాక్యంలో

ఉపమేయం : మేఘాలు

ఉపమానం : గున్న ఏనుగులు



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

అంటే మేఘాలను ఏనుగు పిల్లలవలె ఊహిస్తున్నామన్నమాట –

దీనిని బట్టి పోలికను ఊహించి చెబితే అది **'ఉత్ప్రేక్ష'** అలంకారం.

**3. కింది వాక్యాల్లో దేనిని దేనిగా ఊహించి చెప్పారో రాయండి.**

అ) మండే ఎండ నిప్పులకొలిమా! అన్నట్లు ఉన్నది.

ఆ) ఆకాశంలోని నక్షత్రాలు కొలనులోని పువ్వులా! అన్నట్లు ఉన్నాయి.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- మీ ప్రాంతంలోని కార్మికులను / శ్రామికులను కలిసి, పనిలో వారు పొందిన అనుభవాలను, అనుభూతులను తెలుసుకొని, ఆ వివరాలను నివేదిక రూపంలో రాసి తరగతిలో ప్రదర్శించండి.

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | సింగరేణి కార్మికుల జీవితం గురించి చెప్పగలను. | అవును / కాదు |
| 2. | అపరిచిత గద్యం చదివి ప్రశ్నలు తయారుచేయగలను. | అవును / కాదు |
| 3. | సింగరేణి కార్మికులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పోస్టర్ తయారుచేయగలను. | అవును / కాదు |
| 4. | సింగరేణితో సమాజానికి ఉన్న సంబంధాన్ని సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |

### సూక్తి

పనిచేయడం అలవాటైతే ఆ తరువాత అది లేకుండా ఉండడం కష్టమవుతుంది... ఈ ప్రపంచంలో ప్రతి విషయం పనిమీదే ఆధారపడి ఉంటుంది.

SCERT TELANGANA

# 11

# కాపుబిడ్డ

- గంగుల శాయిరెడ్డి

## చదువండి - ఆలోచించి చెప్పండి.

తొలిజల్లువచ్చింది
తొలకరించింది
పదవోయి రైతన్న
పాటుచేయంగ!
హలమే మన సౌభాగ్య
బలమనుచు చాటి
పొలము దున్నాలోయి
పొలికేక బెట్టి!
బలము నీవే జాతి
కలిమి నీవేరా!
పాతరల బంగారు
పంట నింపుమురా!!



### ప్రశ్నలు:

1. తొలివానకురిసే కాలాన్ని ఏమంటారు?
2. ఈ గేయం ఎవరి గురించి చెపుతుంది?
3. గేయానికి బొమ్మకి మధ్యగల సంబంధం ఏమిటి?
4. బంగారు పంటలను పండించే రైతుల గురించి మీకేం తెలుసు?

### పాఠం ఉద్దేశం

ఏ ప్రాణికైనా బతకటానికి ఆహారం అవసరం. ఆ అవసరాన్ని తీర్చేది వ్యవసాయం. వ్యవసాయం చేసేవారు రైతులు. వారిని కష్టాలు నిత్యం వెంటాడుతుంటాయి. ఏడాదిలోని మూడుకాలాల్లో ఎప్పటి పనులు అప్పుడే కాచుకొని ఉండి, రైతులను తీరికగా ఉండనీయవు. ఆరుగాలం కష్టించి పనిచేసినా హాయిగా బతకలేరు. దినదినగండం, అమాయకత్వం, అహింసాతత్త్వం రూపుకట్టిన రైతుల కడగండ్లను వివరించడం, శ్రామికజీవనం పట్ల గౌరవాన్ని పెంపొందించడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'కావ్య' ప్రక్రియకు చెందినది. వర్ణనతో కూడినది కావ్యం.

ప్రస్తుత పాఠ్యాంశం గంగులశాయిరెడ్డి రచించిన 'కాపుబిడ్డ' కావ్యంలోని 'కర్షక ప్రశంస' అనే భాగంలోనిది. రైతు జీవన విధానం, జీవకారుణ్యం, త్యాగబుద్ధి, విరామం ఎరుగని శ్రమ ఇందులో వర్ణించబడ్డాయి.

## కవి పరిచయం



**08-06-1890**
**04-09-1975**

ఈ పాఠ్యాంశాన్ని రాసినకవి గంగుల శాయిరెడ్డి. జనగామ జిల్లాలోని 'జీడికల్లు' గ్రామం వీరి జన్మస్థలం.

శాయిరెడ్డి రచనల్లో 'కాపుబిడ్డ' కావ్యంతోపాటు 'తెలుగుపలుకు', 'వర్షయోగము', 'మద్యపాననిరోధము' అనేవి ముద్రితాలు. ఇంకా గణిత రహస్యము, ఆరోగ్యరహస్యం అనే అముద్రిత రచనలు కూడా ఉన్నాయి. శైలి సరళంగా, సులభంగా గ్రహించ గలిగినది. సహజకవిగా పేరు పొందిన 'పోతన' పట్ల ఆరాధనాభావం గల శాయిరెడ్డి, ఆయననే ఆదర్శంగా తీసుకొని అటు హలంతో, ఇటు కలంతో సమానంగా కృషి సాగించాడు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.


SCERT TELANGANA



## ప్రవేశిక

*భారతదేశం పూర్వం నుండి వ్యవసాయ ప్రధాన దేశం. గ్రామాలు పూర్వం కన్నా నేడు ఎంతో కొంత ఆధునికమైనవి. అయినా గ్రామాల్లో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా కొనసాగుతున్నది. స్వయంగా హాలికుడే హాలికుల బాధలను ఏకరువు పెడితే ఆ ఆర్ద్రత ఎంతటి వారికైనా హృదయాన్ని కదిలిస్తుంది కదా! 'సత్కవుల్ హాలికులైన నేమి' అని చెప్పిన పోతన వాక్యానికి ఆధునిక కాలంలో ఒక ఉదాహరణ శాయిరెడ్డి. ఇక ఆ రైతుకవి రచనలోనికి ప్రవేశిద్దాం.*





### I

1. సీ. మండువేసవియెండ మంటలోఁగ్రాగుచు
బూనిన పనిసేయు మౌనులెవరు?
వానలో నానుచు వణకుచు హలమూని
చలియందు దున్నెడి సాధులెవరు?
ఊళ్ళలో నడవిలో రాతిరింబవలును
తడబాటు లేనట్టి తపసులెవరు?
తలక్రింద చేయిడి గులకశిలల పైన
వెత లేక నొరిగిన వేత్తలెవరు?

గీ. కష్ట సుఖముల నొకరీతి గడుపువారు
శత్రుమిత్రుల సమముగా సైచువారు
సైరికులుదప్ప నంతటి శాంతులెవరు?
కాన చేమోడ్చి వారి నే గౌరవింతు.

2. సీ. కార్చిచ్చులోబడి కంటకమ్ముల ద్రొక్కి
వడగండ్ల దెబ్బల వడుదువీవు
పెనుగాలి చే దుమ్ము కనులందుఁబడుచుండ
నుఱుము మెఱుములలో నుందువీవు
మంచుపైఁబడుచుండ మాపుశీతంబులో
పచ్చికనేలపై పండుదీవు
కటికచీకటి గప్పి యెటుదారిగానక
నాఁకలి డప్పిచే నడలు దీవు

SCERT TELANGANA

గీ. ఇన్నియిడుముల గుడిచి నీ విల్లుజేర
నాలుపిల్లలు కూటికై యంగలార్చ
చలనమింతైన లేని యో సంయమీంద్ర
కర్షకా! నిన్ను చేమోడ్చి గౌరవింతు.

**ఆలోచించండి - చెప్పండి**


- రైతులవలె, ఇతర వృత్తులవారు పడే బాధలను తెల్పండి.
- మూడు కాలాల్లో రైతులు చేపట్టే పనులేవి?
- పేదరైతు కష్టాలు ఎట్లాంటివి?

## II

3. సీ. ఎండల వేడికి నెత్తుమేడలు లేక
చెట్టుల నీడకుఁ జేరినావు
కొలది చినుకులకే కొంపంత తడియగా
పొదరిండ్ల బురదలో మెదలినావు
గడగడ వడకుచు గడ్డివాముల దూఱి
చలికాలమెట్టులో జరిపినావు
పుట్టలొల్కుల మిట్ట బట్టిమాపటివేళ
గాఢాంధకారము గడపినావు

గీ. సర్పవృశ్చిక వ్యాఘ్రాది జంతువులకు
నునికి పట్టగుచోట్లలో మునులభంగి
తిరిగి యేప్రొద్దు నుందువో దివ్యమూర్తి
కర్షకా! చేతులెత్తి నే గౌరవింతు॥

4. సీ. పనియున్న లేకున్న బ్రాహ్మీముహూర్తాన
తప్పక లేచెడి తాపసేంద్ర!
తెలిసియో తెలియకో దినమున కొకసారి
తానంబు చేసెడి మౌనిచంద్ర!
ఉండియో లేకనో యుత్తమాహారంబు
చక్కగా గుడిచెడి సంయమీంద్ర
వచ్చియో రాకనో వదరుబోతువుగాక
మితభాషితము సేయు యతికులేంద్ర.




గీ. కుటిలనటనము గర్వము కొంటెతనము
వన్నెచిన్నెలు లేని సద్వర్తనుడవు
ఈగియందనురాగివో యోగిచంద్ర!
కర్షకా! చేతులెత్తి నే గౌరవింతు.

5. సీ. పచ్చజొన్నగటక పరమాన్నమును గాగ
చల్లనీరే సుధాసారమగును
వడుకుడుపులు జరి పట్టుబట్టలు గాగ
కంబళే వజ్రంపు కవచమగును
వలపలి చేకఱ్ఱ వజ్రాయుధముగాగ
పరిజనమే నీకు పశువులగును
అందమౌపైరులే నందనములుగాగ
నేప్రొద్దుపంటనిక్షేపమగును.

గీ. ఇచ్చుచుండును నీశ్వరుఁడింద్ర పదవి
వచ్చుచుండును ప్రకృతి బల్వలపు చేత
దాని జూడవు కన్నెత్తి తాపసేంద్ర!
కర్షకా! నిన్నుకేలెత్తి గౌరవింతు.

## ఆలోచించండి - చెప్పండి

- సద్వర్తనకు దోహదం చేసే గుణాలు ఏవి?
- రైతుకు భగవంతుడు ఇంద్రపదవిని ఇస్తున్నాడని ఎట్లా చెప్తారు?
- రైతుకు, మునికి గల పోలికలు ఏమిటి?




## తాత్పర్యాలు

1. మంటలు మండే ఎండకాలపు ఎండలలో మగ్గిపోతూ కూడా చేపట్టిన పని కొనసాగించే ఋషులెవరు? వానలో నానుతు చలిలో వణుకుతు నేలను దున్నే సాధువు లెవరు? రాత్రనక, పగలనక, రాతి నేలల్లో, అడవుల్లో తడబడకుండ తిరిగే తాపసులెవరు? ఎన్ని బాధలున్నా లెక్కచేయక, గులకరాతి నేలమీదనే తలకింద చేయి పెట్టుకొని విశ్రమించే విజ్ఞులెవరు? కష్టసుఖాలను ఒకే విధంగా, శత్రు, మిత్రులను ఒకే మాదిరిగా సహించే శాంత స్వభావులెవరు? రైతులుగాక! అందుకే చేతులు జోడించి వారికి మొక్కి గౌరవిస్తాను.

2. ఓ కర్షకుడా! మిక్కిలి వేడిమిని సహించి, ముండ్లమీద నడిచి, వడగండ్లవాన పాలవుతావు. గాలి దుమ్ములు కమ్మినా, ఉరుములు మెరుపులతో ఉన్నా చలించవు. మంచుకురిసే రాత్రి వేళల్లో, చలిలో, పచ్చిక నేలమీదనే నిద్రపోతావు. ఎటూ దారి కానరాని కటికచీకటి రాత్రులలో అప్పుడప్పుడు ఆకలిదప్పికలతోనే కాలం గడపవలసి వస్తుంది. ఇన్ని కష్టాలను భరించి నీవు ఇంటికి చేరినప్పుడు భార్య, పిల్లలు ఆకలితో అన్నానికై అంగలార్చుగా యతీశ్వరుని వలె ఏ మాత్రమూ చలనం లేకుండా ఉండే నీకు చేతులు జోడించి నేను నమస్కరిస్తాను.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

3. ఓ రైతన్నా! ఎత్తైన మేడలు లేని నీవు ఎండ వేడిమి నుండి కాపాడుకోవటానికి చెట్టు నీడకు చేరావు. కొద్దిపాటి వానకే కురిసే నీ ఇంటిని వదిలి బురదనిండిన గుబురుల్లోనే తలదాచుకుంటావు. చలిబారి నుండి తప్పించుకోవటానికి గడ్డివాములను ఆశ్రయిస్తావు. పనిమీదపడి కటికచీకటి రాత్రులందు కూడ పుట్టలు, మిట్టలపై సంచరిస్తుంటావు. పాములు, తేళ్ళు, పులుల వంటి క్రూర జంతువులకు నిలయమైన తావులలో మునులవలె ఎల్లవేళలా తిరుగాడే నీవు దివ్యమూర్తివే. అట్లాంటి నీకు నేను చేతులెత్తి నమస్కరిస్తున్నాను.

4. హాలికుడా! పని ఉన్నా, లేకున్నా నియమంగా తెల్లవారు జామున లేచే నీవు గొప్ప తాపసివే. తెలిసో తెలియకనో రోజుకొక్క సారైనా స్నానమాచరించే నీవు మునిశ్రేష్ఠునివే. ఉండో, లేకనో ఎల్లప్పుడూ సాత్వికాహారమే గ్రహించే నీవు ఋషీశ్వరునివే. తెలిసీ తెలియనితనంవల్ల తక్కువగా మాట్లాడే స్వభావం గల నీవు యతిరాజువే. కుటిల ప్రవర్తన, గర్వం, కొంటెపనులు, ఆడంబరాలు లేని మంచి నడవడి నీది. నీవొక యోగివి. శ్రేష్ఠుడవు. దాన గుణంపై మక్కువ గలవాడవు. ఇన్ని సుగుణాలున్న నీకు నా వందనాలు.

5. ఓ కృషీవలుడా! నీకు పచ్చజొన్న గట్కే పరమాన్నం. పలుచని చల్లనే అమృతం. చేతితో వడకిన నూలు బట్టలే పట్టు వస్త్రాలు. కప్పుకునే గొంగడే నీకు చెక్కుచెదరని కవచం. కుడి చేతిలోని ముల్లుగర్ర నీకు వజ్రాయుధం. పశుసంపదే నీకు పరివారం. నీవు పెంపు చేసిన పంటచేనులే నందనవనాలు. పండించే పంటనే నిధి నిక్షేపాలు. ఓ మునిశ్రేష్ఠా! ఈ విధంగా భగవంతుడు నీకు ఇంద్ర పదవిని ఇస్తున్నాడు. ప్రకృతి కాంతయే నిన్ను వలచి వచ్చినా ఆమెను నువ్వు కన్నెత్తైనా చూడక నీ వృత్తినే మిన్నగా భావిస్తావు. అందుకే నీకు చేతులెత్తి నమస్కరిస్తాను.

## ఇవి చేయండి

### I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. 'రైతే దేశానికి వెన్నెముక' అంటారు కదా! నేడు రైతుల పరిస్థితి ఎట్లా ఉన్నది? చర్చించండి.
2. రైతు యొక్క జీవనవిధానం గురించి, కవికి ఉన్న అభిప్రాయం గురించి మాట్లాడండి.

### II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

1. కింది పద్యమును చదువండి. పద్యభావానికి చెందిన ఖాళీలను పూరించండి.

'కష్టసుఖముల నొకరీతి గడుపువారు
శత్రుమిత్రుల సమముగా సైచువారు
సైరికులు దప్ప నంతటి శాంతులెవరు?
కాన చేమోడ్చి వారి నే గౌరవింతు.

SCERT TELANGANA

భావం : సైరికులు అనగా ________________. వారు ________________ లను మిత్రులను ________________ సహిస్తారు. వారి ________________ స్వభావం వల్లనే వారిని నేను చేతులు జోడించి గౌరవిస్తాను.

**2. కింది పద్యాన్ని చదివి దానికింద ఉన్న ప్రశ్నలకు సరియైన సమాధానాన్ని గుర్తించండి.**

"ఎండకాలము గుడిసెల నెగరజిమ్మ
తొలకరించిన వర్షము తొట్రుపరుప
ముసురుపెట్టగా రొంపిలో మూల్గుచున్న
కర్షకా! నీదు పల్లెను గాంతురెవరు."

అ) 'రొంపి'కి సరియైన అర్థాన్ని గుర్తించండి. ( )

ఎ) నీరు బి) వరద సి) గాలి డి) బురద

ఆ) 'ఎగురజిమ్ముట' అనగా ( )

ఎ) కాలిపోవుట బి) గాలికి పైకి విసురు సి) కూలిపోవుట డి) కిందపడుట

ఇ) 'తొలకరించుట' అంటే నీకు ఏమి తెలుస్తున్నది? ( )

ఎ) పలకరించుట బి) పులకరించుట సి) వర్షాకాలం మొదలు డి) ఎండాకాలం మొదలు

ఈ) 'కాంతురెవరు' అనడంలోని ఉద్దేశం ( )

ఎ) ఎవరు చూస్తారు? బి) ఎవరు పట్టించుకుంటారు?

సి) ఎవరు అంటారు? డి) ఎవరు వింటారు?

## III. స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) 'ఇంద్రపదవి కన్నా రైతు జన్మ గొప్పది' ఎందుకు?

ఆ) 'జై జవాన్! జై కిసాన్!!' అంటారు కదా! రైతుకు, సైనికునికి గల పోలికలు ఏమిటి?

ఇ) రైతులకు గల ఐదు సమస్యలను రాయండి.

ఈ) 'రైతు ప్రకృతితోని మమైకమై ఉంటాడు' దీనిని సమర్థించండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 'రైతు సంతోషంగా ఉంటే సమాజం బాగుంటుంది' సమర్థిస్తూ రాయండి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

**1. కింది వానిలో ఒకదానికి జవాబును సృజనాత్మకంగా రాయండి.**

అ) పాఠం ఆధారంగా రైతు ఆత్మకథను రాయండి.

(లేదా)

ఆ) అందరికి అన్నం పెట్టే రైతుకృషిని అభినందిస్తూ అభినందన పత్రం రాయండి.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

## V. పదజాల వినియోగం

**1. కింది పదాలతో సొంతవాక్యాలు రాయండి.**

అ) హలం : ____________________

ఆ) సైరికులు : ____________________

**2. కింది పట్టికలోని ప్రకృతి వికృతులను గుర్తించి జతగా రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| రాత్రి | గరువము | బ్రహ్మ | పసరము, పసువు | చిచ్చు | చందురుడు |
| పశువు | చంద్రుడు | శుచి | గర్వము | రాతిరి | బొమ్మ |

**3. కింది వాక్యాలలోని ఒకే అర్థం గల మాటలను గుర్తించి రాయండి.**

అ) మౌనంగా ఉన్నంతమాత్రాన మునికాలేడు. తాపసికి దీక్ష ఎక్కువ.

(____________________; ____________________)

ఆ) వానరులు రాళ్ళు తీసుకొని రాగా, ఆ శిలలతో నలుడు సముద్రంపై వారధిని నిర్మించాడు.

(____________________; ____________________)

ఇ) మాపువేళ పక్షులు గూటికి చేరుతాయి. అట్లే సాయంకాలం ఆవులమందలు ఇళ్ళకు చేరుతాయి.

(____________________; ____________________)

## VI. భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

అ) తాపసేంద్ర = __________ + __________ = ______________

ఆ) పరమాన్నము = __________ + __________ = ______________

ఇ) కేలెత్తి = __________ + __________ = ______________

ఈ) గాఢాంధకారము = __________ + __________ = ______________

ఉ) కొంపంత = __________ + __________ = ______________

**2. కింది వాక్యాల్లోని అలంకారాన్ని గుర్తించండి. దానిని గురించి వివరించండి.**

అ) రైతు మునివలె తెల్లవారు జామునే లేస్తాడు.

ఆ) వంగిన చెట్టు కొమ్మ, గొడుగు పట్టినట్లుందా! అన్నట్లు ఉన్నది.

ఇ) అక్కడ లేక ఇక్కడ లేక మరెక్కడ ఉన్నట్లు?



SCERT TELANGANA

## ఉత్పలమాల

✷ ఛందస్సులో గణవిభజన తెలుసుకున్నారు కదా! ఇప్పుడు గణాల ఆధారంగా పద్య లక్షణాలను తెలుసుకుందాం.

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| లెక్కకు | రానికో | రికల | రీతుల | లోబడి | మానవుం | డిటుల్ |

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| యుక్కిరి | బిక్కిరై | తిరుగు | చుండును | గానివి | శిష్టమా | ర్గముల్ |

- ♦ పై పాదాల్లో భ, ర, న, భ, భ, ర, వ అనే గణాలున్నాయి.
- ♦ మొదటి అక్షరానికి లె (ఎ) – రీ (ఈ), యు (ఉ) – చుం (ఉ); 10వ అక్షరాలకు యతి చెల్లింది.
- ♦ పై పాదాలలో ప్రాసగా క్క-క్కి- అనే హల్లు వచ్చింది.
- ♦ పై పాదాల్లో 20 అక్షరాలున్నాయి.
- ♦ పై పద్య పాదాలు 'ఉత్పలమాల' వృత్త పద్యానివి.

> ♦ నాలుగు పాదాల్లో ఒకే రకమైన గణాలు ఒకే వరుసలో ఉండే పద్యాన్ని 'వృత్త పద్యం' అంటారు.

> ♦ పద్య పాదాల్లో మొదటి అక్షరాన్ని 'యతి' అంటారు. ఈ యతి అక్షరానికి అదే అక్షరంగానీ, వర్ణమైత్రి కలిగిన మరో అక్షరంగానీ అదే పాదంలో నియమిత స్థానంలో రావడాన్ని 'యతి నియమం' అంటారు.

> ♦ పద్య పాదాలలో రెండవ అక్షరానికి 'ప్రాస' అని పేరు. పద్యపాదాల్లో రెండో అక్షరంగా ఒకే హల్లు రావడాన్ని 'ప్రాస నియమం' అంటారు.

పై ఉదాహరణ ననుసరించి 'ఉత్పలమాల' పద్య లక్షణాలను ఈ విధంగా పేర్కొనవచ్చు.

**ఉత్పలమాల**

1) ఇది వృత్త పద్యం.
2) పద్యంలో నాలుగు పాదాలుంటాయి.
3) ప్రతి పాదంలో వరుసగా భ-ర-న-భ-భ-ర-వ అనే గణాలు వస్తాయి.
4) ప్రతి పాదంలో 10వ అక్షరం యతి స్థానం.
5) ప్రాస నియమం వుంటుంది.
6) ప్రతి పాదంలోను 20 అక్షరాలుంటాయి.

## చంపకమాల

✷ ఈ కింది పద్య పాదాలను పరిశీలించండి.

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| అనిన | నమ్రగ | హించితి | మహావి | హగోత్త | మయంచు | సంతసం |

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| బునశి | బితక్ క్ష | ణంబయ | సిపుత్త్రి | కనాత్మ | శరీర | కర్తనం |

పై పద్యపాదాలలోని గణాలను పరిశీలిస్తే

ప్రతి పాదంలోను న-జ-భ-జ-జ-జ-ర అనే గణాలు ఉన్నాయని తెలుస్తున్నది. ఇట్లా ప్రతి పాదంలోను పై గణాలు రావడం చంపకమాల పద్యలక్షణం. పై పద్యపాదాల్లో 'అ'కు 'ఆ'తో, 'బు' కు 'పు'తో యతిమైత్రి చెల్లింది. ప్రాసగా ని-న అనే హల్లులు ఉన్నవి. పై పాదాల్లో 21 అక్షరాలున్నాయి.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20
SCERT TELANGANA

**చంపకమాల**

1) ఇది వృత్తపద్యం.

2) పద్యంలో నాలుగుపాదాలుంటాయి.

3) ప్రతి పాదంలో వరుసగా న-జ-భ-జ-జ-జ-ర అనే గణాలు వస్తాయి.

4) ప్రతి పాదంలో 11వ అక్షరం యతిస్థానం.

5) ప్రాస నియమం వుంటుంది.

6) ప్రతి పాదంలోను 21 అక్షరాలుంటాయి.

**3. కింది పద్యపాదాలకు గణ విభజన చేసి ఏ పద్యపాదాలో గుర్తించి రాయండి.**

అ) తనకు ఫలంబులేదని యెదం దలపోయడు కీర్తిగోరు నా

ఆ) ఆకలి దప్పులన్ వనట నందిన వారికి పట్టెడన్నమో

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- ప్రసార మాధ్యమాల్లో (టి.వి./రేడియో) వచ్చే వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలను చూడండి. వాటి వివరాలను, వాటివల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను గురించి నివేదిక రాయండి.

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | రైతుల స్థితిని గురించి సొంతమాటల్లో చెప్పగలను. | అవును / కాదు |
| 2. | అపరిచితపద్యం చదివి అర్థం చేసుకొని జవాబులు గుర్తించగలను. | అవును / కాదు |
| 3. | రైతులు సంతోషంగ ఉంటే సమాజం బాగుంటుందని సమర్థిస్తూ సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 4. | రైతు ఆత్మకథను రాయగలను. | అవును / కాదు |

**సూక్తి**

"శ్రమైక జీవన సౌందర్యానికి...

సమానమైనది లేనేలేదు".

SCERT TELANGANA

# 12 మాట్లాడే నాగలి

– మళయాళ మూలం:పొన్‌కున్నం వర్కెయ్, అనువాదం:ఎన్. వేణుగోపాల రావు

**చదువండి – ఆలోచించి చెప్పండి.**

ఈ విశ్వంలో, ఈ భూమండలంలో, ఈ జీవనచక్రంలో మనకెంత ప్రాధాన్యముందో ....ఓ చీమకు, ఓ దోమకు, ఓ ఈగకు, ఓ బూగకు, ఓ తేనెటీగకు, ఓ గద్దకు చివరకు ఓ నత్తకూ, ఓ పీతకూ కూడ కాస్త అటు ఇటుగా అంతే ప్రాధాన్యం ఉందని తేలిపోయింది. సమస్యేమిటంటే ఉన్నత జీవులం కావటంతో మనకు తెలివి ఎక్కువనుకుంటాం. కాని ఆ తెలివిని మనం వినాశానికి ఉపయోగిస్తున్నామనుకోం. నాటి వేటకాలం నుంచీ నేటి పారిశ్రామిక యుగం వరకూ మనం ఇతర జీవులనూ ఈ ప్రకృతిలోని జీవవైవిధ్యాన్ని, కాపాడుకోలేకపోతున్నాం. ఫలితం – ఇప్పుడు ఈ భూమ్మీద మన అస్తిత్వమే అయోమయంలో పడింది.

**ప్రశ్నలు:**

1. పై పేరా దేన్ని గురించి తెలుపుతున్నది?
2. తెలివిమీరిన మానవులు ఏం చేస్తున్నారు?
3. వీటి ఫలితాలు ఎలా ఉన్నాయి?
4. జీవవైవిధ్యాన్ని కాపాడటానికి మనం ఏం చేయాలి?

**పాఠం ఉద్దేశం**

ప్రాణులకు – ముఖ్యంగా పెంపుడు జంతువులకూ సంవేదనలుంటాయనీ, మనం చూపే ప్రేమ, ఆప్యాయతలకు అవి స్పందిస్తాయనీ చెప్తూ తద్వారా జీవకారుణ్య దృష్టిని పెంపొందింపచేయటం ఈ పాఠం ఉద్దేశం.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఒక భాషలో ఉన్న విషయాన్ని వేరొక భాషలోకి మార్చి రాసినట్లైతే దాన్ని అనువాదం *(Translation)* అంటారు. తెలుగు సాహిత్యంలో దీనిని 'అనువాద ప్రక్రియ'గా పేర్కొనటం జరుగుతున్నది.

సాహిత్య అకాడమీ వారు ముద్రించిన 'భారతీయ సాహిత్యం – సమకాలీన కథానికలు' అనే గ్రంథంలోని మలయాళభాషలోని అనువాదకథ ప్రస్తుత పాఠ్యాంశం. మలయాళభాషలో పొన్‌కున్నం వర్కెయ్ రాసిన కథను తెలుగులోకి ఎన్. వేణుగోపాలరావు అనువాదం చేశాడు.

## రచయిత పరిచయం



**(1910–2004)**

పొన్‌కున్నం వర్కెయ్ మలయాళ అభ్యుదయ రచయితలలో ప్రముఖుడు. వర్కెయ్ బాల్యం పొన్‌కున్నంలో గడిచింది.

ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించిన వర్కెయ్ 'తిరుముల్కచ్చ' (1939) అనే కథానికా సంకలనంతో రచయితగా పరిచయమయ్యాడు. 24 కథానిక సంపుటాలు, 16 నాటకాలు, 2 కవితా సంపుటాలు, ఒక వ్యాస సంకలనం, ఆత్మకథ మొదలయినవి ఇతని కలం నుండి వెలువడ్డాయి.

మానవసంబంధాలు, మనిషికి ప్రకృతితో ఉన్న అనుబంధం వర్కెయ్ రచనలలోని ప్రధానాంశాలు. ఈయన గొప్ప మానవతావాది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA



## ప్రవేశిక

*ఈ సృష్టిలోని ప్రతి ప్రాణిలో ప్రేమ, ఆప్యాయతలు ఉంటాయి. మానవ సమాజంలో తన కుటుంబంతో ఎంతో మమైకమై సహజీవనం చేస్తున్న మూగజీవులను అనుకోని పరిస్థితులలో దూరం చేసుకొని, తిరిగి ఎప్పుడో కలుసుకున్నప్పుడు మనస్సు ఎంతగా స్పందిస్తుందో 'ఓ సెఫ్ – కన్నన్" ద్వారా తెలుస్తుంది. ఇంతకూ ఓ సెఫ్ ఎవరు? కన్నన్‌ను ఏ విధంగా చూసుకునేవాడు అనే విషయాన్ని ఈ పాఠం ద్వారా తెలుసుకుందాం.*



## I

ఎద్దు సంగతి వచ్చేసరికి ఓసెఫ్ అన్నీ మరిచిపోతాడు. వేరే రైతులు అతణ్ణి 'ఎద్దు పిచ్చోడు' అని పిలుస్తారు. ఆ ఎద్దు పేరు కన్నన్. దాన్ని చూసి ముచ్చటపడని రైతు లేడు. ఓసెఫ్‌కు కన్నన్ తోడిదే లోకం. బూడిద రంగులో బలంగా, పొట్టిగా, లావాటి ఒంపు తిరిగిన కొమ్ములతో అది బ్రహ్మాండమైన ఆకారం గల వృషభరాజు. సుడి తిరిగిన బిగువైన చర్మం, బైటికి ఉబికినకళ్ళు. అసలు కన్నన్ నడకలోనే ప్రత్యేకమైన ఠీవి ఉట్టిపడేది. దున్నేటప్పుడయినా, మరెక్కడయినా ఓసెఫ్ మనసులో ఏమున్నదో కన్నన్ తప్పనిసరిగా పసికట్టేది. ఎక్కడయినా సరే, సామానుల గదిలోగాని, పొలంలోగాని ఆ ఎద్దు సరిగ్గా ఓసెఫ్ ఏమనుకుంటున్నాడో గుర్తించగలిగేది.

కన్నన్‌మీద ఓసెఫ్ తన చెర్నాకోల నెన్నడూ ఉపయోగించలేదు. ఊరికే చెర్నాకోల పైకి లేపే వాడంతే. వేరే రైతులలాగ అతనికి గొంతెత్తి తన ఎద్దును తిట్టవలసిన అవసరమూ ఉండేదిగాదు. స్నేహితుడితో మాట్లాడినట్టే కన్నన్‌తో కూడా మాట్లాడేవాడు. అక్కడ ఉన్న ఎద్దులన్నిటికీ కన్నన్ నాయకత్వం వహించేది. ఒక మడిలో దున్నడం అయిపోయిన తర్వాత, పక్క మడిలోకి వెళ్ళాలని కన్నన్‌కు చెప్పవలసిన అవసరమే లేదు. అటువంటి పనులన్నీ ఎప్పుడు, ఎట్లా చెయ్యాలో కన్నన్‌కు తెలుసు. కొన్నిసార్లయితే కన్నన్ పక్కమడిలోకి వెళ్ళిపోతుంటే, ఓసెఫ్ ఒక్కక్షణం విరామం కావాలనేవాడు.

"ఓయ్ – ఓ క్షణం ఆగు, నన్ను పాన్ వేసుకోనీ. చాలా సేపయింది."

ఆ మాట వినగానే కన్నన్ నిలిచిపోయేది. పాన్ నమలడం అయిపోగానే ఓసెఫ్ "హుఁ" అనే వాడు. కన్నన్ మళ్ళీ పని మొదలుపెట్టేది. ఒక మడిలోంచి మరో మడిలోకి వెళుతున్నప్పుడు ఆ చిన్న గట్లమీద ఎంత జాగ్రత్తగా అడుగులు వేసేదని! ఆ చిన్న చిన్న గట్లమీద ఎక్కడయినా తన గిట్ట పెట్టేది కాదు. సరిగ్గా చూసి ఒక్క తన్ను తంతే గట్లు తెగిపోతాయని దానికి తెలుసు.

చెప్పినదంతా అర్థం చేసుకునే కన్నన్‌ను కట్టేయనవసరం ఉండేదికాదు. దున్నడం అయిపోగానే మేతకు వదిలేసేవాడు. ఊరికే వదిలేస్తూ "హే – పో కడుపు నింపుకో. అరటిచెట్లు మాత్రం ముట్టుకోకు" అని హెచ్చరించేవాడు ఓసెఫ్. కన్నన్ ఎప్పుడూ అరటి చెట్లను గాని, కొబ్బరి మొలకలనుగాని ముట్టుకునేది కాదు. వాటిని ఎంతో శ్రద్ధతో, శ్రమతో నాటారని దానికి తెలుసు. వాటిని నాటినవాళ్ళను కొమ్ములతో పొడవడం కన్న వాటిని తొక్కేయడం ఘోరమని దానికి తెలుసు. దున్నడం అయిపోగానే, కన్నన్ ఒంటిమీద బురదా మట్టీ అంతా కడిగేసేవాడు. ఓసెఫ్‌కు ఈ విషయంలో మాత్రం పట్టుదల ఎక్కువ.

"కుడికాలు ఇటువైపు లేపు –ఆఁ!– తలెందుకట్లా ఊపుతున్నావ్? నీ కొమ్ములు నాకు తగిలాయంటే చూసుకో! సరిగ్గా నించో లేవూ... కదలకు..." ఓసెఫ్ మాట్లాడిన ఈ మాటల్లో ప్రతి ఒక్కటీ కన్నన్‌కు అర్థమయ్యేది. అయితే ఈ భాష దానికంతగా నచ్చేది కాదు. అసలు కడగడం అంటేనే దానికి అయిష్టం. కాని ఓసెఫ్ మీద ఉన్న ప్రేమకొద్దీ ప్రతిసారీ

SCERT TELANGANA

లొంగిపోయేది. హృదయంలోని ప్రేమానురాగాల్ని ఎట్లా వాడుకోవాలో తెలియని రైతులు "ఏ మొండి ఎద్దునైనా తీసుకుపోయి ఒక్కసారి ఓసెఫ్‌కు అప్పజెప్పండి. ఒక్కసారి తన చేతులతో తినిపించాడంటే, ఆ పశువు కొత్త రూపమెత్తుతుంది," అనేవాళ్ళు. ఎద్దులతో ఓసెఫ్ సహజంగా మాట్లాడేవాడు. రోజంతా ఓసెఫ్ తన ఎద్దుకు మేత పోగేస్తూనే గడిపేవాడు. పశువుల పట్ల క్రూరత్వాన్ని మానాలని ఉపన్యాసాలు వింటే ఓసెఫ్‌కు చిర్రెత్తేది. "పశువుల్ని రక్షించాలి, పశువుల్ని రక్షించాలి అని ప్రతివాడూ ఉపన్యాసమిచ్చేవాడే. ఏ ఊళ్ళోనైనా ప్రభుత్వం ఒక వరిపొలాన్నయినా పశువులకోసం వదిలేసిందా? ఏం? గడ్డం తినిపించి రక్షిస్తారా పశువుల్ని?"

కన్నన్‌కు మేత వేసిన తర్వాతనే ఓసెఫ్ తన ఆకలి తీర్చుకునేవాడు. దొడ్లో పశువులు మేతకు మాడితే, ఆ ఇంటికి అరిష్టం దాపురిస్తుందని ఓసెఫ్ నమ్మకం. అనాస ఆకులు కన్నన్ నోటికి అందిస్తున్నాడంటే, ముళ్ళన్నీ కత్తిరించి, ఆకులు ముక్కలు చేసి ఇచ్చాడన్నమాటే.

కన్నన్ పొలాల్లో తిరిగి ఇంటివాకిట్లో అడుగు పెట్టగానే, "హెయ్ కన్నన్," అని కేకేసే వాడు ఓసెఫ్. ఆ గొంతు వినగానే ఎద్దు ఆగిపోయేది. మోర పైకెత్తి ఓసెఫ్ తన దగ్గరి కొచ్చేవరకూ చూస్తూ నిలబడేది. చేతినిండా గడ్డిపరకలతోనో, కాసిన్ని అరటి తొక్కలతోనో, ఏదో ఒక చిన్న కానుక పట్టుకుపోయేవాడు ఓసెఫ్. కన్నన్ అట్లా చేతుల్లోంచే తినేసేది. ఓసెఫ్ ప్రేమగా దువ్వుతుండగా, కన్నన్ అతణ్ణి నాకుతుండేది. ఓసెఫ్ ఎండిపోయిన చెమట ఉప్పన కన్నన్‌కు చాలా ఇష్టంగా ఉండేది.

### ఆలోచించండి - చెప్పండి

- *ఓసెఫ్‌ను 'ఎద్దుపిచ్చోడు' అనడం గురించి మీ అభిప్రాయం ఏమిటి?*
- *విచక్షణ అంటే నీకేమర్థమయింది? కన్నన్‌కి విచక్షణ ఉందని మీరెట్లా చెప్పగలరు?*
- *సాటి మనుషులతో మన ప్రేమాభిమానాల్ని ఎట్లా వ్యక్తపరచవచ్చు?*





SCERT TELANGANA

## II

ఎంత గుంపులోనుంచి అయినా కన్నన్, ఓసెఫ్ గొంతు గుర్తుపట్టేసేది. మేఘగర్జన విని పురి విప్పిన నెమలిలా అది ఆనందించేది. పొలంలో ఓసెఫ్ నాగలి పట్టాలని కూడా దానికి పట్టుదలగా ఉండేది. నాగలి ఇంకెవరు పట్టినా అది తన కొంటెతనం చూపెట్టేది. అది ఆపడానికి మళ్ళీ ఓసెఫ్ జోక్యం చేసుకోవలసి వచ్చేది. "కన్నన్ – వద్దు. మన కుట్టప్పేకదూ, నీకు తెలీదా ఏం?" అనేవాడు. అట్లా ఓసెఫ్ శాంతి కుదిర్చేవాడు. పొలాల్లో రైతులకు ఒక ఆలాపన ఉంటుంది. అందులో పదాలూ, వాక్యాలూ ఏమీ ఉండవు. ఓసెఫ్ కూడా 'హో' అని గొంతెత్తి అందంగా ఆ ఆలాపన చేసేవాడు. ఒకటి రెండు నిమిషాల పాటు ఆ మాధుర్యం అలా స్పష్టంగా నిలిచి ఉండేది. ఈ సంగీతం ప్రేమగీతాలలోను, బృందగానాలలోను వినిపించే మధుర స్వరాలకు గ్రామీణ బాణీలా ఉండేది. బహుశా దాన్ని పవిత్రగీతంగానో, పశువుల మంత్రంగానో వర్ణించడం సరిగా ఉంటుందేమో. ఓసెఫ్ ఆ గీతం ఎత్తుకున్నాడంటే, కన్నన్ ఆలసటనూ, బాధనూ, పనినీ కూడా మరచిపోయి సంగీతంలో మునిగిపోయేది.

మెడలోని గంటలు, నేలలోకి దిగుతున్న గిట్టలు ఆ గీతానికి తాళం వేసేవి. ఓ రోజు చిత్రమైన సంగతి జరిగింది. తుండతిల్ కేలన్ కొడుకు పచన్ నాగలి కట్టాడు. సన్నగా కీళ్ళనొప్పి వచ్చి ఓసెఫ్ ఆ రోజు ఇంట్లోనే పడుకున్నాడు. ఓసెఫ్ ఎద్దులు లేకుండా కేలన్ పొలంపని ఆ రోజు పూర్తికాదు. కనుక కన్నన్‌ను, దాని జత ఎద్దునూ తీసుకుపొమ్మని ఓసెఫ్ చెప్పాడు. మిగతా ఎద్దులతోపాటు ఈ రెండూ కూడా పొలంలో ప్రవేశించాయి. ఆ మడి ఒకసారి దున్నడం అయిపోయింది. రెండో దుక్కి మొదలుపెట్టాక పచన్‌కు పాట ఎత్తుకోవాలనిపించింది. కన్నన్ వెనకనుంచి పచన్ ఆలాపన ప్రారంభించాడు. కాని ప్రపంచంలోకెల్లా సంగీతరహితుడైన ఆ మనిషి ఎందుకు పాడాలనుకున్నాడు? పాడాలనిపించిది, పాడాడు – అంతే. ఆ దారుణమైన సంగీతం మొదలుకాగానే కన్నన్‌కు అసంతృప్తి కలిగింది. తల వేగంగా అటూ ఇటూ ఊపి తన నిరసన ప్రకటించింది. పచన్‌కు ఇదేమీ ఎక్కలేదు. తాను బాగా పాడుతున్నాననే అనుకుంటున్నాడు. తమ పాట ఎంత ఘోరంగా ఉన్నదో గాయకులు గుర్తించకపోవడం సంగీతంలో సహజమైనదే. కాసేపటికి కన్నన్ తన అసంతృప్తిని స్పష్టంగానే ప్రకటించింది. ఐనా పచన్ పాట ఆపలేదు. పచన్ స్నేహితులకు ప్రపంచంలోని ఏ రాగమైనా ఒకటే. కన్నన్‌కు వాళ్ళ తోడ్పాటేమీ దొరకలేదు. పచన్ సంగీతాన్ని అవమానించాడని, కన్నన్ కుడికాలిమీద బలంగా తన్నింది. మూడు రోజులపాటు ఆ సంగీతకారుడు ఇంట్లో ఉండి కాపడం పెట్టించుకోవలసి వచ్చింది.

ఓసెఫ్ దగ్గర కన్నన్ పన్నెండేళ్ళపాటు విశ్రాంతి లేకుండా పనిచేసింది. ఈ మధ్య ఎన్నో వసంతాల్లో శిశిరాల్లో పంటలు ఇంటికొచ్చాయి. చెట్లూ, దుబ్బులూ ఎన్నో శీతాకాలాల్నీ, ఎంతో మంచునూ చూశాయి. పాలితుల ముందు ప్రభువులు చూపిన అనేక సింహాసనాలూ, రాజదండాలూ కూలిపోయాయి. బ్రహ్మాండమైన మార్పులు జరిగిపోతున్నాయి. మనిషిని మనిషి దోపిడీ చేయడానికి వీలులేని కొత్తరకం పాలన లాంటి సంతోషకరమైన మాటలు వినబడ్డాయి. కాని ఓసెఫ్ తనకెంతో ఇష్టమైన ఎద్దుల్ని అమ్మెయ్యవలసివచ్చింది. అప్పటికే అతను బంగారుబాతు లాంటి వరిపొలాన్ని తాకట్టు పెట్టేశాడు. ఇష్టపూర్వకంగా ఏమీ కాదు. కాని అంతకన్న గత్యంతరం లేదు. అతనికి పెళ్ళీడు దాటుతున్న ఒక ముద్దుల కూతురు ఉంది. పెళ్ళికొడుకు కుటుంబం పైసకు ఠికాణా లేనిదే అయినా, మూడువేల రూపాయల కట్నం అడగడంతో ఓసెఫ్‌కు గత్యంతరం లేకపోయింది. పొలాన్ని పదిహేనువందల రూపాయలకు తాకట్టు పెట్టేశాడు. కట్నానికి అది సరిపోయింది. పెళ్ళి ఖర్చులకు ఇంకా డబ్బు కావాల్సివచ్చింది. అందుకని, ఎద్దులంటే ఎంత ప్రేమ ఉన్నా, వాటిని అమ్మెయ్యక తప్పలేదు.

ఇరవై సంవత్సరాలపాటు అతను రాత్రింబవళ్ళూ కష్టపడి పనిచేశాడు. అతను అందరికీ తెలిసిన రైతు. కాని చివరికి ఫలితం ఏమిటి? అతని తల నెరిసిపోయింది. చూపు మందగిస్తోంది. ఒళ్లంతా ముడతలు పడింది. కీళ్ళ నొప్పులు మొదలయ్యాయి. పనితో అతని చేతులెట్లా కాయగాశాయంటే, కత్తికూడా దిగేదికాదు. ఏం చేస్తాడతను మరి? ఐదువేల ఏళ్ళ కిందటి సాధనాలతో పని చేస్తుండేవాడు. నేలలో సారమంతా పోయింది. వెయ్యటానికి ఎరువులేమీ లేవు. తన జీవిత సాధనమూ, మోక్షసాధనమూ అయిన భూమిని పరిరక్షించమని అతను వరుణదేవతను, మేఘాలను, పర్వతాలను, వాయుదేవతను

SCERT TELANGANA

ప్రార్థించాడు. ఏళ్ళకొద్దీ సాగిన ఆ ప్రార్థనల నిష్ఫలత్వంనుంచి అతనింకా తేరుకోలేదు. కాని, దుకాణాలూ పెరిగాయి, దోపిడీ పద్ధతులూ పెరిగాయి. అతను అవమానపడే విషయాలన్నీ పెరగడం మొదలయింది.

కన్నన్‌ను అమ్మినప్పుడు ఓసెఫ్ అక్కడలేడు. క్రయపత్రం విషయంలో అతనికి ఒక రూపాయి రుసుము రావాల్సి ఉండింది. కాని ఎన్ని రూపాయలయినా ఆపలేని కన్నీళ్ళతో అతను అక్కడ్నించి వెళ్ళిపోయాడు. ఆ ఆవరణ వదిలిపోవాలంటే కన్నన్‌కు కష్టం కలిగింది. తల పైకెత్తి, తన యజమాని, తన ప్రాణానికి ప్రాణం అక్కడ ఉన్నాడేమోనని చుట్టూ చూసింది. ఎక్కడో ఏదో పొరపాటు జరిగిందనుకుంటున్నట్టుగా ఒకటి రెండు సార్లు ఆగిపోయింది. ఆ సమయానికి దక్షిణం వేపు పనసచెట్టు కింద నిలబడి ఓసెఫ్ మౌనంగా కన్నీళ్ళు తుడుచుకుంటున్నాడు.

ప్రేమకు ఎప్పుడూ మాటలూ, ప్రదర్శనలూ అవసరం లేదు. ప్రేమంటే దుఃఖం తెలిసిన రెండు హృదయాల సాన్నిహిత్యమే; అయితే, ఓసెఫ్, కన్నన్‌ల కన్నా ఒకరికొకరు దగ్గరయినవాళ్ళు మరెవరూ ఉండరు. వాళ్ళు తమ కష్టాల్ని ఒకరికొకరు చెప్పుకోలేదు. అందువల్ల ఆ రెండు హృదయాలూ మరింత ఎక్కువ బాధను అనుభవించాయి.

**ఆలోచించండి-చెప్పండి**

- *సంగీతానికున్న శక్తి ఎట్లాంటిది?*
- *'ప్రేమంటే దుఃఖం తెలిసిన రెండు హృదయాల సాన్నిహిత్యమే' - దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?*
- *ఓసెఫ్ ఎద్దును అమ్మినప్పుడు మీకేమనిపించింది? ఎందుకు?*

## III

దీక్షాదినాలు ముగిసిపోయి ఈస్టర్ పండగ వచ్చింది. ఎంత పేదవాళ్ళయినా సరే, క్రైస్తవులకు ఇది ఒక ఆనందోత్సాహాల దినం. ఆ రోజున ప్రతి వంటగదిలోంచీ ఘుమఘుమలాడుతూ మాంసం వాసనలొస్తాయి. మూకుళ్ళలో అప్పాలు సుయ్యిమని చప్పుడు చేస్తూ మత్తెక్కించే వాసనల్ని వెదజల్లుతుంటాయి. వేడి మాంసం కూర, కొబ్బరి ముక్కలు, అట్లు, కొన్ని పళ్ళేలు అక్కడ ఉంటాయి. అక్కడ ఎటు చూసినా సంతోషమే. ఈ అద్భుతమైన రోజున ఆనందంలేని ఇళ్ళుండనే ఉండవు. కాని ఓసెఫ్ దేనికోసమో ఎదురుచూస్తూ కూర్చున్నాడు. దగ్గర్లో ఎవరో పొలం దున్నుతున్నారు. ఆ నాగలివాడి మధురస్వరం ఓసెఫ్‌కు వినబడుతోంది. ఆ పాట అతనిలోని రైతు హృదయాన్ని దహించివేస్తోంది. దొడ్లో సాలెగూళ్ళు నిండి, ఎత్తుగా నిలబడి ఉన్న నాగలిని చూస్తే అతని హృదయం బాధతో నిట్టూరుస్తోంది. మళ్ళీ తనకు జీవితంలో ఎప్పుడైనా కన్నన్‌లాంటి ఓ జత ఎద్దులు, ఓ నాలుగైదెకరాల మంచి భూమి వచ్చి ఈ నాగలిని ఉపయోగించగలుగుతాడా? అటువంటి రోజును చూసే అదృష్టం తనకుందా అని ఓసెఫ్ నిస్సహాయంగా ఆలోచించాడు.

"ఏమయ్యోయ్; ఎంతసేపని అట్లా కూచుంటావ్? జరిగిందేదో జరిగిపోయింది. కొట్టాయం వెళ్ళవా ఏమిటి? దాన్ని రేపు అత్తారింటికి పంపించవా ఏం?" ముభావంగా కూచున్న ఓసెఫ్‌ను భార్య మరియా మందలించింది.

కూతుర్ని మర్నాడే అత్తారింటికి పంపించాలి. ఇంకా పెట్టాల్సిన బట్టలు పెట్టనే లేదు. ఓసెఫ్‌కు ఇష్టం లేక కాదు గాని చేతిలో డబ్బులు లేవు. మరియా ఇరవై రూపాయల చీటీ కడుతోంది. దుర్భరమైన రోజుల్లోకూడా కడుపు కట్టుకుని, ప్రతి మెతుకూ జాగ్రత్తగా చూసుకుంటూ వాళ్ళు ఆ చీటీ కడుతున్నారు.

ఓసెఫ్ ఇంక దుకాణానికి వెళదామని లేచి నిలబడ్డాడు. "నాన్నా, రవికల గుడ్డ కాస్త మందం ఉండేట్టు చూడు," అని చెప్పింది కత్రికుట్టి.

"భూమిశిస్తు కట్టలేదు గదూ, అదికూడా కట్టిరా," అంది మరియా.


ఓసెఫ్ చంకలో గొడుగు పెట్టుకుని, భుజంమీద ఓ తుండు వేసుకుని, బొడ్లో ఓ పాన్ దోపుకుని బయల్దేరాడు.

ఈస్టర్ సందడి, ఆనందోత్సాహాలు కొట్టొయంలో ఏమీ తక్కువలేవు. క్రైస్తవుల దుకాణాలు ఒక్కటి కూడా తీసిలేవు. కాని బట్టల దుకాణాలు చాలానే ఉన్నాయి. ఓసెఫ్ ఒకటి రెండు దుకాణాలలోకి వెళ్ళి రకరకాల బట్టల ధరలు, నాణ్యత కనుక్కున్నాడు.

"అబ్బో - ఎంత ధరో!" బట్టలధర విపరీతంగా ఉన్నదని అతని అభిప్రాయం. "ఏదేమైనా నేనింకో రెండు మూడు దుకాణాల్లో కనుక్కోవాలి. ఎక్కడ అణా తక్కువకు దొరుకుతుందో ఎవరికి తెలుసు" అనుకున్నాడు. అట్లా దుకాణాలన్నీ తిరిగాడు. అట్లా నడుస్తూ నడుస్తూ మునిసిపల్ భవనం ముందుకు చేరుకున్నాడు. అక్కడ, గోడ బైటనే, చాలా ఎద్దుల్ని వరసగా నిలబెట్టారు. అవన్నీ ఎంత బక్కచిక్కి ఉన్నాయంటే వాటి పక్కటెముకలు లెక్కపెట్టొచ్చు. ఎముకలమీద కప్పిన చర్మం తప్ప మరేమీ లేదు. వాటిలో కొన్ని చివరి రోజుల్లో కొచ్చిన ముసలిఎద్దులు. కొన్నిటికి తోకలు తెగిపోయాయి. కొన్నిటికి ఏళ్ల తరబడి బళ్లు లాగిన గుర్తుగా మెడలు కాయగాసి ఉన్నాయి. కొన్నిటికి కొమ్ములు ఎదుగుదల ఆగిపోయి చాలా రోజులయినట్టున్నాయి. కొన్ని మనిషి భూతదయలేమిని ప్రకటిస్తున్నాయి. ఆ ఎద్దుల్లో అటువంటి సంగతులెన్నో కనబడతాయి. వాటన్నిటిమీదా మునిసిపాలిటీ నల్లని మృత్యుముద్ర వేసింది. వాటిలో ఇంకా ఏమన్నా మిగిలి ఉంటే ఈస్టర్ పర్వదినాన మాంసంగా మారబోతోంది. అట్లా ముద్రవెయ్యని పశువుల్ని కోసి అమ్మే కటికవాళ్ళమీద మునిసిపాలిటీ కఠిన చర్యలు తీసుకుంటోంది. ప్రజల ఆరోగ్యాన్ని అన్నిటికన్న మిన్నగా భావించే మునిసిపాలిటీ ఈ పరీక్షను ఎప్పుడూ సడలించలేదు. ఓసెఫ్ అక్కడ నిలబడి కాసేపు తేరిపార జూశాడు. అతని దయాహృదయం కదిలిపోయింది. అప్పటికే అక్కడ మొత్తం దాదాపు నలభై ఎద్దులున్నాయి. ఇంకా ముద్ర వెయ్యడానికి రైతులు పశువుల్ని తీసుకొస్తూనే ఉన్నారు. ఓసెఫ్ వాటివంక మరణశిక్ష పడిన మిత్రులవేపు చూసినట్టు చూసి ఉత్తరం వైపు నడక సాగించాడు.

హఠాత్తుగా అతను వణికిపోయాడు. నమ్మశక్యం కాని సంగతి. మందగిస్తున్న కంటిచూపు మోసం చేయడం లేదు గదా అనుకున్నాడు. అక్కడ ఎముకలు తేలిన ఓ పశువును చూసి, ఆ వృద్ధుడి హృదయం కుంగిపోయింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. జలదరింపు కలిగింది. ఔను, అది కన్ననే.

"కన్నన్" అంటూ గుండె లోలోతుల్లోంచి కేకవేశాడు. ఒక్క గంతులో ఆ పశువును చేరుకున్నాడు. తనకు సౌఖ్యాన్నీ, ఆశనూ కలిగించిన ఆ గొంతు విని, పశువు



మొద్దుబారిపోయింది. కన్నన్ అప్పుడు ఆ బ్రహ్మాండమైన భవనం ముందర తలదించుకుని ఉంది. మళ్ళీ ఒకసారి దాని చెవుల్లో జీవితం ప్రతిధ్వనించింది. తల పైకెత్తి చుట్టూ చూసింది.

"బిడ్డా, నన్ను గుర్తుపట్టావా? నిన్నీ స్థితిలో చూడవలసి వచ్చిందా?' ప్రేమ స్పందిస్తున్న గుండెలకు అతను ఆ పశువును హత్తుకున్నాడు. దాని తలమీద నిమిరాడు. ఆ చేతుల స్పర్శ గుర్తించగానే అది తోకెత్తింది. అది తన నోటితో కాదు, హృదయంతో ఏడ్చింది. కన్నన్‌మీద కూడా ముద్ర ఉందేమోనని చూశాడు ఓసెఫ్. ఔను, వెనుకకాళ్ళమీద ముద్ర స్పష్టంగా ఉంది. దాన్ని చెరిపెయ్యడానికి ప్రయత్నించాడు. కాని మునిసిపాలిటీ వేసిన ఆ నల్లముద్రను చెరపడం అంత సులభం కాదు.

### ఆలోచించండి - చెప్పండి

- ధరల ప్రభావం మనిషి జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుంది?
- 'భూతదయ' - అంటే ఏమిటో వివరించండి.
- "బిడ్డా, నన్ను గుర్తు పట్టావా? నిన్నీ స్థితిలో చూడవలసి వచ్చిందా?" దీని ద్వారా మీకేమి అర్థమయ్యింది?


## IV

కన్నన్‌కు కడుపుకింద ఒక రసి కారుతున్న పుండు ఉంది. దాని చుట్టూ ఈగలు ముసురుతున్నాయి.

"ఇదివరకు ఈ ఎద్దు నీదా?" అని అడిగాడు ఒక కటికవాడు.

"దీన్ని ఇక్కడికి తీసుకొచ్చింది నువ్వేనా?" అని అతణ్ణి అడిగాడు ఓసెఫ్.

"ఔను" అన్నాడు కటికవాడు.



కన్నన్ తన ప్రియమైన యజమాని చెమటబారిన ఒంటిని నాకడం మొదలుపెట్టింది. ఆ చెమటను చల్లబరచడానికే అది తన జీవితంలో అత్యధికం వెచ్చించింది. తన జీవిత చరమదశలో కూడ ఆ చెమటే నాకుతోంది. ఆ చెమట రుచి దానికి బాగుంటుంది, అది దాని జీవితంలో భాగం. ముసలిరైతు వెచ్చని కన్నీళ్ళు కన్నన్ ముఖంమీద రాలాయి.

"వెళ్ళనీ, ఇప్పటికే ఆలస్యమైంది. మధ్యాహ్నంలోపు ఈ మాంసం దుకాణానికి చేర్చాలి" ఒకరితో ఒకరు మాట్లాడుకుంటున్న ఆ ఇద్దర్నీ ఉద్దేశించి అన్నాడు దుకాణదారు. రెండు మూడు ఎద్దుల్ని తీసుకుని వెళ్ళిపోతున్న వ్యాపారుల్లో ఒకరు కన్నన్‌ను కూడా తీసుకురావాలని సైగచేశాడు. అంతే ఇక, ఓ రెండు మూడు గంటల్లో కన్నన్ ఈస్టర్ విందుకు మాంసాహారాన్ని సమకూరుస్తుంది.

SCERT TELANGANA

## V

చీకటి పడుతోంది. "దీపాలు పెట్టేలోపు ఈ అరుగు ఊడ్చెయ్యమ్మా" ఓసెఫ్‌కోసం ఎదురుచూస్తున్న మరియా కూతురికి చెప్పింది.

"నాన్నకింత ఆలస్యమయిందేమిటమ్మా?" అడిగింది కత్రి.

"పనిమీద వెళ్ళాడుగా, రానీ" అని మరియా సర్దిచెప్పింది.

"కొట్టాయంకే వెళ్ళి ఉంటే, ఎప్పుడో రావాల్సింది" తన బట్టలకోసం ఎదురుచూస్తున్న కత్రి అసహనంగా అంది. ఆమె కళ్ళు దారిమీదనే ఉన్నాయి. మరియా కూడ ఎదురుచూస్తూనే ఉంది. ఓసెఫ్ జాడలేదు. దీపం వెలిగించారు.

కింద ఆమె ఒక తెల్ల ఆకారాన్ని చూసింది. "అమ్మా, నాన్న వచ్చాడు. ఔనౌను, నాన్నే" కత్రి ఆనందంగా కేకలు వేసింది. నాన్నను తానే మొట్టమొదట చూశానని సంబరంగా ఉంది. తల్లీకూతుళ్ళిద్దరూ ఒకే ఆలోచనతో చూస్తూ నిలబడిపోయారు.

బట్టలకోసం ఆశగా ఎదురుచూస్తున్న ఆ యువతి కళ్ళ ముందరే ఓసెఫ్, కన్నన్‌తో కలిసి లోపలికి వచ్చాడు.

"ఓయ్, ఇది కన్నన్," కత్రి ఆశ్చర్యంతో అంది.

"బట్టలేవి? నువు దీన్ని కొనుక్కొచ్చావా?" అడిగింది మరియా. కన్నన్ తన పాత దొడ్లో ప్రవేశించి సంతోషంతో నేలమీద ఒరిగింది.

వాళ్ళు అతణ్ణి వెయ్యి ప్రశ్నలతో వేధించారు. గొంతెత్తి అరిచారు. ఓసెఫ్ ఒక్కమాట మాట్లాడలేదు. అతని ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయిపోయింది.

"నాన్నా! నువ్వు నాకింత పని చేస్తావని ఎప్పుడూ అనుకోలేదు" కళ్ళనిండా నీళ్ళతో అంది కత్రి.

"బిడ్డా," తండ్రి డగ్గుత్తికతో జవాబిచ్చాడు "నాకు నువ్వెంతో కన్నన్ అంతే. కసాయివాళ్ళు..." తుండుతో కళ్ళొత్తుకున్నాడు. అతను ఆ వాక్యం పూర్తిచెయ్యలేక పోయాడు.

### ఆలోచించండి - చెప్పండి

- కన్నన్ తన యజమానిపై అభిమానాన్ని, ప్రేమని ప్రదర్శించిందని ఎట్లా చెప్పగలవు?
- "నాన్నా! నువ్వు నాకింత పని చేస్తావని ఎప్పుడూ అనుకోలేదు" - అనే కత్రి మాటలను ఎట్లా అర్థం చేసుకుంటావు?
- "నాకు నువ్వెంతో కన్నన్ అంతే" - దీని ద్వారా నీకేమర్థమయ్యింది?

## ఇవి చేయండి

## I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం

**1. కింది అంశాల గురించి తెలుపండి.**

అ) ఈ కథను సొంతమాటల్లో చెప్పండి.

ఆ) 'మాట్లాడే నాగలి' అనే పేరు ఈ కథకు సరైందేనా? ఎందుకు?



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

## II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. కింది వాక్యాలు పాఠంలోని ఏ పేరాలో ఉన్నయో గుర్తించండి. ఆ వాక్యాల కింద గీత గీయండి.**

ఒకసారి దాని చెవుల్లో జీవితం ప్రతిధ్వనించింది.

అది తన నోటితో కాదు; హృదయంతో ఏడ్చింది.

**2. కింది పేరా చదవండి. ఖాళీలు పూరించండి.**

ఒక పండుగరోజు ఆశ్రమంలో సేవచేస్తున్న ఒక ముసలమ్మ, హాలుకు ఎదురుగా ఉన్న గడపలకింద ఉన్న నేలమీద ముగ్గులు వేస్తుంది. అది రమణమహర్షి కంట పడింది. పాటీ! అని భగవాన్ పిలువగా ఎంతో సంతోషంగా భగవాన్ దగ్గరకు వచ్చిందామె. ఇదిగో అవ్వా! కష్టపడి ముగ్గులు పెడుతున్నావు గాని అది బియ్యపుపిండేనా? అన్నారు భగవాన్. కాదు! రాతిముగ్గే అంది ఆ అవ్వ. అయ్యో! చీమలకైనా ఉపయోగం ఉండదే. ముగ్గులు పెట్టడం అంటే చీమలకు ఆహారం వేయడమన్నమాట. ఆ ధర్మం విడిచిపెట్టి అచ్చంగా రాతిముగ్గే పెడితే చీమలు ఆ పక్కకే రావు. ఒకవేళ వచ్చినా ఆ ఘాటుకు చచ్చిపోతాయి కూడ. ఎందుకది? కొంచెమైనా బియ్యపు పిండి చేర్చుకోండి - అని సెలవిచ్చినారు భగవాన్. ఆ మాటలు విన్నవారొకరందుకొని "ధనుర్మాసంలో ముగ్గులు అధికంగా పెట్టడం చీమలకు ఆహారం వెయ్యడం కోసమేనా!" అన్నారు. ఆ! కాకపోతే మరేమి? కొత్త ధాన్యం వచ్చిన సంబరంతో రంగవల్లులు తీర్చి చీమలకు ఆహారం వేస్తారన్నమాట. 'పెద్దలు నిర్ణయించిన ఆచారాలన్నీ జీవకారుణ్యంతో కూడినవే! ఇప్పుడవి పాటించేదెవరు? అలంకారానికి ఏదో చేస్తారంతే' అన్నారు భగవాన్.

అ) జీవకారుణ్యం అంటే ______

ఆ) ముగ్గులు పెట్టడంలో అంతరార్థం ______

ఇ) పూర్వాచారాలను పాటించాలె ఎందుకంటే ______

ఈ) పై పేరాకు శీర్షిక ______

ఉ) పై పేరాలోని ఐదు ముఖ్యమైన పదాలు ______

## III. స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) ఓసెఫ్ స్థానంలో మీరుంటే ఏం చేస్తారు?

ఆ) 'పశువులపట్ల క్రూరత్వాన్ని మానాలని ఉపన్యాసాలు వింటే ఓసెఫ్‌కు చిర్రెత్తేది' ఎందుకని?

ఇ) క్రయపత్రం అంటే ఏమిటి? ఏ సందర్భాల్లో దీన్ని ఉపయోగిస్తారు?

ఈ) కన్నన్‌తో తిరిగివచ్చిన తండ్రిని చూసి కత్రి "నాన్నా!" అంది. అట్లా అనడంలో ఆమె ఉద్దేశం ఏమై ఉంటుంది?



SCERT TELANGANA

**2. కింది ప్రశ్నకు పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) మూగజీవాలపట్ల మనం ఏవిధంగా ప్రవర్తించాలో ఈ పాఠం ఆధారంగా వివరించండి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

**1. కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

అ) 'మూగజీవులకు నోరొస్తే.....' ఊహాత్మకంగా ఒక కథ రాయండి.

## V. పదజాల వినియోగం

**1. గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.**

ఉదా: వృషభం పరమేశ్వరుడి వాహనం.

వృషభం = ఎద్దు

అ) పిల్ల మనసులో ఏముంటుందో తల్లి పసికడుతుంది.

ఆ) కన్నన్ ఠీవిగా నడుస్తూ వుంటే అందరూ మురిసిపోయేవారు.

ఇ) అసహనం మనిషిని ఇబ్బందులకు గురిచేస్తుంది.

ఈ) పశువులు మేతకు మాడితే ఇంటికి అరిష్టం దాపురిస్తదని రైతుల నమ్మకం.

**2. కింది వాక్యాలను చదివి సమానార్థం వచ్చే పదాలను గుర్తించి, వాటి కింద గీత గీయండి.**

అ) రైతు హృదయం దహించింది. కన్నన్ తన ఎదలో బాధను దాచుకున్నాడు. వీరి ఎడదను ఓదార్చేదెవరు?

ఆ) పక్షులు ఆకలిని తీర్చుకోవటానికి సంచరిస్తాయి. కానీ కొంగలు క్షుద్బాధ కోసం చెరువును ఆశ్రయిస్తాయి. ఇక ప్రజలు బుభుక్షను తీర్చుకోవడానికి పనిచేస్తారు.

ఇ) పంటలు చేతికొచ్చినందుకు రైతులు సంబరపడ్డారు. వారి పిల్లలు సంతోషంతో గంతులు వేశారు. వారి కుటుంబమంతా ఆనందంగా గడిపింది.

**3. కింది గీత గీసిన పదాలకు గల వేర్వేరు అర్థాలు (నానార్థాలు) రాయండి.**

అ) తూర్పు దిక్కు వెళ్తున్న భక్తులు మాకు దేవుడే దిక్కు అంటూ వేడుకొంటున్నారు.

ఆ) రాజేశ్ ఉత్తరం వైపున ఉన్న పోస్టాఫీసుకు వెళ్ళి ఉత్తరం తెచ్చాడు. ఎందుకు తెచ్చావని తండ్రి అడిగితే తగిన ఉత్తరమిచ్చాడు.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

4. కింది ప్రకృతి – వికృతి పదాలను జతపరచండి.

| ప్రకృతి | | | | వికృతి |
|---|---|---|---|---|
| 1) | మేఘం | (  ) | అ) | అచ్చెరువు |
| 2) | హృదయం | (  ) | ఆ) | ప్రేముడి |
| 3) | పశువు | (  ) | ఇ) | రాతిరి |
| 4) | ఆశ్చర్యం | (  ) | ఈ) | మొగము |
| 5) | సంతోషం | (  ) | ఉ) | అబ్బురం |
| 6) | దీపం | (  ) | ఊ) | ఎద |
| 7) | ప్రేమ | (  ) | ఎ) | పసరం |
| 8) | సహాయం | (  ) | ఏ) | మొగులు |
| 9) | ముఖము | (  ) | ఐ) | సంతసం |
| 10) | అద్భుతం | (  ) | ఒ) | దివ్వె |
| 11) | రాత్రి | (  ) | ఓ) | సాయం |

## VI. భాషను గురించి తెలుసుకుందాం

1. కింది సంధులను విడదీసి, సంధిపేర్లను రాయండి.

| | రూపము | విసంధి | సంధిపేరు |
|---|---|---|---|
| 1. | ప్రేమానురాగాలు | ______ + ______ | ______ |
| 2. | ఆనందోత్సాహాలు | ______ + ______ | ______ |
| 3. | ఇంకెవరు | ______ + ______ | ______ |
| 4. | ఎక్కడయినా | ______ + ______ | ______ |
| 5. | ఏమున్నది | ______ + ______ | ______ |
| 6. | చేతులెట్లా | ______ + ______ | ______ |
| 7. | పైకెత్తి | ______ + ______ | ______ |
| 8. | మరెక్కడ | ______ + ______ | ______ |
| 9. | సారమంతా | ______ + ______ | ______ |
| 10. | ఆలస్యమయ్యింది | ______ + ______ | ______ |
| 11. | దుర్భరమైన | ______ + ______ | ______ |
| 12. | రామేశ్వరం | ______ + ______ | ______ |

SCERT TELANGANA

**2. కింది సమాసాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.**

| | సమాసపదం | విగ్రహవాక్యం | సమాసంపేరు |
|---|---|---|---|
| అ) | కీళ్ళనొప్పులు | | |
| ఆ) | తల్లీకూతుళ్ళు | | |
| ఇ) | దయాహృదయం | | |
| ఈ) | భూమిశిస్తు | | |
| ఉ) | రాత్రింబవళ్ళు | | |
| ఊ) | పదిసంవత్సరాలు | | |
| ఎ) | నలుదిక్కులు | | |

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- నిత్యజీవితంలో జంతువులు, పక్షులపైన ప్రేమ చూపించే సంఘటనలు మీరు చూసినవి లేదా విన్నవాటి గురించి నివేదిక రాయండి. (లేదా)

  వివిధ జంతువులు / పక్షుల పెంపకందారుల వద్దకు వెళ్ళి, ఆయా జంతువుల / పక్షుల పెంపకంలో ఎలాంటి శ్రద్ధ కనబరుస్తున్నారో తెలుసుకొని నివేదిక రాయండి.

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పాఠంలోని కథను సొంతమాటల్లో చెప్పగలను. | అవును / కాదు |
| 2. | అపరిచిత గద్యం చదివి ఖాళీలను పూరించగలను. | అవును / కాదు |
| 3. | మూగజీవాలమీద ఎందుకు ప్రేమ చూపాలో రాయగలను. | అవును / కాదు |
| 4. | మూగజీవాలకు నోరొస్తే... కథను ఊహాత్మకంగా రాయగలను. | అవును / కాదు |

**సూక్తి**

కపట మానవ ప్రేమ కన్నా . . .
కల్మషంలేని మూగజీవుల అనుబంధం మిన్న

SCERT TELANGANA

## చదువండి - తెలుసుకొండి

### తెలంగాణకు సంబంధించినవి...

### తెలుగు సామెతలు

1) పండుగైనంక అల్లుడచ్చినట్లు
2) పందికొక్కు తనకిందికే దోసుకుంటది
3) పండిన చెట్టు మీదనే బండలు పడేది
4) నాయకుడు లేక నాటకమాడినట్లు
5) నడిచే ఎద్దును పొడిచినట్లు
6) తెగిన బొక్కెన నూతిల్దాక
7) తిట్లకునీవు తిండికినేను
8) గొర్రెలు దినెటోడు పోతె బర్రెలు తినెటోడచ్చె
9) సంకల పిల్లను పెట్టుకొని అంగడంత వెదికినట్లు
10) ఉండనీడిస్తే పండ మంచమడిగినట్లు
11) మాటలు నేర్చిన కుక్క ఉస్కో అంటే ఉస్కో అన్నదట
12) అడుతని నెత్తి బుడతడు గొడ్డె బుడతని నెత్తి బూదేవి గొట్టిందట
13) ఇంట్లో ఈగల మోత బయట పల్లకీలమోత
14) ఇటేటురమ్మంటే ఇల్లంతా నాదే అన్నడట
15) మింగ మెతుకులేదు కాని మీసాలకు సంపెంగనూనె
16) దుష్టువాళ్ళకు పోచమ్మ భయపడతదట
17) పట్టిపట్టి పంగనామాలు బెడితే గోడసాటుకు వోయి తుడుసుకున్నట్లు
18) గోరుచుట్టమీద రోకటిపోటు
19) పెనం మీంచి పొయిలో పడ్డట్లు
20) ఊపిరి లేనోడు ఉర్కవోతె పానం లేనోడు పట్టవోయిండు

### తెలుగు జాతీయాలు

| | జాతీయం | | సందర్భం |
|---|---|---|---|
| 1) | బండమీది రాత | - | శాశ్వతం |
| 2) | వండినకుండ | - | సిద్ధంగా ఉన్నది |
| 3) | కప్పనుదిన్న పాము | - | అచేతనం, మబ్బు |
| 4) | కుక్కబుద్ధి | - | స్థిరంగా ఉండకపోవడం |
| 5) | కుక్కబతుకు | - | ఎవరికీ పట్టనిది |
| 6) | గోడకు చెప్పినట్లు | - | వినిపించుకోకపోవడం |
| 7) | దున్నపోతుమీద వాన | - | స్పందించకపోవడం |
| 8) | బురదల పాతిన గుంజ | - | నమ్మదగనిది |

### తెలంగాణ పదజాలం

| | | |
|---|---|---|
| గంజు | - | పెద్దగిన్నె |
| కంచం | - | పళ్లెం |
| ముంత | - | చెంబు |
| అర్ర, మిద్దె | - | గది |
| లగ్గం | - | పెళ్ళి |
| అరుసుకోవడం | - | మర్యాదచేయడం |
| ఓమ | - | వాము |
| బూగ | - | తూనీగ |
| కుల్లా | - | టోపి |
| ధోవతి | - | పంచె |
| చెక్కి | - | గిర్ని, మర |
| చెద్దరు | - | దుప్పటి |

SCERT TELANGANA

ఉపవాచకం



# 1. చిత్రగ్రీవం

మూలం : ధనగోపాల్ ముఖర్జీ

పక్షి ప్రపంచంలో రెండు దృశ్యాలు మనోహరమైనవి. గుడ్డు బద్దలు కొట్టి తల్లిపక్షి పిల్లపక్షిని ఈ ప్రపంచపు వెలుగులోకి తీసుకొనిరావడం మొదటిది. అట్లా వచ్చిన పిల్లపక్షి నోటికి ఆహారం అందిస్తూ తల్లిపక్షి పెంపకం కొనసాగించడం రెండవది. ఇంతకు చిత్రగ్రీవం ఎవరు? దాని పెంపకం ఎట్లా సాగింది? అది ఎట్లా ఎగరడం నేర్చుకున్నది? అనే విషయాలను పాఠం చదివి తెలుసుకుందాం.

పది లక్షల జనాభా ఉందని మనం చెప్పుకునే కోల్‌కతా మహానగరంలో కనీసం ఇరవై లక్షల పావురాలు ఉంటాయి. ప్రతీ మూడో కుర్రాడి దగ్గర కనీసం ఒక డజను వార్తలు మోసే పావురాలు, గిరికీల పావురాలూ, పిగిలి పిట్టలూ, బంతి పావురాలూ ఉండటం కద్దు. పావురాలను మచ్చిక చెయ్యడం అన్న కళ వేలాది సంవత్సరాలుగా భారతదేశంలో కొనసాగుతోంది. ఆ కళ పుణ్యమా అని పక్షులను ప్రేమించేవారిని అలరించే పిగిలిపిట్ట, బంతి పావురం అన్న రెండు విశిష్టమైన పావురాల జాతులను భారతదేశం ప్రపంచానికి అందించింది. ఎన్నో శతాబ్దాలనుంచీ రాజులూ, యువరాజులూ, రాణులూ, యువరాణులూ తమతమ చలువరాతి మందిరాలలోనూ సామాన్యులూ, నిరుపేదలూ తమ తమ ఇళ్ళూ, పూరిళ్ళలోనూ–పావురాల మీద ప్రేమ, ఆప్యాయతలను కురిపిస్తూనే ఉన్నారు. శ్రద్ధాసక్తులను చూపిస్తూనే ఉన్నారు. గొప్పవాళ్ళ పూదోటలూ, ఫౌంటెన్లూ గానివ్వండి, సామాన్యుల పూలమడులూ, పళ్ళ చెట్లూ గానివ్వండి – అవన్నీ రకరకాల రంగు రంగుల పావురాలతోనూ, నీలికళ్ళతో కువకువలాడే గువ్వలతోనూ నిండి ఉండడం కద్దు.

ఈ నాటికీ విదేశీయులెవరైనా మన మహానగరాలకు వచ్చినట్టయితే వాళ్ళకు ఉల్లాసకరమైన చల్లనిగాలిలో గిరికీలు కొట్టే పావురాల బృందాలు కనిపిస్తాయి. ఆ పెంపుడు పావురాలకు తమ తమ డాబా ఇళ్ళమీద నిలబడి తెల్లజెండాలు ఊపుతూ సంకేతాలు అందించే అసంఖ్యాకమైన కుర్రాళ్ళు కనబడతారు. ఆ నీలాకాశంలో పావురాల గుంపులు పెను మేఘాలలాగా సాగిపోవడం కనిపిస్తుంది. మొదట అవి చిన్న చిన్న బృందాలుగా ఏర్పడి తమ తమ యజమానుల ఇళ్ళ మీద ఓ ఇరవై నిమిషాలపాటు చెక్కర్లు కొడతాయి. ఆ తర్వాత అవి క్రమక్రమంగా పైపైకి సాగిపోతాయి. వివిధ ప్రాంతాల నుంచి వెలువడిన వేరు వేరు బృందాలన్నీ మెల్లగా కలగలిసిపోతాయి. ఒక బృహత్తర సమూహంగా రూపొందుతాయి. కనుచూపుకు అందనంత ఎత్తుకు ఎగిసిపోతాయి. అలా కలగలిసి, ఎగసి గంటల తరబడి ఎగిరాక తిరిగి అన్నీ విడివిడిగా తమ తమ యజమానుల ఇళ్ళకు చేరుకొంటాయి. నగరంలోని ఇళ్ళు గులాబీ, పసుపూ, ఊదా, తెలుపులాంటి రకరకాల రంగులలో ఉన్నా! స్థూలంగా వాటి పైకప్పులు ఒకే పరిమాణంలో, ఒకే ఆకృతిలో ఉంటాయి. అయినా మరి ఆ వేలాది

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20



పావురాలు ఎన్నెన్నో దూరాలు కలిసిమెలిసి ఎగిరినాక, తిరిగి కచ్చితంగా తమ తమ ఇళ్ళకూ, గూళ్ళకు ఎలా చేరుకోగలుగుతున్నాయి అన్నది ఆశ్చర్యం కలిగించే విషయమే. నిజానికి పావురాలకు అద్భుతమైన దిశాపరిజ్ఞానం ఉంటుంది. ఏనుగులు, పావురాలకన్నా తమ తమ యజమానులపట్ల ఎక్కువ విశ్వాసం ప్రదర్శించే ప్రాణులను నేనింతవరకూ చూడలేదు. ఈ రెండిటితోనూ నాకు సన్నిహిత పరిచయం ఉంది. వనసీమలోని గజరాజులుగానివ్వండి, నగర సీమలలోని పావురాలు గానివ్వండి, అవి తమ యజమానులంటే ప్రాణంపెడతాయి. రోజంతా ఎక్కడెక్కడ తిరిగినా, ఏ గగన సీమల్లో ఎగిరినా చివరకి అవి తమకున్న అద్భుతమైన అంతః ప్రేరణాబలంతో తమ మిత్రుడూ, సహచరుడూ అయిన మానవుడి పంచకు చేరుకుంటాయి.

నా పెంపుడు ఏనుగు పేరు 'కరి', నాకో పెంపుడు పావురం కూడా ఉంది. దాని పేరు 'చిత్రగ్రీవం' 'చిత్ర' అంటే ఉల్లాసభరితమైన రంగులతో నిండిన – అని అర్థం. 'గ్రీవం' అంటే కంఠం. నా పావురం మెడ చిత్ర విచిత్ర వర్ణభరితం అన్న మాట. అప్పుడప్పుడు అందుకే మా పావురాన్ని 'హరివిల్లు మెడగాడు' అని ముద్దుగా పిలుస్తుంటాను.

చిత్రగ్రీవం కథను నేను మొట్టమొదట్నించీ మొదలెడతాను. ముందు దాని తల్లిదండ్రుల గురించి చెప్పుకొందాం. దాని తండ్రిపక్షి ఓ గిరికీల మొనగాడు. తల్లిపక్షి ఓ వార్తల పావురం. ఆ రోజుల్లో అది అతి సుందరమైన కులీన వంశానికి చెందిన పావురం. ఆ రెండు విశిష్టమైన పావురాలూ జతగట్టినాయి. గుడ్లు పెట్టినాయి. వాటికి పుట్టిన చిత్రగ్రీవం అందువల్లనే తర్వాతిరోజుల్లో యుద్ధరంగాల్లోనూ శాంతి సమయాల్లోనూ అమోఘంగా పనిచెయ్యగల వార్తాహరియైన పావురంగా రూపొందింది. తల్లిపక్షి నుండి తెలివితేటలు సంపాదించుకున్నది. తండ్రిపక్షి నుండి వేగం, చురుకుదనం, సాహసం సంతరించుకున్నది. అలా సమకూర్చుకున్న శక్తియుక్తుల పుణ్యమా అని అది ఎన్నోసార్లు శత్రువుల దాడి నుంచి ఆఖరిక్షణంలో ఆ దాడి చేస్తున్న డేగల తలలమీద నుంచే గిరికీలు కొట్టి తప్పించుకోగలిగింది. ఆ ముచ్చట్లు సమయమూ సందర్భమూ సరికూడినప్పుడు మరోసారి చెప్పుకొందాం.

ఇంకా గుడ్డులో ఉన్నప్పుడే చిత్రగ్రీవం ఓ ప్రమాదం లోంచి త్రుటిలో ఎలా తప్పించుకుందో ముందు చెపుతాను. ఆ రోజును నేను ఎప్పటికీ మరచిపోలేను. తల్లి పావురం పెట్టిన రెండుగుడ్లలో ఒకదాన్ని పొరపాటున జారవిడిచి పగలగొట్టిన రోజది. ఆ తెలివిమాలిన పనికి నేను ఈనాటికీ సిగ్గుపడుతూ ఉంటా. బాధపడుతూ ఉంటా. నేను పగలగొట్టిన ఆ రెండో గుడ్డులో ప్రపంచంలోకెల్లా అతి విశిష్టమైన పావురం ఉండేదేమో ఎవరికి తెలుసు! ఆ దుర్ఘటన ఇలా జరిగింది.

మాది నాలుగంతస్తుల మేడ. ఆ మేడ మీద పావురాల గూళ్ళు ఉండేవి. తల్లిపావురం గుడ్లను పొదుగుతున్న గూటిని నేను ఓ రోజు శుభ్రం చేద్దామని వెళ్ళాను. తల్లిపిట్టను మృదువుగా లేపి తీసి ఓ పక్కన ఉంచాను. తర్వాత ఒక్కో గుడ్డునే యథాస్థానంలో ఉంచాను. రెండో గుడ్డు మీద మెల్లగా దృఢంగా నే చేతిని ఉంచిన క్షణంలో జరిగిందా ప్రమాదం. నేనా

SCERT TELANGANA

గుడ్ల మార్పిడిలో ఉన్నప్పుడు – ఇంటి పైకప్పును తుఫాను ఎగురగొట్టినట్టుగా నా మొహాన్ని ఏదో బలంగా తాకింది. తీరా చూస్తే అది తండ్రిపావురం. రెక్కలతో బలంగా నా మొహాన్ని మోదుతోంది. ఇంకా దారుణం ఏమంటే నా ముక్కు మీద తన గోళ్ళను కూడా దిగవేసిందది. ఆ నొప్పి ఆ గగుర్పాటూ – వాటి పుణ్యమా అని రెండో గుడ్డును నాకు తెలియకుండానే ఎప్పుడు వదిలేసానో వదిలేశాను. అతికష్టం మీద ఆ తండ్రిపక్షిని దూరంగా తరిమేయగలిగాను. ఈ లోపల జరగవలసిన ప్రమాదం జరగనే జరిగింది. రెండో గుడ్డు పగిలి ఛిన్నాభిన్నమై నా కాళ్ళ దగ్గర పడి ఉన్నది. నా మీదా, ఆ దిక్కుమాలిన తండ్రిపక్షి మీదా నాకు ఒళ్ళు తెలియని కోపం వచ్చింది. నా మీద నాకెందుకు కోపం వచ్చిందీ అంటారా – తండ్రి పావురం నుంచి అలాంటి దాడి జరగవచ్చని నేను ఊహించి ఉండాలిగదా... జాగ్రత్తపడి ఉండాలిగదా. నేనేదో గుడ్లని సంగ్రహించడానికి వచ్చాననుకొందా తండ్రిపక్షి. ఆ అజ్ఞానంతో అది ప్రాణాలకు తెగించి మరీ నా మీద దాడి చేసింది. గుడ్లను ఎత్తుకు పోకుండా ఆపుదామనుకొన్నది. పొదుగుల కాలంలో గూళ్ళను శుభ్రపరచేటప్పుడు అన్ని రకాల సంఘటనలకూ, దాడులకూ మనం సిద్ధపడి ఉండాలి.

సరే – మళ్ళా మన కథ దగ్గరకు వద్దాం. గుడ్డు పై పెంకును ముక్కుతో పొడిచి పిల్లపక్షిని ఈ ప్రపంచంలోకి ఎప్పుడు తీసుకురావాలో తల్లిపక్షికి కచ్చితంగా తెలుసు. తండ్రిపక్షి కూడా అడపాదడపా గుడ్లమీద కూర్చొని పొదిగేమాట నిజమేగాని పొదగటం అన్న పనిని మూడింట రెండువంతులు నిర్వహించేది తల్లిపక్షే. ఆ మిగిలిన మూడోవంతు పొదిగేది తండ్రిపక్షే అయినా పిల్లపక్షుల్ని ప్రపంచంలోకి ఎప్పుడు తీసుకురావాలి అన్న విషయం దానికి తెలియదు. ఆ పరిజ్ఞానం తల్లిపక్షి సొత్తు. గుడ్డులోని పచ్చసొన, తెల్లసొన కలగలసి ప్రాణం పోసుకొని పిల్లపక్షిగా రూపొంది ప్రపంచంలోకి అడుగుపెట్టటానికి సంసిద్ధమయ్యే శుభముహూర్తం వచ్చిందని తల్లిపక్షికి అంత కచ్చితంగా ఎలా తెలుస్తుందీ అన్నది మన ఊహకందని విషయం. అలాగే పై పెంకు మీద ఏ చోటున ఎంత బలంతో ముక్కుతో తాకాలో కూడా తల్లిపక్షికి క్షుణ్ణంగా తెలుసు. పిల్లపక్షికి ఏ గాయమూ తగలకుండా సరైన ప్రదేశంలో సరైన సమయంలో ముక్కుతో గుడ్డును బద్దలుగొట్టడం, పిల్లపక్షిని ప్రపంచంలోకి ఆహ్వానించడం – ఇవన్నీ నాకు అద్భుత మనిపిస్తాయి.

చిత్రగ్రీవం పుట్టటం కూడా సరిగ్గా నేను పైన వివరించినట్టుగానే జరిగింది. గుడ్లను పొదగటం మొదలెట్టిన ఇరవయ్యో రోజున తల్లిపక్షి గుడ్డు మీద కూర్చోవడం మానేసి పక్క పక్కన తారాడటం గమనించాను. తండ్రిపక్షి మేడమీది పిట్టగోడమీంచి దిగివచ్చి గుడ్డును పొదగడానికి ప్రయత్నించిన ప్రతిసారీ తల్లిపక్షి ఆ తండ్రిపక్షిని ముక్కుతో పొడిచి దూరంగా తరిమేసేది. "నన్నెందుకిలా తరిమేస్తున్నావ్?" అన్నట్టుగా ఆ తండ్రిపక్షి కువకువలాడేది. "వెళ్ళవయ్యా వెళ్ళు. ఎంతో ముఖ్యమైన పనిలో ఉన్నాను. ఇబ్బంది పెట్టకుండా పక్కకు వెళ్ళు" అన్నట్టుగా తల్లిపక్షి తండ్రిపక్షిని మరికాస్త దూరంగా నెట్టేసేది. చివరికి తండ్రిపక్షికి అక్కడ్నుంచి వెళ్ళక తప్పలేదు.

అదంతా చూసి నాకు కంగారు మొదలయింది. గుడ్లు పొదగడం పూర్తవ్వాలనీ, పిల్లపక్షి ప్రాణం పోసుకొని గుడ్డులోంచి బయటపడితే చూడాలనీ నాకు మహా ఆత్రంగా ఉన్నది. మరి తల్లిపక్షి ప్రవర్తన చూస్తే విచిత్రంగా ఉందాయే! ఆందోళనతో, ఆసక్తితో, ఆత్రంగా గూటికేసి చూడసాగాను. ఓ గంట గడిచింది. పరిస్థితిలో మార్పు లేదు. మరో ముప్పావుగంట గడిచాక తల్లిపక్షి మెడ అటూ ఇటూ తిప్పుతూ శ్రద్ధగా ఏదో వినసాగింది. బహుశా గుడ్డులోపల కదలికల శబ్దాలయి ఉండాలవి. మెల్లగా తల్లిపక్షి శరీరంలో స్పందన మొదలయింది. దాని శరీరమంతా ఏదో తీవ్ర ప్రకంపన పాకుతోందా అనిపించింది. తల్లిపక్షిలో ఏదో దివ్య సంకల్పం చోటుచేసుకున్నట్టు అనిపించింది. తల నిక్కించి గురిచూసింది. రెండే రెండు ముక్కుపోట్లతో గుడ్డును పగలగొట్టింది. పిల్లపక్షి బయటపడింది. ఒళ్లంతా ముక్కు... చిన్న పాటి శరీరం. స్వల్పంగా కంపిస్తున్న శరీరం. 'ఇన్నాళ్ళూ తాను శ్రమపడిందీ, ఎదురుచూస్తున్నదీ ఇలాంటి బలహీనమైన నిస్సహాయమైన అర్భకమైన పిల్లపక్షి కోసమా?' అని తల్లిపక్షి ఆశ్చర్యపడినట్లు అనిపించింది. అయినా పిల్లపక్షి నిస్సహాయతను గమనించిన మరుక్షణం తల్లిపక్షి దానిని తన రొమ్ములోని నీలి ఈకలమాటున పొదవుకొంది.



SCERT TELANGANA

పక్షి ప్రపంచంలో రెండు దృశ్యాలు అతి మనోహరమైనవి. గుడ్డు బద్దలుగొట్టి తల్లిపక్షి పిల్లపక్షిని ఈ ప్రపంచపు వెలుగులోకి తీసుకురావడం అందులో మొదటిది. అలా వచ్చిన పిల్లపక్షి నోటికి ఆహారం అందిస్తూ తల్లిపక్షి పెంపకం కొనసాగించడం రెండోది. చిత్రగ్రీవం పెంపకం ఎంతో అనురాగంతో సాగింది. మనం చిన్న పిల్లల్ని ఎత్తుకొని లాలిస్తే ఆ పిల్లలకు ఎలాంటి హాయీ సౌఖ్యమూ లభిస్తాయో చిత్రగ్రీవానికి తన తండ్రిపక్షి, తల్లిపక్షులనుంచి అలాంటి వెచ్చదనం లభించింది.

చంటిపక్షులు ఎదిగి వచ్చే సమయంలో వాటి గూళ్ళలో మరీ ఎక్కువగా మెత్తటి దూదీ, పీచు లాంటి పదార్థాలను ఉంచగూడదు. వాటిని తగు మోతాదులోనే ఉంచాలి. లేకపోతే గూడు మరీ వెచ్చనైపోతుంది. అరకొర జ్ఞానపు పావురాల పెంపకందారులు పిల్లపక్షులు ఎదిగే సమయంలో తమ శరీరంనుంచే చాలా మోతాదులో వెచ్చదనాన్ని విడుదల చేస్తాయన్న విషయం గ్రహించరు. ఈ సమయంలో పావురాల గూళ్ళను మరీ తరచుగా శుభ్రం చెయ్యటం కూడా మంచిదిగాదు. తల్లిపక్షి, తండ్రిపక్షి ఆచితూచి గూటిలో ఉంచే ప్రతి వస్తువూ పిల్లపక్షి సుఖసౌకర్యాలకు దోహదం చేస్తాయి.

పుట్టిన రెండోనాటి నుంచే చిత్రగ్రీవం తన తల్లో తండ్రో గూటికి వచ్చిన ప్రతిసారీ తన ముక్కు తెరచి తన గులాబీరంగు ఒంటిని బంతిలా ఉబ్బించడం నాకు స్పష్టంగా గుర్తున్నది. బార్లా తెరచిన పిల్లపక్షుల నోళ్ళల్లో పెద్ద పక్షులు తాము సంపాదించిన ధాన్యపుగింజల నుంచి ఉత్పత్తి చేసిన పాలను పోస్తాయి. అలా పోసిన ఆ పదార్థం ఎంతో మెత్తగా ఉంటుంది. పెద్దపక్షులు ముందస్తుగా తాము సంపాదించిన గింజల్నీ విత్తనాల్నీ తమ కంఠంలో కాసేపు నాననిచ్చి మెత్తబరుస్తాయి. ఆ తర్వాతే ఆ ఆహారాన్ని పిల్లలకు అందిస్తాయి. పిల్లపక్షులకు నెలరోజుల వయసు వచ్చినపుడు కూడా పెద్దపక్షులు తిన్నగా గింజల్ని అందించవు. ముందు తమ కంఠంలో మెత్తబరిచినంక అందిస్తాయి.

మా చిత్రగ్రీవానికి ఆకలి ఎక్కువ. ఒక పెద్దపక్షి తన దగ్గరే ఉండి లాలిస్తూ తన బాగోగులు చూస్తూ ఉండగా, రెండో పక్షి తన కోసం ఆహారసేకరణలో నిమగ్నమై ఉండేలా చేసేది చిత్రగ్రీవం. తల్లితో సరిసమానంగా తండ్రి కూడా చిత్రగ్రీవం బాగోగులు సరిచూడడంలోనూ, ఆహారం అందించడంలోనూ పాలుపంచుకొందని నా అంచనా. తల్లిదండ్రుల శ్రమ, శ్రద్ధ పుణ్యమా అని చిత్రగ్రీవం మహా ఏపుగా ఎదిగింది. గులాబీరంగు మారి పసుపు కలిసిన తెలుపురంగు వచ్చింది. ఈకలు రానున్నాయనడానికి ఈ రంగు మార్పు మొదటి సూచన. తర్వాత చిన్న చిన్న బొడిపెల్లా ముళ్లపంది ముళ్లలాంటి ఈకలు వచ్చాయి. దాని కళ్ళ దగ్గర, నోటి దగ్గర అప్పటిదాకా వేలాడుతూ ఉన్న పసుపుపచ్చని చర్మాలు రాలిపోయినాయి. పొడవాటి, గట్టి, సూదిలాంటి ముక్కు రూపు దిద్దుకున్నది. ఎంతబలమైన ముక్కో... ఓ సంఘటన చెపుతాను.

చిత్రగ్రీవానికి మూడువారాల వయసప్పుడు దాని గూటిలోకి ఒక చీమ పాకింది. గూటి అంచున కూర్చొని ఉన్న చిత్రగ్రీవం ఎవరి ఉపదేశమూ లేకుండానే ఆ చీమను టక్కున తన ముక్కుతో పొడిచింది. అప్పటిదాకా ఏకఖండంగా సాగిన ఆ చీమ ఒక్క దెబ్బతో రెండు ముక్కలైపోయింది. తన ముక్కుతో ఆ చీమ తునకలను కదిపి చూసి తాను చేసిన ఘనకార్యం ఏమిటో అర్థం చేసుకునే ప్రయత్నం చేసింది చిత్రగ్రీవం. అది ఏదో తినే వస్తువు అనుకొని తమ పావురాల జాతికి మిత్రుడైన ఆ అమాయికపు నల్లచీమను చిత్రగ్రీవం పొడిచి చంపిందనడంలో సందేహం లేదు. తాను చేసిన పని చూసి చిత్రగ్రీవం పశ్చాత్తాపపడిందనీ మనం అనుకోవచ్చు. ఏదేమైనా చిత్రగ్రీవం మళ్ళా ఎప్పుడూ తన జీవితంలో మరోసారి చీమను చంపలేదు.

పుట్టిన ఐదో వారానికల్లా చిత్రగ్రీవం తను పుట్టిన గూటినుంచి బైటకు గెంతి పావురాళ్ళ గూళ్ళ దగ్గర ఉంచిన మట్టి మూకుళ్ళలోంచి మంచినీళ్ళు తాగే స్థాయికి చేరుకున్నది. రోజూ సొంతంగా ఆహారం సంపాదించుకునే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ చిత్రగ్రీవం స్థూలంగా తన ఆహారంకోసం తల్లిదండ్రుల మీదే ఆధారపడి ఉన్నది. నా ముంజేతి మీద కూర్చొని



SCERT TELANGANA

అరచేతిలో గింజల్ని ఒక్కొక్కటిగా పొడుచుకు తినేది. గారడీవాడు చమత్కారంగా బంతులను గాలిలోకి ఎగరేసి పట్టుకొనే విధంగా చిత్రగ్రీవం గింజలను తన గొంతులో పైకీ కిందకీ ఆడించి ఆ తర్వాత టక్కున మింగేది. అలా మింగిన ప్రతిసారీ నాకేసి చూసి 'భలే బాగా చేస్తున్నాను గదూ! మా అమ్మ నాన్న పైకప్పుమీద చలికాగుతున్నారు గదా... వాళ్ళు దిగివచ్చాక నేనెంత చురుకైన దాన్నో వాళ్ళకు చెపుతావుగదూ!' అన్నట్టుగా నాకేసి చూసేది. కానీ ఏమాటకామాట చెప్పుకొందాం. శక్తియుక్తులు పెంపొందించుకోవడంలో నా దగ్గర ఉన్న పావురాలు అన్నిట్లోకి చిత్రగ్రీవమే మందకొడి.

ఆ రోజుల్లోనే నేనో విషయం కనిపెట్టాను. గాలి దుమారాల్లో, కళ్ళు మూసుకుపోయే దుమ్మూ ఇసకల్లో పావురాలు నిరాటంకంగా ఎలా ఎగరగలుగుతాయో నాకు అప్పటిదాకా తెలియదు. రోజురోజుకీ పెరిగి పెద్దదవుతున్న చిత్రగ్రీవాన్ని దగ్గర నుండి గమనించే క్రమంలో ఓ రోజు దాని కళ్ళ మీదకు సన్నపాటి చర్మపు పొర సాగి రావడం గమనించాను. దాని కంటి చూపుగానీ పోవడంలేదుగదా అని భయపడి మరికాస్త పరీక్షగా చూడటంకోసం చిత్రగ్రీవాన్ని నా మొహం దగ్గరకు లాక్కున్నాను. అలా లాగగానే చిత్రగ్రీవం తన బంగారు రంగు కళ్ళు విప్పార్చి గూటిలో వెనక్కు వెనక్కు వెళ్ళిపోయింది. అయినా చెయ్యిజాచి పట్టుకొని మేడమీదకు తీసుకెళ్ళాను. ఆ మే నెల మండుటెండలో దాని కనురెప్పల్ని పరిశీలించాను. అప్పుడు కనిపించిందది: దాని కనురెప్పలకు అనుబంధంగా మరో పల్చని చర్మపుపొర ఉన్నది. నేను దాని మొహాన్ని సూర్యునికేసి తిప్పిన ప్రతిసారీ చిత్రగ్రీవం తన బంగారు కళ్ళమీదకు ఆ చర్మపు పొరను సాగలాగేది. అది కళ్ళకు రక్షణ కలిగించే చర్మపుపొర అనీ, దాని సాయంతో పావురాలు గాలిదుమారాల్లోగానీ, తిన్నగా సూర్యుని దిశగా గానీ ఏ ఇబ్బందీ లేకుండా ఎగరగలవనీ బోధపడింది.

మరో రెండువారాలు గడిచేసరికల్లా చిత్రగ్రీవం ఎగరడం నేర్చుకుంది. పుట్టింది పక్షి పుట్టుకే అయినా ఆ ఎగరడం నేర్వడం అన్నది అంత సులభంగా జరగలేదు. మన పిల్లగాళ్ళకు నీళ్ళంటే ఇష్టమేగావచ్చు. కానీ ఈత నేర్చుకోవాలంటే మునిగి తేలడమూ నీళ్ళు మింగడమూ తప్పవు గదా... అలాగే పిల్లపావురాలు కూడా ఎంతో కష్టపడితేగానీ ఎగరడం నేర్చుకోలేవు. చిత్రగ్రీవానికి తన రెక్కలు విప్పడం విషయంలో ఏదో సంకోచం ఉన్నట్టుంది. గంటల తరబడి మేడ మీద బాగా గాలి వచ్చేచోట కూర్చున్నా రెక్కలు విప్పి ఎగరడం విషయంలో మాత్రం దాని ధోరణి నిమ్మకు నీరెత్తినట్టు ఉండేది. ఈ సంగతి స్పష్టం అవడంకోసం మీకు మా మేడ ఎలా ఉంటుందో చెపుతాను. మాది నాలుగంతస్థుల ఇల్లు. మేడమీద చుట్టూ పద్నాలుగేళ్ళ పిల్లాడంత ఎత్తైన బలిష్ఠమైన కాంక్రీటు పిట్టగోడ. వేసవికాలంలో రాత్రిపూట మేమంతా మేడమీదే పడుకునేవాళ్ళం. అలాంటి సమయాల్లో ఎవరైనా పొరపాటున నిద్రలో నడుచుకుంటూ వెళ్ళినా మేడమీంచి వాళ్ళు అమాంతంగా పడిపోకుండా అడ్డుకొనేంత ఎత్తు ఉన్న పిట్టగోడ అది.

చిత్రగ్రీవాన్ని రోజు తీసుకెళ్ళి ఆ పిట్టగోడ మీద వదిలేవాడిని. అక్కడ ఆ గాలుల్లో అది అలా గంటల తరబడి కూర్చొని ఉండేది. అంతే తప్ప ఎగరడం గిగరడం అన్న పనులేవీ పెట్టుకొనేది గాదు. ఇలా కాదని ఒకరోజు పిట్టగోడ కింద కాసిని శెనగగింజలు పోసాను. కిందకి దిగివచ్చి ఆ గింజల్ని తిని పొమ్మని చిత్రగ్రీవాన్ని పిలిచాను. 'ఏవిటీ సంగతి?' అన్నట్టుగా కాసేపు చూసింది. నేను తీసుకువెళ్ళి తనకు ఆ గింజల్ని తినిపించబోవడం లేదని స్పష్టమయ్యాక అది పిట్టగోడమీదే అటూ ఇటూ పచార్లు చెయ్యడం మొదలుపెట్టింది. అడపాదడపా మెడనిక్కించి నాలుగడుగులు కిందనున్న గింజల్ని చూడటం మాత్రం మానలేదు. అలా ఆ నిరాశాభరితమైన నాటకం ఓ పావుగంట దాకా కొనసాగింది. చిట్టచివరకు అది సంకోచాన్ని అధిగమించి పిట్టగోడమీంచి కిందకు దూకనే దూకింది. దాని కాళ్ళు నేలను తాకే సమయంలో అప్పటిదాకా ఏనాడూ తెరచుకొని ఉండని దాని రెక్కలు – అది గింజలమీద వాలి బాలెన్సు చేసుకునే ప్రక్రియలో అప్రయత్నంగా హఠాత్తుగా చక్కగా విప్పుకున్నాయి. ఎంతటి ఘన విజయం!

SCERT TELANGANA

ఆ రోజుల్లోనే దాని ఈకల రంగు మారడం గమనించాను. అంతగా ఆకట్టుకోలేని బూడిదరంగు కలసిన నీలివర్ణపు ఈకలకు బదులుగా దాని ఒళ్లంతా సముద్రపు నీలిరంగు ఈకలతో ధగధగా మెరవసాగింది. దాని మెడప్రాంతం సూర్యకాంతిలో ఇంద్రధనుస్సు వర్ణాల పూసలగొలుసులా శోభిల్లసాగింది.

ఎగరడం అన్న మహత్తరమైన ఘట్టానికి చేరుకున్నది చిత్రగ్రీవం. దాని తల్లీ, తండ్రీ, చిత్రగ్రీవానికి ఎగరడం నేర్పిస్తాయని ఎదురుచూశాను. ఈ లోపల నాకు చేతనయిన రీతిలో నా వంతు ప్రయత్నం చేశాను. రోజూ చిత్రగ్రీవాన్ని మణికట్టు మీద ఉంచుకొని కొద్ది నిమిషాలపాటు చేతిని పైకీ కిందకీ పదే పదే కదిపేవాడిని. అలా కదిపినప్పుడు చిత్రగ్రీవం బాలెన్సు నిలదొక్కుకోవడం కోసం రెక్కలు విప్పడం ముడవడం చేసేది. అలా దానికి రెక్కలు ముడవడం విప్పడం అలవాటయింది. కానీ ఎగరడం అంటే ఇంకా చాలా తతంగం ఉంది కదా... ఆ మిగిలిన పాఠాలు నేర్పడం నా పరిధిలో లేదు గదా... అసలు ఎందుకీ ఆత్రం అని మీరు అనుకోవచ్చు. తోటి పావురాలతో పోలిస్తే చిత్రగ్రీవం ఎగరడం విషయంలో వెనకబడి ఉండటం దానికి ఒక కారణం. అదీ కాకుండా జూన్‌నెల వచ్చేసిందంటే వర్షాలు అందుకొంటాయి. వర్షాలు మొదలయ్యాయి అంటే పక్షులకు దూరాలు ఎగరడం అసాధ్యమవుతుంది. అంచేత వర్షాకాలం ముంచుకొచ్చేముందుగానే చిత్రగ్రీవానికి ఎగరడం నేర్పేయాలి అనుకొన్నాను.

మే నెల ఇంకా కొద్ది రోజుల్లోనే ముగుస్తుంది అనగా తండ్రిపక్షి చిత్రగ్రీవానికి ఎగరడం నేర్పే పని చేపట్టింది. ఆ రోజు అప్పటిదాకా బలంగా వీచి ఊరును చల్లబరచిన ఉత్తరపు గాలి సన్నగిల్లి మంద్రంగా సాగుతోంది. ఆకాశం కడిగిన నీలిముత్యంలా నిర్మలంగా ఉన్నది. దుమ్ము ధూళీ లేకుండా వాతావరణం స్వచ్ఛంగా ఉన్నది. ఊళ్ళోని ఇళ్ళ పైకప్పులూ, దూరాన ఉన్న పంటపొలాలూ – అన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. మధ్యాహ్నం మూడుగంటలవేళ. చిత్రగ్రీవం మేడ పిట్టగోడమీద కూర్చొని ఉన్నది. అప్పటిదాకా చుట్టుపక్కల గిరికీలు కొడుతున్న తండ్రి పక్షి వచ్చి ఎండకాగుతున్న చిత్రగ్రీవం పక్కన వాలింది. వాలి చిత్రగ్రీవం కేసి ఓ చూపు చూసింది. “ఏం వాయ్ బడుద్ధాయ్. మూడునెలలు నిండాయి. ఇంకా ఎగిరే ప్రయత్నాలేం లేవా? భయమా? అసలు నువ్వు పావురానివా, వానపామువా?” అన్నట్టుగా చిత్రగ్రీవం కేసి చూసింది. చిత్రగ్రీవం ఉలుకూ పలుకూ లేకుండా గంభీరంగా ఉండిపోయింది. తండ్రి పక్షికి చిర్రెత్తుకొచ్చింది గాబోలు – పావురాల ఫక్కీలో కువకువా కూస్తూ చిత్రగ్రీవాన్ని గద్దించసాగింది. ఆ గద్దింపుల జడివాననుంచి తప్పించుకుందామని చిత్రగ్రీవం పక్కపక్కకు జరగసాగింది. తండ్రిపక్షి పట్టు విడవకుండా కూతలు పెడుతూ రెక్కలు టపటపలాడిస్తూ తనూ జరగసాగింది. చిత్రగ్రీవం ఇంకా ఇంకా జరిగింది. తండ్రిపక్షీ జరగటం కొనసాగించింది. చిట్టచివరికి చిత్రగ్రీవం పిట్టగోడ అంచుకు చేరింది. ఇంకాస్త జరిగితే కిందపడే స్థితికి చేరుకుంది. ఉన్నట్టుండి తండ్రి పక్షి తన భారాన్నంతా చిత్రగ్రీవం మీద మోపేసింది. చిత్రగ్రీవం గోడమీద నుంచి జారనే జారింది. అలా ఒక అడుగు జారిందో లేదో స్వీయరక్షణకోసం అసంకల్పితంగా రెక్కలు విప్పార్చి గాలిలో తేలింది. మా సంతోషానికి అవధులు లేవు. అప్పటిదాకా కింద అంతస్తులోని నీళ్ళ కుండీలలో జలకాలాడుతున్న తల్లి పక్షి మెట్లమీదుగా మేడమీదికి చేరుకుని తనూ చిత్రగ్రీవానికి సాయంగా ఎగరసాగింది. అలా అవి రెండూ ఎంతలేదన్నా పది నిమిషాలపాటు ఎగిరాయి. ఆకాశంలో గిరికీలు కొట్టి వచ్చి కిందకు వాలాయి. అలా వాలేటప్పుడు తల్లిపక్షి రెక్కలు ముడిచి యథాలాపంగా తాను వాలదలచిన ప్రదేశంలో శుభ్రంగా వాలింది. చిత్రగ్రీవం మాత్రం నానా పాట్లు పడింది. ఒకటే కంగారు. ఒళ్ళంతా వణుకు. వాలే క్షణంలో దాని కాళ్ళు నేలను రాసుకుంటూ పోయాయి. అలా నేలను రాసుకుంటూ వెళుతూ, రెక్కల్ని కంగారు కంగారుగా టపటపలాడిస్తూ, తనను తాను బాలెన్సు చేసుకుంటూ బాగా ముందుకు సాగి ఆగింది. అలా ఆగినప్పుడు దాని రొమ్ము గోడను తాకింది. గబుక్కున రెక్కలు ముడిచేసింది. ఎలాగైతేనేం క్షేమంగా వాలి ఆగింది కదా! చిత్రగ్రీవం ఉత్తేజంతో రొప్పసాగింది. తల్లిపక్షి దానిపక్కకు చేరి ముక్కుతో నిమిరింది. దాని రొమ్ముకు తన రొమ్ము తాకించింది. చిన్న పిల్లాడిని లాలించినట్టుగా లాలించింది. తాను చేపట్టిన కార్యం విజయవంతంగా ముగియటం గమనించిన తండ్రిపక్షి జలకాలాడటం కోసం కింది అంతస్తులోని నీళ్ళకుండీల దగ్గరకు చక్కా ఎగిరిపోయింది.

ఉపవాచకం



# 2. షోయబుల్లాఖాన్

మూలం : చెర్విరాల బాగయ్య

పత్రికలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నకాలం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తా ప్రచురణ చేయడానికి సాహసించని పరిస్థితులు. అయినప్పటికీ తన 'ఇమ్రోజు' పత్రికద్వారా నిజాం ప్రభుత్వ విధానాలను, రజాకార్ల దుశ్చర్యలను ఎండగట్టిన కలం యోధుడు. సత్యప్రకటన తన జీవితానికి చరమగీతం పాడుతుందని తెలిసినా వెనుకంజవేయని ధీశాలి. నిజాన్ని నిర్భయంగా రాసి రజాకార్ల చేతిలో బలైన అమరుడు షోయబుల్లాఖాన్ జీవితాధ్యాయాన్నిచదువుదాం.

వీరజనని శ్రీ భారతమాతను
మహామహుండగు మహాత్మగాంధిని
జనవందితుడగు జవహర్‌లాలును
పూజనీయుడగు బోసుబాబును
వందనీయుడగు వల్లభ్ భాయిని
పరిపరి విధముల భారత వీరుల
ప్రస్తుతింతు నా భావము లోపలనూ తందాన తాన
ఆస్తికత్వమున ఆనందముతోనూ తందాన తాన
తందాన భాయి రాజవందనాన తందాన తాన

**హాస్యం** : అరే భాయి యేదైనా కథ మొదలు పెట్టేటప్పుడు మూలపురుషులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనో లేక విఘ్నేశ్వరున్నో గ్రామదేవతనో తలంచుటొప్పుగాని భారతమాత నట, మహాత్మాగాంధీయట, జహ్వారులాలట ఈ క్రొత్తక్రొత్త దేవతలెవరో కాని నేనవి విని యెరుంగలేదు.

**కథ** : ఓహో! నీవింకా నిద్రలో నుండి కలలుగంటున్నావన్నమాట. పైన పేర్కొన్న వారలు మన భారతదేశపు దాస్యశృంఖలముల విడదీయుటకై అనేక కష్టనష్టముల కోర్చి కారాగారాల కేగి ప్రాణముల బలినొసంగి స్వాతంత్ర్యము గలుగ జేసిన సత్పురుషులు. వీరిని గాక ఇంకెవరిని స్తుతించగలము.

**హాస్యం** : అటులైన సరే కాని నీవిపుడు చెప్పదలచుకున్న కథేమిటో చెప్పరాదా.

SCERT TELANGANA



కథ : చెప్పెద వినుము.

రామరావణుల యుద్ధము గాదోయి తందాన తాన
కౌరవ పాండవ కథయిది గాదోయి తందాన తాన
పూర్వ రాజుల చరిత్ర యిది గాదూ తందాన తాన
తందాన తందాన తందాన తందాన తాన
తందాన భాయి రాజవందనాన తందాన తాన

హాస్యం : సరే! నీవు జెప్పునది బాగానే యున్నది. ఆ కథ గాదు ఈ కథ గాదు. ఏ కథ గాకపోతే నీవు జెప్పదలచుకున్న కథేమిటో చెప్పెదవా? ఊరక కాలయాపన జేసెదవా?

కథ : వినుము. నేనిపుడు చెప్పబోయే కథ మహాత్మాగాంధికి అత్యంత ప్రియభక్తుడును, దేశ సేవా దురంధరుడును, నిష్పక్షపాత హృదయుండును అగు షోయబుల్లాఖాన్‌ను దుర్మార్గులు ఏ విధంగా హత్యగావించి యుండిరో ఈ ప్రజానీకమునకు కథారూపకముగా దెలియజేయువాడను.

హాస్యం : అబ్బా యెంతమాట నుడివితివిరా. ఆ మాట వినిన తోడనే నావంటిలో నుండు రక్తమెల్లను నీరయ్యెను. నోట దడియారెను. గుండెలవిసిపోయెను. సరే కానిమ్ము.

కథ : వినుము

భారతావనిలో భాగ్యనగరమందూ తందాన తాన
మానుకోట తాలూక యందున తందాన తాన
శుభ్రవాడు యనె చిన్న గ్రామమందూ తందాన తాన



SCERT TELANGANA

మహమ్మదీయుడు హబీబుల్లా ఖాను తందాన తాన
పతివ్రతయగు తన భార్యతోన గూడి తందాన తాన
ఏడుగురి బిడ్డల గన్నవాడయ్య తందాన తాన
అయినను ఒక్క బిడ్డ బ్రతుక లేదు తందాన తాన
పూర్వఫలంబుని బొగులు చుండిరయ్యా తందాన తాన
అంతలోనే భగవంతుని దయ వల్లా తందాన తాన
హబీబుల్లాఖానుని యిల్లాలు  తందాన తాన
మరల చూలు దాల్చెనూ తందాన తాన
తందాన తందాన తందాన తందాన తాన
తందాన భాయి రాజవందనాన తందాన తాన

ఇట్లుండగా సుమారు 29 సం॥ల క్రితము ఒకనాడు విశ్వవంద్య బాపూజీ విజయవాడకు వెళ్లుచున్నాడు. దారిలో అనగా మానుకోట స్టేషన్లో హబీబుల్లాఖాన్ గారు పోలీస్ ఇనస్పెక్టరుగా ఉన్నారు. బాపూజీని తదేక దృష్టితో చూశారు. వెంటనే హబీబుల్లాఖాన్ అత్యంత భక్తితో వారికి నమస్కరించాడు. అంత బాపూజీ దివ్యమంగళ విగ్రహము తన కన్నులలో నిండిపోయినది. అటు పిమ్మట ఇంటికి చేరిన హబీబుల్లా ఖానుకు పుత్రోదయము కల్గిందనే వార్త విని పరుగున వెళ్లి తన పుత్రుడిని చూసి సంతోషించాడు. పుట్టినవాడు అంతా గాంధీలాగానే ఉన్నాడనుకొన్నాడు. ఇట్లు బాలషోయబుల్లాఖానుడు శుక్లపక్షచంద్రునివోలె దినదినాభివృద్ధి జెందుచు తన వచ్చిరాని మాటలతో వృద్ధ జననీజనకులతో ముద్దుగొల్పుచు

తందాన తందాన తందాన తందాన తాన
తందాన భాయి రాజవందనాన తందాన తాన
షోయబుల్లాఖాను దమ్మయ్యా తందాన తాన
వివేకమతనిలో మొలుక లెత్తెనయ్యా తందాన తాన
దేశసేవయే దేవుని సేవంచూ తందాన తాన
తన మదిలోపల దలచు చుండెనయ్యా తందాన తాన
విశ్వమానవ భ్రాతృత్వంబయ్యా తందాన తాన
ఎంత దాచిన దాగకుండెనయ్యా తందాన తాన
మబ్బుల్లోని చంద్రుని రీతిగనూ తందాన తాన
ప్రకాశ మానంబగుచుండేనయ్యా తందాన తాన
తందాన తందాన తందాన తందాన తాన
తందాన భాయి రాజవందనాన తందాన తాన

అంత కొన్నాళ్లకు ఔజా అనే ఆమెతో వివాహము జరిగెను.

భళానోయి భాయి తమ్ముడా సై దేశబలానోయి దాదానా

బాపూజీకి పరమభక్తుడు
భారతవీరుల పరమానుచరుడు



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

సత్య అహింసల ప్రచారకుడు
లోభత్వమునకు లొంగని వాడు
ప్రజాక్షేమమే గోరెడు వాడు
షోయబుల్లా ఖానుడమ్మయ్యా

భళానోయి భాయి తమ్ముడా సై దేశ బలానోయి దాదానా.

ఇట్లుండ హైద్రాబాదు ప్రభుత్వము మత ప్రేరణ జేయుచు రజాకార్లనెడు దుష్టశక్తుల బోషించుచు, మొత్తము రాష్ట్రమంతటా లూటీలు, గృహదహనాలు, హత్యలు, మానభంగములు మున్నగు బీభత్సములు బాహాటముగా యా రజాకార్లు జేయుచుండిరి. అప్పట్లో మన షోయబుల్లాఖానుడు తాజ్వీ అనే ఉర్దూ పత్రిక ద్వారా ఆ రజాకార్లు వారి నాయకుడగు ఖాసింరజ్వీ క్రూర కృత్యములను ఖండించుచు వచ్చెను. షోయబుల్లాఖానుడు తమ జాతి వాడయ్యి కూడా తమకు విరుద్ధంగా నడచుకొనుట ఖాసింరజ్వీకేగాక హైద్రాబాదులోనుండు సమస్త మహమ్మదీయుల కిష్టము లేకుండెను. అందువల్ల ఆ పత్రిక తే.21 అజూర్‌సన్ 1357 ఫసలీ రోజున ఆపివేయబడెను. అటు పిమ్మట షోయబుల్లాఖానుకు జాతీయ ఉరుదు పత్రిక లేకపోయెనని మనోవేదన గలిగి ఆ కొరత దీర్చుటకై దైనెల సన్ 1357 ఫసలీనాడు "ఇమ్రోజ్" అను దినపత్రికను ప్రారంభించెను. మన షోయబుల్లాఖాను జాతీయవాది, గాంధీగారి సిద్ధాంతములనే ఆచరించువాడు, మహాధైర్యశాలి. ధైర్యముతో పత్రిక ద్వార జాతీయ భావముల వెల్లడించుచు, చక్కని విమర్శలు జేయుచు నిజమైన వార్తలను ప్రకటించుచుండెను.

భళానోయి భాయి తమ్ముడా సై దేశ బలానోయి దాదానా

షోయబుల్లాఖానునిపై నీ
ప్రభుత్వమీర్ష్య భావంబు చేత
కాగితమిచ్చుట బందు జేసిరీ
వెంటనే యప్పుడు సెన్సార్ పెట్టిరి
అనేక చిక్కులు గలుగ జేసిరి
అయినను యించుక భయపడలేదు
తన యత్నంబు తప్పనె లేదు
న్యాయమె నన్నిటి జయమొసంగునని
అనుకొని యుండెను షోయబుల్లాఖాన్

భళానోయి భాయి తమ్ముడాసై దేశ బలానోయి దాదానా

ఇట్లుండగా మహాత్ముడి అకాలమరణవార్త అకస్మాత్తుగా షోయబు విన్నాడు. నిర్ఘాంతపడ్డాడు. ఇంట తనగదిలో వెక్కివెక్కి యేడుస్తున్నాడు. బలమైన అతని శరీరం దుఃఖావేశంతో వణికి పోవుచున్నది. నోరు పెకలటం లేదాతనికి. ఇంతలో తన తల్లి వచ్చి నాయన ఏడవకుము. ఆయన మహాత్ముడు అతనికి అంతా సమానమే. చావుబ్రతుకుల్లో ఆయనకు భేదం లేదు. హిందూ, ముస్లింలలో సోదర భావాన్ని పెంపొందించుటకై ఆయన మహోత్కృష్టమైన సేవ జేశాడు. నీవు దుఃఖించుట మానుము. నాయనా? ఏది ఒకసారి నవ్వుము. అని దీనంగా బ్రతిమాలుతున్న తన తల్లినిజూసి షోయబుల్లాఖానుడు అమ్మా! రేపు నీకొడుకు స్వాతంత్ర్యము కొరకు బలైతే నీవు దుఃఖించవా యని యడిగినాడు.

ఆ మాటలకు ఆ షోయబుల్లాఖానుని తల్లి, నాకొడుకే అంతటి భాగ్యవంతుడై ప్రజాసేవలో ప్రాణాలు విడిస్తే సత్యం ప్రచారంలో అమరుడైతే నిజంగా నేను నవ్వుతాను. తండ్రి యిది ముమ్మాటికి నిజము అని తల్లిజెప్పిన ధైర్యవచనాలకు సంతోషించినాడు. దుఃఖమును పోగొట్టుకున్నాడు. ఇట్లుండ నీతనిపై కొందరు వ్యతిరేకులకు మరింత విషము తలకెక్కుచునే



SCERT TELANGANA

యున్నది. పది నెలల నుండి తన సంపాదకీయ వ్యాసములు వారినే గాక ప్రభుత్వమును గూడ గడగడ వణికించినవి. నిజమే ఈలాంటి దేశభక్తులను జూచి ఖాసీంరజ్వీ ఊరుకోగలడా! 19–08–1948 రోజున జమ్రుతు మహలులో సభజేసి యేమన్నాడంటే

భళానోయి భాయి తమ్ముడా సై దేశబలానోయి దాదానా

హిందూగాని ముస్లింగాని
ప్రభుత్వానికి వ్యతిరేకంగా
ప్రచారమును గావించినచో
పట్టివాన్ని ప్రాణాల్ దీయుడీ
బర్చిలాతో బొడచి వేయండీ
వారి చేతులు నరికి వేయండీ
నేనుండగ మీకేమి భయము
అని యిటు యటు వలెను ఖసీం రజ్వీ
రజాకారులనే రాక్షస మూకను
పంపివేసెను మచ్చరంబుతో

భళానోయి భాయి తమ్ముడా సై దేశ బలానోయి దాదానా

షోయబుల్లాఖానుకు అదివరకే యీ నిశాచరులు తన ప్రవర్తనను మార్చుకొమ్మని జాబులు రాశారు. అట్లు మార్చుకొనకుండినచో ప్రాణములు దక్కవని యెన్నో తీర్ల బెదరించినారు. అయినప్పటికిని సత్యమునకు పాటుపడ్డ మన షోయబు యీ బెదిరింపులకు జంకలేదు. తనను ఇంచుకైనను మార్చుకోలేదు. ఇట్లుండ 20–08–1948 నాడు ఒక పేరు వూరులేని ఉత్తరం ఒకటి వచ్చింది. అందులో "నీవు గాంధీ కొడుకువా" జాగ్రత్త డొక్క చీల్చి వేస్తాం. ఇదివరకీలాటివెన్నో ఉత్తరాలు రాలేదా! అనుకొన్నాడు. తన పత్రికాలయములో కాంగ్రెసు నాయకులు రామకృష్ణారావు, రంగారెడ్డి మొదలగు షోయబు మిత్రులు యీ బెదరింపు ఉత్తరములను గూర్చి చర్చించారు. శ్రీయుత రామకృష్ణారావుగారు షోయబు నామాట నీవు తప్పుగా భావించవద్దు, ఎందుకంటే రాక్షస రజాకార్లు నీమీద కక్షపెంచుకున్నారు. ఎప్పుడైనా ఏమైనా జరుగవచ్చు. నీవు జాగ్రత్తగా ఉండుము అని చెప్పినప్పటికిన్ని షోయబ్ తన విశ్వాసమును వదలలేదు. మఱునాడు 21–08–1948 రోజున తన కార్యాలయములో రాత్రి 12.30 వరకు 22–08–1948 తారీకు పత్రికకై "నేటి భావాలు" అను శీర్షికతో నొక వ్యాసమును రాసి అక్కడినుండి బయలుదేరి గాఢాంధకారములో విజయాన్ని పొందిన సైనికునివలె సమీపములోనున్న తన యింటికి వస్తున్నాడు మన షోయబు. యింతలో

భళానోయి భాయి తమ్ముడా సై దేశ బలానోయి దాదానా

తందాన తందాన తందాన తందాన తాన
తందాన భాయి రాజవందనాన తందాన తాన
తలుపు చప్పుడు జేయుచుండెను
అంతలోనె తన వెనక వైపున
వెంబడిబడ్డ వేటకుక్కలు
రజ్వీ బంట్లు రాక్షస మూకలు
గుణహీనులును కొరవి దయ్యములు


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20
SCERT TELANGANA

మర్మము దెలియని దుర్మార్గులును
ప్రజల పాలిటి బలు పిశాచములు
దోపిడి దొంగలు దుష్టశక్తులు

భళానోయి భాయి తమ్ముడా సై దేశ బలానోయి దాదానా

మన షోయబుల్లాఖాన్‌ను తుపాకులతో ఢాం ఢాం ఢాం అని కాల్చినారు. అతడు నేల కూలినాడు. ఆ కిరాతకుల కసి అంతతో దీరలేదు. ఏ చల్లని చేయి తన జనుల నోదార్చి సత్య అహింస, ధీర, సోదరత్వ ప్రచారాన్ని చేసిందో, ఏ వీరహస్తం శత్రువులను, నిజాం అరాచకత్వాన్ని, దౌర్జన్యాలని నిర్భయంగా విమర్శించిందో. యే కరకమలము 'ఇమ్రోజ్' పత్రికా కన్యను తీర్చిదిద్ది అలంకరించి సాహిత్య మాతృవాడిని సంతృప్తి పరచిందో అట్టి షోయబు కుడి చేయిని దుండగులు నరికివేసినారు. షోయబు బావమర్ది వెనుకాల నుండి వస్తూ అరిచాడు. ఆయనకు కూడా గుండు దెబ్బ తగిలింది. పడిపోయాడు. రెండు చేతులు మణికట్టు వరకు తీశారు. మిక్కుటముగా అరచుటచే ప్రక్కవారు పరుగెత్తుకొని వచ్చారు. గుండాలు పరుగెత్తినారు. తలుపు తెరుచుకొని షోయబు భార్య, తల్లిదండ్రి ఒక్కుమ్మడి పైనబడ్డారు. కౌగిలించుకొన్నారు.

తందాన తందాన తందాన తందాన తాన
తందాన భాయి రాజవందనాన తందాన తాన
చుట్టు ప్రక్కల వారు వచ్చినారు తందాన తాన
మిత్రులందరు చేరుకున్నారయ్య తందాన తాన
షోయబు ఖానుడీ శరీరమందుండే
రక్తధారలు గారుచున్నవయ్యా
స్పృహ దప్ప లేదింకను షోయబు
తనవారిని కన్నుల జూశాడు
తందాన తందాన తందాన తందాన తాన
తందాన భాయి రాజవందనా తందాన తాన

వీరపత్ని భర్తపై బడి నీవెందుకు అరచలేదు. ఆ దుష్టశక్తులను వెన్నంటి తుపాకితో కాల్చి అయ్యో ఎంతటి ప్రమాదం సంభవించినది. అవుజా నేను బిగ్గరగా అరచిన యెడల పిరికితనమవుతుంది. వీరుడై చచ్చిన వాడికే స్వర్గం. ఇదే నిజమైన అహింసా సిద్ధాంతం. తల్లిని జూచి అమ్మా! నేనెలాగైన యీ లోకాన్ని విడిచిపోతాను. నీవు వీరమాత వనిపించుకొమ్ము. అవుజా నీవు నిండు చూలాలివి. నీవు నా ధర్మపత్నివని కీర్తినిలుపవా? నీవు వీరమాత వౌతావు. మీరు యిట్లా ఏడిస్తే నా ధైర్యం సన్నగిల్లుతోంది. ఆనాడు మన బాపు మనను విడచిపోయిన నాడు నన్ను ఏమని ఓదార్చినావమ్మా! అబ్బా!!

భళానోయి భాయి తమ్ముడా సై దేశబలానోయి దాదానా

ఇవియే షోయీబు ఆఖరిమాటలు
హాయిగ సంతలో నిద్రించినాడు
అతని యాత్మ మహాత్మలో గలిసే
అమరజీవియై యలరారె నయ్య

భళానోయి భాయి తమ్ముడా సై దేశబలానోయి దాదానా

ఉపవాచకం



# 3. చిందు ఎల్లమ్మ

మూలం : డా॥ కె.ముత్యం

జానపదకళల్లో ఒక ప్రత్యేకతను సంతరించుకున్న కళారూపం చిందు బాగోతం. తన అలంకారంలో స్త్రీ, పురుష పాత్రలను సమర్థంగా పోషిస్తూ, ఆబాలగోపాలాన్ని రంజింపచేసిన చిందు కళాకారిణి చిందు ఎల్లమ్మ. చిందు బాగోతం ప్రదర్శన గురించి ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.

నేను చిందుల ఎల్లమ్మను. మాది నిజామాబాద్ జిల్లాలోని చిన్నాపురమనే పల్లెటూరు. మేము మాతాతల కాలం నుండి ఇదే ఊర్ల ఉంటున్నం. నాకుబాగా యాదికున్నది. ఒకనాడు మా నాయన ఏమన్నడంటే "ఆ శెరువు కట్ట కడుతున్నప్పుడు పుట్టినవు బిడ్డా" అని. దాన్నిప్పుడు మనం నిజాంసాగర్ అంటున్నం. నేను బాసరల పుట్టిన్నట. అందుకే మా నాయన నాకు సరస్వతి అని పేరు పెట్టిండు. తర్వాత ఎల్లమ్మ తల్లిగ మార్చిండ్రు.

మాచిందులోల్లకు పూర్వం ఇనాములేమి లేకుండె. చిందాట ఆడుకుని బతుకుతుండేటోళ్లం. మా ఊళ్లో ఎక్క అయ్యగారు అని ఒకాయన చదువు చెపుతుండె. ఆయన దగ్గరకు సదువుకునెటందుకు పోదామనుకుంటే మాకు పలకలు దొరకక పోయేవి. అక్షరాలు పెట్టిచ్చినందుకు మేము ఆయనకు ఏమీ ఇచ్చెటోళ్లం గాదు. ఎందుకంటే ఇచ్చెతందుకు మాతాన ఏముండేదిగాదు! ఇంకోముచ్చట జెప్పుడు మర్చిపోయిన! మాతాన పలకలు లేకుండే అని చెప్పిన గదా! అయితే సక్కగున్న పెద్ద బోకె పెంకలు ఏరుకచ్చుకొని దానిమీద బొగ్గుతో రాస్తుంటిమి. తర్వాత ఎప్పుడోగద! బలపాలచ్చినయి. అయ్య వారి దగ్గర పెద్దబాలశిక్ష పుస్తకం ఉండేది. ఎప్పుడూ దాన్నే సదివెటోళ్లం. అప్పుడు అదే మాసదువు. సదువుతానే నేను చానా కష్టపడ్డ బిడ్డా! మాకు అప్పుడు భూములు లేకుండె. తీనణాకు (తీన్ అణాలు అంటే 18 పైసలు) మానెడు వడ్లు అస్తుండె.

నేను మరీ చిన్నగుండంగ ఊర్లె రెండు, మూడు భాగోతాలే ఆడెటోల్లు. మావోళ్లకు అప్పుడు ఎక్కువ ఆటలు రాకపోతుండె ఎల్లమ్మాట, చెంచులక్ష్మి, సారంగధర ఈ మూడు ఆటలే ఊకే ఆడుతుండె.

మాఊర్ల అందరికి సిన్నప్పటినుండి భాగోతం నేర్పుతుండె. పెద్దోళ్లు నాకు నాలుగేండ్లు ఉండంగ నా ముఖంకు రంగు ఏసిండ్రు. బాలకృష్ణుని ఏషం గట్టిచ్చినరు. మావోల్లు పర్ద ఎనుక పాట పాడితే నేను పర్దముంగట ఎగిరిన. ఇగ అప్పటి నుండి మాతల్లి దండ్రులు యేషం ఏయించి నాచేయి పట్టుకపోయి తోలేసి ఎగురుమని అంటుండె. అట్ల నాకు భాగోతం ఆడుడు అలవాటు చేసినరు. నేను ఎనిమిదేండ్లప్పుడు బాలకృష్ణుని యేషం, తర్వాత రంభ యేషం కడుతుంటిని.

SCERT TELANGANA

ఇగ అట్లనే ఆడుకుంట నేను పెరిగి పెద్దగయ్యేదాక ఆ యేషాలే ఏసిన. ఆడికెల్లి ఇగ పెద్దయేషాలు అంటే... అక్కయేషం, అత్తయేషం, బబ్రువాహనల చిత్రాంగద, సుందరకాండల సీత, సతీసావిత్రిల సావిత్రి యేషాలు ఏసిన. అట్లనే రాజు, వాలి, ధర్మాంగుడు, కుశలుడు, హనుమంతుడు ఇట్ల మగ యేషాలు కూడా కడుతుంటిని.

భాగోతంల అంబకీర్తన పాడిపిచ్చినమంటే ఇగ అయిపాయె ఆట శురైందన్నట్టే. భాగోతంలో రంభ యేషం వచ్చినంక గోపాల కృష్ణుని యేషం అస్తది. "రంభా ఊర్వశులమమ్మా మాయమ్మా" అని పాడుకుంట పిల్లల్ని పర్దముందు ఆడిపిస్తే అది అంబకీర్తన అన్నట్లు. అంబకీర్తన అంటే ప్రార్థననే. ఇగ ఆట మొదలు వెట్టుడే.

సిన్ని కృష్ణుడనురా – బలువన్నెలు దెలిపెదరా
చెన్నుమీరగ – గొల్లభామల చెంత జేరెదనురా...

అని పిల్లలతో పాడిపించి, భాగోతం మొదలుపెడతం. పర్ద ఎనుక యేషాలు తయారయ్యేడిదాక ఇదే ఉంటది. ఎందుకంటే అటు పిల్లలకు నేర్పినట్లుంటది. ఇటు యేషాలు తయారైనట్లుంటది. అసలు భాగోతం మొదలు పెట్టినప్పుడు ముందుగల్ల గణపతి ప్రార్థన, సరస్వతి ప్రార్థన చేస్తం. తర్వాత భాగోతం మొదలయితది.

కొత్తది ఏదన్న ఇన్పిచ్చిందంటే ఆ పాటనే ఊకేపాడుతుంటిని. మాతాత అంటుండె "నీకు కీర్తి రావాల. తల్లిదండ్రులకు పేరు దేవాల. రాజ్యం మీద పేరు నిలపాల" అని.

ఇట్ల భాగోతాలు మా ఊర్లనే గాక, మాచుట్టు పక్క ఊర్లల్ల కూడా ఆడుతుంటిమి. అట్లనే బాన్సువాడ, మద్నూరు, దేగ్లూరులో గూడ ఆడినం. షాపురం, సైనిపురం, అద్దంపురం మీదికెల్లి నర్సాపురం (మెదక్) దాక పోతుంటిమి. ఇట్ల మస్తు ఊర్లు తిరిగి ఆడుతుంటిమి. యాడ వానాకాలం వస్తే ఆడనే ఉంటుంటిమి.

**చిందుభాగోతం :**

భాగోతం అన్నా యక్షగానం అన్నా రెండూ ఒకటే... చిందు భాగోతానికి పేరు రావాలని చిందు యక్షగానం అంటం. గని తేడా ఏమీ లేదు...

చిందోల్ల ఆట అంటే పెద్దోల్లు (పై కులస్థులు) రారని చిందు యక్షగానం అంటం.

భాగోతం పొద్దుగాల్ల పదిగొట్టంగ మొదలైతే, రాత్రి ఆరయితది, యేడు అయితది పూర్తి అయేసరికి... గూట్లె దీపాలు వెట్టే యాల్ల అయితదనుకో...

మేం యక్షగానం పుస్తకాలు తీసికొచ్చి సదువుకుంటం... సదివి దాంట్ల ఇష్టమైనవి తీసుకుంటం. లేకుంటే ఆకులు మార్చేస్తం. పక్కన పెట్టేస్తం... సారమున్నది తీసుకొని సారంలేనిది ఇడిసిపెడతం.

ఒకటే పుస్తకంల కెల్లి చిరుతల భాగోతులు, దాసరోల్లు, మేము తీసుకున్నా మా దరువులకు అనుకూలంగా మార్చుకుంటం. "ఇన్నవ సీత..." అని చిరుతల దరువుకు అనుకూలంగా వాళ్లు మార్చుకుంటే, "ఇన్నావా... సీతా... మాతా..." అని మేం పాడుతం. సారమంతా అదే. పాటంతా అదే. వేషమూ అదే. కాని దరువులే వేరు.

భాగోతంల ఏ పాటకు ఆ పాట రాగం వేరేగుంటది.

ఇప్పటి రాగాలు అల్కగ (తేలిక – సులువు) ఉంటయి. అప్పటియి గొట్టుగ ఉంటయి.

ఆట తాళం, ఆదితాళం ఎక్కువనుకో – భూపాలం, కాంభోజ, మోహన, అసావేరీ రాగాలల్ల పాటలు, పద్యాలు పాడుతం. అట్లనే రూపక, ఆటతాళం... ఇట్ల అన్నీ పాడుతం...

జుళువ తాళం – ఉరుకుడు మీద, చల్తీగా పడే తాళం... నటన చల్తీ పోవాలంటే జుళువ తాళం పడతది.

**అనరో తమ్ముడా!**

**వినుము తెలిపెదనిప్పుడు... విడువక జేసే విప్రుడనేనే...**

రాజు పాత్రలకు పడతది. దీనిల అడుగు, తాళం, రాగం చల్తీగా, కలిసి నడుస్తయి. సుత్తిగంతు, కత్తెర అడుగు, కుంగి ఒప్పెనము, చక్రములు అనేటి గంతులు, అడుగులు ఉంటయి. ఇవ్వి మా భాగోతములోనే ఉంటయి మరి. ఇవన్నీ మా తాతల నుండి వస్తున్నై. ఇక దరువులు ఉంటయి మా భాగోతంల... వీరాభిమన్య యక్షగానంల సుభద్ర యేషం వచ్చింది.

ఆమె...

**నా పేరు సుభద్ర యనే – నాతి యందురే**
**గోపాల కృష్ణుని నామమెపుడు – కోరియుండునే**
**చండ పరాక్రముడైన మా మామ – పాండు యందురె**
**బలవంతులైన ధర్మ భీమ – బావలందురే**
**మొలకైన నకుల సహదేవులు – మరుదులందురే...**

సుభద్ర తన కథ జెపుతున్నదన్నట్లు దరువు సాగుతది.

మా చిన్నప్పుడు మద్దెల, తాళాలు, గజ్జెలు గివ్వే వాయిద్యాలు ఉంటుండె... పేటి (హార్మోనియం), తర్వాత వచ్చె... గని ముందు కాలంల పూ... పూ... అని ఊదేటిది బుర్ర ఉంటుండె... దాన్ని పుంగి అంటుంటిమి... సన్నాయి పలికేటపుడు సుతి (శృతి) కోసం ఒక బాజా ఉండదా... గసుంటిది.

ఈ పుంగిని భాగోతం మొదలైన కెల్లి అయిపోయిందాకా ఊదాల... ఊదీ ఊదీ దమ్ముకు అస్తుండె మాకు... ఒక్కల్లకు దమ్ముకు అస్తే ఇంకొకల్లు తీసుకుంటుండ్రి.

మొగోల్లూ ఊదుతుండ్రి... ఆడోల్లూ ఊదుతుండ్రి.

ఎండిపోయిన ఆనిగెంకాయను (సోరకాయ) బుర్ర కాయ అంటం గద... దానికి తొడిమె దగ్గర రంధ్రం చేసి, పీక పెట్టి, మైదం (మైనం) పూసి పుంగి తయారుజేస్తుంటిమి... పాటకు స్వరం కలుపాలని... అట్ల పుంగి జేసుకుంటుంటిమి...

తబలా, పేటి (హార్మోనియం), తాళం, గజ్జెలు, మావోళ్లే వాయిస్తరు. ఒక యేషం వాదం అయినంక ఆయన వోయి పేటి మీదనో, మద్దెల మీదనో (వాయిస్తూ) కూసుంటడు, అట్లనే యేషం తోటి. ఆయనక వాదం మళ్లా వస్తే పరదముందుకొస్తడు. మరొకళ్లు వోయి ఆయన జాగల కూసుంటరు.

యేషాలు కట్టెటోళ్లకి వాయిద్యాలు వాయించుడు రావాల. ఒకలు కాకపోతే మరొకళ్లు అందుకోవాల గద.

మా భాగోతంల తెర వెనక పల్లవి ఉండాలె. అది పెద్దల సందీ ఉన్నది. దాన్ని 'వెనక పల్లవి' అంటం...

అది లేకపోతే పాట, ఆట రుచి రాదు. తైతకధోం తకధోం – అని వెనక పల్లవి పాడేటోల్లు అన్నదాకా తెరముందాడే మా యేషాలకు కాలు లెవ్వనే లెవ్వది... ఒక పాట, దరువు అయిపోయినట్లయితది.

మేం పాడుతుంటె వెనుక పల్లవి అందుకుంటరిగ మావోల్లు...

ఇగ అస్సలు సంగతి బుడ్డర్‌ఖాన్ యేషం. ఆ యేషం సూసెటోళ్లను కడుపుబ్బ నగిపిస్తది. అది లేకుంటే మా భాగోతంకు నిండుదనమే లేదు.

భాగోతంల ఎవరి పాత్రలు వాళ్ళకే వుంటయి. వాళ్లు లేరనుకో... మేమే సదురుకుంటం...



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

సారంగధర, చెంచులక్ష్మి, సతీసావిత్రి, ప్రహ్లాద, మైరావణ, మాంధాత చరిత్ర, రామాంజనేయ, సతీ అనసూయ, సతీ తులసీ, బబ్రువాహన, బాలనాగమ్మ, హరిశ్చంద్ర, అల్లీరాణి, గంగా కళ్యాణం, రామదాసు చరిత్ర, సుగ్రీవవిజయం – ఇట్లా నేను ఇరవై ఐదు భాగోతాలల్ల మేటి యేషాలు యేస్తుంటి... అవసరమయితే మగ యేషాలు గడుతుంటి, మేటియే. ఆ యేషం ప్రభ దానిమీదికి తెప్పిస్తుంటి.

వాటి మాటలు, పాటలన్నీ రూఢిగా ఉంటయి. మరిచిపోకడలేదు. మల్ల మల్ల సూసుడు లేదు. సదువుడు లేదు... దీనికి ఇది దీనికి ఇది... అని మనుసుల ఉంటది.

ఎవరన్నా ఆడుతున్నా, పాడుతున్నా, వచనం చెప్పినా అవన్నీ మా తలకు ఎక్కించుకుంటం...

ఈ విధంగా పాడితే ఈ విధంగా ఆనాల అని మనసుకు పడతది...

ఉండేతందుకు మాదిగిండ్లల్ల జాగలేకుంటే సెట్ల కింద ఉన్నరట. ఇట్ల కష్టపడ్డరు మా సిందోల్లు పిడీలసంది.

మావోల్లను కల్లుతాగి యేషం కట్టనీయము.

మా చిందుకళ భగవంతుని దయవల్ల ఇప్పుడు పైకెక్కింది గని. హీన పుట్టువడి ఉండె. ఎవరు గానకపోతుండె.

దావఖాన్లకు పోదమంటెగాని, రోగమొచ్చి ఇంత కపూరం (తినే కర్పూరం) ఏసుకుందామంటే కూడా పైసల్లేకుంటుండె అప్పుడు! అట్లనే కొంతమంది సనిపోయింద్రు. ఊర్ల మాలోల్లకు నీరటి పనంట. ఇంత యెవసమంట (వ్యవసాయం) ఉంటది. అట్లనే మాదిగోల్లకి సెప్పులు చేసే కస్పి (వృత్తి) ఉన్నది. బండి జోల్లో, ఆరెకట్టో యేసిస్తే కాపోల్లు ఇన్ని ఇత్తులు (గింజలు) పెడతరు. ఈళ్లు బతుకుతరు. మాకేమున్నదయ్యా? భాగోతం ఆడాల. బతకాల.

పాతరోజుల్ల భాగోతమాడితే ఏం దొరుకుతుండె. ఎట్ల బతికింద్రో మా చిందోల్లు 'ఏమో! ఏండ్లకమాన...! (తరబడి)

మేం దసరకు పెట్టె పూజ చేస్తం.

ఇగ దీపావళి అయినంక ఊల్లల్లకు బయల్దేరితే సంకురాత్రి, శివరాత్రి దాకా బాగోతాలు ఆడుతనే ఉంటం ఊర్లల్ల.

మళ్లీ వానాకాలం అప్పుడే ఇంటికొస్తం. ఆరుద్రకార్తెకు ఊరంతా అడివిపాలైతెరుగద ఇగ... మమ్మల్ని ఎవరు చూస్తరు.

ఇగ అప్పుడు అడక్కచ్చుకున్నదుంటే తింటం. లేకుంటే బాకీ తెచ్చుకుంటం. కొందరు కూలీకి పోతరు.


ఈ వయసుల నేను కూడా మా మేళం తోటి పోతా. లేకుంటే 'ఎల్లమ్మ బృందం' అని ఎట్లంటరు.

మాకు అందరి కళారూపాలు నచ్చుతయి. హైదరాబాదుల కథల మల్లవ్వ ఉంటది. ఆమె కథలు మంచిగ చెపుతది... నాకు మనసౌతది. అది శారదకాల్లది.

ప్రజలు మమ్ముల ఎప్పటినుంచో బతికించుకుంటున్నరు గనీ, సర్కారుమాత్రం మమ్ములను నటరాజరామకృష్ణవల్ల పట్టించుకున్నది. ఒకసారాయన చిందు పాడమని అన్నడు. ఆయనకోసమని చెంచులక్ష్మి భాగోతం ఆడినం. తన షాలువాతీసి నాకు కప్పిండు. సింధును సర్కారుకు గుర్తుజేసిండు ఆయన. మాకు సర్కారును సూపిచ్చిండు.

ఈ సుట్టుపక్కల ఇసుంటి కళాకారులు లేరు. 'చిందుల ఎల్లవ్వది సాగుతది ఇట్ల' అంటారు ఇతర కళాకారులు... దాసుడు (దాచిపెట్టడం) ఏంటికి ఉన్నది చెప్పాల...! ఇగ ఇట్లనే చెప్పుకుంట పోతం... బతుకంతా...

**తన చిందుగానంతో, నటనతో, తెలంగాణతోపాటు అనేక ప్రాంతాల వారిని మెప్పించిన కళాతపస్విని చిందుఎల్లమ్మ. 2005 సంవత్సరంలో నవంబరు 9వ తేదీన నిజామాబాదు జిల్లాలో అమ్దాపూర్‌లో మరణించింది.**



ఉపవాచకం

# 4. ఇల్లు-ఆనందాల హరివిల్లు

**భారతీయ కుటుంబ వ్యవస్థ అనుసరణ యోగ్యమైనదని అంతర్జాతీయ సమాజం అనేక ప్రశంసలు కురిపించింది. తీయని అనుబంధాల సమాహారం, ఆత్మీయతల మందిరం అయిన ఇల్లు, కుటుంబం యొక్క గొప్పదనం తెలుసుకుందాం. కుటుంబ విలువలు కాపాడుకుందాం.**

పక్షి ఆకాశమంతా విహరించి వచ్చినా తిరిగి చేరుకునేది తన గూటికే. మనిషికూడా ప్రపంచంలోని అద్భుతమైన ప్రదేశాలెన్నింటినీ తిరిగినా చివరకు చేరుకునేది తన ఇంటికే. అందుకే మనిషి జీవితంలో ఇంటికి చాలా ప్రాధాన్యం ఉన్నది!

ఇల్లంటే ఇటుకలు, ఇసుక, సిమెంటు, రాళ్ళతో కట్టిన నాలుగు గోడల నిర్మాణమో, ఓ పూరిగుడిసో, ఓ బంగళానో, భవనమో కాదు. ఇల్లంటే మన భావోద్వేగాలన్నింటినీ పంచుకునే అనుబంధాల వేదిక.

ఇల్లంటే ........... అమ్మ,

ఇల్లంటే .......... నాన్న,

ఇల్లంటే .......... కుటుంబసభ్యులు

అక్కా చెల్లెళ్ళు, అన్నా తమ్ముళ్ళు తాతయ్య, నాన్నమ్మ, .............. ఇదే కుటుంబం.

ఇట్లు సుఖసంతోషాల వాకిలి. ఆనందాల లోగిలి. ప్రేమానురాగాల పల్లకి. తల్లిదండ్రులు పిల్లలు కలిసి ఉండే ఒక అందమైన ఆత్మీయ ప్రదేశం.

సామాజిక, మానసిక శాస్త్రవేత్తల అభిప్రాయంలో "ఒకే గొడుగునీడలో ఉంటూ, మానసిక, ఆర్థిక సహాయ సహకారాలందుకుంటూ, సహజ ఆమోదయోగ్యమైన సంబంధాలున్న స్త్రీ, పురుషులు, వారి పిల్లలూ ఉన్న ఈ సమూహమే కుటుంబం".

కాలాలు మారినా, ఏళ్ళు గడిచినా భారతదేశంలో ఇప్పటికీ కుటుంబవ్యవస్థ నిలిచి ఉన్నది. విశ్వసనీయత, సమగ్రత, ఏకత అనే మూడు మూలస్తంభాల మీద మన కుటుంబవ్యవస్థ ఆధారపడి ఉన్నది. "అందరి సుఖంలో నా సుఖం ఉన్నది. వారికోసమే నా జీవితం" అనే త్యాగభావన భారతీయ కుటుంబానికి ప్రాతిపదిక.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20


SCERT TELANGANA

సమాజంలో కుటుంబమే అత్యంత కీలకమైంది. ప్రప్రథమ సమూహం పరివారమే. వ్యక్తి సమాజంలో ఒంటరిగా మనజాలడు. కుటుంబంతో తాను మమైకమై జీవించడంద్వారా ఆనందాన్ని పొందుతాడు. అందుకే పుట్టుకతోనే మనిషికి కుటుంబంతో విడదీయలేని అనుబంధం ఏర్పడుతుంది.

పోషణ, భద్రత కల్పించడం కుటుంబవ్యవస్థలో మౌలికాంశాలు. కుటుంబ వ్యవస్థకు పునరుత్పత్తి ప్రాథమిక లక్షణం. కుటుంబంలో అనుభవాలు, అనుభూతులు కాలానుగుణంగా మారుతూంటాయి. పిల్లలకు సమాజంలో ఒక స్థానాన్ని కల్పించడం, విచక్షణ జ్ఞానాన్నివ్వడం, సంస్కృతిని వారసత్వంగా అందించడం కుటుంబ వ్యవస్థ ప్రధాన ఉద్దేశాల్లో ఒకటి.

కుటుంబ భావన, వ్యవస్థ నిన్నమొన్నటిదిగాదు. దీనికి వేలసంవత్సరాల చరిత్ర ఉన్నది. ఇది వివాహబంధంతోనే మొదలవుతుంది. నాగరికతా సౌరభం లేని ఆదిమమానవుడు పెళ్ళి, ఇల్లు అనే బంధం లేకుండా స్వేచ్ఛగా జీవించాడు. కొంత నాగరికత అలవడిన తరవాత సమూహాలను ఏర్పరచుకొని జీవించడం ప్రారంభించాడు. వ్యవసాయంచేసి పంటలు పండించడం మొదలుపెట్టాక గుహలనుంచి గృహంలోకి మారిపోయాడు. అదే ఒక పెద్దమలుపు. తాను నిర్మించుకున్న ఇంటిపై, కుటుంబంపై ఎనలేని మక్కువను పెంచుకున్నాడు. వివాహబంధాన్ని వివేచనతో ఏర్పరచుకొని అందమైన కుటుంబాన్ని రూపొందించుకున్నాడు.

వేదకాలంనాటికే నాగరికమైన పద్ధతుల్లో ఈ కుటుంబవ్యవస్థ ఏర్పడిందని కొందరు చరిత్రకారుల భావన. వారి రాతల వల్ల కుటుంబ జీవనవిధానం ఆ కాలంలో అత్యున్నత స్థాయిలో ఉండేదనీ, భార్యాభర్తల సంబంధ బాంధవ్యాలు ఉన్నతశ్రేణిలో ఉండేవని తెలుస్తూంది. వేల ఏండ్ల నుంచీ విలువలకు కట్టుబడి జీవిస్తూ విశ్వానికి ఆదర్శంగా నిలిచిన కుటుంబ వ్యవస్థ మనది. ఆనాడు కుటుంబ జీవనం చాలా వరకు సాఫీగా సుఖంగా సాగిపోయిందనీ, అది చాలా నియమబద్ధంగా ఉండేదని తెలుస్తూంది.



కుటుంబంలో తల్లి పాత్ర అత్యంత కీలకమైంది. గౌరవప్రదమైంది. అందుకే ఒకప్పుడు మాతృస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. 'ఇంటికి దీపం ఇల్లాలు' అనే నానుడిని బట్టి భారతీయ సంస్కృతిలో స్త్రీకి ఎంతటి ఉన్నతస్థానం ఇచ్చారో అర్థమవుతుంది.

SCERT TELANGANA

అంతేగాక ఆనాటి సమాజంలో ఉన్న నాలుగు ఆశ్రమాల్లోనూ గృహస్థాశ్రమానికి అత్యంత ప్రాధాన్యం ఉండేది. గృహస్థాశ్రమ ధర్మం ద్వారా ఇతర ఆశ్రమ ధర్మాలు సక్రమంగా కొనసాగుతాయి. అందుకే గార్హస్థ్య జీవితం అతి సుందరమని వారి భావన. పూర్వకాలం నుండీ ఉన్న కుటుంబ వ్యవస్థ ప్రధానంగా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. ఈ వ్యవస్థ నేటికీ దక్షిణ భారతదేశం కంటే ఉత్తర భారతదేశంలో ఎక్కువగా కొనసాగుతున్నది.

ఉమ్మడి కుటుంబంలో కష్టసుఖాల్ని అందరితోనూ పంచుకోవడం జరిగేది. తద్వారా పరస్పర ఓదార్పు లభించేది.

ప్రతిపనిలోనూ సహాయ సహకారాలూ, సూచనలూ, సలహాలు లభించేవి. అందరూ శుభాశుభాలకు చేదోడువాదోడుగా నిల్చేవారు. ఆనందాన్ని పంచుకొనేవారు. ఇలా వాతావరణం ఆహ్లాదకరంగా, సందడిగా ఉండేది.

చిన్నపిల్లలకైతే మహాసరదాగా ఉండేది. అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల ఒడిలో ఒదిగిపోయేవాళ్ళు. పెద్దల ఆలనాపాలనలో, వాళ్ళు చెప్పే కమ్మని కబుర్లూ, కథలతో ఆరోగ్యంగా పెరిగేవారు. అంతేగాక వాళ్ళ కుటుంబాల గొప్పతనాన్ని, గొప్పవాళ్ళను గురించి తెలుసుకొనేవారు. దేవాలయాలకు వెళ్ళాలన్నా, అంగట్లోకి వెళ్ళాలన్నా, మరెక్కడికి వెళ్ళాలన్నా పిల్లలు పెద్దలతో వెళ్ళటానికే ఉత్సాహపడేవారు. ఇంట్లో అందరికీ పెద్దలపట్ల భయభక్తులుండేవి. తల్లిదండ్రుల సేవ భగవంతుని సేవగా భావించేవారు. ఈ విధమైన జీవనవిధానం వల్ల జీవితపథనిర్దేశం జరిగేది.

పిల్లలు స్వేచ్ఛగా వాళ్ళ స్నేహితుల ఇండ్లకు వెళ్ళడం, అక్కడ పెద్దవారితో చనువుగా మాట్లాడడం వీళ్ళ ఆలోచనలకు పదును పెట్టేది. సమాజ స్థితిగతులనూ, ఆచారవ్యవహారాలనూ, సంస్కృతి సంప్రదాయాలనూ పిల్లలు ప్రత్యక్షంగా విని, చూసి ఆకళింపు చేసుకొనేవారు.

ఉమ్మడి కుటుంబాల్లో పిల్లలందరికీ ఒకేసారి భోజనాలు వడ్డించడం అనేది మహాసరదాగా ఉండేది. ఆడవాళ్ళకు అదో అవధానం చేసినంత పనయ్యేది.

ఆటపాటల్లోనూ, కొట్లాటల్లోనూ, అవసరాలను నెరవేర్చుకోవడంలోనూ ఒకరితో ఒకరు పోటీపడేవారు. కాని పెద్దల కనుసన్నలలో, భయభక్తులతో క్రమశిక్షణలో ఉండేవారు. ఏం కావాలన్నా (పిప్పరమెంటో, బిస్కట్టో) ఏదైనా జరిగినా అమ్మమ్మ, నాన్నమ్మలను చేరేవారు. వాళ్ళు కూడా ప్రేమతో దగ్గరికి తీసుకునేవారు. 'అసలు కంటే వడ్డీ'యే ముద్దు కదా!

అలా 'కలిసి ఉంటే కలదు సుఖం' అనే సూత్రం ఆధారంగా సమష్టి కుటుంబం కుటుంబ వ్యవస్థకు బలాన్ని చేకూర్చింది. కొందరి మనోభావాలు భిన్నంగా ఉన్నప్పటికీ మొత్తం కుటుంబానికి అక్కరకు వచ్చేదే అమలయ్యేది. స్వార్థపరతకు తావు తక్కువ. 'మన' అనే భావనకు అందరూ లోనై ఉండేవారు. రైతుకుటుంబాల్లో ఐతే ఇంటిల్లిపాది ఇంటి పనుల్లో, బయటి పనుల్లో పాలుపంచుకొనేవారు. శ్రామిక వర్గం అంతా దాదాపు అలానే ఉండేది. ఊరిలో ఏదన్నా పెళ్ళి లాంటి కార్యక్రమాలు జరిగితే అందరూ శ్రమను పంచుకొని ఆ కార్యక్రమం చేసేవారికి ఆనందం కలిగించేవారు. ఈ సంఘీభావమే దేశానికి వెన్నెముక అయింది. సిరిసంపదలను పోగు చేసింది. ప్రపంచంలోనే భారతదేశాన్ని ఉన్నతస్థానంలో నిలబెట్టింది ఆనాడు. మన ఇతిహాసాలైన రామాయణభారతాలు ఈ సమష్టి కుటుంబ వ్యవస్థను ప్రతిబింబిస్తాయి.

కాలం మారింది. కుటుంబం అనే మాటకు అర్థం, దాని నమూనా మారిపోయింది. ఉమ్మడి కుటుంబంలో వ్యక్తి స్వేచ్ఛకు ఆర్థిక స్వాతంత్ర్యానికీ, సమానత్వానికీ ప్రాధాన్యం లేక పోవడం, స్వార్థం పూర్తిగా పెరిగిపోవడం, వీటివల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో మార్పులు అనివార్యమయ్యాయి. చిన్న కుటుంబ భావన బలపడింది. సమష్టి వ్యవస్థ పూర్తిగా వ్యష్టి


SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

వ్యవస్థగా మారింది. తత్కారణంగా జీవన సరళిలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఆధునికతవల్ల శ్రమవిభజనలో కొత్త మార్పులు వచ్చాయి. స్త్రీ పురుష సంబంధాల్లో కొత్త ధోరణులు ఏర్పడ్డాయి. ఆర్థికస్వేచ్ఛ, సమానత్వం, వ్యక్తి స్వాతంత్ర్యం అనే మూడింటిపైనే 'వ్యష్టి' కుటుంబం ఆధారపడింది. ఈ వ్యష్టి కుటుంబంలో వ్యక్తిగత గౌరవం, సమాజంలో ప్రత్యేక గుర్తింపు, నిర్ణయాధికారం లభిస్తాయి. అయితే ఇలా వ్యక్తి ప్రాధాన్యత పెరిగి ఉమ్మడికుటుంబ వ్యవస్థ మరుగున పడిపోతుంది.

దీని వల్ల కుటుంబపరమైన వారసత్వ భావనలు అందుతున్నాయా? దేశీయ సాంస్కృతిక, జీవన సంప్రదాయాలూ నిలుస్తున్నాయా? మానవ సంబంధాలూ ఆప్యాయతానురాగాలు ఉంటున్నాయా? ఆర్థిక స్వావలంబనకోసం భార్యా భర్తలిద్దరూ సంపాదించాల్సిన అవసరం ఉన్నప్పటికీ జీవితానికి అదే గమ్యం, అదే లక్ష్యం అవుతున్నది. పిల్లలకు టీవీలు, కంప్యూటర్లే ఆటపాటలౌతున్నాయి. భాష పరిమితికి లోనవుతున్నది. భావం సంకుచితమౌతున్నది. అనుభూతులు లోపిస్తున్నాయి. తల్లిదండ్రులకు పిల్లల సంక్షేమమే తొలి ప్రాధాన్యం కావాల్సి ఉండగా, దానిపట్ల వాళ్ళు తగినంత శ్రద్ధ చూపడం లేదు. అది పిల్లల మనస్తత్వం మీద విపరీతమైన ప్రభావాన్ని చూపుతున్నది. తల్లిదండ్రులు పిల్లలకు వారసత్వంగా ఆరోగ్యం, సంస్కారం, చదువు, విజ్ఞానం మంచితనం, పరోపకారగుణం అందించాలే తప్ప కేవలం డబ్బుకాదని గుర్తించాలి. పిల్లల సమస్త సద్గుణాలకూ, 'ఇల్లే' పునాది కానీ ఆ 'ఇల్లే' కనుమరుగవుతున్నది.




పిల్లలు కేర్‌టేకింగ్ సెంటర్లలో .....
భార్యాభర్తలు ఉద్యోగాలలో ...... పెద్ద వాళ్ళు వృద్ధాశ్రమాల్లో .....

ఆ మానవ సంబంధాలు ఏవి? అనురాగాలు ఏవి ? వారసత్వ అనుభూతులు ఎక్కడ? కుటుంబ నేపథ్యం, గొప్పతనం తెలిసే అవకాశం ఏది?

ఆధునికీకరణ, నగరీకరణ, పాశ్చాత్యీకరణ, కంప్యూటరీకరణలు ఈ పరిస్థితికి కారణాలనీ కుటుంబవ్యవస్థపై ఇవి ఎనలేని ప్రభావాన్ని చూపుతున్నాయనీ సామాజిక శాస్త్రవేత్తలు

SCERT TELANGANA




అంటున్నారు. యంత్రశక్తి వినియోగం నానాటికీ పెరుగుతున్నది. బట్టలు నేయడం, నూనెలు తీయడం మొన్నటిమాట. బట్టలుతకటానికి, నగల తయారీకి, నీళ్ళు తోడటానికి, పొలం దున్నటానికి, చెప్పులు కుట్టడానికి, చివరకు గిన్నెలు కడగటానికీ, కడిగిన చేతులు ఆరటానికి యంత్రశక్తినే వాడటం వల్ల మనిషి బద్ధకస్తుడౌతున్నాడు. చలాకీతనాన్ని కోల్పోతున్నాడు. అనేక రోగాల పాలౌతున్నాడు.

ఈ యాంత్రిక జీవన విధానం వల్ల కుటుంబంలోని అందాలు, ఆనందాలు హరించిపోతున్నాయి. వ్యష్టి కుటుంబంలోని లోపభూయిష్ఠమైన, స్వార్థంతో కూడిన జీవన విధానం వల్ల ఈ మార్పులు సంభవించాయి. కుటుంబసభ్యులు సుఖాల్నీ, సంతోషాల్నీ, కష్టాల్నీ, బాధల్నీ, పరస్పరం పంచుకోవాల్సి ఉండగా 'ఎవరికి వారే యమునాతీరే' అన్న విధంగా మెలగుతున్నారు. ఈ బలీయమైనకారణాల వల్లే పిల్లల్లో కొందరు అందరూ ఉండీ అనాథలుగా, మరికొందరు సమాజ వ్యతిరేకశక్తులుగా మారిపోతున్నారు. సమాజానికి పెనుసవాళ్ళను విసురుతున్నారు; అశాంతి, హింసలకు ప్రధాన కారకులవుతున్నారు. పిల్లలపై తల్లిదండ్రుల ప్రభావంతో పాటు, సమాజం, సమవయస్కులు, ప్రసారసాధనాల ప్రభావం కూడా ఉందనేది ఎవరూ కాదనలేని వాస్తవం. కాని ఇప్పటికీ మంచి కుటుంబనేపథ్యం నుంచి వచ్చిన పిల్లలు వీటన్నిటినీ అధిగమించి సమాజంలో నిలదొక్కుకుంటున్నారు.

ఇదిలా ఉండగా వృద్ధుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. వాళ్ళ ఆలనాపాలనా చూసే ఓపిక లేక, తమకు భారం అనే భావనతో వృద్ధాశ్రమాల్లో చేర్చి పిల్లలు బాధ్యతల్ని వదిలించుకుంటున్నారు. ఇది అందరూ ఆలోచించాల్సిన విషయం. కాబట్టి ఆర్థిక సంబంధాలూ, వ్యక్తిగత స్వార్థమూ, హక్కులూ వీటన్నిటికంటే మన బాధ్యతలూ మానవ సంబంధాలూ ముఖ్యమని, అవి మన మనుగడకు ఆధారభూతాలనీ తెలుసుకోవాలి.

అలాగని వ్యష్టికుటుంబం వల్ల ఇబ్బంది అని చెప్పలేం. వ్యష్టికుటుంబంలో ఉన్నప్పటికీ కుటుంబ భావనలు పిల్లలకు వివరించి చెప్పగలగాలి...... పెద్దల బలాన్ని పొందాలి, బలగాన్నీ పెంపొందించుకోవాలి. యాంత్రికత తగ్గాలి. మానవశక్తి, యుక్తి, నైపుణ్యాలు మన వారసత్వ సంపదను పెంచేలా ఉపయోగపడాలి. ఎవరి సంపాదన వారికి ఉండటం మంచిదే. అయినా సమస్యలను పరస్పరం ఆలోచించుకొని పరిష్కరించుకోవాలి. బాధ్యతలు పంచుకోవడం వల్ల యజమాని భారం తగ్గుతుంది. అంతమాత్రాన మానవసంబంధాలు విచ్ఛిన్నం కాకూడదు. యంత్రశక్తి మీదనే ఆధారపడి బద్ధకస్థుడు కాకూడదు. యంత్రశక్తి అంతా ఏదో రకంగా ప్రకృతిపై ఆధారపడే ఉన్నది. ప్రకృతి వనరులను వాడుకోవడం మనకు ధర్మమే కాని వాటిని దోచుకోవడం, నిరుపయోగం చేయడం మన లక్ష్యం కాకూడదు.


మనం చేసే పని ఏదైనా మన సంస్కృతిని, వారసత్వాన్ని, దేశ ఔన్నత్యాన్నీ ఇబ్బడిముబ్బడిగా పెంచి వారసులను ఉత్తేజితులను చేసే విధంగా ఉండాలి. అందుకు సమష్టి లేదా వ్యష్టి కుటుంబ వ్యవస్థలు దోహదం చేయాలి.

కుటుంబం అనే హరివిల్లులో అమ్మానాన్నలు, పిల్లలతోపాటు, తాతానానమ్మలు, కూడా ఒక భాగమైతే అందం, ఆనందం వెల్లివిరుస్తుంది. 'ఇల్లే ఇలలో స్వర్గం' అవుతుంది.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

సమాజానికి కుటుంబం వెన్నెముక. మంచికుటుంబం, మంచిసమాజం దీని నుంచి మంచిదేశం, మంచి ప్రపంచం ఏర్పడతాయి. ఇందుకు అందరూ కృషి చేయాలి.




కుటుంబం అనే మాట మధురం. కుటుంబం అన్న భావన తలపునకు రాగానే మదిలో ఏదో అనిర్వచనీయమైన హాయి కలుగుతుంది. తీపి జ్ఞాపకాలెన్నో గుర్తుకు వస్తాయి.

చిన్ననాటి నుంచి ఇంట్లో అందరితో గడిపిన మధుర క్షణాలు, జీవితంలో జరిగిన సంఘటనలు పెద్దయిన తరవాత సినిమాలా కళ్ళముందు మెదలాలి. ఈ మధురమైన అనుభూతిని పదికాలాల పాటు పదిలంగా ఉంచుకోవాలంటే కమ్మని కుటుంబం కావాలి. గాంధీజీ, నెహ్రూ, ఠాగూర్, అబ్దుల్ కలాం లాంటి మహనీయులెందరికో వారి కుటుంబ నేపథ్యమే స్ఫూర్తి.

ఉమ్మడి కుటుంబం, వ్యష్టి కుటుంబాల మేలు కలయికతో సమానత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలగకుండా; ఆధిపత్యాల పోరులేని, ప్రేమానురాగాలు, విలువలు, మానవసంబంధాలు అంతస్సూత్రమైన ఒక కొత్త కుటుంబ వ్యవస్థ రూపుదిద్దుకోవాలి. అప్పుడే సమాజం, దేశం, ప్రపంచం సుఖశాంతులతో విలసిల్లుతాయి.




SCERT TELANGANA

ఉపవాచకం



# 5. జానపద కళలు

తెలంగాణ పల్లెల్లో ఆటలకు, పాటలకు విడదీయలేని బంధం ఉన్నది. ఇక్కడి సాహిత్యం ప్రజా సాహిత్యం. ఇక్కడి కళలు ప్రజాకళలు. పాటలు, గేయాలు, కథలు మొదలైన అపారమైన సారస్వతము అనేక కళారూపాల్లో వైభవాన్ని పల్లె ప్రజల నాలుకల మీద నాట్యమాడుతాయి. అవే జానపదకళలు. ఇవి తెలంగాణ ప్రజల కళాభిరుచికి చక్కని నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. ఆ జానపద కళా వైభవాన్ని గురించి తెలుసుకుందాం.

జానపదులు అనగా పల్లె ప్రజలు. పల్లెల్లో అలరారు కళలను జానపద కళలు అంటారు. ఒగ్గుకథ, బుర్రకథ, యక్షగానం, చిందుబాగోతాలు, చిడుతలరామాయణం, కోలాటం, భజన, తుపాకిరాముడు, పిట్టలదొర మొదలగునవి జానపద కళలకు ఉదాహరణలు. భాగవతం, రామాయణం, భారతం, గ్రామదేవత కథలు, గొల్లసుద్దులు, తుపాకిరాముడు, వీరుల కథలు లాంటివి ఏండ్లకేండ్లుగా ఈ జానపద కళల ద్వారానే ప్రచారంలోకి వచ్చినాయి. పల్లె ప్రజలు నిరక్షరాస్యులు. అట్లాంటి కాలంలో వాళ్లకు వినోదంతో పాటు నీతిసూత్రాల ఆలోచనను కలిగించేందుకు జానపద కళలు ఉపయోగపడేవి. వీటిలో యక్షగానాలు, గొల్లసుద్దులు, తుపాకిరాముడు గురించి తెలుసుకుందాం.

**యక్షగానాలు :** కొన్నిచోట్ల వీటిని బాగోతాలని, నాటకాలని కూడా అంటారు. పాటలు, పద్యాలు, దరువు, ఆదితాళం మొదలగు ప్రక్రియలతో ఇది సాగుతుంది. ఎక్కువగా వీటిని రాత్రిపూట ప్రదర్శించేవారు. గ్రామంలోని కొందరు యువకులు 'మ్యాల్లం' గట్టి యక్షగానాన్ని నేర్చుకుని ప్రదర్శించేవారు. ప్రజాకళలు ఎప్పుడూ ప్రజల వినోదానికి మాత్రమే ఉపయోగించేవారు కాని సంపాదన కోసం కాదు. నృత్య, నాటక, సంగీత గాత్రాల కలబోత ఇది. ఆయాపాత్రల్లో నటులు నటించి నవరసాలు ఒలకబోస్తుంటే ప్రజలు పరవశంగా స్పందించేవారు. యక్షగానాలు కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణకు వచ్చిన ఒక ప్రక్రియ.


నాటకాలు అయినా యక్షగానాలు అయినా దైవ ప్రార్థనతో మొదలుపెట్టేవారు.

పరాబ్రహ్మ పరమేశ్వర పురుషోత్తమ సదానంద
పరంజ్యోతి పరాత్పర పతితపావన సుప్రకాశ
వరదాయక సకలలోక వాంఛిత గుణదాప్రమేయ
నీకు వందనములు రామ సొగతో మమ్మేలుకోవా
పాకశాసనాభివినుత పంకజమన బ్రోవుమిక
పరమేశ్వర మొక్కెదా ... ॥ ప ॥





SCERT TELANGANA



ఎక్కువగా ప్రచారంలో ఉన్నపాట ఇది. యక్షగానాల్లో స్వదేశీయక్షగానాలు కూడా ఉంటాయి. ఎక్కువగా పల్లెల్లో ప్రదర్శించేది ఈ యక్షగానాలే. బాలనాగమ్మ, చంద్రహాస, శకుంతల, అల్లీరాణి, క్రూరసేన, సత్యహరిశ్చంద్ర లాంటివి యక్షగానాలకు ఉదాహరణలు. యక్షగానాల్లో జానపదులు సులభంగా పాడుకోవడానికి వీలుండే రాగాలు, పాటలు, పద్యాలుంటాయి. ఇందులో భాష, వచనం జనాలకు సులభంగా అర్థమయ్యేరీతిలో ఉంటాయి. ముఖ్యంగా రూపక, ఏక, ఆది, జులువ తాళాలలో పాటలుంటాయి.

మంగలాంగుడనురా ... రుఖ్మాంగుడాను భూపాల చంద్రుడను ॥ మం ॥

సంగర రంగము నందు శత్రువుల బంగమొనర్చిన బలవిక్రముడను ॥ మం॥

యక్షగానాల్లో స్త్రీలపాత్రలు కూడా పురుషులే ధరించేవారు.

**వాయిద్యాలు :** తబల, తాళం, హార్మోనియంలను ఇందులో వాయిద్యాలుగా వాడతారు. వేషకాడు పాట పాడుతుంటే పాటకు అనుగుణంగా తబల తాళం మోగుతుంది. హార్మోనియం వీటితో జతకడుతుంది. తబల తాళం కొట్టేవాళ్లు మ్యాల్లంలో సభ్యులై ఉంటారు. వీరు కూడా వేషం వేస్తారు. వీరు స్టేజిమీదికి వెళ్లినప్పుడు ఆ బాధ్యతను మరొకరు తీసుకుంటారు.

**వేదిక :** యక్షగానాలకు, నాటకాలకు వేదిక ఏర్పాటు చేసుకోవడం చాలా తేలిక. ఆటను ఆదేరోజు సాయంత్రమే ఈ వేదికను ఏర్పాటుచేసుకుంటారు. మామూలుగా వేదికను నాలుగు బజార్లకాడనో కచేరు దగ్గరనో ఏర్పాటుచేసుకుంటారు. నాలుగు వైపుల నాలుగు గుంజల్ని పాతి ఎలిత బొంగులతోనో కర్రలతోనో పందిరివేస్తారు. ఎదురుగా తెల్లటిబట్టనో చెద్దర్లనో రంగు రంగుల చీరలనో కడతారు. వీలైతే పక్కలకు పరదాలను వేలాడదీస్తారు. లేదంటే వదిలేస్తారు. ఒక్కోసారి గ్రామంలో తిరిగి నాలుగు పెద్ద బల్లలను అడుక్కొచ్చి వేస్తారు. లేదంటే నేలమీదనే వేదికను ఏర్పాటుచేస్తారు. వేదికకు రెండు వైపుల రెండు కరంటు బల్బులను ఏర్పాటుచేస్తారు. లేదంటే రెండు వైపుల పెట్రమాక్స్‌లైట్లను పెట్టేవారు. ఇవేవీ అందుబాటులో లేని కాలంలో దీవిటీలను వెలిగించి పట్టుకుని ఆటను ప్రదర్శించేవారు.

**ప్రదర్శన :** తెరచాటున వేషకాళ్లు కూర్చునేవారు. తెరకు ముందు జనం కూర్చుండేవారు. ముందువరుసలో కూర్చోవడానికి పోటీపడేవారు. గ్రామస్తులు ముందుగానే వెళ్లి చాపలు, జోరతట్లు వేసుకుని జాగను ఆపుకునేవారు.



SCERT TELANGANA

మామూలుగా రాత్రిపూట తిండితిన్నాక ఈ ప్రదర్శన మొదలయ్యేది. అర్ధరాత్రివరకు, పెద్ద కథ అయితే తెల్లవారుజాము వరకు ప్రదర్శన సాగేది, వేషధారి వేదిక ముందుకు వచ్చి పాటను పాడుతుంటే వెనక ఉన్న మిగతా సభ్యులు పాటను అందుకునేవారు. ఇలా పాటను అందుకోవడాన్ని పల్లెం అనేవారు.

తేరు నడిపించెదను చూరి వేడుక మీరగను ధారుణి జనులంత నన్ను వీరుడని పొగడగను దూలి గప్పి వచ్చి నట్టి గాలి చందంబులోన

*


క్షేమమా భూచక్రాపురమూ...
మంత్రి క్షామమను మాటలేక గన ॥ క్షే ॥
కామక్రోధలోభమత్సరంబులు కడకుపార దోలి పోరి జనములు ॥ 2 ॥
శ్రీమహేఘనామద్యాన్నమున కుల నీమమీ దకను ఉన్నవారలా ॥ క్షే ॥

*

అయ్యో దిక్కేదే ... తలిదండ్రి లేని వారమైతి మయ్యో దిక్కేదే ... ॥ అ ॥
చయ్యన మన మేనమామ స్వగృహమునకు పోవనెంచి అయ్యెను మొద్దయ్యెను
బయమయ్యెను ఏమయ్యనొకో ॥ అ ॥

ఈ యక్షగానాల్లో పాత్రలను పరిచయం చేసి రాజుకు మంత్రిగా, రాణికి చెలికత్తెగా, యువరాజుకు స్నేహితునిగా కథను నడిపిస్తూ హాస్యాన్ని పంచుతూ చివరివరకూ ఉండే పాత్ర బుడ్డరిఖాన్.

**గొల్లసుద్దులు :** గొల్లసుద్దులంటే గొల్లలు చెప్పే సుద్దులు. సుద్దులు అంటే సంగతులు లేదా మంచి మాటలు. ఇందులో ప్రధాన కథకుడు ఆటపాటలతో ప్రేక్షకులను అలరిస్తాడు. ప్రధాన కథకుడు పాడేపాటను అటు ఇటు పక్కనున్న ఇద్దరు చెవికి చెయికప్పి సాగదీసి వంతపాడుతారు. ఈ ప్రదర్శనలో వీరణాలు (పెద్దడోళ్ళు), కొమ్ములనుపయోగిస్తారు. కొంతమంది వెనుక నుండి వంతపాడుతారు.



గొల్ల సుద్దుల ప్రదర్శనలో కథకుడు సరాసరి రంగస్థలం మీదికి రాడు. జనం మధ్య నుండి వస్తాడు. మిగిలిన ఇద్దరు కూడ ఆటను రక్తికట్టించడానికి ఈ మూలనుండొకరు, ఆ మూలనుండొకరు టుర్, టుర్‌మని గొర్రెలను అదిలించినట్లు, తప్పిపోయిన గొర్రెలను వెతుకుతున్నట్లు, తోడేళ్ళను తరుముతున్నట్లు శబ్దాలు చేస్తూ వస్తారు.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

వీళ్ళ వేషధారణ మోకాళ్ళదాక మడిచికట్టిన పెద్ద అంచున్న ధోతి, నెత్తికి రుమాలు, చెవులకు దుద్దులు, ముంజేతికి కడియాలు, వెండి బిళ్లల మొలతాడు, భుజంమీద గొంగడి, కాళ్ళకు గజ్జెలు, చేతిల కర్రతో గమ్మత్తుగుంటారు. వీళ్ళు రకరకాలుగా యాస భాషతో ఆద్యంతం నవ్విస్తుంటారు. కథను ఎటంటే అటుమలుస్తూ, అందరిని ఆకట్టుకుంటారు.

గొల్లసుద్దులు రూపకం రానురాను ఎన్నెన్నో మార్పులకు గురయింది. ఇప్పటికీ సామాజిక చైతన్యాన్ని కల్గించటానికి ఈ ప్రక్రియల్లో చెపితే సామాన్యులు సులభంగా అర్థం చేసుకుంటారు. ఇప్పుడు ఈ ప్రదర్శనకు డప్పు, డోలక్‌ను వాయిద్యాలుగా ఉపయోగిస్తున్నారు.

ప్రదర్శన : ముందుగా ప్రధాన కథకుడు వేదిక మీదికి వచ్చి, మిగిలిన ఇద్దరిని పాట రూపంలో పిలుస్తాడు.

ఓరి రంగన్నో...

యాడబోయిండో ఈడు... ఓరి రంగన్నో
ఇట్ల లాభంలేదు పాటతో పిలుస్త

ఎల్లన్న : రార్రో రంగన్న – బిరాన ఇటురారో ॥ రార్రో రంగన్న ॥
రాజులు మారిన గాని – రాజ్యాలు మారిన గాని
మారలేదు మన బతుకులు – తీరలేదు మన బాధలు ॥ రార్రో రంగన్న ॥

రంగన్న : వచనం : వత్తన్నత్తన్నతన్ననే...

(పాట) ఏందే ఎల్లన్న గిప్పుడేమయ్యింది ॥ ఏందే ఎల్లన్న ॥
మనరాతలిట్లుండ – మార్చేదిఎవ్వరో ॥ మన రాతలు ॥
పొద్దువోని సుద్దులేల జెపుతావే ఎల్లన్న ॥ ఏందే ఎల్లన్న ॥

ఎందే ఎల్లన్న లొట్టిమీది కాకిలెక్క ఒక్క తీర్గ మొత్తుకోబడితివి ఏమయ్యిందే నీకు?

ఎల్లన్న : తిట్టేనోరు, తిరిగేకాలు ఊరుకోదన్నట్టు, నాకేదన్నతెలిస్తె మీకు జెప్పందే మనుసునవట్టదురా.

రంగన్న : అయితే గదేందో జెప్పరాదు.

ఎల్లన్న : చెపుతగాని మల్లన్నేడిరా? పిలిచి చూస్త...
రార్రో మల్లన్న రాతిరెక్కువైపాయె ॥ రార్రో మల్లన్న॥
గొర్లమందకాడనే పొద్దుపోతున్నది
మాటమాట జెప్పుకుంట మందకాడ్కిపోదాం ॥ రార్రో మల్లన్న॥

మల్లన్న : (వచ్చి) ఎందే ఎల్లన్న పిలుపుమీద పిలుపేత్తవు
సంసారం సంతలోన సింతలెక్కువైపాయె
బతుకు మీద తీపిఏమొ గింతన్నలేకపాయె
అలుపుసొలుపు లేకుండా పిలుపు మీద పిలుపేత్తవ్ ॥ ఏందే ఎల్లన్న ॥

ఇట్ల జెప్పుకుంటూ సమస్యలను, పరిష్కారాలను సుద్దుల్లో చెపుతారు.

పాడేటి పాటలల్లో సమాజంలోని చెడును తొలిగించే ప్రయత్నం కనపడుతుంది. ఈ కళారూపాలు వినోదాన్నందించటమే కాకుండా విజ్ఞానదాయకంగా కూడ ఉంటాయి. అనాదిగా ప్రదర్శిస్తున్న ఈ కళారూపాలు ఇటీవలి కాలంలో ప్రజా ఉద్యమాల్లోను, ప్రభుత్వ కార్యక్రమాలైన అక్షరాస్యత, ఆరోగ్యం, పర్యావరణం, ఎయిడ్స్ నిర్మూలన, కుటుంబ నియంత్రణ, వ్యవసాయం మొదలైన అంశాలను ప్రజల్లోనికి తీసుకెళ్ళినాయి. అంతేకాకుండా తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కళాబృందాలు ఈ ప్రదర్శన ద్వారా తెలంగాణ సాధనను సుగమం చేశాయన్నది ముమ్మాటికి నిజం.



SCERT TELANGANA


**తుపాకి రాముడు (పిట్టలదొర) :** వేషం చూస్తేనే నవ్వువస్తుంది. మాటలు వింటే పగలబడి నవ్వాలనిపిస్తుంది. ఈ మాటలు సరిగ్గా 'తుపాకి రాముడి'కి సరిపోతాయి. గమ్మత్తుగా ఉండే వేషం, చిత్రవిచిత్రమైన మాటలు మాట్లాడుతూ... పైకి ఎన్నో డాంబికాలు చెపుతున్నప్పటికి తన వెనుకనున్న లేమిని గుర్తించండని అందరిని నవ్విస్తూ, ఇంటింటికి తిరిగి యాచిస్తుంటాడు. ఇది పగటివేషాల్లో ఒక రకమని చెప్పవచ్చు. ఎవరైనా వదులుగా అడ్డదిడ్డంగా డ్రెస్సు వేసుకుంటే 'ఏమిరా! తుపాకి రాముడి 'వేషమేందిరా' అనేవాళ్ళు.

ఒక పక్క పైకి మడచిన ఖాకీ ప్యాంటు, చినిగిన అంగి, తెల్లఈకతో కూడిన ఇంగ్లీషుదొరల టోపి, మెడలో రుమాలు (స్కార్ఫ్), సన్నటి చిరుకత్తి మీసం, కాళ్లకు బూట్లు, భుజానికి కట్టెతుపాకి, ముఖానికి తెల్లరంగుతో చూపరులకు నవ్వుపుట్టించేదిగా ఉంటుంది. తుపాకిరాముని వేషం.

**ప్రదర్శన** : వచ్చె వచ్చె ఎవడచ్చె ఎంకట్రాముడచ్చే. మారాజ మారాజ మారాజ. మాతాత తట్టల్దొర... మానాన్న బుట్టల్దొర... నేను పిట్టల్దొర... నన్నందరు లత్కోర్ సాబంటరు.

**పాట** : మాటకు నేను నవాబును – పూటకు లేని గరీబుని
నేనే ఎంకట్రాముణ్ణి – నేనే పిట్టలదొరని ॥ మాటకు ॥

**వ॥** : మారాజ మారాజ మారాజ... నాకేం తక్కువలేదు. తీసుకతింటే తరుక్కపోతదని అడుక్కతింటున్న.



నా పెండ్లికి అమెరిక, సింగపూర్, చైనా, జర్మనీ, జపాన్, మలేసియా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా నుండి అందరచ్చిండ్రు. అందరికి తిండి సరిపోవాలని సెర్ల బియ్యంపోసి, తూం కింద మంట బెట్టిన చింతాకిస్తరేసి ఇద్దరికిత్తుసొప్పున మస్తుగ వడ్డిస్తే బద్దం తిన్నరు బాంచెను. మీ అందరిని చూత్తాంటే అందరు నా పెండ్లికచ్చినట్టే ఉన్నరు గాని... కట్నాల బుక్కుల మాత్రం ఒక్కరి పేరు లేదు.

ఇంతమంచి హాస్యాన్ని పండించే పిట్టలదొరలు ఇప్పుడు కనబడటంలేదు.

ఈ కళలు ఇప్పటివి కావు. వందల సంవత్సరాలుగా వర్ధిల్లుతున్న ప్రజా కళలు పల్లె జీవనంతో, సంస్కృతితో కలిసిపోయిన కళలు. ప్రజల సంతోషాన్ని, దుఃఖాన్ని పంచుకొని ఓదార్పునిచ్చిన కళలు తరతరానికి రూపాన్ని మార్చుకుని ప్రజల ఆలోచనా విధానానికి పదును పెట్టిన కళలు. జీవితంలో ఓ భాగంగా సాగి కదిలి కదిలించిన ఈ ప్రజా కళలు ఆదరణ లేక కనుమరుగై పోతున్నాయి. వీటిని సంరక్షించుకునే బాధ్యత మనందరిది.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

ఉపవాచకం



# 6. పి.వి.నరసింహారావు

భారత రాజకీయాలలో అపరచాణక్యుడనే పేరు, గాంధీ, నెహ్రూ కుటుంబాలకు చెందని తొలి కాంగ్రెస్ నేతగా ప్రధాని పదవీకాలాన్నీ పూర్తిచేసిన అరుదైన ప్రతిష్ఠ, మైనారిటీ ప్రభుత్వాన్ని నిలకడగా నిబ్బరంగా అయిదేళ్ళు నడిపించిన 'తెలుగు నేతృత్వం' ఇవన్నీ తలచుకోగానే గుర్తుకువచ్చే పేరు పాములపర్తి వేంకట నరసింహారావు.

స్థిత ప్రజ్ఞుడు ...

సంస్కరణశీలి ...

అపర చాణక్యుడు ...

న్యాయశాస్త్రజ్ఞుడు ...

బహుభాషా కోవిదుడు ...

అందరికీ అయిన వాడు ...

మన తెలంగాణ మహనీయుడు ...

సాహిత్య సుగంధాలను వెదజల్లినవాడు ...

'లోపలి మనిషి'ని అందంగా ఆవిష్కరించినవాడు ...

ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండట మెట్లాగో తెలిసినవాడు ...

దక్షిణ భారతం నుండి మొట్ట మొదటగా ప్రధాని పీఠం అధిష్ఠించిన వాడు ...

పై మాటలు వింటుంటే గుర్తుకు వచ్చే వారెవరో తెలుసా? భారతదేశ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పుతూ పతనోన్ముఖంగా పరుగులు తీస్తున్న దశలో 'ప్రధాని' పగ్గాలు చేపట్టి చక్కదిద్దిన ధీశాలి, మన తెలంగాణ ముద్దుబిడ్డ పాములపర్తి వేంకట నరసింహారావు.

SCERT TELANGANA

పి.వి.నరసింహారావు తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి. బహుభాషా కోవిదుడు. నిజాం వ్యతిరేక పోరాటంలో రాటు దేలిన తరానికి చెందిన నాయకుడాయన. బహుముఖమైన వీరి ప్రతిభ అనన్య సామాన్యం. రాజకీయ రంగంలో శాసన సభ్యుడిగా, రాష్ట్ర విద్యామంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడుగా, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిగా, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా, ప్రధాన మంత్రిగా దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించిన మేరునగధీరుడు పి.వి.

కవిగా, అనువాదకుడుగా, పాత్రికేయుడుగా, కథకుడిగా, నవలా రచయితగానే కాకుండా పద్నాలుగు భాషలు మాట్లాడగల్గిన బహుభాషావేత్తగా సుపరిచితులు. 1983లో న్యూఢిల్లీలో జరిగిన అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో స్పానిష్ భాషలో మాట్లాడి క్యూబా అధ్యక్షుడు ఫెడల్ కాస్ట్రోను అబ్బురపరిచిన ధీశాలి. పి.వి. పుట్టింది భూస్వామ్య కుంటుంబంలోనే. ఐనా భూస్వామ్య పోకడలకు దూరంగా తనకు వారసత్వంగా సంక్రమించిన భూమిలో యాభై ఎకరాల భూమిని భూదానోద్యమానికి దానమిచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే భూసంస్కరణలకు శ్రీకారం చుట్టి చరితార్థుడయిన పి.వి.నరసింహారావు జీవిత విశేషాలను తెలుసుకొందాం.

**బాల్యం – విద్యాభ్యాసం :**

కరీంనగర్ జిల్లా భీందేవరపల్లి మండలం 'వంగర' పి.వి.నరసింహారావు స్వగ్రామం. ఆయన పుట్టిన గ్రామం మాత్రం వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి. సీతారామారావు, రుక్మాబాయమ్మ పుణ్యదంపతులకు 28 జూన్ 1921న పి.వి.నరసింహారావు జన్మించాడు. వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రత్నాబాయిలు పి.వి.ని దత్తత తీసుకున్నారు.

1924లో బాసరలో కొలువైన జ్ఞాన సరస్వతి సన్నిధిలో అతని తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. వంగర ప్రభుత్వ పాఠశాలలో ఓనమాలు దిద్దాడు. 1928 నుండి 1930 వరకు హుజూరాబాద్ పాఠశాలలో మూడు, నాలుగు తరగతులు చదివాడు. వంగర నుండి హుజూరాబాద్‌కు దాదాపు ఇరవై కిలోమీటర్ల దూరం రోజూ సవారీ కచ్చడం (ఎడ్లబండి) లో వెళ్ళి వచ్చేవాడు. చదువుకునే రోజుల్లో పి.వి.ఎప్పుడూ క్లాస్ ఫస్టే. తానెప్పుడూ క్లాస్‌లో సెకెండ్ రావడం ఎరుగనని 'ఐ విట్నెస్' అనే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒకసారి పి.వి.చెప్పాడు. చిన్నప్పుడు గణితం సబ్జెక్టు అంటే అమితంగా ఇష్టపడేవాడు. చదువులోనే కాదు ఆటల్లోనూ ఆరితేరినవాడే. టెన్నిస్ క్రీడను బాగా ఆడేవాడు. పి.వి.కి చిన్నప్పటి నుండి సంగీతంలోనూ ప్రవేశం ఉంది. లలిత సంగీతం, భజనలు, శాస్త్రీయ సంగీతంతో కూడిన కీర్తనలు శ్రావ్యంగా పాడేవాడు.

1936లో హనుమకొండలో డిస్టింక్షన్ మార్కులతో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణుడయ్యాడు. 1938లో నిజాం రాష్ట్ర వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనడంతో ఆయన రాష్ట్రంలో ఎక్కడా చదువకుండా నిర్బంధం విధించారు. దీనితో ఆయన మహారాష్ట్రలోని పూనెలో బి.యస్సి., నాగపూర్ విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి. పట్టా పొందాడు. హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్ ప్లీడర్‌గా పనిచేశాడు.

**రాజకీయ ప్రస్థానం :**

పి.వి. రాజకీయ ప్రస్థానం ఓటమితో ప్రారంభమయింది. 1952లో స్వతంత్ర భారత తొలి సాధారణ ఎన్నికలలో ప్రముఖ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బద్దం ఎల్లారెడ్డి చేతిలో ఓటమి పాలయ్యాడు. పడిలేచిన కడలి తరంగం వలె తిరిగి 1957 నుండి 1972 వరకు నాలుగు సార్లు మంథని శాసనసభా నియోజకవర్గం నుండి జయకేతనం ఎగురవేశాడు. 1962లో రెండోసారి శాసన సభకు ఎన్నికయిన పి.వి. రాష్ట్ర జైళ్ళు, ప్రజా సంబంధాలు, విద్యాశాఖ, ఆరోగ్య శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించాడు. ఆయా శాఖల్లో పలు సంస్కరణలు చేపట్టి అందరి ప్రశంసలు పొందాడు.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20
SCERT TELANGANA

మూడోసారి శాసన సభకు గెలిచిన సమయంలోనే పి.వి.ని ముఖ్యమంత్రి పదవి వరించింది. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే భూసంస్కరణలు అమలుపరిచేందుకు చర్యలు చేపట్టాడు. పట్టణ భూ గరిష్ట పరిమితి చట్టం కూడా పి.వి. ప్రభుత్వమే తెచ్చింది. నిజానికి పి.వి. ముఖ్యమంత్రి పదవి పోవడానికి భూసంస్కరణ చట్టమే కారణమని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. పేదలకు మేలు జరిగే చట్టం కోసం పదవిని తృణప్రాయంగా వదిలి వేయడం మహనీయులకు కష్టం కాదు కదా!

**దేశ రాజకీయాలలో ...**

1977లో పి.వి. కేంద్ర రాజకీయాలలో ప్రవేశించాడు. హనుమకొండ నుండి లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యాడు. శ్రీమతి ఇందిరాగాంధికి అత్యంత విశ్వసనీయుడుగా ఉంటూ కీలకమైన హోం, విదేశాంగ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు. 1984లో హనుమకొండ నుండి ఓటమి పాలయినా, మహారాష్ట్రలోని రాంటెక్ నియోజక వర్గం నుండి విజయం సాధించాడు. రాజీవ్‌గాంధి మంత్రివర్గంలో మానవ వనరుల శాఖ, హోం శాఖకు మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. రాజీవ్ గాంధి హత్యానంతరం చోటు చేసుకున్న పరిణామాల వలన అప్పటికే రాజనీతిజ్ఞుడుగా దేశ, విదేశాలలో గణుతికెక్కిన పి.వి.నరసింహారావు కీలకమయిన బాధ్యతలు స్వీకరించాడు.

1991లో జరిగిన ఎన్నికల తర్వాత దేశరాజకీయ రంగంలో ఒక అనిశ్చితి ఏర్పడింది. ఏ రాజకీయ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం రాలేదు. అప్పుడు తన రాజకీయ చతురతతో మిత్రపక్షాల మద్దతు కూడగట్టి తాను ప్రధానమంత్రిగా మైనారిటీ ప్రభుత్వం ఏర్పరచాడు. అనేక మంది రాజకీయ విశ్లేషకులు ఈ ప్రభుత్వం ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం మనజాలదని పెదవి విరిచారు. కాని తన అనన్యమైన చాతుర్యంతో ఐదు సంవత్సరాలు చక్కని పాలన అందించి రాజకీయ పండితులనే ఆశ్చర్యపరిచాడు.

**పాత్రికేయునిగా... సృజనశీలిగా... :**

భారతదేశంలో సాహితీ పరిమళాలు వెదజల్లిన అతి కొద్ది మంది రాజకీయ వేత్తలలో పి.వి. అగ్రతాంబూలానికి అర్హుడు. 1948లో 'కాకతీయ' పత్రికను స్థాపించి తొలితరం పత్రికా రచయితలలో ఒకడయ్యాడు. 'కాకతీయ' పత్రికలో 'జయ' అనే మారుపేరుతో అనేక రచనలు చేశాడు. తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో "గొల్లరామవ్వ" కథను 'విజయ' అనే కలం పేరుతో కాకతీయ పత్రికలో రాశాడు. విశ్వనాథ సత్యనారాయణ రాసిన వేయిపడగలు నవలను హిందీలోకి 'సహస్రఫణ్' పేరుతో అనువదించాడు. ఈ రచనకు పి.వి. కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు పొందాడు. 'పన్‌లక్షత్ కోన్‌ఘతో' అనే మరాఠీ పుస్తకాన్ని 'అబల జీవితం' అనే పేరుతో అనువదించాడు.

పి.వి. రాజకీయ, సాహిత్య అనుభవాలను రంగరించి ఆంగ్లంలో రాసిన 'ది ఇన్‌సైడర్' అనే నవలకు విశేష ప్రాచుర్యం లభించింది. తాత్వికుడు, ప్రజాహితైషి చేసిన నిర్విరామ విఫలయత్నాల విషాద గాథే 'ది ఇన్‌సైడర్'. ఈ గ్రంథం 1998లో వెలువడింది. ఈ గ్రంథం 'లోపలి మనిషి' పేరుతో తెలుగులోనికి కూడా అనువదించబడింది. తన చిన్ననాటి ఆత్మీయ మిత్రులు కాళోజీ నారాయణ రావు, రామేశ్వర రావులతో పి.వి. చేసిన సాహితీ చర్చలు వారి సాహితీ తృష్ణకు నిదర్శనాలు.

ఈ విధంగా దేశహితాన్ని కోరిన మహామనీషి, స్థితప్రజ్ఞుడు, సంక్షోభ సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను ఒడ్డుకు చేర్చిన అసామాన్యుడు! తనవారినే కాదు, రాష్ట్రాన్ని, దేశాన్ని దుఃఖ సాగరంలో ముంచి 23, డిసెంబరు 2004న గుండెపోటుతో కన్ను మూశాడు. 'మనవాడు' అని యావత్ తెలంగాణ జాతి గర్వంగా చెప్పుకొనే పాములపర్తి వేంకట నరసింహారావు భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన సేవలు సదా స్మరణీయాలు.

హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్ తీరాన పి.వి. సమాధి తెలంగాణ ఆత్మాభిమానాన్ని చాటుతున్నట్లుగా ఉన్నది. "ఆచితూచి మాట్లాడడమే కాదు, రచనలోనూ పి.వి.ది అదే గాంభీర్యం, పరిణతి, దేశభక్తి కనిపిస్తుంది. దేనికి చలించని ఆయన వ్యక్తిత్వమంటే నాకెంతో ఇష్టం" అనే దాశరథి రంగాచార్య మాటలు పి.వి. సమున్నత వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి.

# పదవిజ్ఞానం

## అర్థాలు

**అ**

అంధకారం = చీకటి
అంపి = పంపి
అగ్గలం = అధికం
అజ్ఞాతం = ఎవరికి తెలియని
అడలు = భయపడు
అధ్యాత్మము = దైవసంబంధమైన
అనివార్యం = తప్పనిసరి
అపారమైన = అధికమైన
అమల = నిర్మలమైన, స్వచ్ఛమైన
అరిష్టం = కీడు
అర్చన = పూజ
అర్థం = ధనం, సొమ్ము
అర్థి = వేడుకొనువాడు
అలుపు = అలసట
అవ్యాజము = కపటంలేనిది, సహజమైనది
అసువులు = ప్రాణాలు

**ఆ**

ఆకాంక్ష = తీవ్రమైనకోరిక
ఆతంకం = ఆరాటం
ఆదేశం = ఆజ్ఞ
ఆలాపన = రాగం తీయుట, పాడుట
ఆశ్రితుడు = ఆశ్రయం కోరినవాడు

**ఇ**

ఇబ్బడి = ఎక్కువ
ఇడుములు = కష్టాలు, తిప్పలు

**ఈ**

ఈగి = త్యాగం

**ఉ**

ఉత్కృష్టం = శ్రేష్ఠం, గొప్పది
ఉత్పాదకం = పుట్టించునది
ఉదారంగా = గొప్పగా
ఉద్బోధ = సందేశం
ఉభయతారకం = ఇద్దరిని తరింపచేసేది (మేలుకల్గించేది)

**ఊ**

ఊతం = ఆధారం

**ఎ**

ఎడద = హృదయం, ఎద
ఎరుక = తెలుసు

**ఒ**

ఒప్పించు = అప్పగించు, అంగీకరింపజేయు
ఒరులు = ఇతరులు

**ఔ**

ఔషధం = మందు

**క**

కంటకం = ముల్లు
కంబళి = గొంగడి
కకావికలం = చెల్లాచెదురు
కర్దమం = బురద, అడుసు
కడిందిగ = ఎక్కువగా
కపోతం = పావురం
కర్షకుడు = రైతు
కల్పతరువు = కోర్కెలు తీర్చే దేవతా వృక్షం
క్వణం = శబ్దం, సవ్వడి, చప్పుడు
కామారి = శివుడు
కార్చిచ్చు (కారుచిచ్చు)= అడవిలో దట్టమైన మంటలు
కూర్మి = స్నేహం, సోపతి
కృప = దయ, కరుణ
కేదారం = పొలం
క్రోధం = కోపం
క్షీరాబ్ధి = పాలసముద్రం

**ఖ**

ఖగం = పక్షి
ఖలం = పాపము



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20

SCERT TELANGANA

(గ)

| | | |
|---|---|---|
| గటక / గట్క | = | మక్క, జొన్న రవ్వతో చేసే వంటకం |
| గిడస | = | ఎండిపోవుట, శుష్కించుట |
| గప్పాలు | = | గొప్పలు, బాతాలు |
| గుడము | = | బెల్లం |

(ఘ)

| | | |
|---|---|---|
| ఘాతం | = | దెబ్బ |

(చ)

| | | |
|---|---|---|
| చందనం | = | గంధం |
| చలువ | = | చల్లదనం |
| చాకచక్యం | = | నేర్పు |
| చిందిలిపాటు | = | తొందరపాటు |
| చూతఫలం | = | మామిడి పండు |
| చెట్ట | = | కీడు |
| చేవ | = | సారం, శాగ |

(జ)

| | | |
|---|---|---|
| జగతి | = | ప్రపంచం, దునియ |
| జమీందారు | = | భూస్వామి |
| జిహ్వ | = | నాలుక |
| జైకొట్టుట | = | మద్దతు తెలుపుట |
| జ్యోత్స్న | = | వెన్నెల |

(ఠ)

| | | |
|---|---|---|
| ఠికాణా | = | నివాసం |
| ఠీవి | = | వైభవం |

(త)

| | | |
|---|---|---|
| తనువు | = | శరీరం, పెయ్యి |
| తపసి / తాపసి | = | ఋషి |
| తమ్మి | = | పద్మం, తామరపువ్వు |
| తరువు | = | చెట్టు |
| తలంపు | = | కోరిక |
| తుల | = | తరాజు, తక్కెడ |

(ద)

| | | |
|---|---|---|
| దండడి | = | తీవ్రం |
| దక్కు | = | లభించు, దొరుకు |
| దప్పిక | = | దాహం, దూప |
| దాస్యం | = | సేవ, శాత, ఊడిగం |
| దృఢంగా | = | గట్టిగ |
| దోషం | = | తప్పు |
| దోయిలి | = | దోసిలి |

(ధ)

| | | |
|---|---|---|
| ధర్మువు | = | ధర్మం |
| ధామం | = | నిలయం |
| ధృతి | = | ధైర్యం |

(న)

| | | |
|---|---|---|
| నికృష్టం | = | నీచం |
| నిక్షేపం | = | నిధి, లిబ్బి |
| నిమగ్నం | = | లీనం |
| నిమజ్జనం | = | అనుపుట, మునగడం |
| నీరము | = | నీరు |
| నుడువుట | = | చెప్పుట |

(ప)

| | | |
|---|---|---|
| పడియ | = | మడుగు |
| పరిజనం | = | సేవకులు, నౌకర్లు |
| పరిమళం | = | మంచి వాసన |
| పాడి | = | న్యాయం |
| పాదుషా | = | రాజు |
| పార్శ్వం | = | వైపు, పక్కన |
| పాశం | = | తాడు |
| పుల్లు | = | గడ్డి |
| పేర్మి | = | ప్రేమ |
| ప్రగతి | = | అభివృద్ధి |
| ప్రతిన | = | ప్రతిజ్ఞ, ఒట్టు |
| ప్రతిష్ఠ | = | కీర్తి, స్థాపన, |
| ప్రస్థానం | = | ప్రయాణం |
| ప్రహసితం | = | పెద్దనవ్వు |
| ప్రేయం | = | ప్రియం, ఇష్టం |

(బ)

| | | |
|---|---|---|
| బండారం | = | ధనాగారం, కోశాగారం, ఖజానా |
| బాస | = | ప్రతిజ్ఞ, ఒట్టు |
| బ్రాహ్మీముహూర్తం | = | సూర్యోదయానికి మూడు గడియల ముందు కాలం |
| బుగులు | = | భయం |
| బుభుక్షితుడు | = | ఆకలిగొన్నవాడు |
| బేరీజు | = | అంచనా (లెక్కవివరం) |

SCERT TELANGANA

**భ**

భంగి = విధము, తీరు
భంజన = విఱుచు / విరుచు
భూతము = ప్రాణి, పంచభూతాల్లో ఒకటి
భూషణం = ఆభరణం, నగ

**మ**

మందుడు = తెలివితక్కువవాడు
మక్కువ = ఇష్టం
మహత్తు = గొప్పతనం, మహిమ
మహిషం = దున్నపోతు
మాత్సర్యం = పగ, ఓర్వలేనితనం
మాన్యులు = గౌరవించదగినవారు
మ్యాలం = మేళం
మిరం = కారం
మిసిమి = కాంతి
మేచక = నల్లని
మోర = ముఖం
మైత్రి = స్నేహం, సోపతి
మౌక్తికం = ముత్యం

**య**

యతి = సన్న్యాసి, ముని

**ర**

రకం = పన్ను
రాకామల జ్యోత్స్న = పున్నమినాటి తెల్లని వెన్నెల
రీతి = విధం
రుద్రుడు = శివుడు
రుధిరం = రక్తం, నెత్తురు

**ల**

లేశం = కొంచెం, కొద్దిగ
లోభి = పిసినారి, పిసినిగొట్టు

**వ**

వదుకుదుపులు = చేనేత వస్త్రములు
వనట = శోకం, ఏడుపు
వరాహం = పంది
వలపల = కుడివైపు
వశం = స్వాధీనం
వసియించు = నివసించు
వ్యాఘ్రం = పెద్దపులి
విఘ్నం = ఆటంకం, అడ్డంకి
విమల = స్వచ్ఛమైన
విరివిగ = అధికంగా, బాగా
విరులు = పూలు
విలసిల్లు = ప్రకాశించు, ఒప్పు
విహంగం = పక్షి
విహారం = వేడుకగా తిరుగుట
వృశ్చికం = తేలు
వెఱచు = భయపడు
వేత్త = తెలిసినవాడు

**శ**

శీలం = నడవడి
శంభుడు = శివుడు (మంగళకరుడు)
శాకం = కూర
శీతం = చల్లనిది
శ్యేనం = డేగ
శ్రేయం = మేలు

**స**

సంయమి = ఋషి
సంహారం = చంపుట
సఖుడు = స్నేహితుడు, దోస్త్, సోపతిగాడు
సతతం = ఎల్లప్పుడు
సమత = సమానత్వం
సమాహితం = అంగీకరించబడినది, సమకూర్చబడినది
సర్వత్ర = అంతట
సార్వభౌముడు = చక్రవర్తి
సాలు = సంవత్సరం
సింగారించిన = అలంకరించిన
సుకుమారం = మృదువైన
సుధ = అమృతం
సురతరువు = కల్పవృక్షం
సూనృతం = మంచిమాట, సత్యం, నువ్వద్దె
సృజన = సృష్టి
సైచు = సహించు
సొగసు = అందం, సక్కదనం
సౌహార్దం = స్నేహం, సోపతి
స్పర్శ = తాకుట

**హ**

హలం = నాగలి
హసితాస్యుడు = నవ్వు ముఖం కలవాడు
హితం = మేలు, మంచి


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2019-20
SCERT TELANGANA

## పర్యాయపదాలు

అంధకారం = చీకటి, తమస్సు, తిమిరం
అసువులు = ప్రాణములు, ఉసురు, జీవములు
ఆకలి = క్షుత్తు, బుభుక్ష
ఆలంబనం = ఆధారం, ఆశ్రయం, ఊత
ఇడుములు = ఇబ్బందులు, కడగండ్లు, కష్టాలు
ఉడుపులు = గుడ్డలు, పుట్టములు, బట్టలు, వస్త్రాలు
కర్దమం = బురద, అడుసు, పంకం
కష్టం = ఇక్కట్టు, శ్రమ, ఇడుము
కాంక్ష = ఇచ్ఛ, కోరిక, వాంఛ
కాపు = రైతు, కర్షకుడు, కృషీవలుడు, హాలికుడు, సైరికుడు
కుప్పలు = రాసులు, ప్రోగు, ప్రోవు
కేతనం = పతాకం, జండా, ధ్వజం
క్వణము = శబ్దము, సవ్వడి, చప్పుడు
చిచ్చు = అగ్ని, జ్వలనం, అనలం, అంగారం
జననాథుడు = రాజు, నృపుడు, ప్రభువు, భూమీశుడు
తనువు = శరీరం, దేహం, మేను, ఒడలు, పెయ్యి
తాపసి = తపస్వి, తబిసి, ఋషి, యోగి, మౌని
ధృతి = ధైర్యం, బింకం, గట్టితనం
నినాదము = ధ్వని, మోత, శబ్దం
నిశీథిని = రాత్రి, యామిని, నిశ
నీరం = నీళ్ళు, ఉదకం, జలం, తోయం
పశువు = గొడ్డు, జంతువు, పసరం
పరిమళం = తావి, సువాసన, సౌరభం
పాదము = అడుగు, అంఘ్రి, చరణము
పుడమి = భూమి, నేల, అవని, వసుధ, ధరిత్రి, ఇల
భార్య = పత్ని, కళత్రం, ఆలు, పెండ్లము
మంచు = తుహినం, నీహారం, హిమం
మైత్రి = స్నేహం, చెలిమి, సోపతి
మోక్షం = కైవల్యం, ముక్తి, నిర్వాణం
వాన = వర్షము, వృష్టి, చిత్తడి
విలువ = వెల, ఖరీదు, మూల్యం
వెండి = రజతము, ధౌతము, రూప్యము
వేసవి = వేసంగి, గ్రీష్మము, ఎండాకాలం
సఖులు = స్నేహితులు, మిత్రులు, సోపతిగాళ్ళు
సమూహం = గుంపు, బృందం, సముదాయం
సైరికుడు = కాపు, హాలికుడు, రైతు
హంస = మరాళము, చక్రాంగము, మానసౌకము
హలము = సీరము, నాగలి, కుంతలము
హృదయం = ఎద, మది, మనస్సు

## నానార్థాలు

అరిష్టం = కీడు, మజ్జిగ, కాకి, కుంకుడు చెట్టు
అర్థం = శబ్దార్థం, కారణం, ధనం, న్యాయం, ప్రయోజనం, వస్తువు
కాలం = నల్లనిది, సమయం, మరణం, ఇనుము
చీకటి = అంధకారం, దుఃఖం, రాత్రి
చేవ = సారము, ధైర్యము, పొగరు
తలపు = అభిప్రాయం, ఆలోచన, జ్ఞప్తి
దిక్కు = దిశ, శరణము, దారి
పాడి = న్యాయము, ధర్మము, తీర్పు స్వభావం, ఆచారం
పావని = ఆవు, గంగ, భీముడు, హనుమంతుడు, పవిత్రురాలు
మిసిమి = కాంతి, నవనీతం, సంపద
మూలం = వేరు, మొదలు, ఊడ, కారణం, పునాది
మౌక్తికం = ముత్యం, ఏనుగు కుంభస్థలం, మేఘం, శంఖం
వనము = అడవి, జలము, సమూహము
వెఱచు = భయపడు, సంకోచించు
శక్తి = బలం, సామర్థ్యం, పార్వతి
శ్రేయం = సుకృతం, మేలు, ధర్మం
సుధ = పాలు, సున్నం, అమృతం
హంస = అంచ, పరమాత్మ, తెల్లగుఱ్ఱం, మాత్సర్యం
హితం = లాభం, క్షేమం, ఇష్టం, ఉపకారం
క్షీరము = పాలు, తీపు, నీళ్ళు, పాలపిట్ట, మఱ్ఱిచెట్టు

SCERT TELANGANA

# ప్రకృతి - వికృతి

| | | |
|---|---|---|
| అగ్ని | - | అగ్గి |
| అద్భుతము | - | అబ్బురము |
| ఆశ్చర్యం | - | అచ్చెరువు |
| ఆహారము | - | ఓగిరము |
| కుల్య | - | కాలువ |
| కులం | - | కొలం |
| ఖని | - | గని |
| గుణం | - | గొనం |
| దీపం | - | దివ్వె |
| దోషం | - | దోసం |
| ధర్మం | - | దమ్మం |
| పశువు | - | పసువు |
| పుణ్యం | - | పున్నెం |
| ప్రేమ | - | ప్రేముడి |
| భృంగారము | - | బంగారము |
| భక్తి | - | బత్తి, బగితి |
| ముఖము | - | మొగము |
| రాశులు | - | రాసులు |
| రాత్రి | - | రాతిరి |
| విద్య | - | విద్దె |
| వైద్యుడు | - | వెజ్జు |
| సంతోషము | - | సంతసం |
| సహాయం | - | సాయము |
| హృదయం | - | ఎద |

# వ్యుత్పత్త్యర్థాలు

| | | |
|---|---|---|
| అంధకారము | = | లోకులను అంధులుగా చేయునది - చీకటి |
| కామారి | = | మన్మథునికి శత్రువు - శివుడు |
| కైమోడ్పు | = | చేతులు జోడించి చేయునది - నమస్కారము |
| పక్షి | = | పక్షములు కలది - పక్షి |
| పయోనిధి | = | పయస్సుకు (నీటికి) నిధి - సముద్రం |
| పుత్రుడు | = | పున్నామ నరకమునుండి రక్షించువాడు - కొడుకు |
| పౌరులు | = | పురంలో నివసించువారు - ప్రజలు |
| శ్యేనము | = | తీవ్రంగా పోవునది - డేగ |
| సంయమి | = | సంయమము (ఇంద్రియ నిగ్రహం) కలవాడు - ఋషి |
| సైరికుడు | = | సీరముతో (నాగలి) నేలను దున్నువాడు - రైతు |
| సోమార్ధధరుడు | = | చంద్రవంకను శిరస్సున ధరించినవాడు - శివుడు |
| హాలికుడు | = | హలముతో (నాగలి) నేలను దున్నువాడు - రైతు |

SCERT TELANGANA